RNI No.APTEL/15835/2019

ప్రజా

మణిపూస

తెలుగు

మాసపత్రిక

సంపుటి - 1 సంచిక - 7 | ఆగస్టు - 2020 | పేజీలు : 80 | వెల : 25/-



ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్
కనపర్తి రాజారావు

అసోసియేట్ ఎడిటర్
శ్రీ కె.వెంకట అప్పారావు (Ph.D)

సీనియర్ సబ్ ఎడిటర్ & టెక్నికల్ అడ్వయిజర్
శ్రీ డా॥ ఎం.జయకుమార్,MBA.,Ph.D,.

ఎడిటర్ : **శ్రీ బి.రాజేష్,** B.Sc,.

కరస్పాండెంట్
కె.దినేష్, B.Tech.,(M.J.M.C)

ఫొటోగ్రాఫర్ : **బి.వీరయ్య**

డిజైన్ & డి.టి.పి
ఆర్.తేజేష్కు, Cell : 9866789072

సేల్స్ మేనేజర్
జి.విజయ్‌కుమార్ B.A., B.Ed,.

Office Address
D.No.10-12-6/44, Plot No.302,
Sai Towers 1, Rednam Gardens,
Visakhapatnam.530002
Cell : 9492423833

విషయ సూచిక

Registration No.1140/2019

ప్రజా మీడియా నెట్‌వర్క్
PRAJA MEDIA NETWORK

ఇ. జయకర్ డానియల్
Chief Executive Officer (CEO)

కనపర్తి రాజారావు
చీఫ్ ఎడిటర్ & పబ్లిషర్

సాయి టవర్స్-1, ఫ్లాట్ నెం.302, రెడ్నం గార్డెన్స్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 94924 23833.
హెచ్.నెం. 9-1-38, వైఎంసిఎ కాంప్లెక్స్, సర్దార్‌పటేల్ రోడ్డు, సికింద్రాబాద్, తెలంగాణ,
ఫోన్ : 9885715927, 9912202720

ఎడిటోరియల్

నెక్ట్స్ ఏంటి? ఎవరు?



కాంగ్రెస్ తాత్కాలిక అధ్యక్షురాలు సోనియా గాంధీకి పదవి గడువు ఆగస్టు 10వ తేదీతో ముగుస్తోంది. ఆ గడువు లోపలే కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలి. ఎవరూ ఎన్నిక కాకపోతే పర్మినెంట్ అధ్యక్షురాలిగా సోనియా గాంధీనే కొనసాగుతారా అందుకు ఆమె అంగీకరిస్తారా ఆమె అంగీకరించకపోతే కొత్త అధ్యక్షుడు ఎవరు

కాంగ్రెస్ పార్టీకి కొత్త అధ్యక్షుడు ఎవరనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా ఉంది. ఈ ప్రశ్న వేధిస్తున్నది కేవలం కాంగ్రెస్ పార్టీనే కాదు. ఇతర పార్టీల్లోనూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరనే విషయంపై ఆసక్తిగా ఉంది. నిజానికి కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరు అనే ప్రశ్న తలెత్తడానికి అవకాశమే లేదు. ఎందుకంటే అది ఒక కుటుంబం చేతుల్లో ఉంది. అధ్యక్ష పదవి ఆ కుటుంబ సభ్యులు తప్ప మరొకరు చేపట్టేందుకు అవకాశం లేదు.

ఆ పదవికి పోటీ పడటానికి ఎవరూ సాహసం చేయరు కూడా. కానీ ఇప్పుడు కాంగ్రెస్ అధ్యక్షుడు ఎవరు అనే ప్రశ్న తలెత్తడానికి కారణం సోనియా గాంధీ కుమారుడు, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీయే. ఈ సంగతి అందరికీ తెలిసిందే. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి బాధ్యత వహిస్తూ రాహుల్ పదవిని వదులుకున్నారు. ఆ పని చేయొద్దని ఎంతమంది చెప్పినా వినలేదు. తనకు అనారోగ్యం కారణంగా సోనియా గాంధీ పార్టీ పగ్గాలు రాహుల్ గాంధీకి అప్పగించారు.

తానింక రెస్టు తీసుకోవచ్చని అనుకున్నారు. కానీ రాహుల్ పగ్గాలను మధ్యలోనే వదిలేశారు. దీంతో గత్యంతరం లేక ఆమె తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆ గడువు ఆగస్టు 10వ తేదీతో ముగుస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్లోనే నాయకత్వ సంక్షోభానికి ముగింపు పలకాలని సోనియా అనుకున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోవాలని ప్లాన్ చేశారు.

కానీ రాహుల్ గాంధీ పట్టు వీడకపోవడం, కరోనా మహమ్మారి వ్యాప్తి చెందడం మొదలైన కారణాలతో అధ్యక్షుడి ఎన్నిక పెండింగ్‌లో పడిపోయింది. చివరకు సోనియా గాంధీ పదవీ కాలం ముగిసే టైం కూడా వచ్చేసింది. అనారోగ్యం కారణంగా ఆమె తాజాగా ఆస్పత్రిలో చేరారు. రాహుల్ పదవి వదిలేసినప్పటి నుంచి ఆయనే మళ్ళీ పగ్గాలు చేపట్టాలనే డిమాండ్ కొనసాగుతూనే ఉంది.

సోనియా గాంధీ పార్టీ ఎంపీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్ అధ్యక్ష ఎన్నిక అంశాన్ని లేవనెత్తారు. రాహుల్ గాంధీయే మళ్ళీ పగ్గాలు తీసుకోవాలన్నారు. రాహుల్ కేంద్రప్రభుత్వం తీరును ఎండగట్టడం తాము చూస్తున్నామని, ప్రధాని మోడీని కడిగిపారేయడం గమనిస్తున్నామని కాబట్టి ఆయనే మళ్ళీ అధ్యక్షుడిగా రావాలని అన్నారు. ఎంపీలు చాలామంది రాహుల్‌ను బలపరిచారు.

కరోనా మహమ్మారి సమయంలో రాహుల్ పార్టీని లీడ్ చేశారని ప్రశంసించారు. ప్రజావాణిని బలంగా వినిపించారని అన్నారు. కానీ సమావేశంలోనే ఉన్న రాహుల్ గాంధీ మౌనంగా ఉండిపోయారు. కొందరు నాయకులు ప్రియాంక అయితే ఎలా ఉంటుంది అని ఆలోచిస్తున్నారు. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చాక ఆమె యాక్టివ్‌గా ఉన్నారు. మోడీపై బాగానే విమర్శనా బాణాలు సంధిస్తున్నారు. ఆమెను యూపీ సీఎం అభ్యర్థిగా అధిష్టానం నిర్ణయించినట్లు ఈ మధ్య వార్తలొచ్చాయి.

నిజానికి కాంగ్రెస్ అధ్యక్ష పదవి రాహుల్ గాంధీకే ఇవ్వాలని సోనియా కోరిక. ఆయన ద్వారానే కాంగ్రెస్ మళ్ళీ కేంద్రంలో అధికారంలోకి రావాలని, ఆయన ప్రధాని కావాలని అనుకుంటున్నారు. ఆశపడుతున్నారు. రాహుల్ అంగీకరించకపోతే, సోనియా కొనసాగడానికి ఇష్టపడకపోతే ప్రియాంకా గాంధీని తెరమీదికి తెస్తారా అది కూడా కాకపోతే నాన్ గాంధీ కుటుంబానికి చెందిన నేతను అధ్యక్షుడిని చేస్తారా చూడాలి.

చీఫ్ ఎడిటర్

తెలుగు పత్రికా పరిభాషలో ఉర్దూ

- సంపత్ కుమార్ శ్రీవత్స, మొబైల్ : 9346435123

వార్త పత్రికలకంటూ ఒక ప్రామాణిక భాష ఏర్పరచబడింది. అది గ్రాంధికమూ కాదు, గ్రామ్యమూ కాదు విశేషంగా వార్త 'టైటిల్' లేక 'లీడ్' పాఠకుడిని ఆకట్టుకునే విధంగా రాయల్సి ఉంటుంది. చూడగానే సగం విషయం అర్థమైపోయి మిగతా వార్త కడవరకూ చదవాలనిపించాలి.

ఇక కొన్ని ఆకర్షణీయమై టైటిల్స్ లేక పతాక శీర్షికల్ని పరిశీలిద్దాం.

'కోస్తాకు **తుఫాన్** హెచ్చరిక' ఇందులో 'తుఫాన్' అనేది ఉర్దూపదం (సుడిగుండం)

'కరోనా కట్టడి కోసం **పకడ్బందీ** 'చర్యలు' మళ్ళీ అంతే "పకడ్బందీ" అనే పదాన్ని 'కట్టుదిట్టమైన' అనే అర్థంలో ఉపయోగించారు.

"ముఖ్యమంత్రి ఆజ్ఞలు **"బేఖాతర్"** పంటలు వేసే విషయంలో **ఆఖరు** నిర్ణయం అధికారులదే,

'విధివిధానాలు **'కరారు'.** మహిళాబిల్లుకు అన్ని పార్టీల **మద్దతు** పై నాలుగు క్యాప్షన్స్‌లో చూడండి. "బేఖాతర్" అనే పదాన్ని నిర్లక్ష్యం లేక అగౌరవం అనే అర్థం వచ్చేలా రాశారు. ఉర్దూలో ఖదర్ = గౌరవము, "బేఖదర్" అంటే 'అగౌరవము' చిన్న మార్పుతో బేఖదర్ బేఖాతరుగా మారింది. ఇక పోతే మరో వార్తలో "కరారు" అనే పదము **ఖరార్** నిర్ణయమునకు సమానార్థకము. నిర్ణయించడమైనది అనే అర్థంలో రాయబడింది. "ఆఖరు నిర్ణయం" అనే దానిలో ఆఖర్ = తుది, చివర. ఈ విధంగా ఉర్దూ తెలుగుల మధ్య ఆత్మీయ బంధం ఉన్నదని నిరూపించబడింది.

"పలు **రైళ్ళ రద్దు**తో ప్రయాణీకులు **బేజారు**, రైల్ గాడీ అనే ఉర్దూ పదాన్ని "ధూమశకటము" అని రాయలేముకదా! <u>రద్</u> అంటే నిలిపివేత, **"బేజార్"** అంటే ఇబ్బంది. ఈ విధమైన గమ్మత్తైన ప్రయోగాలు కోకొల్లలు.

మరొక దినపత్రిక "అసెంబ్లీ సాక్షిగా ఎమ్మెల్యే **దాదాగిరి** అనే దాన్లో **దాదాగిరీ**ని హైలైట్ చేసింది ఈ పదానికి వాస్తవంగా 'పెత్తనం' అని అర్థం వ్యావహారికంగా 'దాదాగిరి' "గుండాగిరి" అంటే దౌర్జన్యం అన్న మాట.

రైతులకు "రుణ**మాఫీ"** అనే శీర్షికను నిశితంగా గమనిస్తే 'ఋణమ్' అనే సంస్కృత పదానికి **"మాఫీ"** అనే ఉర్దూపదమును జతచేసి కొత్త సమాసాన్ని సృష్టించారని అర్థమవుతుంది. "మాఫీ" అంటే క్షమించటం కానీ ఈ సందర్భంలో రైతులు గతంలో తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించనవసరం లేదు. "అని అర్థం చేసుకోవాలి. మరొక పత్రిక **"సర్కారీ** రుణాలు **రద్దు"** అని రాసింది. **'సర్కారీ'** అంటే ప్రభుత్వ సంబంధ, ఋణాలు **రద్** (రద్దు) చెల్లించనక్కరలేదు అని భావము.

"ఎండాకాలం చల్లని **కబురు**"ను పరిశీలిస్తే ఖబర్ = వార్త, ఖబర్ 'కబురు'గా రూపాంతరం చెందినట్లు తెలుస్తుంది. మరొక సందర్భంలో 'ఖబర్' అంటే 'సమాధి' సుమా! ప్రస్తుతం మాత్రం వేసవి ఎండలతో బాధపడుతున్న ప్రజలకు చల్లని (మంచి) వార్త అని భావించాలి.

"ప్రభుత్వోద్యోగులకు తీపికబురు" అని రాస్తారుగా! మరి వార్త ఏదైనా తీయగా ఉంటుందా? అంటే ఇబ్బంది పడుతున్న ఉద్యోగులకు మేలు చేసే కబురు, నిజంగానే తియ్యగా కమ్మగా ఉంటుందనేది నిజం.

"అసెంబ్లీ ఎన్నికల్లో **జోరు** అందుకున్న కారు" అనే శీర్షిక కారు గుర్తువేగాన్ని పుంజుకున్నది అనే దాన్ని **జోర్** = వేగము అనే ఉర్దూ పదంతో హైలైట్ చేసింది. 'కారు, జోరు' అనే అంత్యప్రాసలను కుదిర్చి పఠనయోగ్యంగా మార్చిన విలేఖరి 'కవి'కి తక్కువేం కాదండోయ్!

వందలాది ఏళ్ల నైజామ్ పాలనలో తెలుగు, ఉర్దూపదాలు క్షీరనీరాల వలె కల్సిపోయాయనటంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

అన్యభాషా పదాలను స్వీకరించటం అన్ని భాషల్లోనూ ఉన్నదే గానీ, తెలుగంత విశాలహృదయం మరేభాషకూ లేదు. ఉర్దూ భాషలోని అనేక పదాలను తనలో ఇముడ్చుకుని అలవోకగా మాట్లాడుతారు - తెలంగాణా వాసులు.

ఎక్కువగా వినియోగంలో ఉన్న పదాలతో - రాసిన వార్తలు ఆకట్టుకుంటాయి కదా! అలాంటి పదాలు వాక్యానికి వన్నె తెస్తాయి. కాబట్టి శీర్షికల్లో వాటిని వాడేస్తారు. పాత్రికేయులు. అంతెందుకు చూడండి 'హెడ్‌లైన్స్', 'బ్యానర్ ఐటమ్' అనే ఇంగ్లీష్ పదప్రయోగాల్ని (శీర్షిక & పతాక శీర్షిక) యధాతథంగా పెట్టేస్తారు. తప్పేమీ కాదు కదా!

"పెన్షనర్ల సమస్యలపై హైకోర్టులో **ఫిర్యాదు దాకలు** బాగా గమనిస్తే "ఫర్యాద్" అనే పదానికి అభియోగము అని 'దఖల్' అంటే ప్రవేశపెట్టుటి అని అర్థం. "ఫరియాద్" తెలుగులో 'ఫిర్యాదు' గాను దఖల్ తెనిగీకరించబడి 'దాకలు'గా రూపొంది అభితయోగ్యం అయినాయి. అలా చేసింది 'వకీల్‌సాబ్' న్యాయవాదిగారు.

'విద్యార్థులపై పోలీసుల **"లాఠీఛార్జ్" - లాఠీ'** అనే ఉర్దూపదం (కర్ర) ఛార్జ్ అనే ఇంగ్లీష్ పదంతో కలిసి విద్యార్థులను విరగదన్నింది.

"ప్రజా**దర్బార్**"లోని **దర్బార్** అనే ఉర్దూపదానికి సభ అని అర్థం. "ప్రజాసభ" లేక జనసభ అన్నా సరిపోతుంది, కానీ **"దర్బార్"** పద ప్రయోగంచేత వార్తకు బలం చేకూరింది.

'ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అమ్మాయిలదే **'హవా'**

'డిగ్రీ ఫలితాల్లో బాలికల **జోరు**

'హవా' అంటే గాలి, జోరంటే వేగం అని తెల్సుగా?

పరీక్షా ఫలితాల్లో అమ్మాయిలు ముందు నిలిచారు, అనే విషయాన్ని హవా, జోరు వంటి ఉర్దూ పదాల వినియోగం ఆకర్షనీయంగా మార్చింది.

"యుద్ధంలో సైనికులు పదుల సంఖ్యలో **కతమ్"**

"అమరవీరులకు అందరి **సలామ్"**

'ఖత్మ్' అంటే ముగించటం లేక ఉత్తరించటం. అలాగే

'సలామ్' అంటే వందనం అని అర్థం

"మిడతల దండు" రాకతో తెలుగు రైతులు "**హైరానా** పెరుగుతున్న కోవిడ్ మరణాలతో ప్రపంచమే పరేషాన్" అనే రెండు వార్తల్లో పంచ్‌పాయింట్‌గా "**హైరానా"** (ఆందోళన) **పరేషాన్** (ఇబ్బంది), అనే ఉర్దూ పదాలను వినియోగించటం గమనార్హం. ఇలాంటి పదప్రయోగం భయం యొక్కస్థాయిని హెచ్చించి చూపిస్తున్నది.

ఈ విధంగా మనకు తెలియకుండానే ఎన్నో అన్యభాషాపదాలను ఉపయోగిస్తుంటాం.

"లాక్‌డౌన్ తర్వాత తారెత్తిస్తున్న **'చోరీలు'** దొంగతనాలు అనే దానికి బదులుగా "చోరీ" అనే పద ప్రయోగం పాఠకుల్ని చదింపజేస్తుంది.

అనే పదప్రయోగం పాఠకుల్ని చదివింపజేస్తుంది.

"దేవస్థానం విధుల బదలాయింపు"లో చూచి నట్టయితే **'బదిలీ'** మరలించటం కదా! దీని అర్థం ఏమిటంటే 'నిధులను తప్పుదారి – పట్టించి దుర్వినియోగం చేసినారు, అనే 'బద్‌లీ' అనే దాన్ని తెనిగీకరించి – "బదలాయించటం"గా రూపొందించినారు, 'అధికారి స్థాన చలనము'ను కూడా కలెక్టర్ "బదిలీ" అని రాయటం కద్దు, సామాన్యపాఠకుల్లో ఉత్సుకతను పెంచటానికే ఇలా రాస్తుండవచ్చు.

ఈ వార్తలో నాలుగు పదాలున్నాయి. గానీ వాటిలో మూడు ఉర్దూపదాలే "**జైలు** నుండి **ఖైదీ పరారీ"** **జైలు** అంటే కారాగారం, **'ఖైదీ'** అంటే నేరస్తుడు. **'పరారీ'** అంటే పారిపోవటం. ఎంతో విచిత్రంగా కుదిరిందో చూడండి.

"సర్కార్ దవాకానకు సుస్తీ" ఇందులో వినయోగించిన మూడు ఉర్దూభాషనుండి తీసుకున్నవే సర్కార్ = ప్రభుత్వము, దవాఖానా = వైద్యశాల, అలాగే 'సుస్తీ' = అనారోగ్యము భలేగా ఉందికదూ!

చదవీ చదవీ బోర్ కొట్టేలా ఉంది కాబట్టి నిత్యం పత్రికల్లో ఉపయోగించే చక్కని ఉర్దూ పదముల అర్థాలను తెలియజేయ ప్రయత్నిస్తాను.

ఉర్దూ		**తెలుగు**		**అర్థము**
షర్త్	–	షరతులు	=	నిబంధనలు
సవాల్	–	సవాలు	=	ప్రశ్న / ఛాలెంజ్
జవాబ్	–	జవాబు	=	సమాధానము
బడాబాబు	–	బడాబాబులు	=	పెద్దమనుషులు
బంద్	–	బంద్	=	మూసివేత / నిలిపివేత
ఖాయమ్	–	ఖాయం	=	నిశ్చయము
షురూ	–	షురూ	=	ప్రారంభం
నకద్	–	నగదు	=	ధనరూప

ఇలా చెప్పుతూపోతే తెలుగు పదాలను ఎదుర్కోవలసి రావచ్చు. పత్రికా భాషలో 'అభివ్యక్తీకరణ' విషయంలో తెలుగు, ఉర్దూ పదాలు అద్భుతాలు సృష్టిస్తున్నాయనేది వాస్తవం..

అరమరికలు లేకుండా కలసిపోయిన తెలుగు, ఉర్దూలకు వేవేల వందనాలు.



భారతీయులం

మొదట మనం భారతీయులం, ఆ తరువాతే హిందువులం, లేదా ముస్లిములం అని కొంతమంది నాయకులు అంటున్నది నాకిష్టం లేదు. ఆ మాటలు నన్ను సంతృప్తి పరచవు. అరమరికలు

లేకుండా మళ్ళీ అంటున్నాను. అవి నన్ను సంతృప్తి పరచవు.

భారతీయులుగా మన విధేయత, మతం వల్లగానీ, సంస్కారం వల్లగానీ భాషల వల్లగానీ ఉత్పన్నమయ్యే మరొక రకమైన విధేయతతో పోటీపడవలసిన పరిస్థితి రాకూడదని, నా అభిప్రాయం. ప్రజలందరూ, మొదటా – చివరా కూడా భారతీయులే అవ్వాలని, భారతీయులు తప్ప మరేమీ కాకూడదని నా కోరిక.

–డా॥ బి.ఆర్.అంబేద్కర్

భారత ఆర్థిక వ్యవస్థపై వ్యాధి ప్రభావం

- ఆచార్య కె.ఎస్.చలం,యు.పి.ఎస్.సి.పూర్వసభ్యులు

ప్రపంచ పెట్టుబడిదారి మార్కెట్ విధానంలో నిలపాలని రాజ్యం నిర్వర్తించగల పరిమిత కార్యాలను సమీక్షించుకునే అవకాశాన్ని కోవిడ్– 19 కల్పించింది. భారతదేశం వర్గ స్వభావం ఉన్న రాజ్యమని అంగీకరించినా పాలకవర్గాలు– బ్రాహ్మణ –వైశ్య వర్గాలకు బాధను, హిందుత్వంలో భాగంగా మారాయని కూడా అంగీకరించాలి. ఈనాటికి దేశం యొక్క ఆర్థిక నిర్మాణం వర్ణ ధర్మాలపై ఆధారపడిందన్నది సత్యం. ఇంకా చెప్పాలంటే అధికారం ,ఆదాయం, అవకాశం, (మూడు 'అ'కారాలు) ఈనాటికి కొద్దిమంది 'ద్విజుల 'చేతుల్లోనే ఉన్నాయి. దళితుల్లో అధిక భాగం శూద్రుల్లో సేవా కులాలు కేవలం ద్విజులకు సేవ చేయటం వరకే ఉన్నారు. శూద్రుల్లో పైకి వస్తున్న భాగం వారిని ద్విజులు ఎంపిక చేసుకుంటారు .మనుధర్మం ప్రవచించిన పవిత్ర హిందూ వర్ణాశ్రమ ధర్మం ఇదే. కోవిడ్ 19 ఈ ధర్మాన్ని అతిక్రమించి కులం, వర్గం, లింగం, వయస్సు, రంగు , ప్రాంతం, మతం అన్ని సమస్తాన్ని కాదని అందర్నీ ఆక్రమించింది. కనుకనే మనం ఒక విశ్వ జనీన ఆర్థిక సూత్రాన్ని అవలంబించి అన్నార్తులకు అసహాయులకు సాయం చేయవలసి ఉంటుంది. భారత్ ఈ నాటికీ వ్యవసాయాధార సమాజమే. దానిపై 60 శాతం ప్రజలు కార్మిక కర్షక శక్తిని ఆధారపడి జీవిస్తున్నారు. మరింత మంది దళితులు, వలస కార్మికులుగా తరలివచ్చి ఈ శ్రమజీవుల సమూహంలో చేరుతున్నారు. ఇది చిత్రమైన విషయం. మన మార్క్సిస్టు మేధావులు కొంతమంది కాదన్నా– అవునన్నా– పశ్చిమ దేశాల్లో 'కార్మికవర్గం' అనే మాట అంతర్ధానమైంది. భారతదేశంలో ముఖ్యంగా దళితులు, ఆదివాసీలు, శ్రామిక కులాల మిశ్రమమైన కార్మికవర్గం చెక్కు చెదరకుండా అలానే ఉన్నది. లౌకిక శక్తుల పోరాటాలతో కొద్దిపాటి మార్పులు కనిపించవచ్చును. వలస కార్మికులు వేల కిలోమీటర్లు తిండి, నీరు లేకుండా నడిచారు అంటే అదే రహస్యం .ఏ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎటు వాళ్ళు అంటరాని వాళ్ళు కదా !సామాజిక దూరంగా ఉంచాలి కదా .అలాగే ఉంచారు. ఎవరో వ్యక్తుల ప్రజాస్వామిక శక్తుల ఆదరణతో ప్రపంచానికి తెలియ జేసారు.

అంతర్జాతీయ సామాజికసంస్థ (ఐఎల్ఓ) నివేదిక (2019 జూలై) ప్రకారం శ్రామికుల పరిస్థితి దిగజారుతుంది. ప్రపంచ ఆదాయమూ, పంపకం అనే విభాగంలో జరిగిన వివరాలు.

1. శ్రామిక ఆదాయం దిగజారుతుంది. విపరీత ధోరణులకు లోనవుతుంది. అమెరికా –ఐరోపా దేశాలలో పరిస్థితి అలానే ఉంది.

2. స్వీయ ఉద్యోగ కల్పనలో శ్రామికాదాయం తీవ్రంగా మార్పులకు లోనవుతుంది. మనం నిత్యం చెప్పేపద్ధతుల పరిమితులను తెలియజేస్తుంది.

3. జాతీయాదాయంతో పాటు శ్రామికాదాయంలో తేడాలు కూడా తగ్గుతున్నాయి .అందుచేత సగటు దేశాలమధ్య తేడా పెరుగుతోంది.

4. దేశాల అంతరిక పరిస్థితుల్లో కూడా పంపిణీ వెళ్తుంది. అధిక ఆదాయం శిఖరం పైన పెరిగేకొద్దీ అట్టడుగున అల్పాదాయ వర్గాలు మరింత తక్కువకు పని చేయవలసి వస్తుంది .ఎన్ ఎస్ ఎస్ అధ్యయనాల ప్రకారం భారత్‌లో గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం మగవారు, 55 శాతం ఆడవారు, నగర ప్రాంతాలలో 70 శాతం మగవారు, 52 శాతం ఆడవారు, కష్టజీవుల జాబితాలో కనిపిస్తున్నారు. ఎన్.ఎస్.డి 2019 నివేదిక ప్రకారం –గ్రామీణ ప్రాంతాల్లో 54.9 శాతం మగవారు, 18.2 శాతం ఆడవారు, నగర ప్రాంతాల్లో 57 శాతం మగవారూ– 15.9 శాతం ఆడవారు ఎదుగూ బొదుగూ లేని ఆదాయాలతోనే జీవిస్తున్నారని తెలిసింది. (ps+ss) వయస్సుల రీత్యా చూస్తే 15 – 29 ఏళ్ల వయసులో 38.2 శాతము (గ్రామీణ 38 శాతం/ నగరం 38.5), 15ఏళ్ల నుంచి పైకి 49.8 శాతం ఉన్నారు. గ్రామీణ వ్యవసాయ శాఖలో 73 పాయింట్ నాలుగు శాతం పనివాళ్ళు స్థిర ఆదాయం వర్గంగా ఉండిపోతారు వ్యవసాయేతర శాఖల్లో 68.4 శాతం (ps+ss) ఆ పరిస్థితులు కనిపిస్తున్నారు. ఇందులో మగవారు 70.1శాతం, ఆడ వారు 54.8 శాతం కనిపిస్తున్నారు. (పట్టికలు 2, 3) అదే నివేదిక ప్రకారం మగవాళ్ళలో 5.4 శాతం ఆడవాళ్ళలో 3.8 శాతం నిరుద్యోగులుగా ఉన్నారు ఇదే నగరాల్లో 7.1 శాతం, 10.8 శాతాలుగా కనిపిస్తున్నారు.

ఎన్ఎస్‌డి (2019) నివేదిక దాదాపు ఇటువంటి శాఖలను సూచించింది. ఈ నివేదిక ప్రకారం (సెకండరీ విద్య– దానిపైన) కొంచెం విద్యావంతులైన మగవారిలో 10.5% ఆడవారిలో 17.3 శాతం నిరుద్యోగులు వున్నారని తెలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ శాతాలు మగవాళ్ళు 17.4 శాతం, ఆడవారిలో 13.6 శాతంగా ఉన్నాయి. ఇవన్నీ 2019 రిపోర్టులోనివి. 2017 –18 రిపోర్టులు ఈ శాతాలు కొంచెం (మగవారు 18.7 శాతం ఆడవారు 27.2%) హెచ్చుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదే నివేదిక ప్రకారం ఎస్టీలు (41.8 శాతం) హెచ్చుగా, ఆ తర్వాతి స్థానాల్లో ఎస్సీలు (37 శాతంలో) ఓ బి సి లు (36.2 శాతం) ఉన్నారు. ఇతర కులాల్లో 35.9 శాతం కనిపిస్తుంది ఎస్టీ కులాలు అందరికంటే ఎక్కువగా నిరుద్యోగం ఉందని తెలుస్తుంది.

పై సంఖ్య వివరాలు ఉన్న తేడా 70 శాతం మగ వారిలో 50 శాతం వ్యవసాయంలో ఉన్నట్లు తెలుస్తోంది. వ్యవసాయేతర రంగాల్లో మగవారు 71.1%, ఆడవారిలో 54.8 శాతం ఉన్నారు. ఈ రంగాల్లో ఎక్కువ మంది sc,st,obc ముస్లిం వర్గానికి చెందిన వారు. ఇక్కడ ఒక ముఖ్య విషయం .సరిగ్గా ఈ వర్గాల నుండే లాక్‌డౌన్‌లో నగరాల్లో జీవించలేక గ్రామీణ వ్యవసాయ క్షేత్రల వైపు ప్రయాణం అవుతున్నారు. అన్నం పెట్టే వాళ్ళు లేరు ఆదరించే వాళ్ళు లేరు సుప్రీంకోర్టు కూడా కల్పించుకొని ఆర్టికల్ 21 ప్రకారం వలస జీవులను క్షేత్రాలకు చేర్చమని ఆజ్ఞాపించ లేకపోయింది. శ్రామికుల ఆత్మగౌరవాన్ని రక్షించే వారే లేకపోయారు. గ్రామీణ ప్రాంతాల కూలీ రేట్లు స్వల్పంగా ఉంటున్నాయి. రిజర్వ్ బ్యాంక్ తన ఏప్రిల్ 2020 రిపోర్టులో ఉన్నట్లుగా "ఇటీవల మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం" చట్టం పనిచేస్తున్నట్లు కనిపించదు. తక్కువ కూలీ ఆలస్యంతో చెల్లింపులు, బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు ఇందుకు కారణాలని తెలుస్తూనే ఉంది. గాంధీ పథకం ప్రకారం ఇచ్చే వేతనాలు ఇతర పథకాల కంటే 15 శాతం తక్కువగా ఉంటున్నాయి. 375 రూపాయలు దినసరి వేతనం ఉండాలని ఇతరులు సూచిస్తుంటే ,ఈ పథకంలో 175 రూపాయలు ఉంటుంది. జాతీయ కనీస వేతనం రూ. 250 ఉండాలని మంత్రి వర్గం కూడా సూచించింది.

ఆదివాసీ హక్కులు చట్టాలకే పరిమితమా?



- ఆచార్య కె.పి.సుబ్బారావు

ప్రతీ సంవత్సరం ఆగస్టు తొమ్మిదవ తారీఖున ప్రపంచ ఆదివాసీ దినం ప్రపంచ వ్యాప్తింగా జరుగుతుంది. ఆదివాసీలు అనేకంటే 'మూలవాసీలు' సరియైన పదంగా ఐక్యరాస్య సమితి నిర్ణయించింది. ఆదివాసీలలో చైతన్యాన్ని నింపడానికీ, వారి హక్కులను రక్షించుకొనడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడాలన్నదే ముఖ్యఉద్దేశ్యం. అంతేకాకుండా ఆదివాసులు ఇంతవరకూ సాధించుకొన్న హక్కులకు గుర్తింపు నివ్వడానికి ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ రక్షణకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిని కూడా మదింపు చేసుకొనడానికి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఉపయోగపడుతుంది.

టూకీగా చరిత్ర చెప్పాలంటే ఐక్యరాజ్య సమితి 1994లోనే ప్రతీ సంవత్సరం ఆగస్టు 9వ తారీఖున అంతర్జాతీయ మూలవాసీలు *(International Day on Indigenous People)* దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించింది. అప్పటి నుండి ప్రపంచంలోని ఆదివాసీలు దీన్ని ఒక పండగగా జరుపు కుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదికారికంగా జరుపుతున్నాయి. అంతర్జాతీయ లేబర్ సంస్థ ప్రకారం 90 దేశాలలోని 5000 రకాలైన ఆదివాసులు, సంఖ్యరీత్యా 476.6 మిలియన్ల మందికి ఒక ఆత్మధైర్యాన్నిచ్చే రోజుగా వర్ణించవచ్చు.

భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్‌లో పొందు పర్చడంవలన ఆదివాసీలను షెడ్యూల్డు తెగలుగా పిలుస్తారు. దేశ వ్యాప్తంగా 645 తెగలు, మన రాష్ట్రంలో 35 రకాల తెగలున్నారు. ఈ తెగలకు ప్రత్యేకమైన సంస్కృతి, భాష, ఆవాసం, సాంప్రదాయాలున్నాయి. సామాన్య ప్రజల భాషలో ఈ తెగలను మైదాన తెగలు, కొండ తెగలు, అడవి తెగలుగా వర్గీకరిస్తారు. ప్రపంచంలో అండమాన్ నికోబార్ దీవుల్లోని 'జారవా'లు అతి ప్రాచీన మైన తెగ అయితే 'అండమానీస్' అతి చిన్న తెగ. ఆదివాసీలు హిందువులు కాదు, ఆ మాటకొస్తే ఏమతనికి చెందనివారు. అడవిలోని చెట్టూ, పుట్టను నమ్ముకొనే ప్రాచీన సాంప్రదాయంగలవారు. అలాంటి వారిని క్రిష్టియన్ మిషనరీలు అడవుల్లోకి చొచ్చుకుపోయివారిని క్రైస్తవులుగా మారుస్తున్నారు. దీనికి తోడు మైదాన ప్రాంతం వారు వచ్చిన వారితో ఎటూ సమస్యలున్నాయి.

స్వాతంత్ర్యకం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా ఆదివాసీల బ్రతుకుల్లో పూర్తిగా వెలుగురాలేదు. సరిగదా అనేక సమస్యలతో సతమతమౌతున్నారు. వీటిలో ముఖ్యమైనవి చిన్న కమతాలుగా ఉన్న పోడు వ్యవసాయం వలన చాలీ చాలని ఆదాయం, తక్కువ శాతం మంది కులవృత్తులు చేపట్టడం, నిరక్షరాస్యత, అవిద్య, ప్రభుత్వపథకాలు అందకపోవడం, బ్యాంకు సదుపాయంలేకపోవడం, నిరుద్యోగం, చట్టాలు ఆచరణలోకి రావకపోవడం.

భారతరాజ్యాంగం 5,6 షెడ్యూల్స్ ప్రకారం 1996లో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా సంకల్పించిన పంచాయితీ రాజ్ షెడ్యూల్డ్ ప్రాంతాల విస్తరణ చట్టం *(PESA)*ను. అటవీ హక్కులచట్టం 2006 ప్రకారం ఆదివాసీలు నివసించే ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా, పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులకు అనుమతులు చేయాలన్నా గ్రామసభ అనుమతి కావాలి. ఈ చట్టాల ప్రకారం ఆదివాసీ ప్రాంతాలను పరిపాలించుకొనే అధికారం సంక్రమించింది. ఈ చట్టాల ప్రకారం ఆపరేషన్ గ్రీన్ హంట్ దండకారణ్యంలో రాజ్యాంగ విరుద్ధంగా కొనసాగుతుంది కనుక ఆదివాసీల మనుగడను కాపాడు కోవడం అత్యవసరమైంది.

ప్రజాస్వామ్యంలో జీవించే హక్కును రాజ్యాంగం ప్రతీపౌరునికి కల్పించిన ఒక ప్రాధమిక హక్కు. ఈ హక్కును హరించే అధికారం సమాజంలో ఏ వ్యక్తికి కాని, ప్రభుత్వానికి గాని లేదు. శ్రీకాకుళ రైంతాగపోరాటం వలన సాధించుకొన్న 1/70 చట్టం, పీసా, అడవీ సంరక్షణ చట్టాలను ప్రభుత్వాలు అమలు పర్చాలని ఆదివాసీలు కోరుకుంటున్నారు. గ్రామ సభ అనుమతి లేకుండా అడవిలోని ఖనిజ సందను దేశ, విదేశ కార్పొరేటు సంస్థలకు కట్టబెట్టకుండా జల్, జమీన్, జంగిల్ కొరకు పోరాటాలు చేస్తున్నారు. వారి పోరాటాల ఆకాంక్షలను, ఆశయాలను గుర్తించడమే నిజమైన ఆదివాసీ దినోత్సవంగా పరిగణించాలి.



ఆత్మగౌరవ ప్రతీక 'దళిత' సాహిత్యం



ఆచార్య **దార్ల వెంకటేశ్వరరావు,**
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
సెంట్రల్ యూనివర్సిటీ,
హైదరాబాద్,
ఫోను: 9182685231

సమాజం వైరుధ్యాలమయం. అది సంఘర్షణలతో పరిణామ స్వభావాన్ని కలిగి ఉంటుంది. ఆదిమ సమాజం దశ నుండి ఆధునిక సమాజం వరకూ ఈ అంతరాలు కొనసాగుతూనే ఉన్నాయి. మత, వర్గ, వర్ణ, భాష, ప్రాంతీయ, లింగ భేదాల వల్ల మానవుల మధ్య సంఘర్షణ అనివార్యమవుతుంది. సవ్యదిశలో జరిగే సంఘర్షణల వల్ల సమాజంలో కొత్త పరిణామాలు సంభవిస్తుంటాయి. భారతీయ సాహిత్యంలోనూ, తెలుగు సాహిత్యంలోనూ ఇటువంటి సంఘర్షణల నుండే దళిత సాహిత్యం తనదైన ఒక ప్రత్యేక అస్తిత్వంతో మొదలైంది. తెలుగులో సంప్రదాయ, అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీ వాద సాహిత్య ధోరణులకు నాటి సమాజ పరిణామాలు కారణమైనట్లే, దళిత సాహిత్యానికి కూడా అలాంటి కారణాలే తోడయ్యాయి. అలాంటి నేపథ్యం నుండే తెలుగులో దళిత సాహిత్యం కూడా ఆవిర్భవించింది. దళిత సాహిత్య సాహిత్యం కూడా ఆవిర్భావంతో తెలుగులో సాహిత్య విస్తృతి పెరిగింది. తెలుగు సాహిత్యమంతా పునర్మూల్యాంకనకు గురికావలసిన పరిస్థితి ఏర్పడింది. సాహిత్యానికి కొత్త వస్తువు, కొత్త అభివ్యక్తి లభించి సాహిత్యం నిత్యనూతనంగా మారింది. సాహిత్యానికి వందలాది సంవత్సరాలు దూరంగా ఉన్న వర్గం సాహిత్యానికి దగ్గర కావడంతో భాష, సాహిత్య నిర్మాణంలో కొత్త సూత్రీకరణలు చేసుకోవాల్సి వచ్చింది. ఇంత ప్రభావితం చూపిన దళిత సాహిత్య మౌలిక భావనలు, వాదాలు, సిద్ధాంతాలు, దళితసాహిత్య ఆవిర్భావ వికాసాలను తెలుసుకుందాం.

దళితులు – దళిత సాహిత్యం:

భారతీయ సమాజంలో చాతుర్వర్ణ వ్యవస్థ కొనసాగింది. దాన్ని అనుసరించి కులవ్యవస్థ రూపొందింది. అందువల్ల కుల వివక్షను ఆధారం చేసుకొనే దళితులను, దళిత సాహిత్యాన్ని సాహితీవేత్తలు గుర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో దళితులు, దళిత సాహిత్యం అనే మౌలిక విషయాల పట్ల విస్తృతమైన చర్చ జరిగింది.

నిఘంటువుల్లో "దళితము' అనే శబ్దానికి "ఖండింపబడినది, ఛేదింపబడినది, వికసించినది' అనే అర్థాలు కనిపిస్తున్నాయి. ఖుశ్రీఙ్ అంటే దీశీశీవఅ శీతీ తీవaబఅవశీ శీ జూఅవషవం ప్రవఅవతీఖుశ్రీ– శ్రీఎఅని ఆంగ్ల నిఘంటువులు వివరిస్తున్నాయి. అస్పృశ్యత కారణంగా సమాజం నుండి కొంతమందిని "విడగొట్టబడ్డ' వారనే అర్థంలోనే సాహితీవేత్తలు దళితులను వివరిస్తున్నారు. ప్రత్యేకించి ఒక్క కులం లేదా కొన్ని కులాలకు మాత్రమే పరిమితం చేసుకొని దళిత శబ్దాన్ని ఉపయోగించటం సరికాదనే వాదనలు కూడా ఉన్నాయి.

1) సామాజిక వ్యవస్థలో సరైన స్థానం లభించని, వివక్షకు గురవుతున్న వారందరికీ "దళిత' శబ్దం వర్తిస్తుంది. 2) శతాబ్దాల తరబడి జరిగిన పోరాటంలో వ్యక్తమైన ఆత్మ గౌరవ నినాదం "దళిత'. 3) మతాన్ని ఆధారం చేసుకొని ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో జరిగే వివక్షను ప్రశ్నించే శబ్దం "దళిత'. 4) సమాజంలో నిమ్నస్థాయిలో బతుకీడుస్తూ, ఆ కష్టాల నుండి బయటపడటానికి శాస్త్ర విజ్ఞానాన్ని విశ్వసిస్తూ, హేతువాద భావనా బలంతో పోరాడుతూ, అస్తిత్వం కోసం నిత్యం ప్రయత్నించే వారికి ప్రాతినిధ్యం వహించే శబ్దం "దళిత'. 5) దేవుడు, విధి, స్వర్గ–నరకాలు: జన్మ–పునర్జన్మ: ఆత్మ– అంతరాత్మ: అదృష్టం దురదృష్టం వంటి భావనలన్నీ దళితులను బానిసలుగా మారుస్తున్నాయని భావిస్తూ నాస్తికత్వం, హేతువాద భావాలతో మానవతావాదాన్ని బలపరుస్తూ సామాజిక విముక్తిని ఆశించే విస్తృత పరిధిగల శబ్దం "దళిత'. ఇలా "దళిత' శబ్దం గురించి రచయితలు భిన్న కోణాల్లో వివరించారు.

ఈ సందర్భంగా ఒక ముఖ్యమైన స్ఫూర్తిని వివరించుకోవాలి. అది దళిత్ పాంథర్స్ ఉద్యమం, అది మన తెలుగు దళిత సాహిత్యంపై చూపిన ప్రభావం. డా.బి.ఆర్.అంబేద్కర్ స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా స్ఫూర్తిని కొనసాగించడానికి మహారాష్ట్రలో ఏర్పడిన ఒక విప్లవభావాలు గల సంస్థ 'దళితపాంథర్స్'. *Destroying the revolutionary voice of Dr. Ambedkar, these contemptible leaders made capital out of his name and set up their beggars 'bowls"* అని ఆవేదన పడి స్థాపించిన సంస్థ. ఇది అమెరికాలో బ్లాక్ పాంథర్స్ సంస్థ కార్యకలాపాలకు ప్రభావితమై, భారతదేశంలో కులం వల్ల పొందుతున్న అవమానాల్ని తీవ్రస్థాయిలో ఎదుర్కోవడానికి 1970లో మహారాష్ట్రలో ఒక సంస్థగా ఏర్పడింది. *Third Dalit World, that is, oppressed nations, and dalit people are suffering. Even in America, a handful of reactionary whites are exploiting blacks. To meet the force of reaction and remove this exploitation, the Black Panther movement grew. From the Black Panthers, Black Power emerged. The fire of the struggles has thrown out sparks into the country. We claim a close relationship with this struggle* అని అమెరికాలో తెల్లవాళ్ల నుండి నల్ల జాతి ప్రజలు ఎదుర్కొంటూ, వాటినుండి విముక్తి పొందిన స్ఫూర్తిని గ్రహించాలన్నారు. అందుకనే *our commitment to total revolutionary and democratic struggles, and about its policies, are being spread* అని స్పష్టంగా ప్రకటించిన సంస్థ. అప్పటి నుండి కొన్ని కొన్ని భావాల్ని ప్రకటిస్తున్నప్పటికీ 1971లో న బొంబాయి నుండి

"దళిత పాంథర్స్ మ్యానిఫెస్టో' ని ప్రకటించింది. భారతదేశంలో దళితులు కులాన్ని ఏదుర్కోవడానికి రాజకీయంగా, ఆర్థికంగా, సాంస్కృతికంగా, ఆచరణాత్మకంగా చేయాల్సిన పనుల్ని ఈ మ్యానిఫెస్టోలో ప్రకటిస్తూ చిన్న పుస్తకాన్ని ప్రచురించింది. 1973, (బొంబాయి)లో దీన్ని మరింతగా పరిష్కరించింది. అంతవరకు అస్పృశ్యులు, అంటరానివాళ్ళు, సమాజానికి దూరంగా నెట్టివేయబడుతున్నవాళ్ళని రకరకాలుగా పిలిస్తున్నా, షెడ్యూల్డు కులాలనీ పిలుస్తున్నా తొలిసారిగా వీళ్ళని ఒక చైతన్యానికీ, ఒక సంఘటిత శక్తికీ నిదర్శనంగా సంబోధిస్తూ దళితుల్ని నిర్వచించే ప్రయత్నం చేసింది. చరిత్రలో 'దళిత' అనే పదాన్ని వాడిందెవరనేది తర్వాత చర్చిద్దాం. కానీ, దళిత పదాన్ని చైతన్యస్ఫూర్తిగా, ఆత్మగౌరవశక్తిగా దళిత పాంథర్స్ మ్యానిఫెస్టో మలిచింది. అందువల్ల భారతీయ దళిత సాహిత్యంలోను, తెలుగు సాహిత్యంలోను 'దళిత పాంథర్స్ మ్యానిఫెస్టో"కి ఒక చారిత్రక స్థానం ఉంది.

Who is a dalit? Members of scheduled castes and tribes, Neo-Buddhists, the working people, the landless and poor peasants, women and all those who are being exploited politically, economically and in the name of religion అని దళిత పాంథర్స్ మ్యానిఫెస్టో దళితుల్ని నిర్వచించింది.

దీని ప్రకారం షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, నయా బౌద్ధులు, శ్రామికులు, భూమిలేని పేద రైతులు, స్త్రీలు, మతం పేరుతో రాజకీయంగా ఆర్థికంగా దోపిడీకి గురయిన వారంతా "దళితు'లవుతారని తెలుస్తుంది. కానీ, గిరిజనులకు అస్పృశ్యత సమస్య లేదు. అన్ని రంగాల్లోనూ వెనుకబాటుతనం ఉంది. అగ్రవర్ణ స్త్రీలను "దళితులు'గా భావించనవసరం లేదనీ భావిస్తున్నారు. ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ, సిక్కు వంటి మైనారిటీ వారిపై హిందూమత ఆధిపత్యం ఉంది. అణిచివేతకు గురవుతున్నారని, వీరినీ దళితులుగా గుర్తించాలనీ కొంతమంది భావిస్తున్నారు.

దళితసాహిత్యం విస్తృతంగా వస్తున్నప్పటికీ, దళితులంటే ఎవరు? ఏది దళిత సాహిత్యం అనే విషయంలో భిన్న దృక్పథాలు కనిపిస్తున్నాయి. వీటిని రెండు దృక్పథాలుగా విభజించవచ్చు. ఒకటి, చాతుర్వర్ణ్యానికి అవతలివారు మాత్రమే దళితులు. రెండు, అణచివేతకు గురౌతున్నవాళ్ళంతా దళితులు. ఇలాగే, వీరి గురించి రాసేదంతా దళితసాహిత్యమని ఒక వాదనా, కేవలం ఆ జీవితాన్ని అనుభవిస్తున్న వాళ్ళు లేదా ఆ కులాలకు చెందిన వాళ్ళు రాసేది దళిత సాహిత్యమనే మరో వాదన కూడా ఉంది.

భారతీయ దళిత సాహిత్యం– దళితులు:

దళితసాహిత్యాన్ని వివరిస్తూ భారతీయ దళిత సాహిత్యం గురించి ఆంగ్లంలో కనిపిస్తున్న నిర్వచనాల పరిశీలిద్దాం.

1. The term 'Dalit' is not confined to certain traditional castes and communities which are declared to be depressed. It embraces all the communities which are denied a place within respectable social order and were outcastes as a consequence. So, Dalit is not a community but it is social class" (Dada More, Dalit Writings, achievement and prospects. p.8)

2. 'The Dalit is a very comprehensive term which covers most of the people who were unnoticed, unprivileged and underprivileged. They were not at all taken a note of and they had not at all become at any time, the subject of anything good in the society" (P.I. Somkambble, Dalit Literature at a Glance, FAIDWC, 1994:64

3.Dalit is the only name which the Black Untouchable of India have given themselves. Its root word is "dal"' ''which in Hebrew means brow ken, crushed" (V.T.Rajasekhar, Dalit: The Black Untouchables of India, 1979: 43)

4."Today one is for more likely to encounter the term "Dalit (The oppressed), a self-identification that expresses bitter pride in centuries of struggle" (Barbara R.Joshi, Untouchables, Religions and Politics. P: 39)

5.Dalit is not a caste but a realization and is related to the experiences, joys and sorrows, and struggles of those in the lowest stratum of society; It matures with the sociological point of view and is related to the principles of negativity, rebellion and loyalty to science, thus finally ending as revolutionary"(Arjun Dangle, Dalit Literature: Past, Present & Future, Poisoned Bread. 1994: 265)

6. ''Dalit is the name for total revolution, it is revolution incarnate" (Baburao Bagul, Dalit Literature is but is human Literature, Poisoned Bread, 1994: 289

ఈ నిర్వచనాల్లో కూడా దళితుల్ని కేవలం కులం ఆధారంగానే కాకుండా వివక్షను ఆధారంగా చేసుకొని నిర్వచించే ప్రయత్నం చేశారు. మన తెలుగు సాహిత్యంలో ఎలా అర్థం చేసుకుంటున్నారో తెలుసుకుందాం.

తెలుగు దళిత సాహిత్యం–దళితులు

1987 అక్టోబరు 8 నుండి 10 వరకూ హైదరాబాదులో జరిగిన "అఖిల భారత దళిత రచయితల ప్రథమ మహాసభలు" దళితలంటే ఎవరో నిర్వచించే ప్రయత్నం చేశాయి.

1. "సాంఘికంగా, ఆర్థికంగా, రాజకీయంగా దోపిడీకి గురవుతున్న వర్గాలను, వర్ణాలను దళితులు" (ఎస్వీ సత్యనారాయణ, దళితవాద వివాదాలు, 2000, పుట: 6) గా ఈ సభలు నిర్వచించాయి.

2. "దళితులంటే కేవలం మాల, మాదిగ కులాల వారు అని ఇరుకిరుకు భావజాలంలోంచి ప్రజలు బయటకు రావలసిన అవసరం ఉంది... ఇక్కడ రెండే వర్గాలు ఉన్నాయి. అవి అగ్రకులాలు, దళితులు" అని చెప్తూ ముస్లిమ్‌లూ దళితులే అనే అభిప్రాయాన్ని అక్బర్ (" ముస్లిమ్‌లూ దళితులే" (వ్యాసం), దళితవాద వివాదాలు, 2000, పుట: 46) వ్యక్తం చేశారు.

3. "ఎస్సీ., ఎస్టీ., బి.సీ., కులాలకు సంబంధించిన కవులు విశాలార్థంలో కుల వ్యవస్థనీ, హిందూ తత్త్వాన్నీ వ్యతిరేకిస్తూ రాసేవారంతా దళిత కవులని (జి.లక్ష్మీనరసయ్య , చిక్కనవుతున్నపాట, 1995, పుట: ?) జి.లక్ష్మీనరసయ్య 'చిక్కనవుతున్న పాట' దళిత కవితా సంపుటికి రాసిన ముందుమాటలో వ్యక్తం చేశారు.

4. "రెండు భిన్న తాత్త్విక భూమికలు నేపథ్యంగా కలిగిన దళితులు, మైనారిటీలు ఇంచుమించు ఒకే విధమైన పీడనను, అణచివేతను, అపహాస్యాన్ని ఎదుర్కొంటున్నారు". దళితులు అనే పదానికి లక్ష్మీనరసయ్య

'చిక్కనవుతున్నపాట' ముందుమాటలోనూ "ఆర్థికపరమైన ఇబ్బందులతో పాటు, మతపరంగానూ, కులపరంగానూ ఎవరైతే వివక్షను ఎదుర్కొంటున్నారో, వారందరూ దళితులే" (శివరామకృష్ణ, 'చేదుని మరిచిపోయినదెవరు? (వ్యాసం) దళితవాద వివాదాలు, 2000, పుట: 48) నని వివరించారని శివరామకృష్ణ పేర్కొనడంలో దళితులను మరింత విశాలార్థంలో నిర్వచించుకోవాల్సి వస్తుంది.

5. "ఇక్కడ రెండే రెండు వర్గాలు. నిజమే. అయితే అవి అగ్రకులాలు, దళితులూ కాదు, పీడితులు, పీడించేవారు. అలాంటప్పుడు పీడితులలో దళితులు, మైనారిటీలతో పాటు ఇతరులు కూడా ఉన్నారు. వాళ్ళందరిదీ ఒకే గొంతుకావాలి. అలాగే పీడిరచేవారిలోను అల్పంగానైనా దళితులు, మైనారిటీలు ఉన్నారు. వాళ్ళు ఈ ఉద్యమానికి చెందరు. అలాకాక చారిత్రక నేపథ్యంలో పీడితులలోని దళిత, మైనారిటీలకు చెందని వారిని విడిగా చూడవలసి వస్తే, నిస్సందేహంగా దళితులనీ, మైనారిటీలనీ కూడా విడిగా చూడవలసి వస్తుంది. కారణం, మైనారిటీలకు తమదైన సాహిత్యం ఉండి, సాంఘిక గౌరవం ఉంది, చరిత్ర ఉంది. కానీ, దళితులు అలా కాదు. వారు మానవజాతి సిగ్గుపడాల్సినంతగా అన్నిరకాలుగా దోపిడీకి, అణచివేతకూ గురైయ్యారు" ('దళితులు రాసిందే దళితకవిత్వమా?' (వ్యాసం) దళితవాద వివాదాలు, 2000, పుట: 51 అందువల్ల పీడితులంతా దళితులేననీ వారికోసం ఎవరైనా దళిత సాహిత్యాన్ని రాయవచ్చని బి.వి.వి. ప్రసాద్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

6. "భారతావనిలో సాంఘికంగా, ఆర్థికంగా అణగద్రొక్కబడినవారంతా దళితులే. ప్రధానంగా ఎస్సీ., ఎస్టీలు., బీ.సీలు ఈ కోవకు వస్తారు. మైనారిటీలు హిందూయేతర మతాల్లో ఉన్నారు. కనుక, మైనారిటీలు కూడా ఈ కోవలోకే వస్తారు. స్త్రీలు ఏ వర్గంలో ఉన్నా, ఏ కులంలో ఉన్నా అణగద్రొక్కబడుతున్నారు. కనుక, వారూ ఈ కోవలోకే వస్తారు. దీనిని బట్టి దళితులంటే ఎస్సీ., ఎస్టీలు., బీ.సీ., మైనార్టీలు, స్త్రీలు అనేది స్పష్టమవుతుంది"(కత్తి పద్మారావు, దళితసాహిత్యవాదం-జాషువ: 2008, పుట: 21) అని కత్తిపద్మారావు వివరించారు.

7."దళిత సాహిత్య వాదానికి తాత్త్వికభూమిక కులనిర్మూలన సిద్ధాంతం. కులనిర్మూలన పునాది మీద జరిగిన సాహిత్యవాదమే దళితసాహిత్యవాదం. 'దళిత' అనే శబ్దం కారంచేడు పోరాటంతోనే ఆంధ్రదేశంలోకి ఉద్యమ రూపంలో వచ్చింద"(కత్తి పద్మారావు, దళితసాహిత్యవాదం-జాషువ: 2008, పుట: 28-30) ని చెప్తూనే అంతకు ముందుకూడా, అంటే నన్నయకు ముందున్నదంతా దళితసాహిత్యమే కానీ, ఆ దిశగా పరిశోధన జరగలేదరని దళితసాహిత్యం ఉందని కత్తిపద్మారావు అభిప్రాయపడ్డారు. దీన్ని బట్టి దళితసాహిత్యంతోనే తెలుగు సాహిత్యం ప్రారంభమైందని ఆయన వాదనగా కనిపిస్తుంది.

'దళిత' అనే పదాన్ని మొట్టమొదటిసారిగా ప్రయోగించినవారెవరనే విషయంలో సాహితీవేత్తల్లో ఏకాభిప్రాయం లేదు. ఈ పదాన్ని తొలిసారిగా ప్రయోగించినవారు డా? బి.ఆర్.అంబేద్కర్ అని చిన్నారావు (యాగాటి చిన్నారావు, ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమచరిత్ర, (తెలుగు అనువాదం: ప్రభాకర మందార) 2007: 4 బరోడా మహారాజు అని మరికొంతమందీ (మోహన్ యాగాటి చిన్నారావు, ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమచరిత్ర, (తెలుగు అనువాదం: ప్రభాకర మందార) 2007:148) పేర్కొంటున్నారు. డా.బి.ఆర్ అంబేద్కర్ జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించిన తర్వాత దళిత పదాన్ని ప్రయోగించడం ఆరంభమైందని, ఆయన మరణానంతరం ఈ పదం బాగా ప్రచారంలోకి వచ్చిందనీ విమర్శకులు (బాలశ్రీనివాసమూర్తి, గుమ్మనగారి. సమకాలీనవాదాలు-సాహిత్యవిమర్శ, 2002, పుట: 02) అంటున్నారు.

భారత, భాగవతాదికావ్యాల్లో ఈ పదం కనిపిస్తున్నా నేటి దళితులు ప్రయోగిస్తున్న అవగాహనతో 'దళిత' పదాన్ని ఆ కావ్యాల్లో ప్రయోగించలేదు. కానీ, అంటరానివాళ్ళనే దృష్టితో దళితుల్ని ఆయా కావ్యాల్లో రకరకాలుగా వర్ణించారు. భారతదేశంలోని చాతుర్వర్ణానికి అవతలి వారిని "అవర్ణులు, అతిశూద్రులు, అనార్యులు, దాసులు, దస్యులు, ప్రతిలోములు, అంత్యజులు, అంత్యవాసులు, అంత్యులు, అసురులు, ఛండాలురు, బాహ్యులు, మ్లేచ్ఛులు, హీనులు, అస్పృశ్యులు, హరిజనులు" (బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు-ప్రసంగాలు. సంపుటం 7, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ :1992. పుట: 281) మొదలైన పేర్లతో పిలిచేవారని బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు-ప్రసంగాలను బట్టి తెలుస్తుంది.

దళితులను 'హరిజనులు' అని నర్సీమెహతా (1414-1481) పిలిచాడనీ, దాన్ని 'హరిజనోద్ధరణ' ద్వారా గాంధీజీ (1869-1948) ప్రచారంలోకి తెచ్చాడనీ, ఈ పదాన్ని అంబేద్కర్ తీవ్రంగా వ్యతిరేకించారనే భావాలు ప్రచారంలో ఉన్నాయి. దళిత మేనిఫెస్టో (1995)లో కేశవకుమార్, కె.సత్యనారాయణలు ఇలా రాశారు.

"దళిత సాహిత్యం అంటే 'అంటరానితనం, దానికి మూలమైన కులవ్యవస్థల స్వభావాన్ని గురించి, దోపిడీ, అణచివేతల గురించి చిత్రిస్తూ, విశ్లేషిస్తూ, విముక్తిమార్గాన్ని నిర్దేశించేదే దళితసాహిత్యం" అనీ, దళితులంటే "రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అణచివేయబడిన శ్రామికులు" అని స్పష్టం చేశారు.

ఎస్వీ సత్యనారాయణ "దళితవాదవివాదాలు"(2000)లో దళితసాహిత్యాన్ని భిన్నవిధాలుగా నిర్వచిస్తున్నారని వివరిస్తూ "దళితుల ద్వారా దళితుల కోసం రాయబడే సాహిత్యమే దళితసాహిత్యమని ఒకవర్గం భావిస్తుంటే, ప్రగాఢమైన సంవేదన, తిరుగుబాటుతత్త్వం, మార్పుకోసం పోరాట నిర్దేశం చేసేదని వేరొకవర్గం, దళితుల ప్రయోజనాలకోసం ఎవరు రాసినా అది దళితసాహిత్యమవుతుందని మరోవర్గం భావిస్తుంది" (ఎస్వీ సత్యనారాయణ, దళితవాదవివాదాలు, 2000, పుట: 2) అని అన్నారు.

'చిక్కనవుతున్నపాట' (1995) లో సంపాదకుడు జి.లక్ష్మీనరసయ్య ఇలా పేర్కొన్నారు."దేశీయ మార్క్సిజమే దళిత కవిత్వం ఎజెండా" పేరుతో రాసిన ముందుమాటలో "అగ్రకుల ప్రగతివాదులు తమ కుల, మతాలను *disown* చేసుకొని రాసినప్పటికీ అది దళితకవిత్వం కాదనీ, అది జార్జిలూకాచ్ చెప్పిన 'మీడియేషన్ రోల్'లో భాగంగానే భావించా లన్నారు." (జి.లక్ష్మీనరయ్య, చిక్కనవుతున్నపాట, ముందుమాట, పుట: 3)

ఈ నిర్వచనాలు, వాదోపవాదాలను క్రోడీకరిస్తే కింది సారాంశాన్ని గమనించవచ్చు.

1.'దళిత' అనే పారిభాషిక పదం కేవలం కొన్ని కులాల వాళ్ళకే కాకుండా,సామాజిక వివక్షకూ, సమాజంలో సరైన గౌరవం లభించని వాళ్ళకూ వర్తిస్తుంది. 2. స్వేచ్ఛకీ, సామాజిక గౌరవనీయ గుర్తింపుకీ దూరమైనవాళ్ళకి వర్తిస్తుంది. 3. భారతదేశంలో కులం వల్ల అణచివేతకు గురికాబడిన వాళ్ళంతా దళితులు. 4. దళిత అనేది ఒక ఆత్మగౌరవ

నినాదం.5. దళిత అనేది కేవలం కులానికి మాత్రమే కాకుండా, మతంతో కూడా ముడిపడి వాళ్ళ జీవితానుభవ సంఘర్షణలకు కూడా సంబంధించింది. 6.సామాజిక విముక్తిని కోరేది దళిత శబ్దం. 7.మతంపేరుతో సామాజికంగా, ఆర్థికంగా దోపిడీకి గురైన షెడ్యూల్డు కులాలు, తెగలు, నియోబౌద్ధులు, శ్రామికులు, భూమిలేని రైతులు, స్త్రీలంతా దళితులే.వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత "కులవివక్ష కారణంగా షెడ్యూల్డు కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు, కొన్ని పరిమితులతో ముస్లిం, క్రైస్తవమతానికి చెందిన వాళ్ళనీ, స్త్రీలను తెలుగులో దళితులు'గా వీరి అనుభూతులను, అనుభవాలను, కష్టనష్టాలను అంబేద్కర్ దృక్పథంతో కళాత్మకంగా అభివ్యక్తీకరించడాన్ని దళిత సాహిత్యం'గా నిర్వచించుకోవచ్చు.

ఈ నిర్వచనాలన్నింటిలో కులం వల్ల, మతం వల్ల వివక్షకు గురైనవాళ్ళంతా దళితులనే అభిప్రాయం కలుగుతుంది. సామాజికంగా నిమ్న స్థానాన్ని అనుభవిస్తున్న ఆ ప్రజలు నేడు దళిత శబ్దాన్ని ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తున్నారు."దళిత' శబ్దం ఆత్మ గౌరవానికి సమైక్య శక్తికీ ప్రతీకగా ప్రయోగంలో ఉంది. ఆ శబ్దంతో పిలిపించుకోవడానికి ఇష్టపడుతూ, ఆ పేరుతోనే తమ భావాలను వివిధ సాహిత్య ప్రక్రియలుగా అందిస్తున్నారు. అన్ని భారతీయ భాషల్లోనూ "దళిత సాహిత్యం' పేరుతోనే రచనలు చేస్తున్నారని స్పష్టమవుతుంది.

సామాజికంగా నిమ్న స్థానాన్ని అనుభవిస్తున్న ప్రజలు దళిత శబ్దాన్ని ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తున్నారు. చారిత్రక ఆధారాలను బట్టి వీరిని అవర్ణులు, అతిశూద్రులు, అనార్యులు, దాసులు, దాస్యులు, ప్రతిలోములు, అంత్యజులు, అంత్య వాసులు, అంత్యులు, అసురులు, చండాలురు, బాహ్యులు, మ్లేచ్ఛులు, హీనులు, అస్పృశ్యులు, అంటరానివాళు ్ళ, పంచములు, హరిజనులు వంటి వివిధ పేర్లతో పిలిచారు. అయితే పంచములు, హరిజనులు శబ్దాలతో కొన్ని వందల సంవత్సరాలుగా వీరిని పిలిచేవారు. భారత స్వాతంత్రోద్యమ కాలంలో నర్సీమెహతా అనే ఓ రచయిత పెట్టిన "హరిజన' శబ్దాన్ని మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ విస్తృతంగా ప్రాచుర్యంలోకి తెచ్చారు. మతపరంగా దేవుని బిడ్డలనే అర్థంలో ఆ శబ్దాన్ని ప్రచారం చేశారనీ, అది తమ ఆత్మగౌరవ భంగకరమని దళితులు నిరసించారు. అప్పటినుండే "దళిత' శబ్దం ఆత్మ గౌరవానికి సమైక్య శక్తికీ ప్రతీకగా ప్రయోగంలో ఉంది. ఆ శబ్దంతో పిలిపించుకోవడానికి ఇష్టపడుతూ, ఆ పేరుతోనే తమ భావాలను వివిధ సాహిత్య ప్రక్రియలుగా అందిస్తున్నారు. అన్ని భారతీయ భాషల్లోనూ "దళిత సాహిత్యం' పేరుతోనే రచనలు చేస్తున్నారు.

నినాదం

- డా.జి.వి.రత్నాకర్
మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ, హైదరాబాద్

అగ్రహారపు
అత్యాచారాలకు
ఆర్భాటాలు
అహంకారాలూ
ఎక్కువ

అప్పుడప్పుడూ
అవి కొవ్వొత్తుల
ఎలుతురులౌతూ
నిరసనప్రదర్శనలూ
అవుతుంటాయి

నిర్భయ చట్టాలు
సింగపూర్ తరలింపులు
చివరాఖరికి ఉరిశిక్షల
అమలులు కూడా అవుతాయి

దిశ చట్టాలు ఎన్ కౌంటర్
కథలు
కూడా అల్లుతుంటాయి

గోదారొడ్డునజి
అమానవీయ
అంటరాని వెలివాడలపైని
అత్యాచారాలు

శిరోముండనాల
అక్రమ అన్యాయాలు మాత్రం
ఆశ్చర్యంగా
ఏరుదాటి కూడా రావు

అమెరికా నల్లోని
కోసం పెగిలిన గొంతులు

చీరాల పిల్లోని
కోసం మాత్రం రగలవు

అంటరాని చావులకూ
అత్యాచారాలకూ
లెక్కలు ఉంటాయి

కాశ్మీర్ మిలిటరీ
చావుకు పలికిన రేటు
ఆ కోట్లు ప్లాట్లు ఉద్యోగం

అంటరాని రాపర్ల
మరణాలకు మాత్రం
అసలే పలకవు

ఒంటి కంటి రాజ్యం
నేడు మరీ గుడ్డిదై పోతంది...

పోలీసు స్టేషన్లే
న్యాయస్థానాలుజి
రచ్చబండ పంచాయతీల
ఆనవాలౌతున్నాయి

ఖాకీ చొక్కాలే
ఈమధ్య కొత్తగా
నల్లకోట్లయిజి
న్యాయం కూడా
చెప్తున్నాయిజి

రాజ్యం కనుసన్నల అంటరాని
బానిసల గొంతులు
రంగుల జెండాల
పలుకులౌతున్నాయి...

కరవటం సంగతి
మాచెర్ల చెన్నయ్యకు
నాగులేటొడ్డునున్నజి
కన్నమునికీ తెలుసు

కనీసం మొరగండిరా..

నీచం కన్నా మరణం
మేలు కదరా...

నీలిజెండాల
నీడలో రగులుతున్న
అగ్గిరవ్వలకి
ఇకనైనా అండగా నిలుద్దాం

న్యాయదేవత
చెవులకే కాదు
నల్లగంతలకి
గొంతుకలౌదాం...

కులకుట్రల
అహంకారపు
గొంతుమీద కాలుపెడదాం

ఆటవిక న్యాయం
ఇక చెల్లదంటూ
అసలు న్యాయం
జరిగేదాకజి
నినాద నాదాలౌదాం...

గోడ కుర్చీ

- డా.జి.వి.రత్నాకర్
మౌలానా అజాద్ నేషనల్
ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్

నాన్నా..కిరణ్
ఎక్కడున్నావు తొందరగా రారా!

ఇక్కడ అమ్మ
నీకోసం ఎదురు చూస్తుంది...

నీకిష్టమైన
కోడికూర కూడా
వండి పెట్టింది

నీ పుట్టినరోజుకి
కొన్న బట్టలు బూట్లు అన్నీ పట్టుకుని
అన్నం తినకుండా..

మొన్నటి నుండి
పిచ్చి దానిలా
ఎదురు చూస్తుంది వాకిట్లో నిలబడి..

“అన్న” రావాలి
ఆ “రాజ్యం” రావాలి
అంటా నినదించిన

ఇంటి పక్క చర్చి మైకు
దీనంగా చూత్తంది

తలవంచుకుని నేలచూపులవతంది
అన్న రాక కోసం....

నాలుగు దశాబ్దాలవతన్న
ఆ నరమేధం “సాక్షి”గా

పూటకో పేట అంటా
పిడికెడు మెతుకులైన
ఆ చర్చి కాంపౌండు

చీరాల మాలపల్లెలన్నీ
అన్యాయం జరిగింది

అంటా పిడికిలెత్తుతున్నాయి..

అమ్మా..పెద్దమ్మా..
బైబిల్ పట్టి మా పల్లెకొచ్చిన అత్తమ్మా..

నీ బిడ్డని ఆశీర్వదించిన
మా పల్లెల బతుకులకి..

ఈ హత్యలు అత్యాచారాలు
శిరోముండనాల వరాలేంటి తల్లీ....

దెబ్బకి దెబ్బ అనే
ఈ జాతికి పట్టిన ఈ కర్మేంటి తల్లీ..

చేతలుడిగి సారంలేని
ఆ పరలోక రాజ్జెపు
దేబిరింపులేంటి..

కలలైనా కన్నీళ్లైనా ఆకలైనా

ఆఖరికి ఆరడుగుల
బొందలైనా కలిసి పంచుకున్నోల్లమే కదా

అవమానాల్ని అంటరానితనాన్ని
తరాలుగా మూతిముంతలుగా
మోసినోళ్ళమేకదా..

పిడికిలెత్తితేజి
కాలు కదిపితే
మెడకాయలేం తెగవులేరా...

కనీసం పెదవులు కదపండిరా
గొంతెత్తండిరా..

పల్లె మొగదాల
అన్నంపెట్టి
ఆత్మగౌరవమైన ఆబొమ్మ
మోనంగా రోదిస్తుందిరా

ఇందుకా?
నేను నిదరలేని రేత్రులయింది
రాజ్యాంగపు
రాతలయింది..అంటుందిరా..!

గోదారి నుండి
ఒంగోలు రాదారి దాకా

పొగిలి పెగులుతున్న
గొంతులకి సైరన్ అవుదాం
స్వరం కలుపుదాం..

మొసలి కన్నీరు కారుత్తున్న రాజ్జాన్ని
పల్లె ముంగిట్లో
గోడకుర్చీ ఏయిద్దాం
నెత్తుటి బాకీలన్నీ సరిసెద్దాం...

(చీరాల్లో జరిగిన.. కిరణ్
అమానవీయ మరణంకి స్పందనగా)



అదే ప్రజాస్వామ్యం

- అబ్రహం లింకన్

“నా శత్రువు నోరు విప్పకుండా చేయగల బలం, బలగం, అధికారం నాకు వున్నప్పటికీ... అతను తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను నేను హరించను. చివరికి అతని మాటలు నాపై విమర్శలైనా సరే, అదే ప్రజాస్వామ్యం.”

ఖర్మకాలిన జీవితాలు

కరోనాతో ఖర్మ కాలిపోయింది..!

– కె.వెంకట్, (పి.హెచ్‌డి)

అవును, ఎవడి ఖర్మ ఎప్పుడు కాలిపోతుందో అర్థంకాని జీవితమైపోయింది అందరిదీ.. హమ్మయ్య, ఇవాల్టికి నాకు కరోనా రాలేదు.. గండం గడిచిపోయిందనుకుని సంబరపడిపోయి బతికేసే రోజులు వచ్చేశాయి.. ఏదీ ఇంతకుముందులా జీవితం లేదు.. ఇక ముందూ ఉండకపోవచ్చు.. అంతా విచిత్రం. అంతా విడ్డూరం.. అంతా భయం.. భయం..

పక్కింటోళ్లతో మాట్లాడుకోవడం మానేశాం.. పక్కింటి పిల్లల్ని మన ఇంటికి రానివ్వడం ఏనాడో మర్చిపోయాం..ఎ క్కడ కరోనా వస్తుందోనని.. మన పిల్లల్ని నాలుగు గోడల మధ్య కట్టేస్తున్నాం.. కరోనా పుట్టుపూర్వోత్తరాల గురించి మాటలు రాని పిల్లలకు కూడా అర్థమయ్యేలా చెప్పేస్తున్నాం. ఆఖరికి పక్కింటోళ్లు పెట్టిన దేవుడి ప్రసాదం కూడా తినడం మానేశాం. ఎక్కడ ఆ కరోనా పురుగు అందులో ఉందోనని.. ఏదో తెలీని అంటరాని తనం తెలియకుండానే మనం అలవాటు చేసేసుకున్నాము..

ఇంట్లో కూడా చాలా మంది మాస్క్ లు కట్టుకుని బతికేస్తున్నారు. కూరగాయలపైనా శానిటైజర్ కొట్టి ఎండలో ఎండబెట్టి వండుకుంటున్నారు.. రోజుకు వందసార్లు చేతులు కడిగేస్తున్నారు. మాస్క్ కట్టీ కట్టీ మూతి తెల్లగా అయిపోయింది.. చేతులకు శానిటైజర్ రాసీ రాసీ.. పొట్టు ఊడిపోతోంది.. కషాయాలు తాగీ తాగీ నోరంతా అదోమాదిరిగా తయారైంది..

పండగలు, పబ్బాలు నాలుగు నెలల క్రితమే మానేశాం.. నలుగురు కలిసి సంతోషంగా నవ్వుకుని నాలుగు నెలలు దాటిపోయింది. మందు కొట్టేటప్పుడు తాగుబోతులు కూడా డిస్టెన్స్ మెయింటైన్ చేసేస్తున్నారు. కబుర్లు చెప్పుకుంటూ చాయ్ దుకాణం దగ్గర చాయ్ తాగుతూ.. సిగరెట్ పీకే ఆలోచనలు కల్లోకి కూడా రావడం లేదు. పాలప్యాకెట్ వేసేవాడు కూడా ఇంటి కింద గేటు దగ్గరే వేసి వెళ్లిపోవాలి.. ఏ అమెజానోడో.. ఫ్లిప్ కార్టోడో ఖర్మకాలి ఇంటి గుమ్మం దాకా వచ్చాడో చచ్చాడే.. గుమ్మానికి ఆవతలెక్కడో ప్యాకెట్ విసిరి పారేస్తే తెచ్చుకుని దాన్ని శానిటైజర్‌లో ముంచి లేపి గానీ ఓపెన్ చేయడం లేదు.. ఎక్కడ మహమ్మారిని అందులో ఏమూలో వేసుకొచ్చాడోమోనని..

స్విగ్గీలు, జొమాటోల్లో ఆర్డర్లు మానేశాం.. ఒకవేళ ఆర్డరిచ్చినా ఇమ్యూనిటీ బూస్టర్ ఫుడ్‌నే ఆర్డరిస్తున్నాం.అంతేగాదు ఆర్డరిచ్చేముందే డెలివరీ బాయ్‌కి నో కాంటాక్ట్ ఆప్షన్ సెలెక్ట్ చేసుకుంటున్నాం..

పార్కుల్లో ప్రేమ జంటల కిలకిలలు, ముద్దూ ముచ్చటలూ మాయమైపోయాయి.. స్విమ్మింగ్ పూల్స్‌లో స్విమ్మింగ్ మానేసాం.. అందమైన జలపాతాలు, పర్యాటక ప్రాంతాల్లో ఫ్యామిలీతో కలిసి వెళ్లడం అనేది.. ఊహల్లో మాత్రమే.. సినిమా థియేటర్‌లో పాప్ కార్న్ తింటూ సినిమా చూసే రోజులు పోయాయి.. ఇకపై ఉండకపోవొచ్చు..

ఆఫీసులన్నీ బోసిపోయాయి... షాపులన్నింటికీ తాళాలు పడిపోయాయి.. కర్మాగారాలన్నీ మూతబడిపోయాయి.. వ్యాపారాలన్నీ నాశనమై పోయాయి.. ఉద్యోగాలన్నీ ఎగిరిపోయాయి.. జీవితం అంతా భయం.. భయం.. బయటికెళ్తే కరోనా.. టీ తాగితే కరోనా.. సమోసా తింటే కరోనా.. పానీ పూరి తింటే కరోనా.. కూరగాయల్లో కరోనా.. పాలల్లో కరోనా.. షాపుకెళ్తే కరోనా... పార్క్ కెళ్తే కరోనా.. వాకింగ్ కెళ్తే కరోనా.. గుడికి వెళ్తే కరోనా... చర్చికి వెళ్తే కరోనా.. పెళ్లికి వెళ్తే కరోనా... ఫంక్షన్‌కి వెళ్తే కరోనా.. ఎక్కడికి వెళ్లినా కరోనానే..

ఏం చేస్తున్నాం..ఎవడు ఏం చెప్పినా వెంటనే పాటించేస్తున్నాం.. ఎవరో ఏదో తింటే కరోనా రాదంటే అది కసకసా నమిలి మింగేస్తున్నాం.. ఎవరో ఏదో త్రాగితే కరోనా రాదంటే పిచ్చి కషాయాలన్నీ త్రాగేస్తున్నాం.. కరోనాతో చచ్చింది కన్నతండ్రైనా.. తోడబుట్టిన సోదరి అయినా కడుపున బుట్టిన పిల్లలైనా ఎవరి దగ్గరకూ వెళ్లలేకపోతున్నాం.. మూటగట్టి నిర్ధాక్షిణ్యంగా శవాన్ని బుల్డోజర్ తో మున్సిపాల్టీ వాళ్లు గోతిలోకి విసిరిపారేస్తే టీవీల్లో చూసి కన్నీళ్లు పెట్టేసుకుంటున్నాం..

పక్కింటోడికి చిన్న జ్వరం వచ్చినా కరోనా వచ్చిందేమోనని ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికో వెళ్లిపోతున్నాం... రోడ్డుమీద ఎవరైనా తుమ్మితే, దగ్గితే వణికిపోతున్నాం.. అంతా భయం .. భయం.. భయం.. చస్తా మేమోనని భయం.. చావొస్తుందేమోనని భయం.. బతకాలి.. మనం మాత్రమే బతకాలి.. ఏ కరోనాలు సోకకుండా మనం, మన పిల్లలు మాత్రం క్షేమంగా ఆరోగ్యంగా ఉండాలి.. అంతే.. అదే కావాలి

రేపటి సంగతి ఏంటో తెలీదు.. వ్యాక్సిన్లు వస్తాయో రావో తెలీదు.. రేపటి తరం పరిస్థితి ఏంటో తెలీదు.. బతకడమెలాగో అర్థం కావడం లేదు. డబ్బులు లేనోళ్లకి చాలా మందికి పూట గడవడం లేదు.. డబ్బులెక్కువైనోళ్లకి సమయం గడవడం లేదు.. ఇంకొన్నాళ్లకి చాలామంది మానసిక వ్యాధి గ్రస్థుల్లా మారిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు.. భయంతో ఇప్పటికే కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.. వ్యాపారాలు దెబ్బతిని అల్లాడిపోతున్నారు.

ఇలాంటి విపత్కర సమయంలోనూ ఒకరికి ఒకరు సాయం చేసుకునే మంచితనం, మానవత్వం కనీసం మన దరిదాపుల్లోకి కూడా రావడం లేదు. పక్కోడు తిండికి లేక అల్లాడుతున్నా.. ఉద్యోగం లేక బాధపడుతున్నా కనీసం స్పందించే హృదయం లేదు.. డబ్బంతా ఇళ్లల్లో, బ్యాంకుల్లో దాచుకుంటున్నారు.

6 నెలల సహజీవనం

- కె.రత్నకుమార్

కరోనా మానవాళిలోకి ప్రవేశించి 6నెలలు దాటిపోయింది. భారతదేశంలో ఉద్ధృతి ప్రారంభమై మూడు నెలలలైంది.ముఖ్యంగా నెలరోజుల నుండి విజృంభిస్తోంది. గాలి ద్వారా కూడా కరోనా వ్యాప్తిచెందుతునే అంశం నేడు కలవర పెడుతోంది. సుమారు 32దేశాలకు చెందిన 239మంది శాస్త్రవేత్తలు ప్రపంచ ఆరోగ్య సంస్థకు (డబ్ల్యూహెచ్ఓ)కు బహిరంగ లేఖ కూడా రాశారు. ఐదు మైక్రాన్ల కంటే తక్కువ పరిణామంలో ఉండే సూక్ష్మ తుంపర్ల ద్వారా ఈ వైరస్ ఒకరి నుండి ఇంకొకరికి చేరుతుందని వారి వాదన.దీనికి సంబంధించిన సాక్ష్యాధారాలు కూడా తమ దగ్గర ఉన్నాయని వారు చెబుతున్నారు. డబ్ల్యూహెచ్ఓ మొదట్లో దీనితో ఏకీభవించలేదు. ఈ అంశాన్ని కొట్టిపారేయలేమని తాజాగా అంటోంది.పక్కా ఆధారాల కోసం ప్రయత్నాలు చేపట్టి, వెల్లడిస్తామని చెబుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో, జనంతో రద్దీగా ఉన్న ప్రాంతాలు, గాలి,వెలుతురు సరిగ్గాలేని ప్రదేశాల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అర్థమవుతోంది. గాలి ద్వారా, చిన్న చిన్న తుంపర్ల ద్వారా వైరస్ వ్యాప్తి చెందే క్రమంలో సమగ్రమైన మార్గదర్శకాలు రావాల్సిన అవసరం ఉంది. అప్పటి వరకూ ప్రజల్లో భయాందోళనలు పెరిగిపోయే అవకాశం ఉంది. భౌతికదూరం పాటించడం, మాస్కులు ధరించడం వంటి చర్యల ద్వారా వ్యాప్తిని చాలా వరకూ అరికట్టవచ్చు అనే అభిప్రాయంలోనే ఇంకా ప్రజలు ఉన్నారు. నిజంగా గాలి ద్వారా, తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందా, ఒకవేళ అదే నిజమైతే, ఇటు ప్రజలు-అటు ప్రభుత్వాలు వైద్యపరమైన అంశంలో ఎలా ఉండాలి అన్నదానికి స్పష్టమైన విధి విధానాలు రూపకల్పన చేసుకోవాల్సి ఉంది. మొదటి నుంచీ కరోనాపై స్పష్టమైన ప్రకటనలు లేవు. చూస్తుండగానే, కరోనా సోకుతున్నవారి సంఖ్య వందల నుండి వేలు, అక్కడ నుండి లక్షలు దాటుతున్నాయి.ఆర్థికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో భారతదేశం ప్రథమశ్రేణిలో ఉంది. అమెరికా, చైనా, భారత్ ఈ మూడు ప్రస్తుతం ప్రపంచంలో బాగా గుర్తింపులో ఉన్న దేశాలు. 1950నుండి ఇప్పటి వరకూ జరిగిన 70ఏళ్ళ ఆర్థిక ప్రయాణంలో అంచలంచలుగా ఎదుగుతూ వచ్చింది. అయినప్పటికీ, 2014 గణాంకాల ప్రకారం చూస్తే, పట్టణ ప్రాంతాల్లో 24శాతం ప్రజలు ఇంకా మురికివాడల్లోనే జీవిస్తున్నారు.పేదరికం, గృహవసతి లేకపోవడం, చాలీ చాలని సంపాదన మధ్య ఉండే కోట్లాదిమంది ప్రజలు భౌతికదూరం పాటించడమే కష్టం.ఇప్పుడు గాలి, తుంపర్ల ద్వారా కూడా కరోనా వైరస్ వ్యాప్తి చెందడం మొదలైతే, ప్రత్యామ్నాయ మార్గాలు ప్రశ్నలుగానే మిగిలిపోతాయి.కాలుష్యంతో పాటు, పరిశుభ్ర వాతావరణాల కొరత, కరోనా వ్యాప్తి రేటును ఎటు తీసుకెళుతుందో అనే భయాలు పెరుగుతున్నాయి.రోజు రోజుకు సంఖ్య పెరిగిపోతున్న నేపథ్యంలో, ఆస్పత్రుల్లో వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయి.క్వారంటైన్ కేంద్రాల్లో ఆరోగ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం దొరకడం లేదని కొందరు గగ్గోలు పెడుతున్నారు.ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే, లక్షలాది రూపాయలు వదిలించుకోవాలి.ఆ స్థోమత ఎందరికి ఉంది.కరోనా కట్టడి అలా ఉంచగా.... అరికట్టలేని దశలోకి ప్రయాణం చేస్తున్నట్లు భావించాలి.సంపూర్ణ లాక్‌డౌన్ దశ దాటిపోయి, పాక్షిక లాక్‌డౌన్‌లో దేశం ఉంది.మళ్ళీ సంపూర్ణ లాక్‌డౌన్ విధించినా దేశం తట్టుకోలేదు.కరోనా విజృంభించినా తట్టుకోలేదు.అత్యధికంగా పాజిటివ్ కేసులు నమోదయిన దేశాల్లో భారతదేశం మూడో స్థానంలోకి వచ్చేసింది. మొత్తం కేసులు 7లక్షల 50వేలకు చేరాయి. జులై మొదటి వారంలోనే లక్షా అరవైవేల కేసులు నమోదయ్యాయి. కరోనా మరణాలు 20వేలు దాటిపోయాయి. మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఒడిస్సాలో, కర్ణాటకాలో విజృంభణ పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లోనూ వ్యాప్తి ఆందోళనకరంగానే ఉంది. హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసి పరిధిలో ఉద్ధృతి చాలా ఎక్కువగా ఉంది. కరోనా కట్టడిలో భాగంగా, కొన్ని మందులు అందుబాటులోకి వచ్చాయి. వాటి పనితీరు, ఫలితాలపై స్పష్టత రావాల్సివుంది. రికవరీ రేటు, మరణాల రేటు ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, కేసుల సంఖ్య రోజురోజుకూ పెరగడం ఆందోళన కలిగించే అంశం. వ్యాక్సిన్లు అందుబాటులోకి వస్తేకానీ, దీని కట్టడి సంపూర్ణంగా జరుగదు. ప్రజలు ఒకప్పటి వాతావరణంలోకి వెళ్లాలంటే కనీసం 18నెలల నుండి రెండు సంవత్సరాలు పట్టేలా ఉంది. వ్యాక్సిన్లు అందుబాటులోకి రావడానికి కనీసం 10-12నెలలు పడుతుందని నిపుణుల అంచనా. అప్పటి వరకూ కరోనాతో కలిసి కాపరం ఎలా చెయ్యాలి, ఉద్ధృతిని ఎలా అరికట్టాలి, ప్రస్తుతం గాలి, తుంపర్ల ద్వారా కూడా వ్యాప్తి చెందే అవకాశం ఉంటే, దాన్ని ఎలా అధిగమించాలి, ప్రస్తుతం అందుబాటులోకి వస్తున్న మందుల వల్ల ప్రయోజనాలు... మొదలైన అంశాలపై ప్రభుత్వాలు ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలి.మార్గదర్శకాలు జారీ చెయ్యాలి.ప్రజలకు వైద్యపరమైన వసతులతోపాటు, మానసిక స్థైర్యాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వ అధినేతలదే. కరోనా చుట్టూ ఉన్న అయోమయం, అపోహలు తొలిగించడం సామాజిక అవసరం. ఈ దిశగా ప్రభుత్వాలు, పాలకులతోపాటు శాస్త్రవేత్తలు, వైద్యరంగ నిపుణులు కంకణం కట్టుకోవాలి.

భారత్‌పై వేలాడుతున్న కరోనా కత్తి....

నిజంగా ఇది ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన సమయం. ఏ

మాత్రం అశ్రద్ధ చేసినా అమెరికా, స్పెయిన్, ఇటలీ దేశాల్లో మాదిరిగా మన దేశంలో కూడా శవాల గుట్టలను చూడాల్సిన దుస్థితి ఎదురు కావచ్చు. ఆస్పత్రులు ఏ మాత్రం సరిపోనంతగా కరోనా రోగులు భారీగా పెరిగే అవకాశాలున్నాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. మొత్తానికి భారత్ మెడపై కరోనా కత్తి వేలాడుతోంది.

వ్యాక్సిన్ లేదా కొవిడ్-19 నివారణ మందు రాని పక్షంలో వచ్చే ఏడాది శీతాకాలం ముగిసే నాటికి రోజుకు 2.87 లక్షలు చొప్పున కరోనా పాజిటివ్ కేసులు వచ్చే అవకాశం ఉందని మసాచుచట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధకుల అధ్యయన నివేదికలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయని చెప్పక తప్పదు.

ప్రపంచంలో అత్యధికంగా భారత్‌లోనే రోజువారీ కరోనా కేసుల వృద్ధిరేటు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశమే. గత వారం రోజుల లెక్కలను పరిశీలిస్తే మనమెంత ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నామో తెలుసుకోవచ్చు. అమెరికాలో రోజుకు సగటున 1.8% , బ్రెజిల్‌లో 2.7%, రష్యాలో 1%, పెరూలో 1.2% కేసులు పెరుగుతున్నాయి. ఇదే భారత్‌లో మాత్రం రోజు రోజుకు సగటున 3.5% మేర వృద్ధి నమోదు కావడం ప్రమాద తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

ప్రస్తుతం ప్రతి రాష్ట్రంలో కేసులు రోజురోజుకూ తమ రికార్డులను తామే తిరగరాసుకుంటున్నాయి. మన తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే దాదాపు ప్రతిరోజూ ఐదు వేలకు పైగానే కేసులు నమోదు కావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? దేశ వ్యాప్తంగా పాజిటివ్ రేటు తొలిసారి 7% దాటడం చాలా ఆందోళన కలిగించే పరిస్థితి.

నిన్న మొన్నటి వరకు కరోనా కేసుల విషయంలో అమెరికా, ఇటలీ, స్పెయిన్, బ్రెజిల్ తదితర దేశాల్లో నమోదవుతున్న సంఖ్యను చూసి మనం ఆశ్చర్యపోయే వాళ్లం. మన దేశంలో అలాంటి దుస్థితి లేదని హమ్మయ్య అంటూ గుండెల మీద చేతులేసుకుని హాయిగా ఊపిరి తీసుకునే వాళ్లు. అయితే రానున్న రోజుల్లో మనకు నిద్రలేని రాత్రులే అని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. వాటిని పరిగణలోకి తీసుకుని అప్రమత్తం కాకపోతే మాత్రం భారత్ కూడా పైన పేర్కొన్న దేశాల సరసన చేరడానికి మరెంతో కాలం పట్టిందనే ప్రమాద సంకేతాలు వస్తున్నాయి.

కాగా శీతాకాలం నాటికి భారత్‌లో రోజుకు 2.87 లక్షల కరోనా కేసులు నమోదవుతాయని ఎంఐటీ సంస్థ శాస్త్రీయ పరిశోధన నివేదిక తెలియజేస్తోంది. ఈ సంస్థ పరిశోధన ప్రకారం భారత్, అమెరికా, దక్షిణాఫ్రికా, ఇరాన్, ఇండోనేసియా, బ్రిటన్, నైజీరియా, టర్కీ, ఫ్రాన్స్, జర్మనీలు తొలి పది స్థానాల్లో నిలుస్తాయని లెక్కకట్టింది.

84 దేశాలకు చెందిన 475 కోట్ల మంది ప్రజల సమాచారాన్ని పరిశీలించి నమూనాను అభివృద్ధి చేసినట్లు మసాచుచట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) పరిశోధకులు వెల్లడించడాన్ని ఆశామాషీగా తీసుకోడానికి లేదు. ఎందుకంటే వారు అంచనా వేసినట్టుగానే...ప్రస్తుతం మన దేశంలో కేసులు నమోదు కావడాన్ని గుర్తించాలి.

'సామూహిక రోగనిరోధక శక్తి' సాధించేందుకు చేరువగా ఏ దేశమూ లేదనీ, దాని కోసం నిరీక్షించడం ఆచరణీయ మార్గం కాదని ఆ పరిశోధక సంస్థ తేల్చేయడం ద్వారా... అసలు నిజాలేంటో చెప్పకనే చెప్పినట్టైంది. కావున ఎవరో వస్తారు...ఏదో చేస్తారనే ఉదాసీనతను వీడి, మనల్ని మనం కాపాడుకోవాలనే లక్ష్యంతో అప్రమత్తంగా ఉండడం ఒక్కటే మన ముందున్న ఏకైక కర్తవ్యం.

❄❄❄❄

హోటల్ క్లీనర్.. ఇప్పుడు కలెక్టర్..
షేక్ అబ్దుల్ నాసర్...



అబ్దుల్ నాసర్.. కేరళలోని కొల్లం జిల్లా కలెక్టర్.. పేదరికంలో పుట్టి, ముస్లిం అనాథ శరణార్థుల స్కూల్‌లో చదివి కలెక్టర్ అయ్యాడు.. కన్నీరు తెప్పించే దయనీయ జీవిత నేపథ్యం, స్ఫూర్తిని కలిగించే జీవన ప్రయాణం నాసర్ గతం.. చిన్నప్పుడు చదువుకుంటూనే ఇళ్లలో తల్లికి తోడుగా పాచి పనులు, పదేళ్ల వయసులో రాత్రిళ్ళు హోటల్స్‌లో క్లీనర్ పనులు, 15 ఏళ్ల వయసులో కూలీ పనులు, ఇంత కఠినమైన, కఠోరమైన జీవితం తల్లి పట్టుదల , ప్రోత్సాహం, ఆయనను ఐఎఎస్ చేశాయి.. చివరకు ఈ పేదవాడిని జిల్లా కలెక్టర్ చేశాయి... ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలి...

మనుషులు..యంత్రాలు

– ఎం.జ్యోతి



అమెరికా, యూరోప్ దేశాల్లో పని మనుషులు ఉండరు. ఉన్నా గంటకు చెల్లించాల్సిన డాలర్లు, పౌండ్లను లెక్కకడితే పనిమనుషులకు జీతాలు చెల్లించడానికి యజమానులు మరోచోట పనిచేయక తప్పదు. ఎవరి పని వారే చేసుకోవడం అక్కడి పద్ధతి. డిగ్నిటీ ఆఫ్ లేబర్. మన దేశంలో మనపని ఇంకొకరు చేస్తేనే మనకు మర్యాద. గౌరవం. తృప్తి. హోదా. రాచరికం చింత చచ్చినా ఫ్యూడల్ పులుపు మాత్రం చావదు. విపరీతమయిన జనాభా, పేదరికం, నిరుద్యోగం, ఏదో ఒక పని చేసుకుని బతుకు వెళ్లదీయాలి. దాంతో మనకు అన్నిటికీ పని మనుషులే. ఇల్లు ఊడవడానికి, అంట్లు తోమడానికి, వంట చేయడానికి, బట్టలు ఉతకడానికి...ఇలా మనకు అడుగడుగునా పని మనుషులే.

కొన్ని ఇళ్లల్లో పని మనుషులు, వంటవాళ్లు, సెక్యూరిటీ వాళ్ళు, తోటమాలులే కనిపిస్తారు. ఆ ఇంటి యజమాని, అమ్మగారు, వారి పిల్లలు కనపడరు. మా అమ్మగారు పెంపుడు కుక్కల బాగోగులతో బిజీగా ఉంటే– మేము అమ్మగారి పిల్లలను పెంచడంలో బిజీగా ఉన్నాం అని పనిమనుషులు గర్వంగా చెప్పుకునే ఇళ్లను మనం సకల జీవుల సంరక్షణగా, విశ్వమానవ సౌభ్రాతృత్వంగానే చూడాలి. ఆర్థిక సరళీకరణల 1990ల తరువాత ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. వద్దన్నా వాయిదాల పద్ధతిలో చెల్లించే రుణాల మీద వస్తువులు అంటగట్టడం పెరిగింది. ఫ్యాన్లు, గ్రైండర్లు, మిక్సీలు, ఏసీలు, గ్రీజర్లు, హీటర్లు, వాషింగ్ మెషీన్లు, టీవీలు ఇళ్లల్లో సాధారణమైపోయాయి. ఇప్పుడు కంప్యూటర్, నెట్ కనెక్టివిటీ, సెల్ ఫోన్ లు సరేసరి.

కరోనా లాక్‌డౌన్, ఆంక్షలు, భౌతిక దూరాల భయాల నేపథ్యంలో పనిమనుషులు రావడం ఒక సమస్య. వచ్చినా వారితో ఇదివరకటిలా ధైర్యంగా పని చేయించుకునే పరిస్థితి లేదు. దాంతో వాక్యూమ్ క్లినర్లు, డిష్ వాషర్లు, ఇతర ఇంటి పనులు చేసే చిన్న చిన్న యంత్రాలకు ఒక్కసారిగా డిమాండు పెరిగింది. చీపురును మూల కూర్చోబెట్టి రోబో వాక్యూమ్ క్లినర్ ఇల్లు ఊడ్చి, తుడిచి బుద్ధిగా ఛార్జింగ్ సాకెట్లో కూర్చుంటోంది. తనలో తానే కుత కుత ఉడికి, సుళ్ళు తిరిగి, డిటర్జెంట్ తిని, తాగి, నురగలుగక్కి డిష్ వాషర్ అంట్లు తోమి బయట పడేస్తోంది.

మోడరన్ టైమ్స్ పేరుతో చార్లీ చాప్లిన్ 85 ఏళ్ల కిందట ఒక సినిమా తీశాడు. మనిషి ఎలా యంత్రంలో ఇరుక్కుని యంత్రమైపోతున్నాడో, యాంత్రిక జీవనం ఎంత వింతగా తయారవుతోందో అప్పటికే విధ్వంసం, విషాదం, హాస్యాలను రంగరించి చెప్పాడు. టేబుల్ ముందు కూర్చుంటే ప్లేట్లో ఆహారాన్ని యంత్రమే తీసుకుని నోట్లో కుక్కితే– అది వికటించి ఎలా పళ్లూడిపోయి ముక్కు మొహం పచ్చడి అవుతుందో వివరించే సన్నివేశం భవిష్యత్తుకు సంకేతం. ఫీడింగ్ మెషిన్ పేరిట చాప్లిన్ హాస్యం పండించినా ఆ ఎగతాళి ఇప్పుడు నిజమవుతోంది.

దేశ వ్యాప్తంగా రోబో వాక్యూమ్ క్లినర్లు, డిష్ వాషర్ల సేల్స్ ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయట. అసలే భౌతిక దూరం ఇప్పుడు బజ్ వర్డ్. ప్రాణమొక్కటి తక్కువయిన రోబోలు అన్ని పనులు చేస్తే, ఆ రోబోలను కూడా కొనడానికి సిద్ధంగా ఉన్నాం. మోడరన్ టైమ్స్‌లో ఫ్యాక్టరీ యంత్రాల వైపరీత్యానికే చాప్లిన్ అంతలా బాధపడ్డాడు. ఇప్పుడు నట్టింట్లో నాట్యమాడే వైర్‌లెస్ ఊడ్చే యంత్రాలు, గిన్నెలు కడిగే అంట్ల యంత్రాలు, జుట్టు ఆరబెట్టుకునే డ్రైయర్లు ...అడుగడుగునా కాలికి వేలికి తగిలే యంత్రాలను చూస్తే చాప్లిన్ ఇంకెన్ని సినిమాలు తీసేవాడో?

వైర్‌లెస్ వాక్యూమ్ క్లినర్లు, డిష్ వాషర్లు పరస్పరం మనసు విప్పుకుని మాట్లాడుకునే రోజులు. ఇల్లు లాక్ చేసుకుని వెళుతూ రోబో క్లినర్లకు పనులు చెప్పి వెళ్లే రోజులు. కరోనా విరుచుకుపడినట్లు– భవిష్యత్తులో కరెంట్ ప్రపంచమంతా ఒక్కసారి ఆగిపోయిందని అనుకుందాం. చార్జింగులు దిగిపోయాయని అనుకుందాం. అప్పుడు ఈ యంత్రాలు నడిచేదెలా, నడిపేదెవరు, నడవని యంత్రాలను మోసేదెవరు.

ప్రతి సౌఖ్యానికి కొంత మూల్యం చెల్లించుకోవాలి. మొత్తం యంత్రాల మీదే ఆధారపడితే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది.

సీఎం ఆఫీసుకూ గోల్డ్ స్మగ్లింగు భారీ మరక

- వై.పి.వరప్రసాద్

కేరళ సీఎం పినరై విజయన్... ఆయన ఆఫీసుకు దుబయ్ నుంచి... అనగా అరబ్ ఎమిరేట్స్ నుంచి భారీగా బంగారం స్మగ్లింగుతో సంబంధం ఉందంటే.. ఆయనకు, ఆయన పార్టీకి ప్రత్యక్షంగా ఏ సంబంధాలూ లేకపోవచ్చు... కానీ తన ఆఫీసుకు ఈ స్మగ్లింగు యవ్వారంతో మరక అంటిందంటే, అది ప్రభుత్వానికి ఎంత నామర్దా.. ఎంత అప్రతిష్ఠ.. ఎంత నామోషీ.. మన మీడియాకు ఇవి ఆనవు గానీ... ఓసారి కాస్త చెప్పుకుందాం ఈ కథేమిటో... ఎందుకంటే.. సాక్షాత్తూ మన విదేశాంగ శాఖ కూడా సీరియస్‌గా ఉంది దీనిపై... ఎందుకంటే... ఆ స్మగ్లింగు దౌత్యసమాచారం ముసుగులో చాలాకాలంగా సాగుతోంది గనుక... కేరళ బంగారం వర్తకులకూ ఇందులో సంబంధం ఉంది.

ఈమధ్య కేరళ రాజధాని ఎయిర్‌పోర్టు కస్టమ్స్ వాళ్లకు ఓ టిప్ అందింది... ఏమిటయ్యా అంటే.. ఎమిరేట్స్ నుంచి కేరళ ఆ దేశ కాన్సులేట్ ఆఫీసుకు గోల్డ్ స్మగుల్ అవుతోందని..! కాన్సులేట్లు, ఎంబసీలకు ఆయా దేశాల నుంచి వచ్చే పార్శిళ్ల మీద పెద్దగా నిఘా ఉండదు, పెద్దగా కస్టమ్స్ కష్టాలుండవ్... చెక్కింగులూ పెద్దగా ఉండవ్... చకచకా కస్టమ్స్ క్లియరెన్స్ లభిస్తుంది... అవి ఆయా దేశాల నడుమ ఉండే మర్యాదలు.

అందుకని మమ్మల్నేం చేయమంటారు అని విదేశాంగ శాఖను, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖను అడిగారు... తనిఖీ చేయండి అని చెప్పింది మన విదేశాంగశాఖ. ఫుడ్ పార్శిల్‌గా రిజిష్టరైన ఓ పార్శిల్ అనుమానాస్పదంగా కనిపించి ఓపెన్ చేశారు... అందులో బంగారు కడ్డీలు కనిపించాయి. మరికొన్ని పార్శిళ్లనూ ఓపెన్ చేశారు... మొత్తం 30 కిలోలు. కట్టుదిట్టంగా ప్యాక్ చేయబడినవి... దాంతో అధికారులు షాక్. దౌత్య కార్యాలయాలకు వచ్చే పార్శిళ్ల ద్వారా గోల్డ్ స్మగ్లింగ్... వెంటనే బంగారం స్వాధీనం చేసుకుని, కాస్త తవ్వడం మొదలుపెట్టారు. ఎందుకంటే. ఇలాంటిది ఇదే తొలిసారి కాబట్టి...! దీనిపై ఇండియా ఇంటలిజెన్స్ కూడా సీరియస్‌గా ఉంది.

ఇది బయటపడగానే కాంగ్రెస్, బీజేపీ, కేరళ అధికార పార్టీ, అనగా సీపీఎంపై, సీఎంపై విమర్శల బాణాలు ఎక్కుబెట్టాయి... కాంగ్రెస్ చానెల్‌గా చెప్పబడే జైహింద్ టీవీ వరుస కథనాలు ప్రసారం చేయడం మొదలుపెట్టింది... ఈ బంగారం బయటపడగానే కేరళ సీఎం ఆఫీసులోని ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి దాన్ని దాచిపెట్టడానికి ప్రయత్నించాడు... ఆ బంగారం రిలీజ్ కోసం కస్టమ్స్ వాళ్ల మీద ఒత్తిడి తీసుకొచ్చాడు... దేనికి.. ఆయన ఎవరు.

ఆయన తరచూ ఎమిరేట్స్ వెళ్తున్నాడనీ... కేరళ బంగారం వర్తకులకూ, దుబయ్ బంగారం వర్తకులకూ టచ్‌లో ఉంటూ మంచి సంబంధాలు మెయింటెయిన్ చేస్తున్నాడనీ బీజేపీ, కాంగ్రెస్ దుమ్మెత్తిపోయడం మొదలెట్టాయి... కస్టమ్స్ వాళ్లు ఎమిరేట్స్



కాన్సులేట్ ఆఫీసు మాజీ పీఆర్వో సరిత్‌ను అదుపులోకి తీసుకుని, కాస్త తమదైన శైలిలో విచారించాయి... దాంతో ఓ పేరు బయటికొచ్చింది... ఆమె పేరు స్వప్న... ఆమె ఎవరు..?

ఆమె కేరళ రాష్ట్ర సంస్థ, The Kerala State Information Technology Infrastructure Limited (KSITIL) కు చెందిన స్పేస్ పార్క్ marketing liaison officer తీరా సమయానికి ఆమె పరార్... పైన ఫోటోలో కనిపిస్తున్నది ఆమే... కేరళ సీఎం ఆఫీసు కార్యదర్శి మరియు ఐటీ కార్యదర్శి శివశంకర్‌కు ఆమె "బాగా క్లోజ్" అనీ, ఆయనే ఆమెను కాపాడటానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నాడని గుప్పుమంది... ఇది బయటికి రాగానే కేరళ ప్రభుత్వం ముందుగా ఆమెను ఆ పోస్టు నుంచి పీకేసింది

ఈ స్వప్న ఎవరు..? మొదట్లో ఎయిర్ ఇండియాలో పనిచేసేది... అప్పట్లోనే ఆమె మీద బోలెడు ఆరోపణలు... వివాదాలు... తరువాత ఎమిరేట్స్ కాన్సులేట్ ఆఫీసులోనూ పనిచేసింది (The Executive Secretary of the Chief Officer of the UAE Consulate in Thiruvananthapuram) కొన్నేళ్లు అబుదాబిలో ఉన్నందు వల్ల ఆమెకు అరబిక్ బాగా వచ్చు... అలాంటి వ్యక్తిని బ్యాక్ గ్రౌండ్ చెక్ చేసుకోకుండా నేరుగా ప్రభుత్వ ఐటీ శాఖలోకి ఎలా తీసుకున్నారు అనేది విపక్షాల ప్రశ్న... కాన్సులేట్ ఆఫీసులో తన మాజీ కొలీగ్ సరిత్‌తో కలిసి ఈ రాకెట్ స్టార్ట్ చేసిందనేది ఆ ఆరోపణల సారాంశం... కేరళ ప్రభుత్వం ఆ ఐఏఎస్ అధికారిని ఎందుకు కాపాడుతోంది..? ఇది ప్రస్తుతానికి సమాధానాలు లేని ప్రశ్న... నిందితులకు సహకరిస్తున్నట్టు ఆరోపణలున్న సీనియర్ ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను తాజాగా కేరళ ప్రభుత్వం పక్కకు తప్పించింది... ఆయన స్థానంలో మీర్ మొహ్మద్ అనే యువ అధికారిని తీసుకొచ్చింది.

✠✠✠

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః...


– కెబి.వాల్మీకి

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః.....ఈ శ్లోకం ఏ సందర్భంలో వచ్చిందో తెలుసా.....?గురువు అనగానే అందరూ చెప్పే మొట్టమొదటి శ్లోకం "గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురు స్సాక్షాత్పర బ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః".. అయితే ఈ శ్లోకం ఎందులోది?

ఏ సందర్భంలోది? ఎవరు వ్రాశారు? వంటి సందేహాలు ఎవరికయినా ఎప్పుడయినా వచ్చాయా?

ఈ శ్లోకం వెనుక అత్యంత ఆసక్తికరమయిన కథ ఉంది. ఈ కథ ఇంతకుముందు తెలిసినవారు మళ్ళీ చదివేయండి, తెలియని వాళ్ళు శ్రద్ధగా చదవండి.

కొన్నేళ్ళ క్రిందట గురుకులాలు ఉండేవి. అలా ఒకానొక గురుకుల ఆశ్రమంలో ఒక గురువుగారు ఉండేవారు ఆయన పేరు వేద ధర్ముడు. ఆయన సర్వశాస్త్ర కోవిదుడు, జ్యోతిష్య శాస్త్రంలో దిట్ట. ఈయన ఎందరో పిల్లలని చేరదీసి, ఆయన వద్దే ఉంచుకుని, భోజనం పెట్టి, ఆశ్రయం కల్పించి ఆయనకొచ్చిన విద్యలన్నిటినీ నిస్వార్థంగా బోధిస్తూ ఉండేవారు.



అలా ఈయన వద్ద కౌత్సుడు అని ఒక శిష్యుడు ఎంతో గురుభక్తితో ఉంటూ, విద్యను అభ్యసిస్తూ తను కూడా జ్యోతిష్య శాస్త్రంలో పట్టు సాధించాడు. చదువు ముగిసిపోయాక శిష్యులంతా స్నాతకసభ (మన గ్రాడ్యుయేషన్ వంటిదనుకోండి) ముగించుకుని గురువుని, ఆశ్రమాన్ని వదిలి వెళ్ళిపోయేవారు.

అలా కౌత్సుని విద్య కూడా చివరికి వచ్చేసిన సందర్భంలో ఒక సారి గురువుగారు ఏదో పని మీద ఊరు వెళుతూ ఆశ్రమ బాధ్యతలన్నిటినీ కౌత్సునికి అప్పగించి వెళతారు. ఆయన తిరిగివచ్చేసరికి ఆయన లేనిలోటు లేకుండా అన్నీ యధావిధిగా జరుగుతుండటం చూసి సంతృప్తితో ఆనందిస్తారు గురువుగారు.

ఇదిలా ఉండగా, స్నాతక సభ జరిగే రోజు రానే వచ్చింది. అందరూ గురువుగారితో తమకున్న అనుబంధాన్ని చెప్పుకుని, ఆయన వద్ద ఆశీర్వచనాలు తీసుకుని తమ తల్లిదండ్రులతో తమ తమ ఇళ్ళకు వెళిపోయారు. ఈ కౌత్సుడు మాత్రం నోరు మెదపలేదు, తల్లి దండ్రులు ఎంత బ్రతిమాలినా వాళ్ళతో వెళ్ళడానికి విముఖత చూపించాడు.

చేసేది లేక అతని తల్లిదండ్రులు వెళ్ళిపోతారు. గురువుగారు ఇతనిని పిలిచి తను మాత్రం వెళ్ళకపోవడానికి కారణమేమిటని అడుగుతాడు. అప్పుడు కౌత్సుడు బోరున విలపిస్తూ "గురువుగారూ! మీరు పొరుగూరు వెళ్ళినప్పుడు మీరు నేర్పిన జ్యోతిష్య విద్యతో మీ జాతకం చూశాను, ఈ కార్తీక మాసం (పదిహేను రోజుల్లో) నుండి తమకి దారుణమయిన కుష్ఠురోగం రాబోతోందని మీ గ్రహస్థితి చెబుతోంది.

నాకు చదువు నేర్పించి, తిండి పెట్టిన మిమ్మల్ని కష్టమయిన కాలంలో వదిలి వెళ్ళలేను. కనుక మీతోనే ఉండి సేవలు చేసి మీరు ఆరోగ్యవంతులు అయిన తరువాతే వెళతాను, అప్పటిదాకా మిమ్మల్ని వదిలిపోను" అంటాడు. అది విన్న గురువుగారు ఆశ్చర్యం, ఆనందం, దుఃఖం అన్నిటినీ కలగలిపిన ఒక అనుభూతితో ఆనంద భాష్పాలు రాలుస్తారు.

కౌత్సుడు మాత్రం ఈయనకి ఆ వ్యాధి రాకుండా ఏమేం చేయాలో ఆలోచించి గురువు గారితో ఫలానా జపాలు, పూజలు, యాగాలు చేద్దాం, తద్వారా మీకు రోగం రాదు అంటాడు. దానికి గురువుగారు "ప్రారబ్ధం భోగతో నస్యేత్" అన్నట్టుగా ప్రారబ్ధం అన్నది ఎప్పుడయినా అనుభవించాల్సిందే.

కనుక ఇప్పుడు అనుభవించి నేను విముక్తుడిని అవుతున్నాను అన్న ఆనందముతో ఉన్నాను కనుక నువ్వు బాధపడకు అంటాడు. అప్పుడు గురువుగారి మాటను కాదనలేక, కాశీలో పాపం చేసినా పుణ్యం చేసినా రెట్టింపు ఫలం వస్తుంది అంటారు కనుక

మనం అక్కడకి వెళ్ళి పుణ్య కార్యాలు చేద్దాం తద్వారా మీరు త్వరగా కోలుకుంటారు అంటాడు.

సరేనని ఇద్దరూ అక్కడకి ప్రయాణమవుతారు. కాశీ వెళ్ళిన తరువాత అక్కడ విద్యాదానం చేయటం, శివపంచాక్షరీ మంత్ర జపం చేయించటం, చేతనయినంతలో ఇతరులకి సహాయ సహకారాలు చేయటం, ఇలా ఎన్నెన్నో మొదలు పెట్టాడు కౌత్సుడు. మిట్టమధ్యాహ్నం కాళ్ళకి చెప్పులు లేకుండా జోలె పట్టుకుని (భిక్ష ద్వారా వచ్చినది మాత్రమే తినేవారు అప్పట్లో) తిరిగి అన్నాన్ని తెచ్చి గురువుగారికి పెట్టి, తను తినేవాడు.

ఒక్కోసారి గురువుగారు ఆయన తినక, తినని తిననీయక అన్నాన్ని విసిరేసేవారు. చీటికీ మాటికీ కౌత్సుడిని కొట్టడం, తిట్టడం చేయటం, చీదరించుకోవటం వంటివి చేసేవారు. అయినా కూడా ఎక్కడా విసుక్కోకుండా గురువుగారికి వ్యాధి ముదిరి మరింత బాధపెడుతోంది కాబోలు పల్లెత్తు మాట అనని ఈయన ఇలా ప్రవర్తించడానికి కారణం అదే అనుకుంటూ మరింత సేవలు చేసేవాడు.

కౌత్సుడి గురుభక్తిని గమనిస్తున్న బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఒక పందెం వేసుకున్నారు, "మన ముగ్గురిలో ఎవరు కౌత్సుడిని గురువుగారి వద్దనుండి పంపుతారో వారే మనలో గొప్పవారు" అని.

ఇక్కడ మనం గమనించాల్సిన ముఖ్య విషయం, గురువుగారిని ఇబ్బంది పెట్టి ఆనందించడం దేవుళ్ళ లక్ష్యం కాదు, కౌత్సుడు భగవంతుడు పరీక్షలు పెట్టే స్థాయిని చేరుకున్నాడు అని. సరే, అనుకున్నట్టుగా ముందుగా బ్రహ్మ మారు వేషంలో వచ్చి "నువ్వు కాశీ వచ్చినప్పటి నుండీ చూస్తున్నాను, ఎందుకాయన దగ్గర అన్ని మాటలు పడుతూ ఉంటావు, పెద్ద వాడిని చెప్తున్నాను, నా మాట విని వేరే గురువుని చూసుకుని వెళ్ళిపో" అంటాడు.

దానికి కౌత్సుడు "గురువుని, అదీ ఇటువంటి పరిస్థితుల్లో బాధపడుతున్న ఆయనని వదిలేయమని చెప్తున్న మీరు పెద్దవారెలా అవుతారు? మీరు మా గురువుగారి పరిస్థితుల్లో ఉంటే శిష్యుడు వదిలి వెళ్ళిపోవాలనే అనుకుంటారా?" అనేసరికి బ్రహ్మ నోట మాట రాక వెళ్ళిపోతాడు.

తదుపరి విష్ణువు మారు వేషంలో వచ్చి "రోగముతో ఉన్న గురువుగారికి సేవ చేస్తున్నందుకు నిన్ను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను, కానీ చేసిన మేలు మరిచే కృతఘ్నుణ్ణికి సేవ చేస్తే పాపం కూడా వస్తుంది కనుక ఆయనని వదిలి వెళ్ళిపో" అంటాడు.

దానికి కౌత్సుడు "కృతజ్ఞత అన్నది ఏదయినా ఉంటే ఇటువంటి సమయములో వదిలి వెళ్ళిపోతే నాదవుతుంది కానీ నన్ను చేరదీసి, భోజనం పెట్టి, నా నుండీ ఏమీ ఆశించకుండా తన విద్వత్తునంతా ధారపోసిన ఆయనది కాదు" అనేసరికి విష్ణువు వెను తిరుగుతాడు.

ఇహ ఈశ్వరుడు మారు వేషములో వెళ్ళి "మానవ సేవే మాధవ సేవ అన్న మాట వాస్తవమే కానీ ఇలా చీత్కారాలు పొందుతూ ఎందుకు? తను తినటం మానేయటమే కాక నువ్వు తినే వీలు కూడా లేకుండా అన్నం నేలపాలు చేయటం తప్పు కాదా? నువ్వు దూరమయితేనే నీ విలువ తెలిసొస్తుంది కనుక కొన్నాళ్ళు దూరంగా ఉండు" అంటాడు.

దానికి కౌత్సుడు సాష్టాంగ పడి, "తిండికి లేక బాధపడే నాకు తిండి పెట్టడమే ఎక్కువ, పైగా జీవితమంతా తిండిని పొందగల వీలునిచ్చే విలువయిన విద్యని నాకు ధారపోశారు. కొన్ని సంవత్సరాల పాటు ఉచితంగా భోజనం పెట్టి వృద్ధి చేసిన ఆయనకి కొన్ని రోజులు నన్ను ఉపవసించేలా చేసే హక్కు ఉంది.

కనుక మహానుభావా!! వీలయితే నాకొక సాయం చేయండి. మీ ముందు ఇంకో ఇద్దరు వచ్చారు, మీరిక్కడే కాపలా ఉండి ఇలాంటి అనవసరమయిన నీతులు మరెవరూ చెప్పకుండా చేయండి చాలు" అంటాడు.

అంతే ఆ ముగ్గురూ ఇతని గురుభక్తికి మెచ్చి "కౌత్సా! మేము త్రిమూర్తులం. నీ గురుభక్తికి మెచ్చాం, మేము పెట్టిన పరీక్షలో నువ్వు నెగ్గి నీ అపారమయిన గురుభక్తిని చాటుకున్నావు. నీకు మోక్షాన్ని ప్రసాదిస్తాము" అంటారు.

దానికి ఆనందించిన కౌత్సుడు "మీ దర్శన భాగ్యం నా అదృష్టం. మీ గురించి నాకు చెప్పింది మా గురువుగారే. ఇప్పుడు మీ దర్శన భాగ్యం కలిగించినది కూడా ఆ గురువుగారే. కనుక నాకు నా గురువే బ్రహ్మ, గురువే విష్ణువు, గురువే మహేశ్వరుడు, మీ ముగ్గురినీ సృష్టించిన ఆ పరబ్రహ్మ ఎవరయితే ఉన్నారో ఆయన కూడా నాకు నా గురువే. అందువలన నాకు మోక్షానికి అర్హత వచ్చింది అంటే, నాకు ఇన్ని నేర్పించి, ఇంతలా తీర్చిదిద్దిన మా గురువు గారికి కూడా ఆ అర్హత ఉన్నట్టే కనుక ఆయనకే ఇవ్వండి" అంటాడు.

ఇటువంటి గురుభక్తి ఉన్నందుకు శిష్యుడినీ, అటువంటి గొప్ప శిష్యుడిని తయారు చేసినందుకు గురువునీ ఇద్దరినీ మెచ్చిన త్రిమూర్తులు ఇరువురికీ మోక్షాన్ని ప్రసాదిస్తారు.

ఇటువంటి కథలు విన్నప్పుడు, చదివినప్పుడు స్ఫూర్తిదాయకంగా అనిపిస్తాయి. ఏ పనయినా పూర్తి చేయటానికి అత్యంత ముఖ్యం, అతి ముఖ్యం, ముఖ్యం అని మూడు కారణాలుంటాయట. ఉదాహరణకి అన్నం వండాలనుకోండి, అత్యంత ముఖ్యమయినది బియ్యం, అతి ముఖ్యమయినవి నీళ్ళు, మంట, పాత్ర, మొ., ముఖ్యమయినది వండే విధానం తెలియటం.

అదే విధముగా ఉద్యోగం సంపాదించి సుఖంగా జీవిస్తున్నారు అంటే గురువులు నేర్పిన విద్య అత్యంత ముఖ్యమయినది, అతి ముఖ్యమయినవి మన శ్రద్ధ, క్రమశిక్షణ, మొ., గురువులు నేర్పిన చదువులు బుద్ధికి పట్టేలా చేయగల బుద్ధిని ఇచ్చిన తల్లిదండ్రులు ముఖ్యమయినవారు.

అందుకనే మాతృదేవోభవ, పితృదేవోభవ తరువాత ప్రాముఖ్యతని ఆచార్యదేవోభవ అంటూ గురువుకి ఇచ్చారు. ఇటువంటి జ్ఞానం మనకి అలవడిన నాడు నా కృషి వల్లనే నాకు ఉద్యోగం వచ్చింది అన్న అహంకారం ఉండదు. మరీ కౌత్సుడంత లేకపోయినా అసలంటూ గురుభక్తి పెంచుకుని, గురువులని గౌరవించాలని ఆశిస్తూ గురువులందరికీ అంకితం.

ఓం శ్రీ గురుభ్యో నమః....

వాయులీన సంగీత స్వర్గం ..

ద్వారం వెంకట స్వామి నాయుడు

-వాసుశ్రీ, సీనియర్ జర్నలిస్ట్

అది 1893వ సంవత్సరం

అది దీపావళి

అది దీపాల వేళ..కర్ణాటక దేశంలో..

ఓ పసిపాప ఏడున్నొక రాగంలో ఏడ్చాడు..ఆ

ఏడుపులో ఓ గమకం ఒలికింది..

కర్ణాటక సంగీత జగత్తులో ఓ కొత్తద్వారం తెరుచుకుంది...

ద్వారం వెంకట స్వామి నాయుడు గారు అలా ఆవిర్భవించారు.

పదేళ్ళొచ్చాయ్!

నాయుడు ఆరో క్లాసు చదువుతున్నాడు.

ఉన్నట్టుండి కళ్ళు మసకేసినట్లయిపోయాయ్!

నల్లబల్లమీద అక్షరాలు అలుక్కు పోయినట్టున్నాయ్!

రేయ్..నాయుడూ.. రాసుకోకుండా దిక్కులు చూస్తున్నావేంట్రా బడుద్ధాయ్.. అన్నాడు మాస్టారు..

నాకేమీ కనబడట్లేదండీ.. వొణుకుతూ లేచి నించున్నాడు నాయుడు.

కనపడట్లేదురా గుడ్డిపీనుగా.. అయితే గుడ్డి వెధవకి చదువెందుకూ..బళ్ళోంచి వెళ్ళిపో..

కసురుకున్నాడు..గుడ్డి మేస్టారు.

కళ్ళలో చూపులేకపోయినా నీళ్ళు నింపుకుని ఇంటికెళ్ళిపోయారు.

ఉత్తరోత్తరా ఈ కుర్రాడే 'సంగీత కళానిధి' అవుతాడని ఆ మేష్టారికేం తెలుసు...

పైగా మాస్టారి తిట్లే దీవెనలయ్యాయి. ఆయనే కనుక స్కూల్లోంచి పొమ్మనకపోతే... మన నాయుడు గారు కూడా ఏ సెకండ్ ఫామ్ వరకో చదువుకుని ఎక్కడో గుమాస్త అయ్యేవాడేమో!

ఆంధ్రదేశానికి సంగీతంలో అనర్ఘరత్నాన్ని అందించిన ఆ మేస్టారికి జోహార్లు..

కళ్ళలో నీళ్ళు కక్కుకుని ఇంటికొచ్చిన నాయుడు కనబడడం మానేశాడు. పిల్లాడేమైపోయాడో అని తల్లీ తండ్రీ అంతా గాభరాపడ్డారు.

అన్న వెంకటకృష్ణయ్య ఊరంతా వెతికి ఉసూరుమని ఇంటికొచ్చాడు.

వెంకటకృష్ణయ్య వాయులీన విద్వాంసుడు..



మనసు బాగోలేక కాస్సేపు వయొలిన్ వాయిద్దామనుకుని పెట్టె తెరిచాడు. వాయులీనం లేదు!!

గుండె గుభేలుమంది.. వాయులీనం తన ప్రాణం..దాన్ని తనకి తెలియకుండా ఎవరూ ముట్టుకోరే..

ఇల్లంతా వెతికితే..ఒక చోట నుంచి నాదం వినిపించింది.

మేడమీద కూర్చుని..తదేక ధ్యానంతో వాయులీనం వాయిస్తున్నాడు తమ్ముడు..

ఆశ్చర్యపోయాడు అన్న.

వీడు వాయులీనమెప్పుడు నేర్చుకున్నాడూ...,.గమకాలంత సొగసుగా ఎలా పలికిస్తున్నాడూ.. అని

కాని అలా వింటూనే ఉండిపోయాడు..

ఆ వాయులీనంలో ఏదో మెత్తదనం..

ఆ వాయులీనం వింటుంటే హృదయం మీటినట్టుంది.

వీడు సామాన్యుడు కాదు కారణజన్ముడు..! సరస్వతీ కటాక్షం సంపూర్ణంగా ఉన్న నాదయోగి.

అంతే... వెంటనే అన్న గారొక నిర్ణయానికొచ్చి..

తమ్ముణ్ణీ తీసుకుని వీణా విద్వాంసులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రిగారి శిష్యుడైన సందివనం వెంకన్న గారి దగ్గరికి తీసుకెళ్ళి శిష్యుడిగ చేర్పించాడు..!

అదిగో అన్నయ్య అంటే వాడూ!

ద్వారం వెంకట స్వామి నాయుడు తపస్సు ఆరంభమయ్యింది..

తనకి దృశ్యం కనబడదు...శ్రావ్యం తప్ప.

ఆ చీకటి కాన్వాసు మీద..వాయులీనంతో చిత్రాలు గీయాలి..రంగులు అద్దాలి.. మెరుపులు మెరిపించాలి..పువ్వులు పూయించాలి.

గగనంలో ఎక్కడో అందకుండ సంచరించే రాగ గంగని..భగీరథుడిలా కిందికి దించాలి.

అనంత సగర గర్భాన...అస్పృశ్యంగా ఉండిపోయిన రాగామృతాన్ని వాయులీనంలో మథించి...మోహినియై శ్రోతలందరికీ అమృతం పంచిపెట్టాలి..!

పొద్దున్న బ్రహ్మీ ముహూర్తంలో వాయులీనం మీద కమాను ఆడటం ప్రారంభిస్తే...మళ్ళీ అపరాహ్ణం వేళ వరకూ అదే ధ్యాస..అదే శ్వాస..

మళ్ళీ సంధ్యవేళ మొదలెడితే ఎన్నోరాగలు మెల్లిమెల్లిగా గగనం వేపుకెళ్ళీ విచ్చుకోడం.. వాయులీనం తీగలు నరాలు..

వాయులీనం హృదయం...

నాయుడిగారి శరీరంలో వాయులీనం అంతర్భాగం..

కేవలం...సాధన చెయ్యడమే కాక...అన్నగారితో కాకినాడ సరస్వతీ గాన సభకి వెళ్ళి.. అక్కడికొచ్చే మహామహోపాధ్యాయులు...సంగీత సామ్రాట్టులు అయిన..కోనేరాజపురం వైద్యనాథయ్యర్, అరియకుడి రామానుజయ్యంగార్, కాంచీపురం నాయనపిళ్ళై, మహారాజపురం విశ్వనాథ అయ్యర్, పల్ఘాట్ అనంత రామ భాగవతార్ మొదలైన గాత్ర విద్వాంసులూ, బెంగుళూరు నాగరత్నం, తిరువాలూర్ రాజయ్, వసంత కోకిల, కోయంబత్తూర్ తంబి, ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మి మొదలైన గాయనీ మణులు తిరుకొడికావల్ కృష్ణయ్యర్, మలై కోటయ్ గోవిందస్వామి పిళ్ళై వంటి వయొలిన్ విద్వాంసులు, వీణ శేషన్న, సంగమేశ్వర శాస్త్రి వంటి వైణికులు – దక్షిణామూర్తి పిళ్ళై...అళహనంబి మొదలైన మృదంగ విద్వాంసులు – ఇంకా ఎంతో మంది హిందుస్థానీ గాయకులను సునిశితంగా పరిశీలించి... సంగీతంలోని ఎన్నో మెళుకువల్ని వంటబట్టించుకున్నారు ద్వారం.

'మై ఫ్రెండ్స్' అనే సంగీత సభ..

సంగీత విద్వాంసులంతా తమ తమ ప్రతిభా 'పాట'వాల్ని ప్రదర్శిస్తున్నారు.

చివరిగా నాయుడొచ్చారు..

'సాదాసీదా మనిషి..నల్ల కళ్ళద్దాలు..బక్కపల్చని శరీరం..వాణికి నమస్కారం చేసి వాయులీనం చేపట్టాడు.

సవ్యసాచైపోయాడు.

ఎడాపెడా వాయించేస్తున్నాడు.

ప్రేక్షకులు తెలీని మత్తులో పడి కొట్టుకుపోతున్నారు. సభ అయిపోయింది.

వెంటనే... సభలో ఉన్న కవి 'మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారు' గబగబ వేదికనెక్కి...నాయుడిని కౌగిలించేసుకుని తన చేతికున్న వజ్రపుటుంగరాన్ని వేలికి తొడిగి.. అదరగొట్టేశావు ఫిడేల్ నాయుడూ.. అని ఆనందబాష్పాలు రాల్చాడు. ఏ సుమూహూర్తాన కవి ఫిడేల్ నాయుడు అన్నాడో గానీ ఆ పేరే స్థిరపడిపోయింది... సార్థకత చేగూరడం జరిగిపోయాయ్!

♦♦♦

ఎంత నేర్చుకున్నా నాయుడు సంగీత దాహం తీరలేదు!

సరే విజయనగరం సంగీతం కళాశాల్లో చేరి ఇంకా నేర్చుకుందాం అని బయలు దేరాడు. తీరా అక్కడ ప్రిన్సిపల్ ఎవరయ్యా అంటే హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు గారు..

ఏదీ వాయించు.. అని ఆజ్ఞ జారీ చేసారు దాసుగారు.!

నాయుడు ఫిడేలు అందుకున్నాడు.

సరే రేపు కోరుకొంద ప్యాలెస్‌కి రా.. ఆనంద గజపతి రాజా వారు కూడ విన్నాక, నిన్ను చేర్చుకోవాలో వద్దో నిర్ణయిద్దాం... అన్నారు దాసుగారు.

మర్నాడు సంధ్యవేళ..

విజయనగరం కోరుకొంద రాజభవనంలో నాయుడి వయొలిన్ కచేరీ!

సభలో ఆనంద గజపతులతో పాటు ఆయన స్నేహితులు బంధువర్గం.. కొంతమంది విదేశీయులు వగైరా కూడా ఉన్నారు.

ఫిడేల్ శృతి చేసుకుని మొదలుపెట్టాడు. ఘనరాగ పంచకంలోని నాటరాగంలో... అగరుపొగలై పోయిన రాగలు... అలా అలా గాల్లో తేలుతూ... మఖ్ మల్ తెరల్ని స్పర్శించి.. పెద్దపెద్ద ఫాండిదిల్‌లోని వెలుగు ముట్టుకునీ.. ప్రాంగణమంతా పాకీ.. శ్రీరాగంలా అమృతం కురిపించీ.. వినమ్రమై నిలిచింది!

చప్పట్లు మారుమ్రోగాయి!

ఆనందగజపతుల వారు ఆధిభట్ల వారి వైపు విలాసంగా చూసారు!

దాసు గారు.. నాయుడి వైపు పరీక్షగా చూస్తూ...

'అబ్బాయ్ నువ్వేమీ.. అనుకోకు.. నీకు విద్యార్థిగా సీటు రావడం కష్టం.. అన్నారు..

గుండె ఆగినంత పనైంది.. నాయుడు గార్కి.

మళ్ళీ దాసు గారే అందుకుంటూ లేకపోతే పుంభావ సరస్వతివి నువ్వు విద్యార్థివేంటిరా చక్కగా ప్రొఫెసరై అందరికీ నేర్పించు.. అని అశీర్వదించారు.

నాయుడిగారి కళ్ళ చీకట్లపైన ఎన్నో మెరుపులు..

విజయనగరం సంగీత కళాశాల వయొలిన్ అధ్యాపకులు శ్రీ ద్వారం వెంకట స్వామి నాయుడు..

♦♦♦

నాయుడు గారు దాదాపు భారత దేశంలో ఉన్న అన్ని సంగీత సభల్లోనూ వాయించారు. 1941లో మద్రాస్ మ్యూజిక్ అకాడమీకి అధ్యక్షత వహించి 'సంగీత కళానిధి' అన్న బిరుదు తీసుకున్నారు.

1940లో మైసూర్ మహారాజా వారిచే 'బంగారు రాజముద్రికతో పాటు సంగీత రత్నాకర బిరుదు.

1949లో విజయవాడ పురపాలక సంఘం అధ్వర్యంలో పౌర సన్మానం..అదే సంవత్సరం ఆంధ్ర విశ్వ విద్యాలయం వారి చేత 'కళా ప్రపూర్ణ' ... 1953లో 'రాష్ట్రపతి అవార్డు'..1957లో 'పద్మశ్రీ' అదే సంవత్సరం వెంకటేశ్వర విశ్వవిద్యాలయం చేత 'డి.లిట్.

ఇలా ఎన్నో బిరుదులూ, సన్మానాలు అన్నట్లు చెప్పడం మర్చిపోయాను..ద్వారం వెంకటస్వామి నాయుడు ప్రసిద్ధుడైపోయాక చిన్నప్పుడు గుడ్డిపీనుగా అని తిట్టిన మాస్టారొచ్చి.. నన్ను క్షమించు నాయనా నువ్వంతటి వాడవౌతావని ఎరగన్రా అని కంటతడి పెట్టుకుంటే.. మీరు ఆ రోజు తిట్టారు గనుకే ఇంతటి వాణ్ణయ్యాను మాస్టారు అన్న సౌమ్యుడు ద్వారం.

♦♦♦

1964లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నాయుడి గారిని ఆస్థాన విద్వాంసునిగా నియమించింది...ఆ సందర్భంగా సంగీత నాటక అకాడమీ చేసిన సన్మానం అందుకున్న రాత్రి... నాయుడి గారికి గుండెపోటు వచ్చింది!

మిత్రుడూ.. మృదంగ విద్వాంసుడూ అయిన కోలంక వెంకట్రాజు గారు పక్కన ఉండగా.. ద్వారం వారి ప్రాణ వాయులీనం అనంత వాయువుల్లో విలీనం అయిపోయింది!!

రాజకీయాల్లో రేవంత్ రెడ్డి

- ప్రజామీడియా నెట్‌వర్క్



తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గతంలో టిడిపి పార్టీలోకి అడుగు పెట్టిన రేవంత్ రెడ్డి సీనియర్‌లను సైతం వెనక్కి నెట్టి చంద్రబాబు దృష్టిలోకి వచ్చారు. ఇక ఆ తర్వాత టీడీపీని వదిలి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన తర్వాత కూడా రేవంత్ రెడ్డి జోరు ఎక్కడా తగ్గలేదు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్‌ను ఢీ కొట్టే అసలు సిసలైన నాయకుడు రేవంత్ రెడ్డి అనడంలో అతిశయోక్తి లేదు. మాటల్లో అయినా బలంలో అయినా కెసిఆర్‌కి ధీటుగా ఉంటారు రేవంత్ రెడ్డి. అందుకే కాంగ్రెస్ పార్టీలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సీనియర్లు ఉన్నప్పటికీ ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం రేవంత్ రెడ్డి వైపే మొగ్గు చూపుతుండటం అందరికీ తెలిసిందే.

తన వ్యూహాలను అమలు చేస్తూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడు. ఇలా ఎన్నో సార్లు వ్యూహాలను అమలు చేశారు, ఒక పాయింట్‌ని ఎలా లేవనెత్తి ఎవరెవరికి ఫిట్టింగ్ పెట్టి ఎలా వివాదం రాగల్చాలి అన్నది కరెక్ట్‌గా చేస్తూ ఉంటారు రేవంత్ రెడ్డి, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్.. రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడ్డారని రాష్ట్ర గవర్నర్ తమిళసై పిలిస్తే ఎందుకు రాలేదు... ఆరోగ్య ముఖ్య కార్యదర్శి శాంతకుమారి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సొమేష్ కుమార్‌లను వెంటనే విధుల నుంచి తొలగించాలని అంటూ డిమాండ్ చేశారు రేవంత్ రెడ్డి. తద్వారా ప్రస్తుతం బిజెపి పార్టీ నుంచి ఉన్న గవర్నర్ తమిళసైకి.. కెసిఆర్‌కి మధ్య విభేదాలు వచ్చేలా చేయడం అనే ఒక ప్రణాళికను అమలు చేశారు. అంతేకాకుండా ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా వ్యవహరించకపోతే గవర్నర్ కల్పించుకోవాలి లేకపోతే కేంద్రం కల్పించుకోవాలి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గవర్నర్ తమిళిసై ఉన్నప్పటికీ ఎందుకు కల్పించుకోవడం లేదు అని వారిని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు రేవంత్, అంతే కాకుండా హైదరాబాద్‌లో ప్రతి భవనం గవర్నర్ అధీనంలో ఉంటుందని సచివాలయం కూల్చివేత కు గవర్నర్ అనుమతి తెలంగాణ ప్రభుత్వం తీసుకుందా అని ఒక పాయింట్ తెరమీదకి తెచ్చి.. రేవంత్ గవర్నర్‌కి కూల్చివేతను ఆపాలని చెప్పకనే చెప్పారు అని అంటున్నారు విశ్లేషకులు.



వేలాడే స్తంభం

– శర్మ


మన దేశంలోని సుప్రసిద్ధ, చారిత్రాత్మకమైన ఆలయాల్లో ఏపీలో ఉన్న లేపాక్షి ఆలయం కూడా ఒకటి. అనంతపురం నుంచి సుమారుగా 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న లేపాక్షి గ్రామంలో ఈ ఆలయం ఉంది. ఇక్కడి ఆలయంలో స్వామి వారిని వీరభద్ర స్వామిగా కొలుస్తారు. దీన్ని విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన రాజులు క్రీస్తుశకం 16వ శతాబ్దంలో నిర్మించారు. ఈ ఆలయంలో ఉన్న మండపాల్లో అద్భుతమైన శిల్పకళానైపుణ్యం మనకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

ఆలయ ప్రాంగణంలో భారీ రాతితో చెక్కబడిన నంది విగ్రహం ఉంటుంది. ఇది ఆలయానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది.

ఆలయంలో 70 స్తంభాలు ఉంటాయి. కానీ ఒక్క స్తంభం మాత్రం నేలకు పూర్తిగా ఆనుకోకుండా ఉంటుంది. స్తంభం అడుగు భాగంలో మనం ఖాళీ ప్రదేశాన్ని గమనించవచ్చు. అయితే ఈ స్తంభం కిందకు ఆనకుండా అలా గాలిలోనే ఎందుకు ఉందో ఇప్పటికీ సైంటిస్ట్‌లకు అంతుబట్టని మిస్టరీగానే మారింది. దీన్ని బ్రిటిష్ వారి హయాంలో కదిలించడానికి యత్నించారట. కానీ అది కొద్దిగా స్థానభ్రంశం చెందిందే తప్ప అక్కడి నుంచి అస్సలు కదలలేదు. దీంతో ఈ ఆలయంలో ఈ స్తంభం అతి పెద్ద మిస్టరీగానే ఉండిపోయింది. లేపాక్షి ఆలయంలో ఉండే ఈ వేలాడే స్తంభాన్ని చూసేందుకే చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. దాని కింద వస్త్రాలను, ఇతర వస్తువులను ఉంచి అటు, ఇటు దొర్లిస్తూ సంతోషిస్తుంటారు.

అయితే ఆ స్తంభం ఒక్కటే అలా వేలాడుతూ ఎందుకు ఉందనే విషయంపై పలువురు వివరణ ఇచ్చారు. భూకంపాల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆలయంలోని ఇతర స్తంభాలు కదిలితే వాటిని ఆపేందుకు ఈ ఒక్క స్తంభం ఉపయోగపడుతుందట. అందుకనే దాని కింద అలా ఖాళీ వదిలారట

ఇక సీతాదేవిని రావణాసురుడు ఆకాశమార్గంలో తీసుకువెళ్తుంటే ఆమెను కాపాడబోయిన జటాయువు అనే పక్షి ఇక్కడే పడిందట. అదే సమయంలో శ్రీరాముడు పక్షిని లేవాలని పిలిచాడట. లే.. పక్షీ.. అన్నాడట. దీంతో ఈ ప్రాంతానికి లేపాక్షి అనే పేరు వచ్చిందని చెబుతారు.



అత్తా కోడలు

– ఉమాబాల



"అక్కా...నీకు పనైపోతే నీతో కొంచెం మాట్లాడాలి..అంది మంగళ " తన అక్కతో...

"అదేంటి, కొత్తగా ..అంది నవ్వుతూ ఇందిర..."

"కొత్తగా ఏమీ లేదు గానీ నువ్వైతే రారాదూ అంది మంగళ..."

మంగళ పూణే నుండి అక్క ఇందిరా వాళ్ళింటికి వచ్చి వారమైంది...

మంగళ అక్కడ కాలేజ్‌లో లెక్చరర్‌గా చేస్తోంది..

ఇంకో ఐదేళ్ల సర్వీస్ ఉంది...

ఏవో సెలవులు కలిసొస్తే ఇంకో రెండు రోజులు సెలవు పెట్టుకుని అక్కని పిల్లల్నీ చూడాలని, తనకీ రొటీన్ లో చేంజ్ ఉంటుందని వచ్చింది..

మంగళకి ఒకబ్బాయి..అమ్మాయి...

అమ్మాయికి పెళ్లి అయ్యి బెంగళూరులో ఉంటోంది...

కొడుక్కి బాంబేలో ఉద్యోగం.

భర్త అక్కడే ఎస్.బి.ఐలో బ్రాంచ్ మేనేజర్‌గా చేస్తున్నాడు. ఆయనకి ఇంకా ఓ సంవత్సరం సర్వీస్ ఉంది.

భర్త నేను మేనేజ్ అవుతాలే నువ్వువెళ్ళిరా అంటే వచ్చింది.

అక్క ఇందిర ఉండేది హైదరాబాద్‌లో.

అక్కకి ఇద్దరు అబ్బాయిలు అమ్మాయి... అమ్మాయి పెద్దది...

అమ్మాయికి పెళ్లి అయిపోయి.....హైదరాబాద్ లోనే కొండాపూర్‌లో ఉంటుంది...

పెద్ద అబ్బాయికి పెళ్లి అయ్యి సంవత్సరం అయ్యింది...

వాళ్ళది లవ్ మేరేజ్... కొడుకు కోడలు హైటెక్ సిటీలో ఉద్యోగం..

ఇంకో అబ్బాయి చెన్నైలో జాబ్ చేస్తాడు...ఇంకా పెళ్లి కాలేదు...

భర్త సెక్రటేరియట్‌లో పని చేసి రిటైర్ అయ్యి రెండేళ్లు కావొస్తోంది...

సొంత ఇల్లు.. సౌకర్యాలతో...హంగులతో ఉంది...

జీవితం ప్రశాంతంగా సాగిపోతోందనే చెప్పొచ్చు...

ఇదీ వాళ్ళిద్దరి వివరాలు..

అక్క ఇందిర చేతులు నేప్ కిన్ తో తుడుచుకుంటూ వచ్చింది "చెప్పవే" అంటూ...

"నువ్వు కూర్చో ముందర అని " తను జరిగింది మంగళ...

"అక్కా. ఈ వారం రోజులూ ఎంత బాగా గడిచిపోయాయో...

నేను ఇలా తీరికగా కూర్చుని...నువ్వు వండిన రుచికరమైన వంటలు తింటూ భలే ఎంజాయ్ చేసాను...

అమ్మ గుర్తొచ్చింది అంది.. అభిమానంగా..."

"చాల్లేవే... అసలు నువ్వు కదిలిరావడమే గొప్ప...

నువ్వూ బ్రహ్మాండం గా చేస్తావు లే వంటలు అంది" ఇందిర...

"ఇంతకీ ఏంటి మాట్లాడాలన్నావు అంది..."

"మరేమీ లేదక్కా...గత వారం రోజులుగా నీ సంసారాన్ని గమనించాను...

బావగారి వ్యక్తిత్వం... నీ మాట జవదాటాని

కొడుకు...విధేయత తో అందరితో అభిమానంగా ఉంటూ ఏ మాత్రం గర్వం లేని కోడలు...

నాకు చాలా సంతోషంగా ఉంది..."

ఎంత మందికి ఉంటుంది చెప్పు ఈ అదృష్టం...

అయితే నేనొకటి చెప్తాను ఒక స్నేహితురాలిగా...ఏమీ అనుకోకుండా విను...

అన్నీ బావున్నాయి గానీ, నీ ప్రవర్తన మీ కోడలు మానస తో నాకు నచ్చలేదక్కా...

"విను..అసహనంగా చూడకు..."

అసలు ఆ అమ్మాయితో అభిమానంగా మాట్లాడనే మాట్లాడవు...

అంటీ ముట్టనట్టు ఉంటావు...

ఆ అమ్మాయి నీకు ఎంత దగ్గరవుదామని ప్రయత్నించినా నువ్వు దూరంగానే ఉంటున్నావు...

ఆ అమ్మాయి వంటింట్లోకి వస్తే చాలు...ఏమి కావాలి అని అడుగుతావు..

ఏదైనా కావాలిస్తేనే రావాలా...

ఏదైనా సహాయం చేద్దామని మానస ప్రయత్నించినా...
ఆపని ఎప్పుడో అయిపోయింది...అవసరం లేదు అంటావు...
ఈ ఇల్లు తన ఇల్లు కూడా కదా...
తనకి ఈ ఇంట్లో స్వాతంత్రం లేదా...
ఎందుకని నీ కూతురు వినీల లాగా చూడలేకపోతున్నావు
ఆ అమ్మాయి ఆఫీస్ నుండి ఇంటికి రాగానే..." ప్రేమగా కాఫీ త్రాగుతావా అని అడిగితే నీ సొమ్మేం పోయింది..."
నిన్న రాత్రి మానస కిచెన్లోకి వచ్చి నేనేమైనా చెయ్యనా అత్తయ్యా అని అడగడం నేను విన్నాను...
"నువ్వు వద్దు... అంతా అయిపోయింది" అని చెప్పావు...
ఒక్కోసారి తనని కూడా ఏదో ఒక ఐటమ్ అయినా చెయ్యమనొచ్చుగా...
పోనీ శని ఆదివారాల్లో తనకి వంటిల్లు అప్పగించొచ్చుగా...
అదేదో నీ ఒక్క దాని సామ్రాజ్యం...అందులోకి ఎవరూ రాకూడదు అనుకుంటే ఎలా...?
నీ అధికారం పోతుందేమో అన్న అభద్రతా భావం నీలో కనిపించింది నాకు...
వెంటనే ఇందిర అంది.. అలా కాదే... ఆ అమ్మాయి ఆఫీస్ నుండి అలసిపోయి వస్తుంది కదా అని...
ఇంకా ఏదో చెప్పబోతుంటే...
వెంటనే అంది మంగళ..."అక్కా ఇవన్నీ సాకులు...
ఆ అమ్మాయి టైమింగ్స్ ఇవే ఎప్పటికీ...ఇలాగే ఉంటుంది వాళ్ళ లైఫ్ స్టైల్...
అలా అని.. తను ఎప్పటికీ వంట గదిలోకి రాకుండా ఉండిపోవాలా మరి..."
ఆ అమ్మాయికి కూడా చిన్న చిన్న కోరికలు ఉంటాయి
తనేదో వెరైటీగా వంట చేయాలనీ ...మీరంతా మెచ్చుకోవాలని...
ఈ ఇల్లు..మనుషులు నీకు మాత్రమే సొంతం..మానస ఒక అతిథి అనుకుంటున్నావు...
ఇది చాలా తప్పు...తను ఈ ఇంటి కోడలు...నీ కొడుక్కి భార్య...మీ కుటుంబానికి వారసులని ఇస్తుంది...తన విలువ కూడా తెలుసుకో...
అసలు నవ్వుతూ మనస్ఫూర్తిగా మానస తో మాట్లాడడం నేను ఈ వారం రోజులలో చూడలేదు...
ఒక్కటి ఆలోచించు అక్కా...మానస ఇక్కడ ఉండకుండా వేరే వెళ్లిపోవడం ఎంతసేపు...
కానీ తను మీతో సర్దుకుపోవాలని..ప్రయత్నిస్తోంది..అది నాకు స్పష్టంగా అర్థమయ్యింది...
ఇప్పటి పిల్లలు సున్నితంగా ఉండటమే కాదు చక్కటి సంస్కారంతో కూడా ఉంటున్నారు...
బాధలు అనేవి టీవీ సీరియల్స్‌లోలా ఉండక్కర్లేదు...
ఇది కూడా ఒకరకమైన మానసిక టార్చర్ తెలుసా...?
ఇప్పుడు నీకున్న ఓపిక ఎప్పుడూ ఇలానే ఉంటుందా చెప్పు...
నీ జవసత్వాలు ఉడిగాకా నిన్ను చూసుకోవాల్సింది కొడుకులూ కోడళ్లు మాత్రమే..అది మర్చిపోకు...
ఇప్పుడు మనసు గాయపడి...రేపు భవిష్యత్తులో నీతో ఎలా ప్రేమగా ఉండగలుగుతుంది...
మనం ప్రేమని ఇస్తేనే..మనం తిరిగి పొందగలుగుతాం...
కనీసం ఆశించే హక్కు ఉంటుంది...
నీకు నీ కొడుకు పెళ్లి ఆర్భాటంగా జరగలేదని అసంతృప్తి ఉంది...
నాతో కూడా అన్నావు చాలా సార్లు...
నిజమే... కానీ ఆ అమ్మాయికి తండ్రి లేడు...
ఏదో తల్లీ కొడుకూ సింపుల్‌గా చేశారు...
పాపం దానికి మానసని బాధ్యురాలిని చేసి నీ కోపం ఇలా చూపిస్తే ఎలా...
ఒక్కసారి నీ పెళ్ళైన కొత్తలో నీ అత్తగారితో నువ్వు గడిపిన రోజులు గుర్తు చేసుకో...
నువ్వు ఏవైనా బాధలు పడి ఉంటే అలాంటివి నీ కోడలు పడకుండా చూసుకో...
ఇలా చెప్పానని ఏమీ అనుకోకక్కా..
నేను కాకపోతే నీకు ఇంత చనువుగా ఎవరు చెప్తారు...
నువ్వు మరింత సంతోషంగా ఉండాలని నా కోరిక...
నువ్వు ఈ ఒక్క లోపం సరిచేసుకుంటే...నీలో ఎన్నదగిన లోపాలే లేవు...
నువ్వు బంగారు తల్లి...అనుకూలమైన భార్య గానే కాక ప్రేమమూర్తి వైన అత్తగా కూడా ఉండక్కా..
ఓ సారి ఆలోచించు అంది మంగళ...
ఇందిర మంగళ భుజం మీద తల వాల్చి వెక్కి ఏడ్చింది...
నువ్వు ఏడవొద్దు... నీకు అర్థమయ్యింది కాబట్టి నిన్ను నువ్వు సరిదిద్దుకో...
మానసని ప్రేమించు...ఈ ఇంట్లో స్థానమియి... అలాగే నీ మనసులో కూడా అంది నవ్వుతూ మంగళ...
వేడిగా టీ పెట్టి తెస్తా నువ్వు కూర్చో..అంటూ వంటింట్లోకి వెళ్ళింది మంగళ....
సాయంత్రం మానస వచ్చి ఫ్రెష్ అవగానే...
అమ్మా మానసా.. రేపే మంగళ వెళ్ళేది...
ఈ వారం రోజులుగా నా వంట తిని తినిఉంది...
ఈ పూట వెరైటీ గా నువ్వు ఏమైనా చేస్తావా...అంది నవ్వుతూ ఇందిర...
మానస ఆశ్చర్యంగా ...ఆనందంగా తల ఊపుతూ...
మంగళ వంక చూసింది...
మంగళ...పెదవి విరుస్తూ భుజాలు ఎగరేసింది...
నాకేమీ తెలియదు అన్నట్టు...

దమ్ముంటే నన్ను అరెస్ట్ చేసుకోండి

"సంచలన జర్నలిజానికి కేర్ ఆఫ్ అడ్రస్ దాసరి "ఉదయం"

– మాడభూషి శ్రీధర్. రచయిత, మాజీ కేంద్ర సమాచార హక్కు చట్టం కమిషనర్





ఉదయం దిన పత్రిక చైర్మన్ దాసరి నారాయణరావు గారి ఇంట్లో రాత్రి 12 తరువాత కీలకమైన సమావేశానికి రావాలని పిలుపు. తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన అవినీతిపై న్యాయకమిషన్ నివేదిక ప్రతిని మేం ముందే సంపాదించాం. నివేదికలో ఉన్న లోపాలను చీల్చి చెండాడుతూ కొన్ని వ్యాసాలు రాసి సిద్ధంగా ఉంచాం, వాటి ప్రచురణపై సంపాదకుడు నిర్ణయం తీసుకోవలసి ఉంది.

ఈ విధంగా కమిషన్ నివేదికపై విమర్శావ్యాసాలు ప్రచురించడం చట్ట వ్యతిరేకమా అని అడిగారు. నేను అవునన్నాను. కమిషన్ ఆఫ్ ఇంక్వయిరీ చట్టం 1952 కింద కమిషన్ పనిని కించపరుస్తూ రాస్తే నేరం. అదీగాక అసెంబ్లీలో సమర్పించకముందే బయటపెడితే ప్రివిలేజెస్ భంగపరిచారనే ఆరోపణను కూడా ఎదుర్కొనవలసి వస్తుంది. ప్రభుత్వం తలచుకుంటే అరెస్టు కూడా చేయవచ్చు అని వివరించాను. మరేం చేద్దామంటారు అన్నారాయన. ఖచ్చితంగా నివేదికను ఉదయంలో ఉతికి ఎండేయాల్సిందే. మీరు దానికి ముందే ఘాటుమాట రాస్తే బాగుంటుంది. లేదా మా పేర్లతో ప్రచురిస్తే మేం పరిణామాలు ఎదుర్కొనడానికి కూడా సిద్ధం అన్నాను. అంటే చైర్మన్ గారిని అరెస్టుచేయించాలని నీకుందన్నమాట అని మా ఎండీగారు అన్నారు. నేను దాసరి గారిని చూసాను. ఆయన ఏమంటావన్నట్టు చూసారు. మిమ్మల్ని అరెస్టు చేయాలని ఎన్టీఆర్ క్యాబినెట్ నిర్ణయిస్తుందంటారా అని నేనడిగాను. చూద్దాం ఏం చేస్తారో అని నవ్వుతూ దాసరి ఆ విమర్శావ్యాసాలను ప్రచురించడమే కాకుండా తన సంతకంతో ముందుమాట కూడా రాసి, అరెస్టు చేస్తే చేస్కోండి అన్నట్టు సవాలు విసిరారు. మరో ఎడిటర్ ప్రొప్రయిటర్ అయితే ఇంత ధైర్యసాహసాలు చూపేవారా? శ్రీ వేంకటేశుని పాదపద్మాల సాక్షిగా అనే శీర్షికతో ఆయన మొదటి పేజీ లేఖతో మా వ్యాస పరంపర సంచలనం రేపింది. ప్రభుత్వం వారు పెట్టిన క్రిమినల్ పరువు నష్టం దావాను ఆ తరువాత మేం పదకొండు సంవత్సరాలు ఎదుర్కోవలసి వచ్చింది.

టిటిడిపై మేం రాసిన పరిశోధనాత్మక వార్తారచన పర్యవసానంగా దాదాపు రెండుమూడు సంవత్సరాల పాటు ఉదయంలో రాయవలసిన తీవ్ర సంఘటనలు జరిగాయి. కాంట్రాక్టుల కుంభకోణం తదితర అక్రమాల ఫైళ్లు మాకు చూపాలని కమిషన్ ముందు మేం పిటిషన్ పెట్టాం. టిటిడి అధికారులు 'ఇవి మా ఫైళ్లు మీరెవరు అడగడానికి' అని వాదించారు. 'తిరుమల హుండీలో ఒక్క రూపాయి వేసిన వాడికి కూడా తన డబ్బు ఏ విధంగా ఖర్చు చేసారో తెలుసుకునే హక్కుందని' మేం వాదించాం. కమిషన్ మా వాదనను అంగీకరించి టిటిడిని ఆదేశిస్తే వారు ఫైళ్లు టేబుల్ పైన పరిచారు. ఆ ఫైళ్లు చూసే పని నామీదే పడింది. ఆ రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 దాకా ఏకధాటిగా ఫైళ్లను పరిశీలించి దాదాపు 250 ఫైళ్లలో ముఖ్యమైన పత్రాల జాబితా తయారు చేసాను. మరునాడు వాటి ప్రతులు కావాలని పిటిషన్ పెట్టాను. దానికి కూడా వారినుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కాని కమిషన్ నాకు ఆ ప్రతులన్నీ ఇప్పించింది. అవినీతి అక్రమాలపైన విస్తారమైన సాక్ష్యాలు దొరికాయి. అప్పట్లో ప్రభుత్వం కార్యాలయంలో ఫైళ్లు చూపాలని డిమాండ్ చేసే హక్కు లేదు. 2005 సమాచార హక్కుచట్టం కింద ఇప్పుడు ఈ హక్కులున్నాయి. 20 ఏళ్ల కిందట లేని ఈ హక్కును ఉదయం అమలు చేయగలిగింది. ఉదయం టిటిడిలో అవినీతిగురించి లేవనెత్తిన కుంభకోణాన్నింటికి సాక్ష్యాలు చూపింది. అవి జరగలేదనడానికి వీల్లేదు. అయినా పై అధికారులను తప్పించడానికి కమిషన్ చాలా అన్యాయంగా తప్పుడు నిర్ధారణలుచేసిన వివరాలు మేం బయట పెట్టాం.

కాని విచారణ మధ్యలో జడ్జిగారు మాపై దాడి జరిగే ప్రమాదం ఉందని మమ్మల్ని హెచ్చరించారు. తిరుపతిలోనే మామీద దాడిచేయడానికి కుట్ర పన్నారని కమిషన్ అధ్యక్షులు న్యాయమూర్తి పెన్మత్స రామచంద్ర రాజుగారు మా లాయర్‌కు మాకు మాత్రమే రహస్యంగా చెప్పారు. వెంటనే విమానంలో హైదరాబాద్ తరలిపోయాం. జడ్జిగారి వల్లే మేం బతికి పోయాం. ఆ తరువాత జడ్జిగారు నిజాలన్నీ తెలిసి కూడా టిటిడి అవినీతి పెద్దల్ని ఎందుకు రక్షించారో మనం ఊహించుకోవచ్చు.

ఎబికె సంచలన శీర్షికలు

మొదట్లో సంపాదకులకు ఇతర ముఖ్యులకు మాత్రమే దాసరితో కలిసే అవకాశం ఉండేది. రెండు రంగాల్లోనూ ప్రముఖుడు కావడం వల్ల సమయం దొరికేది కాదు. ఆయన్నుఎప్పుడు కలుద్దామా అని హైదరాబాద్ లో ఒక మామూలు విలేకరిగా నేను అనుకుంటూ ఉండే వాడిని. ఎప్పుడైతే తిరుమల తిరుపతి దేవస్థానంలో సాగే అవినీతిని ఎండకడుతూ 9 పరిశోధన వార్తా వ్యాసాలు రాసామో అప్పుడు ఆయనే మమ్మల్ని (నన్నూ సాయిబాబాను) పిలిచాడు. నిజానికి అంత సంచలనమైన వార్తా వ్యాసాల విషయం దాసరికి ప్రచురించిన తరువాతనే తెలిసింది. కాని ఎబికె ఆధ్వర్యంలో స్వతంత్రంగా ఆ తొమ్మిదిరోజుల సంచలన రచన సాగిపోయింది. ఈ వార్తావ్యాసాలకు ఎబికె శీర్షికలు సంచలనం రేపాయి.

సినీ నటి సిఫార్సు ఖాతరు చేయని దాసరి

తిరుమల పైన కాటేజిల్లో కొన్నింటిని చెరబట్టి భక్తులకు నివాసం కొరత కృత్రిమంగా సృష్టించారని మేము రాస్తే దేవస్థానం వారిని ఖాళీ చేయించక తప్పలేదు. ఆ విధంగా చెరబట్టిన ఒక సినీ నటి తనను మినహాయించాలని కోరితే, ఉదయం పత్రికవారు వెంటబడుతున్నారని మేమేమీ చేయలేమని, అధికారులు చెప్పారట. అప్పుడు మాకు తెలిసిన సినీ దర్శకరత్నమే అని ఆ నటి తనను వదిలేయాలని దాసరి గారిని కోరారట. లేదమ్మా నేనేమీ చేయలేను అని వినయంగా చెప్పి, ఆ విషయం మాతో ఆనందంగా పంచుకున్నారాయన.

మీరయ్యా అసలు హీరోలు

తిరుపతి వార్తలు రాసి తలనీలాలు సమర్పించి గుండుతో దాసరిని చూడడానికి వెళ్తే 'ఓహో మీరేనా రాసింది' అంటూ నవ్వుతూ చూసి 'మీరయ్యా అసలు హీరోలు' అని మమ్మల్ని ప్రోత్సహించిన సారథి ఆయన. కొత్తగా సినీరంగంలో ప్రవేశిస్తున్న నాగార్జున, వెంకటేశ్ లకు సినీ పునాదులు వేసింది దాసరి. మా వార్తా సమావేశాలు అప్పుడప్పుడు షూటింగ్ స్థలాల్లో జరిగేవి. అక్కడికి చేరడానికి ముందే 'శ్రీధర్ వస్తున్నాడు ఒక కుర్చీ వేయండి' అని ఆదేశించేవారు. షూటింగ్ సమయంలో దర్శకుడికి తప్ప మరెవరికీ కుర్చీ ఉండదట, దర్శకుడు కావాలంటే తప్ప. దర్శకుడు నిర్మాతకో లేక మరో అత్యంత ప్రముఖుడికో మరొ కుర్చీవేయనిస్తాడట. నేను వెళ్లి అక్కడ కూర్చుంటే వీడా అత్యంత ప్రముఖుడు అన్నట్టు నన్ను ఆశ్చర్యంగా చూసేవారు. ఆయన షూటింగ్ ఆపి మాతో మాట్లాడేవారు. ఆ హీరోలకు నన్ను అసలు హీరోగా పరిచయం చేసేవారు. 1994లో నేను న్యాయశాస్త్ర బోధనారంగంలోకి మళ్లి, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో చేరిన తరువాత, అంటే దాదాపు పదేళ్ల తరువాత ఓసారి ఒక సమావేశంలో హీరో సుమన్ తదితర ప్రముఖులకు నన్ను మళ్లీ అసలు హీరో అని పరిచయం చేయడం నా కుటుంబసభ్యులు మరిచిపోలేరు.

సింగరేణి ఎల్ఐసి కుంభకోణం

సింగరేణి కూలన్నకు భీమా పోటు అనే పేరుతో సింగరేణి కార్మికులను ఎల్ ఐ సి ఏజెంట్లు, ఆఫీసర్లు కలిసి కుట్రలు చేసి దోచుకున్న అక్రమాలను బయటపెట్టినపుడు ఎల్ ఐ సి వారు తమ వ్యాపార ప్రకటనలు ఆపుతామని బెదిరించి మా వార్తావ్యాసాల ప్రచురణను నిలిపివేయించారు. దాసరికి ఈ విషయం తరువాత తెలిసింది. నెలరోజుల్లో ఎల్ఐసి ఒక అధికారిక ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించినప్పుడు ఉదయం పక్షాన నిలదీస్తే అధికారులు కుంభకోణం జరిగిందని ఒప్పుకోకతప్పలేదు. 'ఉదయం ప్రశ్నలకు బిత్తర పోయిన ఎల్ఐసి' వారి లోగుట్టు బయటపెట్టే వార్తను మొదటి పేజీలో వేసి జరిగిన నష్టాన్ని సరి చేసారాయన. 'అన్నగారి ఆరుకోట్లలో ఆ నూర్గురు లేరట' అనే శీర్షికన ఒక నూరుగురు ప్రజలు ఉన్నా లేరనే కుట్రనుబయటపెట్టిన పరిశోధనకు ప్రధాన పతాక స్థాయి ఇచ్చారు.

నాకే కాదు రాష్ట్రం మొత్తం మీద విలేకరుల సైన్యానికి, సంపాదక వర్గానికి ఆయన ఇచ్చిన ప్రోత్సాహం స్వేచ్ఛ, పరిశోధించి ప్రచురించే వెసులుబాటు మరవలేనివి. కొన్ని నెలలు జీతాలు లేకపోయినా కార్మికులు ఆపని పత్రిక ఉదయం. దాసరికి ఆర్థిక కష్టాలున్నాయని ప్రతికార్మికుడు సానుభూతి చెందడం అపురూపమైన సంఘటన.

శక్తిత్వం

దాసరి నారాయణరావు చిత్రానికి పూలదండ చుట్టి, క్రింద దీపాలు అమర్చిన ఒక ఫోటో వాట్సప్ మాధ్యమంలో హటాత్తుగా కనిపిస్తే ఆయన ఇక లేరని అర్థమై వివరాలు తెలుసుకోవాలనిపించనంత విషాదంలోకి మనసు వెళ్లిపోయింది. కులసంకుల సమాజంలో, కళామాధ్యమవ్యాపారవ్యూహ ధురంధరులైన వర్గంచేతిలోకి దాదాపు పూర్తిగా వెళ్ళిపోయిన సినీ పరిశ్రమ (పరిశ్రమో కాదో తెలియదు)లో తీవ్రమైన ప్రతిఘటనను ఎదుర్కొంటూ కూడా ఒక చోటు సంపాదించుకోగలిగిన డైనమిక్ డైనమేట్ దాసరి. సుప్రసిద్ధ తండ్రుల సుపుత్రుడు కాడాయన. చెప్పులు లేకుండా నడిచి, సైకిల్ మీద రిక్షాల్లో తిరిగిన సామాన్యుడు, పేదవాడు, కాని కొత్తదేదో చెప్పాలన్న ఉత్సాహం ఉరిమే ఊహలు ఆయన సంపద. కొందరికాయన ఊహలు, భావాలూ ప్రయోగాలూ నచ్చవు. కుటుంబాల గుప్పిట్లో ఉన్న సినీ గుత్త వ్యాపార వాతావరణంలో కులమతాలకు అతీతంగా కొత్త సినీ కుటుంబాన్నిసృష్టించిన శక్తిత్వం దాసరిది. డబ్బురాకపోక సినిమారంగం జూదం వంటిదని వేరే చెప్పవనసరం లేదు. ఆ నేపథ్యంనుంచి దాసరి పత్రికారంగంలో ఉదయించారు.

ఉదయం వెలుగుల వెనుక సూర్యులు

ఆంధ్రపత్రికలు, ఆంధ్ర ప్రభలు తగ్గుతున్నరోజుల్లో వెలిగిపోతున్న ఈనాడుకు పోటీగా డైనమిక్ ఆనాడు ఉదయించిన ఉదయానికి వెనుక సూర్యుడు దాసరి. దాన్ని ఏడు గుర్రాలతో నడిపిన వాడు ఎబికె అయితే అందులో కీలకమైన సంపాదక మణులు కె రామచంద్రమూర్తి, పతంజలి, పొత్తూరి వెంకటేశ్వరరావు, గజ్జల మల్లారెడ్డి: పరిశోధనలు చేసి గుట్టు బయట పెట్టే విలేకరుల సైనిక బృందంలో నన్నూ ఒకడిగా దాసరి గుర్తించారు.

విలేకరికి సంపాదకుడికి ఉదయంలో లభించిన స్వేచ్ఛ ఎన్నడూ ఏ పత్రికలోనూ ఎవరికీ ఉండకపోవచ్చు. 1984లో చేరి 1994లో అస్తమించేదాకా ఆ ఉదయ కిరణాలలో ఒకడినై వెలిగే అవకాశం కలిగింది. నిజానికి దాసరి అమ్మేసిన రోజునే ఉదయం అస్తమయం మొదలైంది. తేజస్సు తగ్గిపోయి ఆ తరువాత ఆ(గి)రిపోయింది. మళ్లీ వెలిగించాలని దాసరి తపించారు. ఆరోగ్యం సహకరించలేదని వేదనపడ్డారు. ఆ దీపానికి నూనె వత్తీ అన్నీ అయిన దారి అనే అసలు

దీపం నిన్న ఆరిపోయింది. గద్యం పద్యం ద్వారా విజ్ఞానాన్ని పంచే పత్రిక అజ్ఞానం మత్తులో ఉంచే మద్యం వ్యాపారుల చేతికి మారినప్పుడే బాధ కలిగింది. వారు మంచివారే అయినా, పత్రికా రంగంలో సమస్యల తీవ్రత వల్ల, అనుభవం తగినంత లేకపోవడం వల్ల, అనుభవజ్ఞుల సహకారం అందక, ఉదయం ఆగిపోవడం తెలుగు పత్రికారంగంలో ఒక విషాదఘట్టానికి ఆరంభం. ఆవిషాదానికి కొనసాగింపు ముగింపు దాసరి నిష్క్రమణ. ఆర్థిక ఒడుదొడుకులు లేకుండి ఉంటే స్వేచ్ఛాభిప్రాయప్రకటనా సౌలభ్యం ఉదయం రూపంలో బతికి ఉండేది.

ఎద్దు ఉంది బుద్ధే లేదు

- స్టాలిన్

కరోనా వైరసుని ఎదుర్కోవడంలో అర్థమయ్యేదేంటంటే... అమెరికాకు మంచి హాస్పిటల్స్, హెల్త్ కేర్ సిస్టమ్స్ ఉన్నాయి కానీ 50% ప్రజలకు మూర్ఖత్వం ఉంది. సగం మంది ప్రజలు గవర్నమెంట్ కానీ, డాక్టర్లు గానీ చెప్పాల్సిన అవసరం లేకుండానే మాస్కులు పెట్టుకుని సామాజిక దూరం పాటించుకుంటు, అనవసరంగా ఇళ్లలోంచి బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కానీ, మిగిలిన సగం వితండవాదం చేసుకుంటూ అజాగ్రత్తగా ఉంటూ మాస్కులు పెట్టుకోకుండా సామాజిక దూరం పాటించకుండా వాళ్లకు వాళ్ళు చేటు చేసుకోవడం తోబాటు మిగిలిన వాళ్లకు కూడా చేటు చేస్తున్నారు. మాస్కులు పెట్టుకోమనడం స్వేచ్ఛను హరించడమని కొందరు, మత విశ్వాసానికి భంగం అంకె కొందరూ వాదించడం నిజమైన మూర్ఖత్వమే కాకుండా అమానుషం కూడా!



దీని పర్యవసానం గత వారంగా ప్రతిరోజూ రికార్డులు సృష్టిస్తున్నది అమెరికా – కేసుల సంఖ్యలో ట్రంప్, తన పక్కనుండే మూర్ఖ ముష్కరులు జనవరి నుండి కొంచెం జాగ్రత్తగా ఉండి మత విశ్వాసంతో కాకుండా సైన్స్ పై నమ్మకంతో నిపుణులు చెప్పేది విని, అధ్యక్ష ఎన్నికల కోసం అబద్ధాలు చెప్పకుండా దేశ ప్రజల రక్షణకు కావలసిన చర్యలను తీసుకుని ఉంటే అత్యంత ఆధిక్యతతో గెలిచి ఉండేవాళ్ళు.

ట్రంప్ తన స్వార్థంతో కూడిన మూర్ఖత్వంతో నేడు ఓటమి అంచుల్లో ఉన్నాడని సర్వేలు చెవుతున్నాయి.. ప్రపంచంలోనే అత్యధిక కేసులు, మరణాలు అమెరికాలో సంభవించి, ఐదు కోట్ల మందికి ఉద్యోగాలు పోయి దేశ ఆర్థిక వ్యవస్థ రెండొందల ఏళ్లలో ఎన్నడూ లేని సంక్షోభంలో చిక్కుకుంది. ట్రంపు లాంటి వ్యక్తి ఈ వినాశవేళ అధ్యక్షుడిగా ఉండటం అమెరికాకే కాకా యావత్ ప్రపంచానికి కరోనా ముప్పుని ఎన్నో రెట్లు పెద్దది చేసింది. సాధారణంగా ప్రపంచానికి ముప్పులు వచ్చినపుడు అమెరికా నాయకత్వం చాలా ప్రయోజానంగా ఉండేది కానీ ఇప్పుడు అమెరికాకు ఎద్దుంది కానీ బుద్ధి లేదు.

భారత దేశానికి మంచి హాస్పిటల్స్, హెల్త్ కేర్ సిస్టమ్స్ లేవు, అలాగే మంచి ప్రభుత్వ వ్యవస్థలు లేవు. మనకున్న సమాచారం ప్రకారం జనవరి రెండో వారంలో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ అఫ్ మెడికల్ సైన్సెస్ ప్రధాని మోడీ, ఇతర ప్రభుత్వ పెద్దల సమావేశంలో లాక్‌డౌన్ వెంటనే పెట్టాలని అర్థించింది. కానీ, ఇక్కడ కూడా ట్రంపే భారత దేశానికి చేటు చేశాడు. ఫిబ్రవరి 24న భారత్ వస్తున్న సందర్భంగా బీజేపీ ప్రభుత్వం లాక్‌డౌనుకు ఒప్పుకోకుండా ఆలస్యం చేసి విదేశీ ప్రయాణికుల రాకను ఆపలేదు. ఈలోపు మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే ఒక బృహత్తర కార్యక్రమాన్ని పూర్తిచేశారు. వీటిని కూడా ఎద్దు ఉంది కానీ బుద్ది లేదు కిందే జమకట్టాలి.

భారత దేశంలో నిరక్షరాస్యత, అజ్ఞానం, అమాయకత్వం పలుపాళ్ళలో ఉంది కానీ ప్రభుత్వం, వ్యవస్థలు అర్థమయ్యేటట్టు చెపితే వినేవాళ్లే అత్యధికం. మాస్కులు పెట్టుకుంటేనే కరోనా వ్యాధి రాదు అంటే మిక్కిలిగా పెట్టుకుంటారు. మా స్వతంత్రం కాకరకాయ అని వాదించేవాల్లు చాలా తక్కువ. ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నా, పూటకు గడవటం కష్టమవుతున్నా సహకరించే వాళ్ళే ఎక్కువ. ఒక 10% మాత్రం జాగ్రత్తలు తీసుకొని వారు ఉండి ఉంటారు ఈ టెన్ పర్సెంట్ సమస్య ఎప్పుడూ ఉండేదే.. కానీ ఎక్కువమంది ప్రమాదాన్ని గుర్తించి జాగ్రత్త పడ్డారు. ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా దేశ ప్రజలు త్యాగాలు చేశారు, చేస్తూనే ఉన్నారు. దీన్నే ఎద్దు లేదు కానీ బుద్ధి ఉందని అంటారు.

1996 ఆర్థిక సంస్కరణ తర్వాత భారత ప్రస్థానం

- కె.వి.రమణ, ఎం.ఎ.,బి.ఇడి

భారతదేశం తనను తాను పునర్నిర్మించుకునే దిశగా, అభివృద్ధి చెందిన దేశంగా అగ్రరాజ్యంగా ప్రపంచపటంపై రెపరెపలాడే దశగా అడుగులు వేసే ప్రయత్నాలు కొన్నేళ్ల నుండి మొదలయ్యాయి.ముప్పై ఏళ్ళ క్రితం పివి నరసింహారావు ప్రధానమంత్రిగా అధికారం చేపట్టిన నాటి నుండి ఈ చర్యలు మరింత వేగవంతమయ్యాయి. పివి తెచ్చిన ఆర్థిక సంస్కరణలు పెట్టుబడుల వరదకు గేట్లు ఎత్తాయి. లైసెన్స్ రాజ్ రద్దు చెయ్యడంతో అనేక అడ్డుగోడలు పగిలిపోయాయి. ప్రయివేట్ వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు బలంగా వేళ్ళూనుకున్నాయి. భారతదేశ టర్నోవర్ గణనీయంగా పెరిగింది.ఒకప్పుడు, ప్రభుత్వఉద్యోగం వస్తేనే, జీవితంలో స్థిరపడినట్లు భావించేవారు. ఆ భావన తాలూకా రూపు రేఖలు మారిపోయాయి. పెద్దఎత్తున విద్యా సంస్థలు వెలిశాయి.అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. గ్రామీణవాసుల్లోనూ విద్యాధికులు పెరిగారు. పట్టణీకరణ, నగరీకరణ ఊపందుకొంది. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు, ఉపాధి అనూహ్యమైన ప్రగతిని సాధించాయి. విదేశాల్లో చదువుకోవడం కూడా పెరిగింది. వివిధ రంగాల్లో కొత్త నిర్మాతలు (ఎంట్రపెన్యూర్స్) పుట్టుకొచ్చారు. హాస్పిటల్స్, హాస్పిటాలిటీ, టూరిజం, వినోదం, మీడియా మొదలైన రంగాలు ప్రగతి సాధించాయి.పివి తర్వాత దేశాన్ని పాలించిన ప్రధానులు సైతం, ఆర్థిక సంస్కరణల పునాదులపై సౌధాలు నిర్మించారు. పెట్టుబడులకు రాచబాట వేశారు. గడిచిన రెండు దశాబ్దాల్లో సాఫ్ట్ వేర్ రంగం అతిపెద్ద వ్యవస్థగా రూపాంతరం చెందింది. ఈ రంగం యువకులను విపరీతంగా ఆకర్షించింది. ఉద్యోగ అవకాశాలు వెల్లువలా వచ్చాయి. కొందరు ఔత్సాహిక పెట్టుబడిదారులు సొంత సంస్థలను ఏర్పాటుచేసుకున్నారు. జాతీయంగా, అంతర్జాతీయంగా ట్రేడ్ గణనీయంగా పెరిగింది. అనేక విదేశీ సంస్థలు భారత్‌లో వ్యాపారం చెయ్యడానికి, భాగస్వామ్యం కలుపుకోడానికి బాగా ఉత్సాహం చూపించాయి. ఇలా, గడచిన మూడు దశాబ్దాల కృషి, అవకాశాలు, అవసరాలు, సంస్కరణలు భారత్ గతిని సమూలంగా మార్చేశాయి. అభివృద్ధి చెందని దేశాల జాబితా నుండి శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అతి తక్కువ దేశాల సరసకు భారత్ చేరింది. అగ్ర రాజ్యాలైన అమెరికా, చైనాల సరసన కూర్చోడానికి సర్వ సన్నాహాలు చేసుకుంటోంది. ఏదో ఒక నాడు, ఈ మూడింటిలో రెండవ అగ్రరాజ్యంగా భారత్ అవతరిస్తుందని పరిశీలకుల బలమైన భావన. ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ కూడా అదే స్ఫూర్తితో ముందుకు వెళ్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ వ్యాపార అవకాశాలు సమృద్ధిగా ఉన్న భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలంటూ, ఇండియా గ్లోబల్ వీక్ -2020 సదస్సులో, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పిలుపు ఇచ్చారు. గూగుల్ సంస్థ సి.ఈ.ఓ సుందర్ పిచ్చయ్య- ప్రధానమంత్రి నరేంద్రమోదీ తాజాగా భేటీ అయ్యారు. రానున్న 5-7 సంవత్సరాల్లో భారత్‌లో సుమారు 75వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టనున్నట్లు గూగుల్ సంస్థ ప్రకటించింది. ఇది గొప్ప పరిణామంగా భావించాలి.ఈ దిశగా సుందర్ పిచ్చయ్య ప్రకటన కూడా చేశారు. గూగుల్ ఫర్ ఇండియాలో భాగంగా, డిజిటైజేషన్ ఫండ్ రూపంలో ఈ పెట్టుబడులు ఉంటాయి. ఈక్విటీ వాటాలు, సంస్థల్లో భాగస్వామ్యం, పర్యావరణహిత మౌలిక సదుపాయాల కల్పన మొదలైన చోట్ల ఈ పెట్టుబడులు ఉంటాయి.వైద్యం, విద్య, వ్యవసాయ రంగం, కొత్త వస్తువుల ఉత్పత్తి, భారతీయ భాషలు మొదలైనవాటిపై గూగుల్ సంస్థలు దృష్టి సారించనున్నట్లు సమాచారం. రైతులు,యువకులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసం అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించే దిశగా గూగుల్ సహాయం తీసుకోవడం సాంకేతికంగా కీలకమైన మలుపు.భవిష్య సాంకేతిక రంగాన్ని భారత్ ముందుండి నడపాలని సుందర్ పిచ్చాయ్ చేసిన వ్యాఖ్య ఎంతో అభినందనీయం. ఒక భారతీయుడిగా దేశభక్తిని చాటుకున్నాడు.భారతదేశం ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్. స్వయంసమృద్ధి సాధించాలనే లక్ష్యంతో మన ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన సంకల్పం వజ్రసంకల్పమవ్వాలి. ఇప్పటికే స్పేస్, రక్షణ తదితర రంగాల్లో కొన్ని సంస్కరణలు చేపట్టారు. కొన్ని ప్రైవేట్ సంస్థలకు కూడా అనుమతులు ఇచ్చారు.భారత్‌లో కొన్ని రంగాలు ఇప్పుడిప్పుడే ఎదుగుతున్నాయి. లాజిస్టిక్స్, స్టోరేజ్, వ్యవసాయం, స్పేస్, రక్షణ, ఫార్మా మొదలైన రంగాల్లోకి విదేశీ పెట్టుబడులను ప్రధాని ఆకర్షిస్తున్నారు. ఇవి సత్ఫలితాలు ఇస్తే మంచిదే. ఇప్పటికే చాలా రంగాల్లో చైనా మీద ఆధారపడి చేదు అనుభవాలు తెచ్చుకున్నాం. చైనాతో వాణిజ్య, వ్యాపార బంధాలు తెంచుకొనే ప్రయత్నంలో ఉన్నాం. ఇరు దేశాల మధ్య సమగ్ర చర్చలు సంపూర్ణమైన తర్వాత మాత్రమే, ఈ విషయంలో మనకు సంపూర్ణమైన అవగాహన వస్తుంది. అమెరికాను కూడా తక్కువగా అంచనా వెయ్యకూడదు. విదేశీ పెట్టుబడులను స్వాగతించే క్రమంలో, భవిష్య ప్రయాణంలో వచ్చే ఇబ్బందులు, అవరోధాలు, షరతులు, లాభ నష్టాలు మొదలైనవాటన్నింటినీ సమగ్రంగా బేరీజు వేసుకొని ముందుకు వెళ్ళాలి. లేకపోతే, మొదటికే మోసం వస్తుంది. బలమైన రాజ్యాలతో వ్యాపారాలు చేసుకునేటప్పుడు, బంధాలు పెంచుకొనే సమయాలలోనూ చాలా చాలా జాగ్రత్తగా ఉండాలి. భారత్ సాధించాల్సిన అభివృద్ధి ఇంకా చాలా ఉంది. మేక్ ఇన్ ఇండియాను ముందుగా అభివృద్ధి పథంలో నడిపించాలి. సమాంతరంగా, విదేశీ వ్యవస్థలపై దృష్టి పెట్టాలి.స్పేస్, రక్షణ మొదలైన దేశ భద్రతకు సంబంధించిన రంగాల్లో విదేశీయుల హస్తం ఉండడం ఎంతవరకు శ్రేయస్కరం, ఏ స్థాయి వరకూ అనుమతించాలి మొదలైన విషయాల్లో పాలకులు ఎంతో అప్రమత్తంగా ఉండాలి.సున్నితమైన రంగాల విషయంలో ఆచితూచి అడుగులు వెయ్యాలి. స్వదేశీబలాన్ని బాగా పెంచుకుంటూ, భారతదేశాన్ని అగ్రస్థానంలో కూర్చోపెట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి అభినందనలు తెలుపుదాం.జయహో భారత్.


ఓలీ..నేపాలీ

– సిహెచ్. వెంకటేష్,
ఎం.ఎ.,ఎం.ఫిల్, బెంగుళూర్

భారతదేశ భూభాగంలో ఉన్న ప్రాంతాలను తన మ్యాప్‌లో పెట్టుకొని సంబరపడిపోతున్న నేపాల్ ప్రధాని ఓలి శర్మ ఇప్పుడు మరో కొత్త వివాదానికి తెరలేపారు. అసలైన అయోధ్య మాదే, శ్రీరాముడు మావాడే అంటూ అత్యంత వివాదాస్పదమైన వ్యాఖ్యలు చేశారు. ఇది ఓలి శర్మ వ్యాఖ్యలకు పరాకాష్ఠ. ఇవన్నీ చూస్తుంటే, ముందు ముందు ఇటువంటి వ్యాఖ్యలు ఏమేమి వినాల్సి వస్తుందో, అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. శ్రీరాముడి జన్మస్థలం దక్షిణ నేపాల్‌లోని థోడీలో ఉందని చెబుతున్నారు. నేపాల్‌లోని బీర్‌గంజ్‌కు పశ్చిమ ప్రాంతంలోని థోడీ శ్రీరాముడి జన్మస్థలమని ఆయన వాదన. సీతాదేవి నేపాల్‌కు చెందిన మహారాణిగా భావిస్తున్నారు. ఇటీవల, భారత్‌కు చెందిన లిపులేఖ్, కాలాపానీ, లింపియాధురా ప్రాంతాలను తమ భూభాగాలుగా పేర్కొంటూ కొత్త మ్యాప్ సృష్టించి, పార్లమెంట్‌లో ఆమోదం కూడా పొందారు. ఈ నేపథ్యంలో, ప్రతిపక్షంతో పాటు స్వపక్షంలోనూ ఓలి శర్మపై వ్యతిరేకత వచ్చింది. జాతీయభావనను దృష్టిలో పెట్టుకొని, ప్రజల్లో తమపై వ్యతిరేకత రాకూడదనే ఉద్దేశ్యంతో, ఓలి శర్మను వ్యతిరేకించిన వర్గం కూడా కొత్త మ్యాప్‌కు ఆమోదం తెలిపింది. భారతదేశానికి వ్యతిరేకంగా మారడం, భారత్ తో వివాదాలు తెచ్చుకోవడం, బంధాలు పాడుచేసుకోవడం నేపాల్‌లోని రాజకీయ నేతలతో పాటు ఎక్కువమంది ప్రజలకు కూడా ఏమాత్రం ఇష్టం లేదు. ఓలి శర్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండీ చైనాతో నేపాల్‌కు బంధాలు పెరిగాయి. అదే సమయంలో, భారత్‌కు మెల్లగా దూరం అవుతున్నారు. కొన్ని నెలల నుండీ భారత్‌పై వ్యతిరేక స్వరం పెరుగుతోంది. అందులో భాగమే, తాజాగా అయోధ్య శ్రీరాముడు అంశం కూడా, అని భావించాలి. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణానికి సుప్రీం కోర్టు నుండి అనుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో, రామమందిర నిర్మాణానికి శ్రీకారం కూడా చుట్టారు. పూజలు, సంప్రోక్షణలు కూడా చేశారు. కరోనా ఇబ్బందులు లేకపోతే, ఈపాటికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ భూమిపూజ కూడా చేసి ఉండేవారు. ఏది ఏమైనా, మోదీ ప్రస్తుత పాలనా సమయంలోనే రామమందిర నిర్మాణం సంపూర్ణం అయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పుడు, నేపాలీ ప్రధాని అయోధ్యపై కొత్త చరిత్ర చెబుతున్నారు. కె.పి శర్మ ఓలిగా చెప్పుకునే ఈయన పూర్తి పేరు ఖడ్గప్రసాద శర్మ ఓలి. గతంలో, 2015 అక్టోబర్ నుండి 2016 ఆగస్టు వరకూ మొట్టమొదటగా ప్రత్యక్ష ఎన్నికల విధానంలో నేపాల్‌లో ప్రధానమంత్రి పదవి చేపట్టిన మొట్టమొదటి రాజకీయ నాయకుడు. మళ్ళీ, 2018 మే నుండి ప్రధానమంత్రిగా కొనసాగుతున్నారు. ఇన్నేళ్ల నుండి రాజకీయాల్లో ఉండి, ఇన్నేళ్ల పాటు దేశ ప్రధానమంత్రిగా ఉన్న ఈయనకు ఇప్పటిదాకా శ్రీరాముడు, సీతాదేవి, అయోధ్య గుర్తుకు రాలేదా. ఇప్పుడు ఆఘమేఘాల మీద రామాయణం, ఆ పాత్రలు గుర్తుకు రావడం ఆశ్చర్యమే కాదు, పలు అనుమానాలకూ దారితీస్తోంది. ప్రస్తుతం, తమ సొంత పార్టీలోనే ఆయనపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అసలు ప్రధానమంత్రి పదవి ఎంతకాలం ఉంటుందో చెప్పలేని పరిస్థితుల్లో ఓలి శర్మ ఉన్నారు. ఇంకొక పక్క, కరోనా ప్రభావంతో సర్వ వ్యవస్థలు కుదేలై పోయాయి. ఇటు పార్టీలోనూ – అటు ప్రజల్లోనూ తన ఉనికి ప్రశ్నగా మారిన సంక్షోభంలో అయన ఉన్నారు. అసలే పేద దేశం. చాలాకాలంపాటు రాజరికపు పాలనలో సాగిన రాజ్యం. వీటన్నింటినీ పక్కతోవ పట్టించి, కొత్త జాతీయభావాన్ని ప్రజల్లో నింపి, తద్వారా తనని తాను రక్షించుకోడానికి ఓలి శర్మ సరికొత్త వ్యూహాలు అల్లుతున్నారు. అందులో భాగమే, భారత్ పై ఈ చారిత్రక, సాంస్కృతిక రూపమైన దాడి. వీటన్నింటికి తోడు, అసలు సూత్రధారి చైనా. పాత్రధారి మాత్రమే కేపీ శర్మ ఓలి. చైనా సామ్రాజ్యకాంక్షతో రగిలిపోతోంది. ప్రపంచంలోని బలహీనమైన దేశాలకు రకరకాల రూపాల్లో ఎరవేసి, తన వైపు తిప్పుకుంటోంది. సరిహద్దు దేశాలను కబళించాలన్నది తన యుద్ధంలో ఒక వ్యూహం. చాలా దేశాలు అవసరాల రీత్యా లొంగుతున్నా, భారతదేశం లొంగడం లేదు. ఎలాగైనా భారత్‌ను లొంగ తీసుకోవాలనే ప్రయత్నాలు తీవ్రంగా చేస్తోంది. అవసరమైతే ప్రత్యక్ష యుద్ధానికి కూడా సిద్ధమవుతోంది. భారత్ కూడా చైనాకు దీటుగా సమాధానం చెబుతోంది. భారత్‌ను తన హస్తాల్లో పెట్టుకొని, అమెరికాను అణచి వేసి, అగ్రరాజ్యంగా సుస్థిర స్థానం ఆక్రమించాలని విఫల ప్రయత్నాలు చేస్తోంది. ఈ యుద్ధంలో భాగంగానే పాకిస్తాన్, నేపాల్ దేశాలను చైనా బాగా ప్రోత్సహిస్తోంది. భారతదేశానికి పక్కలో బల్లేలలా తయారుచేసింది. ఆర్థికంగా, అన్నిరకాలుగా ఆకర్షిస్తూ ఈ రెండు దేశాలను తన జేబులో పెట్టుకుంది. భారత్ పై అనేక మార్గాల్లో దాడులకు ఉరికొల్పుతోంది. పైకి శాంతి చర్చలు చేస్తూ, రహస్యంగా భారత్ చుట్టూ అగ్గి రగులుస్తోంది. తాజాగా ఇరాన్‌ను కూడా తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. చాబర్ రైల్వే ప్రాజెక్టు నుండి భారత్‌ను తప్పించే విధంగా, ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి, ఆర్థిక ఒప్పందం కుదుర్చుకుంది. ఇలా, భారత్‌ను బలహీన పరచాలని చైనా చేస్తున్న దురాగతాల్లో భాగమే తాజాగా నేపాల్ ప్రధాని ఓలి శర్మ చేసిన వ్యాఖ్యలు. నేపాల్ ప్రధానంగా హిందూదేశం. భారతదేశంతో సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ఎన్నో ఏళ్ళ బంధాలు ఉన్నాయి. చాలా ఏళ్ళు మైత్రీ బంధమే కొనసాగింది. నేపాల్‌లో పరిశ్రమలు స్థాపించినవారు, వ్యాపారాలు చేస్తున్నవారు ఎక్కువమంది భారతీయులే. ఈ రెండు దేశాల మధ్య విడదీయలేని బంధాలు ఉన్నాయి. రాజకీయాలకోసం, తాత్కాలిక ప్రయోజనాల కోసం చైనా బుట్టలో పడితే, నేపాల్ భవిష్యత్తులో భారీమూల్యం చెల్లించక తప్పదు. భారత్‌తో తలపడేంత శక్తి నేపాల్‌కు లేదు. ప్రపంచ దేశాల దృష్టిలో చైనా ఇప్పటికే చెడ్డపేరు మూటగట్టుకుంది. అదే సమయంలో, భారతదేశ గౌరవం, విశ్వాసం, ప్రతిష్ఠ బాగా పెరుగుతున్నాయి. అయోధ్య భారతదేశంలోని భూభాగమని కొన్ని వేల సంవత్సరాల చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా అయోధ్య నాది, రాముడు మావాడు, సీతమ్మ మా రాణి అని, వితండ వాదాలతో కూడిన కొత్త చరిత్ర లిఖించడానికి పూనుకోవడం ఔచిత్యం కాదు. ఈ కట్టుకథలకు స్వస్తి చెప్పి, చైనా కబంధ హస్తాల నుండి బయటకు వచ్చి, భారతదేశానికి స్నేహహస్తం అందిస్తేనే నేపాల్ కు అన్ని విధాలా శ్రేయస్కరం.

ఒక్క క్షణం

– శ్రీనివాస్



ఒక ఊర్లో మంచి పేరు ప్రతిష్టలు కలిగిన పండితుడు ఒకాయన ఉండేవాడు.

చాలా చక్కని వాక్పటిమ గలవాడు.

ఆయన ఆలయం ఆవరణలో కూర్చొని ప్రవచనం చెబుతూ వుంటే

వేలమంది జనం అలా కదలకుండా బొమ్మల్లా వింటూ ఉండిపోయేవాళ్ళు.

ఆయన ఖ్యాతి చుట్టుపక్కల చాలా గ్రామాల్లో వ్యాపించింది. ఒకసారి ఆయన ప్రవచనం నిమిత్తం పొరుగూరు వెళ్ళవలసి వచ్చింది.

ఆ ఊరు వెళ్ళే బస్సు ఎక్కి టికెట్ తీసుకున్నాడు.

అయితే పొరపాటున బస్సు కండక్టర్ 10 రూపాయలు ఎక్కువ ఇచ్చాడు.

పండితుడు అది గమనించి తిరిగి ఇవ్వాలని యోచించాడు.

కానీ బస్సునిండా జనం కిక్కిరిసి ఉండటంతో,

దిగేటప్పుడు ఇద్దాంలే అనుకుని కూర్చున్నాడు. కొద్ది సేపు తరువాత అతని మనసులో ఆలోచనలు మారాయి.

'ఆ కండక్టరు కూడా ఎంతమంది దగ్గర చిల్లర కొట్టేయడం లేదు.

ఈ బస్సు కూడా ఒక సంస్థదే కదా! ఎంత మంది తినటంలేదు?

నా పది రూపాయలకే నష్టపోతుందా ఏమిటి?

ఈ పది రూపాయలు ఏదైనా దైవ కార్యానికి ఉపయోగిస్తా......'

అని అనుకుని మౌనంగా కూర్చున్నాడు. అంతలో వూరు వచ్చింది.... బస్సు ఆగింది.

కానీ ఆయన దిగేటప్పుడు బస్సు కండక్టర్ దగ్గరికి రాగానే

తన ప్రమేయం ఏమాత్రం లేకుండా అసంకల్పితంగా

కండక్టరుకు ఇవ్వవలిసిన పది రూపాయలు ఇచ్చి

"మీరు నాకు టికెట్ ఇచ్చేటప్పుడు ఇవి ఎక్కువగా ఇచ్చారు" అన్నాడు. దానికి ఆ కండక్టర్ "అయ్యా! నేను మీ ప్రవచనాలు ఎంతో శ్రద్ధగా వింటాను.

మీరు చెప్పడంతోటే సరిపెట్టుకుంటారా లేక పాటిస్తారా

అని చిన్న పరీక్ష చేశాను" అని అన్నాడు. పండితుడు చల్లటి చిరు చెమటలతో బస్సు దిగి

'పది రూపాయల కోసం తుచ్ఛమైన ఆశతో

నా విలువలకే తిలోదకాలు ఇవ్వబోయాను...

నా అదృష్టం బాగుంది.

నా మనస్సాక్షి సరైన సమయంలో సరియైన నిర్ణయం తీసుకొని

నా విలువలను కాపాడింది' అనుకున్నాడు జీవిత కాలం పాటు సంపాదించుకున్న మంచితనం కూడా

సర్వనాశనం కావడానికి

క్షణం చాలు.... ఒకానొక సందర్భంలో మీ శత్రువులు కూడా మీ మీద ప్రయోగం చేస్తారు... మీ మంచితనాన్ని నాశనం చేయడానికి.... మీకు సంబంధం లేకుండానే మీ గురించి ప్రచారం చేస్తుంటారు... ఆ ప్రచారం అవునా కదా అని తెలుసుకోకుండా వాళ్ళు కళ్ళు ఉండి కూడా గుడ్డిగా నమ్ముతారు... అది వాళ్ళ కర్మ... కానీ మీరు మాత్రం జాగ్రత్త... గడియారంలో సెకండ్ ముళ్ళు ఎలా తిరుగుతుందో అలానే మీ జీవితంలో ప్రతి సెకండ్‌ని గమనిస్తూ ముందుకు సాగండి.... మంచితనానికి ఎప్పుడు చావు లేదు.... మంచితనానికి ఇప్పుడు గుర్తింపు రాకపోవచ్చు. కానీ ఏదో ఒక సందర్భంలో ఆ మంచితనాన్ని అందరు గుర్తిస్తారు... మీరు బ్రతికి ఉన్నంత కాలము మంచి చేయాలి, మంచి పేరుతో జీవించాలి... మరణించాకా కూడా ఆ మంచి పేరు నిలిచిపోయేలా జీవించండి..



జిక్కి

వర్థంతి

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్

పరిచయం : జిక్కి అని ముద్దుగా పిలుచుకునే పి.జి.కృష్ణవేణి (1935 - 2004) తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, సింహళ మరియు హిందీ భాషలలో సినిమా గాయకురాలు.

వ్యక్తి గత వివరాలు:

పేరు : జిక్కి - పి.జి. కృష్ణవేణి.

జన్మించిన ఊరు : చంద్రగిరి - చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ .

జననం : నవంబరు 3, 1935

మరణము : 16 - ఆగస్టు -2004, బ్రెస్ట్ కాన్సర్‌కి ఆపరేసన్ అయిన 3సం. తరువాత అదే కాన్సర్ కిడ్నీస్‌కి సోకడం వలన చనిపోయారు.

భర్త : ఎ.యం.రాజా - గాయకుడు (ప్రేమ వివాహము - 1958లో) 1989లో రోడ్ ప్రమాదంలో చనిపోయారు.

చదువు : బి.ఎ.పచయ్యప్ప కాలేజీ, మద్రాసు

వృత్తి: నేపధ్య గాయని

పిల్లలు : 4 కూతుర్లు, 2 కొడుకులు .

క్రియాశీల కాలం : (1935 - 2004)

జవళి గీతాల జిక్కి

జిక్కి అని ముద్దుగా పిలుచుకునే పి.జి.కృష్ణవేణి (1935 - 2004) తెలుగు, తమిళ, కన్నడ, మళయాళ, సింహళ మరియు హిందీ భాషలలో ప్రసిద్ధ సినీ గాయకురాలు. మూడు దశాబ్దాల పాటు పదివేలకు పైగా పాటలు పాడారు. చిత్తూరు జిల్లాలోని చంద్రగిరిలో జన్మించిన జిక్కి సంగీత శిక్షణ లేక పోయినా వినికిడి జ్ఞానంతో పాడటం నేర్చుకుంది.

జిక్కి తండ్రి మద్రాసులో స్టూడియోలో చిన్నాచితక పనులు చేస్తుంటే ఆమె ఎప్పుడైనా వెళ్లినప్పుడు అదంతా తిరిగేది. అలా తిరుగుతున్నప్పుడు చూసిన ప్రముఖ దర్శకులు గూడవల్లి రామబ్రహ్మం, పంతులమ్మ (1943) సినిమాలో చిన్నవేషంతో పాటు పాట పాడే అవకాశం కల్పించారు. జిక్కి అప్పట్లో ప్రముఖగాయకుడైన ఏ.ఎమ్.రాజాను ప్రేమవివాహం చేసుకుంది. వీరికి ఆరుగురు సంతానం. అరవయ్యేళ్లు దాటాక కూడా ఆమె ఆదిత్య 369 సినిమాలో జాణవులే... అనే పాట పాడి తన గొంతులో ఇంకా వాడి తగ్గలేదని నిరూపించారు.

హాయి హాయిగా ఆమనిలా: పిల్లపాలు గజపతి కృష్ణవేణి అంటే ఎవరో చెప్పలేరు కానీ జిక్కి అనగానే ఆమె ప్రముఖ గాయని అని ఎవరైనా గుర్తుపడతారు. కమ్మని కంఠంతో మధురమైన పాటలతో దక్షిణాది సినీ ప్రేక్షకులను మైమరపించారామె. ఒకే స్వరంలో అటు మధురానుభూతిని, ఇటు కవ్వింపునీ పలికించ గల గాయని జిక్కి. ఆమె పాట వింటే పులకించని మది పులకిస్తుంది, ఆమని హాయిగా సాగుతుంది. ఎన్ని సార్లు విన్నా ఆమె గాత్రంపై మోజు తీరలేదు అనిపిస్తుంది. 'హాయి హాయిగా ఆమని'లా సాగే జాణ పదాల స్వరం - 'పులకించని మదిని సైతం పులకింపచేసే భా'స్వరం' జిక్కి సొంతం. ఆమె గుర్తుకు రాగానే శృంగార, జానపద బాణీలు మదిలో మెదులుతాయి. "రాజశేఖరా నీపై మోజు తీరలేదురా" లాంటి విరహగీతాలే కాదు, పోలీస్ వెంకటస్వామిని మరవలేని మనసూ, బంగారిమా మని పిలిచే పిలుపూ ఆమె పాటలో మిళితమైంది.

బాలనటిగా ఎంట్రీ: ఆమె సినీరంగానికి పరిచయమైంది గాయనిగా

కాదు, 'పంతులమ్మ' చిత్రంలో బాలనటిగా పరిచయ మయ్యారు. అదే సినిమాలో పాట కూడా పాడారు. ఇంకా త్యాగయ్య, మంగళసూత్రం, గొల్లభామ చిత్రాల్లో నటించారు. తర్వాత 'జ్ఞానసుందరి' అనే తమిళ సినిమాతో పూర్తి గాయనిగా మారారు. ఈ చిత్రంలో జిక్కి పాడిన పాట బాగా ప్రేక్షకాదరణ పొందింది. దాంతో అప్పటి సినీ సంగీత దర్శకులందరి దృష్టి జిక్కిమీదనే. 1950 దశకంలో దక్షిణ సినీ పరిశ్రమలో గాయనిగా జిక్కికి తిరుగులేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, సింహళ, హిందీ... ఇలా ఏ భాషలోనైనా ఆమె గాత్రమే వినిపించేది. మొత్తం పది వేలకు పైగా పాటలు పాడారు. సహ గాయకుడు ఎ.ఎం. రాజాతో కలిసి హిందీ చిత్రంలో పాడారు. హిందీ భాషలో పాడిన తొలి తెలుగు గాయకులు వీరిద్దరే. ఎన్నో హిట్ పాటలు పాడిన వీరిద్దరూ తర్వాత వివాహం చేసుకున్నారు.

ఏరువాకా సాగాలో రన్నో చిన్నన్న:

ఎవరికి పాడుతున్నాం అనేది దృష్టిలో పెట్టుకుని పాడటం ముఖ్యమని భావంచేవారు జిక్కి. అలా పాడిన పాటే 'రోజులు మారాయి' చిత్రంలో 'ఏరువాక సాగారో రన్నో చిన్నన్న" పాట. ఈ పాట ఆమెకే కాదు, ఆ సినిమకూ మంచి పేరు తెచ్చింది. తెలుగు సినిమాల్లో జానపద గీతాల రచనకు పెట్టింది పేరు కొసరాజు, మాస్టర్ వేణు సంగీత సారథ్యంలో వచ్చిన ఈ పాట ఇప్పటికీ తెలుగు సినీ ప్రేక్షకుల మదిలో తాజాగానే ఉంది.

ఘంటసాల, జిక్కి ఆలపించిన "హాయి హాయిగా ఆమని సాగే" ఆల్‌టైమ్ హిట్ పాట. వినటానికి ఎంతో శ్రావ్యంగా, సులువుగా సాగిపోతున్నట్లు అనిపించే పాట. ఇదే పాటను హిందీలో పాడిన మొహమ్మద్ రఫీ, లతా మంగేష్కర్లు 'ఘంటసాల, జిక్కిలా ఈ పాటకు న్యాయం చేయలేం' అన్నారంటేనే తెలుస్తుంది ఈ పాటలోని స్వరాలు పాడటం ఎంత కష్టమో.

'అనార్కలి' చిత్రంలో అందరూ ఇష్టపడే "జీవితమే సఫలము రాగసుధా భరితము, ప్రేమకథా మధురము" పాటలో జిక్కి తీయని గాత్రాన్ని మర్చిపోలేం. హిందీ అనార్కలీలో 'ఏ జిందకీ ఉసీకీ హై' పాటకి అనుసరణే తెలుగులో పెట్టారు సంగీత దర్శకులు ఆదినారాయణరావు. ఇందులో ఎక్కువ జనాదరణ పొందిన మరో పాట "రాజశేఖరా నీపై మోజు తీరలేదురా". ఈ పాటలో ఈ చిత్ర దర్శకుడు, నృత్య దర్శకుడు అయిన వేదాంతం రాఘవయ్య అక్బర్ ఆస్థాన గాయకుడిగా కనిపిస్తారు.

"పులకించని మది పులకించు" (పెళ్ళి కానుక), "చాంగురే బంగారు రాజా" (శ్రీకృష్ణపాండవీయం), "చెట్టులెక్కగలవా.. ఓ నరహరి పుట్టలెక్కగలవా..." (చెంచులక్ష్మి), "చిగురాకులలో చిలకమ్మా", "రావోయి మా ఇంటికి" (దొంగరాముడు), "ఎక్కడమ్మా చంద్రుడు" (అర్ధాంగి), "ఓహో బస్తీ దొరసాని" (అభిమానం), "బతుకు నీ కోసమే" (ఇంటిగుట్టు), "చల్లని వెన్నెల సోనలు" (వెలుగునీడలు), "రాధ రావే రాణీ రావే" (శాంతినివాసం), "ఓ దేవదా... చదువూ ఇదేనా" (దేవదాసు), "వగలోరు వగలు తళుకు బెళుకు వగలు" (పాతాళభైరవి), 'కొమ్ములు తిరిగిన మగవారూ కొంగు తగిలితే పోలేరు", "జాణవులే వర వీణవులే" (ఆదిత్య 369), "నిన్నే పెళ్ళాడేస్తా నంటూ" (నిన్నే పెళ్ళాడతా), "అలనాటి రామ చంద్రుడు అన్నింటా సాటి" (మురారి) లాంటి ఎన్నో మరపురాని, మర్చిపోలేని పాటలు ఆమె సొంతం.

తెలుగు ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈమె విరహ గీతాలతో పాటు ఉల్లాసకరమైన పాటలు, ప్రేమగీతాలు ఎన్నో పాడారు. కొన్ని కారణాల వల్ల సినిమాల్లో పాడటం మానేసినా, కచేరీలు చేశారు. భర్త ఎ.ఎం.రాజా రైలు యాక్సిడెంట్లో చనిపోయిన తర్వాత తన ఇద్దరు కొడుకులతో కలిసి సంగీత బృందాన్ని ప్రారంభించి, విదేశాల్లో అనేక సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె ఎప్పుడూ డబ్బు ముఖ్యమనుకోలేదు. దానికి ఉదాహరణ ఓ తమిళ సినిమాలో మొత్తం పాటలు పాడే అవకాశం వచ్చినప్పుడు, నిర్మాత ఎక్కువ మొత్తంలో డబ్బు ఇచ్చినా తనంతటతానే ఆ డబ్బులు తగ్గించుకు న్నారు.

చాలా కాలం తర్వాత ఆమె 'ఆదిత్య – 369, సీతారామయ్యగారి మనవరాలు, నిన్నే పెళ్ళాడుతా, చివరిగా 'మురారి' చిత్రంలో పాడారు. పాటకే తన జీవితం అంకితం చేసుకున్న జిక్కి బ్రెస్ట్ క్యాన్సర్తో 2004 ఆగస్టు 16న చనిపోయారు. ఆమె శ్వాస ఆగిపోయినా మన గుండెల్లో జిక్కి గొంతు ప్రతిధ్వనిస్తూనే ఉంది.

ప్రాచుర్యం పొందిన గీతాలు :

వద్దురా కన్నయ్యా! ఈ పొద్దు ఇల్లు వదలి పోవద్దురా అయ్యా

జీవితమే సఫలము... ప్రేమకథా మధురము

'ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా'

'పందిట్లో పెళ్లవుతున్నాదీ,'

పులకించని మది పులకించు లాంటి పాటలు

చిత్ర సమాహారం

నిన్నే పెళ్ళాడుతా (1996), ఆదిత్య 369 (1991), సీతారామయ్యగారి మనవరాలు (1991), వట్టత్తుక్కుళ్ చతురమ్ (1978), సంపూర్ణ రామాయణం (1971), శ్రీమంతుడు (1971), తిరుపతమ్మ కథ (1963), లవకుశ (1963), భీష్మ (1962), గులేబకావళి కథ (1962), సిరి సంపదలు (1962), సీతారామ కళ్యాణం (1961), బాటసారి (1961), శభాష్ రాజా (1961), పెళ్ళి కానుక (1960), సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి (1960), శాంతినివాసం (1960), శ్రీ వెంకటేశ్వర మహాత్మ్యం (1960), కృష్ణలీల (1959), రాజమకుటం (1959), చెంచులక్ష్మి (1958), మాంగల్యబలం (1958), సువర్ణ సుందరి (1957), భలేబావ (1957), మాయాబజార్ (1957), పాండురంగ మహత్యం (1957), సారంగధర (1957), తోడికోడళ్ళు (1957), చిరంజీవులు (1956), భలేరాముడు (1956), జయం మనదే (1956), కనకధార (1956), పెంకి పెళ్ళాం (1956), దొంగ రాముడు (1955), రోజులు మారాయి (1955), అనార్కలి (1955), అర్ధాంగి (1955), రేచుక్క (1954), తోడుదొంగలు (1954), ఆహ్ (1953), బ్రతుకు తెరువు (1953), దేవదాసు (1953), పర్దేశీ (1953), ప్రతిజ్ఞ (1953), ధర్మదేవత (1952), పల్లెటూరు (1952), పాతాళ భైరవి (1951), నవ్వితే నవరత్నాలు (1951), పల్లెటూరి పిల్ల (1950), షావుకారు (1950), సంసారం (1950), మనదేశం (1949), పంతులమ్మ (1943)

హాయ్.. హాయ్.. నాయక

– శ్రీనివాస్ శర్మ, సీనియర్ జర్నలిస్ట్



ఎన్టీఆర్ నటనను బేరీజు వేసే వయస్సు లేదు.. కానీ మాయాబజార్ సినిమాలోని వివాహభోజనంబు పాట దాని పిక్చరైజేషన్ నన్ను విపరీతంగా ఆకట్టుకుంది. రమణారెడ్డి గారు మంత్రదండంతో.. మంత్రాలు చదువుతూనే అండాలు అండాలు చిత్రాన్నాం.. పులిహోర.. గుండిగలు గుండిగలు పాయసాలు పరమాన్నాలు, లడ్డూలు, జిలేబీలు, బొబ్బట్లు.. అత్తరాసలు (అరిసెలు) కజ్జికాయలు గారెలు.. బూరెలు అబ్బో అబ్బబ్బో ఎన్నెన్ని వంటలు... వాటి సువాసనలతో మనలో ఆకలి వేసెలా... నోట్లో నీళ్లు ఊరేలా.. అలా అన్ని చక చకా వచ్చి నేరుగా వరుసలో ప్రత్యక్షము అవుతాయి.

ఆ సమయంలోనే ఎస్.వి.రంగారావు గారు... ఘటోత్కచుడిలా వంటశాలలోకి ఎంట్రీ ఇవ్వడం... ఆయనకు నోరూరడం... పీఠపై బాసింపట్టు వేసుకొని కూర్చొని తన శరీరాన్ని పెంచేసుకుంటుంటే అబ్బో అదో థ్రిల్ దాన్ని అనుభవించాల్సిందే ఆయన ముందుకు వండిన పాకము అంతా మిలటరీలో సైనికుల కవాతు అంత డిసిప్లేన్‌లో ఒకదాని తర్వాత ఒకటి వచ్చి నిలుచుంటే...వారెవ్వా.. లడ్లన్నీ.. ఒకదాని తర్వాత ఇంకోటి వరుసగా అలా నోట్లోకి వెళ్లుతుంటే మన కను గుడ్లు కూడా సంభ్రమాశ్చర్యంలో కోడిగుడ్ల సైజ్ ఐపోతాయేమో చిత్రాన్నాలు

పులిహోర, పాయసాలు, గారెలు, బూరెలు బొప్పట్లు... అంతా తన బొజ్జలోకి వెళ్లి పోతాయి అండాలు.. పళ్లాలు గుండిగలు మాత్రమే మిగిలిపోతాయి చివర్లో... అడుగు బొడుగు

కూడా ఉంటే చేత్తో తీసుకొని తిని అవికూడా చాలలేదన్నట్లు ఆ పాత్రను అసహనంతో విసిరి కొట్టడం.. నీళ్లు త్రాగాలని చెంబు తీసుకుంటే ఆయన పెరిగిన శరీరానికి అది అనక గిరాటేసి..బిందెను అవలీలగా ఎత్తుకొని త్రాగడం... త్రాగినానంతరం

విసిరేసి.. మీసాలు సవరించుకుంటూ త్రేన్పడం. వ్రాసి ప్రేక్షకులను..వ్రాయక నిర్మాతలను ఏడిపిస్తాడు అని ఆత్రేయగారికి పేరు. ఎస్.వీ రంగారావు గారిని కూడా ఇండస్ట్రీలో యాక్టింగ్ చేసి ప్రేక్షకులను... నిర్మాతలను, తోటి నటులను విసిగిస్తాడని టాక్ ఉండేది. బాబు నీ చిట్టి చేతులతో నాకు ముద్దలు తినిపిస్తావు... నేను నీకు నీ ముఖం పై మట్టిని పోస్తున్నానురా... అంటూ ఏడిచే దృశ్యము ఇట్టే మనసును కరిగించేస్తూంటే బ్యాక్‌గ్రౌండ్‌లో బాబూ వినరా... అన్నాదమ్ములా కథ ఒకటి అనే విషాద పాట వస్తూ వుంటుంది.ఎంత విషాధమైన ఘటన.. ఆ సీన్‌లో ఆయన నటన ప్రేక్షకుల గుండెను పిండేసి కంటతడి పెట్టేస్తుంది. తోటి నటులు.. దర్శక నిర్మాతలకు అంతవరకు షూటింగ్‌కు రాకుండా ఏడిపించి... విసిగించిన వ్యక్తి... షూటింగ్‌కు వచ్చాక ఆయన నటనతో కూడా ఏడిపించేవాడు.

అంతటి ఆయన నటనా కౌశలాన్ని మెచ్చుకోకుండా ఎవ్వరూ

ఉండలేరు.

తండ్రిగా...తాతగా..పెదనాన్నగా

ఉన్నత నటనను అందించి...జీవితాల్లో కూడా అలాంటి తండ్రి..తాత.. లు కావాలనే కోరుకుంటుంది మనసు. **అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం.. ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే నాటకం..వింత నాటకం..** అవును కదా జీవిత సారాన్ని అంతా కాచి వడబోశారా అన్నంత గాఢతతో కూడిన తాత్వికతను రంగరించిన ఈ సాహిత్యానికి రంగారావు గారి నటన అనితర సాధ్యము.తొడికోడళ్లు సినిమాలో మతిమరుపు

ఉన్న ప్లీడరు పాత్రలో..ఎంత సహజంగా జీవించారు. గుండమ్మ కథలో గారెలు తినాలన్న భర్త కోరిక తీర్చడానికి డబ్బుకోసం యజమాని దగ్గరికి వచ్చి డబ్బులు అడిగితే... **పనోళ్ళకు కూడా గారెలు కావాలా..తింటారా? అని యజమాని అంటే అభిమానవంతురాలైనవ్యక్తి పాత్రలో జమున ఉక్రోషంతో** ఏం పనివారు మనుషులు కాదా...?వారు గారెలు తినకూడదా అని అంటుంటే గుంభనంగా నవ్వుకుంటూ ఆయన ఏమమ్మాయి పెరట్లో గిన్నెలు ఉన్నాయి శుభ్రం చేసి ఆ తర్వాత గారెలు చేసుకోవడానికి డబ్బులు తీసుకెళ్లు అని పురామయించడం ఎంత సజీవంగా ఉంటుందో నటనకే నటనను నేర్పిన గురువులేమో అనిపిస్తుంది.

న్యాజివీడు నివాసి...చదువు చెన్నపట్నం...లో చదివి తెలుగు లాగా తమిళాన్ని అనర్గళంగా మాట్లాడగలగడం..తమిళ సినీ ప్రస్థానంలో అతనికి చాలా బాగా కలిసొచ్చింది.

తనదయిన శైలిలో డైలాగులు చెబుతూ ప్రేక్షకుల గుండెల్లో చెదరని ముద్ర వేశారు.విలన్ పాత్రలకు

ఒక కొత్త స్టైల్‌ను ఏర్పరిచి నటించారు.నాటకాల అనుభవంతో షేక్స్పియర్ నాటకంలో షైలాక్ పాత్రను చేసిన అతను...దానిని అనుకరిస్తూ..ఆ స్టైల్ ను పాతాలభైరవి సినిమాలో మాంత్రికుని పాత్రలో విన్నూత్న నటనతో అందరిని ఆకట్టుకున్నాడు.

పౌరాణికంలో అనేకానేక పాత్రలు వేసినా ఘటోత్కచుడు హిరణ్యకశిపుడు కీచకుడు పాత్రలు..ఎప్పటికి నిలిచిపోతాయి.తాను చేసిన

కీచక పాత్ర తనను ప్రపంచ దేశాలల్లో మంచి నటుడుగా గుర్తింపుతెచ్చి అంతర్జాతీయంగా అవార్డులను తెచ్చి పెట్టింది.తాను దర్శకత్వం వహించిన చిత్రాలకు నంది అవార్డులు తెచ్చిపెట్టింది.ఇతని నటనకు తెలుగులో కన్నా తమిళంలోనే ఎక్కువగా అవార్డులు వరించాయి.

రాష్ట్రపతి అవార్డులు కూడా ఈయనను వరించాయి.

భారత ప్రభుత్వం..పద్మ అవార్డులు ఈయనకు ఇవ్వక పోవడం శోచనీయం... ఈయన పేరు మీద తపాలా బిళ్ళ విడుదల చేయడం హర్షణీయం.

ఆయన మద్యానికి బానిస కావడం అతివృష్టి ..అనావృష్టి లాగా త్రాగితే అలాగే తాగుతూ ఉండటం లేకపోతే అలా చాలారోజులు...త్రాగకుండా ఉండటం..ఆయన నైజం.జమున గారు డాడీ మీరు ఇలా త్రాగితే మీ ఆరోగ్యం ఏమైపోతుంది..అని ఏడుస్తూ అడిగితే అమ్మాయి సీన్ అయ్యిపోయిందిగా

ఎందుకు ఏడుస్తూ డైలాగ్ చెబుతున్నావు అని రంగారావు గారు అంటే డాడీ షూటింగ్ అయిపోయింది అని మీకు తెలుసు నాకు తెలుసు...

నేను ఎందుకు ఏడుస్తున్నానో .కూడా మీకు తెలుసు..అని షూటింగ్ విరామ సమయంలో జరిగిన ఈ సంభాషణ కన్నీళ్లు తెప్పిస్తుంది.మనుషుల పై ఆయనకున్న అభిమానము..మమకారం జమున డాడీ అన్న పిలుపును బట్టే తెలుస్తుంది.ఫైర్ ఆఫీసులో పనిచేశాడు కాబట్టే..ఆయన గొంతులో డైలాగ్స్ ఎప్పుడూ.. వాడి వేడిని కలిగి ఉంది అని మనకు అనిపించినా ఆర్ద్రతను నింపుకొని ఉంటుంది..కదా అని మనసు చెబుతుంది.

అతని మాడ్యులేషన్ తో కన్నుల్లో కన్నీటి సుడులు తెప్పించడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఈయన కున్న మద్యపానం అలవాటు వల్ల కోల్పోయిన చిత్రాలు ఎన్నో. ఆయన 56సంవత్సరాల

జీవిత కాలంలో 250 అన్ని భాషల్లో కలిపి నటించాడుఎన్ని బిరుదులో ఎన్నెన్ని అవార్డులో వరించిన..శ్రీ సామర్ల వెంకట రంగారావు గారికి....102 సంవత్సరపు జయంతి శు భాకాంక్షలతో...ఘన నివాళి..నా అక్షర సుమాలతో..

ఆయనలాగా నటించే నటుడు...పుట్టడు... పుట్టినా... నటనలో ఆయనను మించిపోడు అని తెలుపుకుంటూ..

కౌసల్యా సుప్రజా రామ పూర్వాసంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్ ?
ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద ఉత్తిష్ఠ గరుడధ్వజ
ఉత్తిష్ఠ కమలాకాంత త్రైలోక్యం మంగళం కురు

శ్రీవేంకటేశ్వరుని సుప్రభాతం సుబ్బలక్ష్మి గొంతులో మనకి సుపరిచితం. - ప్రభాతము" అనగా "మంచి ఉదయం" అని అర్ధం. హిందూ పూజా విధానాలలోను, ప్రత్యేకించి శ్రీవైష్ణవం ఆచార పరంపరలోను, భగవంతుని పూజామూర్తికి అనేకమైన సేవలు (షోడశోపచారములు) నిర్వహించే సంప్రదాయం ఉంది. ఇలాంటి సేవలలోనిదే సుప్రభాత సేవ. ఆ సుప్రభాత సేవా సమయంలో చేసే కీర్తననే "సుప్రభాతం" అని అంటారు. తిరుమల శయనవూ మంటపంలోని భోగశ్రీనివాసుని ఈ సుప్రభాతం ద్వారా మేల్కొలుపుతారు. బంగారు వాకిలిలో పదహారు స్తంభాల తిరుమామణి మంటపంలో ఈ సుప్రభాతాన్ని పఠిస్తారు. సుప్రభాత పఠనానంతరం భోగశ్రీనివాసుని గర్భగుడిలోనికి తీసికొని వెళతారు. 1430 సంవత్సరంలో శ్రీవీరప్రతాపరాయల హయాంలో వేదపఠవంతోపాటు సుప్రభాత పఠనం కూడా ఆరంభమైంది. అప్పటినుండి అవిచ్ఛిన్నంగా ఈ సంప్రదాయం కొనసాగుతున్నది. కాని అది రాసినది ..ఎవరో తెలుసా? శ్రీ హస్తగిరి అనంతాచార్యులు. 1361లో రాసాడు,.

దటీజ్ సచిన్



క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ , మాజీ సారథి సౌరభ్ గంగూలీ ఎంత మంచి ఓపెనింగ్ జోడీయో అందరికీ తెలిసిందే. 1996 నుంచి 2007 మధ్య మొత్తం 136 ఇన్నింగ్స్‌ల్లో కలిసి ఓపెనింగ్ చేసిన వీరు.. వన్డే క్రికెట్‌లో ఎవరికీ సాధ్యంకాని విధంగా 6609 పరుగులు చేశారు. అలాగే ఆల్ టైమ్ అత్యుత్తమ ఓపెనింగ్ బ్యాట్స్ మెన్‌గా ప్రత్యేక గుర్తింపు సాధించారు. అయితే, వీరిద్దరూ బ్యాటింగ్ చేసేటప్పుడు సచిన్ ఎప్పుడూ తొలి బంతిని ఎదుర్కొనేందుకు ఇష్టపడేవాడు కాదనే అభిప్రాయం ఉండేది. ఇదే విషయంపై గంగూలీ తాజాగా మయాంక్ అగర్వాల్ తో ముచ్చటించిన సందర్భంగా ఓ అభిమాని ఈ ప్రశ్నించాడు.'సచిన్ పాజీ ఎప్పుడూ మిమ్మల్ని ఓపెనింగ్ స్ట్రైక్ చేయమని ఒత్తిడి తెచ్చేవాడు. అది నిజమేనా లేక అపోహ?' అని అడిగాడు. దీనికి స్పందించిన దాదా అది నిజమేనని, సచిన్ అలా చేయడానికి కూడా రెండు కారణాలున్నాయని చెప్పాడు. 'అతనెప్పుడూ అలాగే చేసేవాడు. అయితే, దానికి కారణం కూడా ఉంది. కొన్నిసార్లు నేను కూడా సచిన్ ను తొలి బంతి ఎదుర్కోమని చెప్పేవాడిని. అయితే, అలా ఎందుకు ఓపెనింగ్ స్ట్రైక్ చేయడో రెండు కారణాలు వివరించాడు. 'ఒకటి ఏంటంటే.. తన ఫామ్ బాగుంటే అలా నాన్ స్ట్రైకింగ్ ఎండ్‌లోనే ఉండిపోవాలని నమ్మేవాడు. రెండోది.. ఫామ్‌లో లేకపోతే నాన్ స్ట్రైకింగ్‌లో ఉండటం వల్ల ఒత్తిడి తగ్గేదని చెప్పేవాడు' అని గంగూలీ వివరించాడు. అలాగే తాను పలుమార్లు బలవంతంగా ఎలా సచిన్ ను స్ట్రైకింగ్ ఎండ్‌లో నిలబెట్టాడో కూడా వెల్లడించాడు. అందుకు తానో ట్రిక్ ప్లే చేసేవాడినని చెప్పాడు. మైదానంలోకి వెళ్లేటప్పుడు సచిన్ కన్నా ముందే వెళ్లి తాను నాన్ స్ట్రైకింగ్ ఎండ్‌లో నిలుచునేవాడినని, అలా రెండు, మూడుసార్లు చేసినట్లు గుర్తుచేసుకున్నాడు. దాంతో లిటిల్ మాస్టర్ తప్పనిసరి పరిస్థితుల్లో ఓపెనింగ్ చేసేవాడని వివరించాడు.

– గౌతమ్

వచ్చే ఏడాది 5జీ




దేశంలో చాలానే కంపెనీలు ఉండొచ్చు. మరే కంపెనీకి లేని రీతిలో రిలయన్స్ వార్షిక సాధారణ సమావేశానికి ఉండే క్రేజ్ అంతా ఇంతా కాదు. ప్రతి ఏడాది తన వార్షిక సమావేశం సందర్భంగా ఆయన ఏదో ఒక ఆసక్తికర ప్రకటన చేస్తుంటారు. గత ఏడాది ఇదే సమావేశంలో.. తమ కంపెనీ అప్పుల్ని తీర్చేస్తామని.. అప్పుల్లేని కంపెనీగా మారుస్తామని మాట ఇచ్చారు. ఆయన మాట విన్న వారంతా ఆశ్చర్యపోయారు. కానీ.. ముకేశ్ చెప్పినట్లే చేసి చూపించారు. కరోనా లాంటి కఠిన కాలంలోనూ తన జియో వాటాల్ని భారీ ధరలకు అమ్మే విషయంలో ఆయన సక్సెస్ అయ్యారు. చెప్పిన సమయం కంటే తక్కువ వ్యవధిలోనే రిలయన్స్‌ను రుణ రహిత సంస్థగా మార్చటమే కాదు.. 150 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువను సాధించిన తొలి భారతీయ కంపెనీగా చరిత్రను క్రియేట్ చేశారు. ఇదే విషయాన్ని ఈ రోజున ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఏజీఎంలో వెల్లడించారు.

మానవ చరిత్రలో అత్యంత ఇబ్బందికర పరిస్థితిగా కరోనాను అభివర్ణించారు ముకేశ్ అంబానీ. కోవిడ్ తర్వాత భారత్ తో పాటు మిగిలిన ప్రపంచం కూడా వేగంగా కోలుకుంటుందన్న ఆయన.. ప్రతి కష్టం కొత్త అవకాశాల్ని తెచ్చి పెడుతుందని గుర్తు చేశారు. అందరి అంచనాలకు భిన్నంగా జియో సొంతంగా 5జీ సొల్యూషన్స్ ను డెవలప్ చేసిందని చెప్పారు.ఇది ప్రపంచ స్థాయి సేవల్ని అందిస్తుందని చెప్పారు.

వచ్చే ఏడాదికి ఈ సేవలు అందుబాటులోకి రావొచ్చని చెప్పిన ఆయన.. ప్రభుత్వం స్పెక్ట్రం రాగానే ప్రకటిస్తామని చెప్పారు. అంతేకాదు.. జియోలో 7.7 వాతం వాటాను గూగుల్ రూ.33737 కోట్లు పెట్టుబడి పెట్టనుందని చెప్పారు. భారత్‌లో అతి పెద్ద రైట్స్ ఇష్యూని కూడా పూర్తి చేశామన్నారు. గూగుల్ తో ఒప్పందం రానున్న కొన్ని వారాల్లోనే ఖరారు కావొచ్చన్న విషయాన్ని తాజాగా బ్లూంబర్గ్ పేర్కొన్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాదికి 5జీ సేవలు ఇస్తామన్న మాటను చెప్పటం ద్వారా..సదరు స్పెక్ట్రం విడుదలకు ప్రభుత్వ క్లియరెన్సు మాత్రమే మిగిలి ఉందన్న విషయాన్ని ముకేశ్ చెప్పకనే చెప్పినట్లైంది.

భారతదేశంలో పెర్ల్ ఆక్వాకల్చర్

పెర్ల్ లేదా ముత్యం "రత్నాల రాణి"గా ప్రసిద్ధి పొందింది. ముత్యం ప్రేమ, స్వచ్ఛత మరియు మంచి సంపదకు ప్రతీకగా నిలుస్తుంది. ముత్యాలను వైభవం, రాయల్టీకి చిహ్నంగా పరిగణిస్తారు మరియు చరిత్రలో ధనవంతులైన, శక్తివంతమైన వ్యక్తులు మాత్రమే దీనిని కలిగి ఉండేవారు. వీటిని ఆభరణాల హస్తకళలో ఉపయోగిస్తారు ఇంకా శస్త్రచికిత్స, పీడియాట్రిక్స్ మరియు ఇఎన్‌టి లాంటి విలువైన వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. తొమ్మిది మహారాత్నాలలో, ముత్యం వజ్రం తరువాత రెండవ స్థానంలో ఉంది. ముత్యాల వ్యాపారంలో 90% కంటే ఎక్కువ శాతం ముత్యాలు, కల్చర్డ్ ముత్యాలు పెంపకం ద్వారానే వస్తాయి. పెర్ల్ ఆక్వాకల్చర్ ఒక బిలియన్ డాలర్ల వ్యాపారం మరియు విలువ పరంగా ప్రపంచంలోని అతిపెద్ద ఆక్వాకల్చర్ కార్యకలాపాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. కల్చర్డ్ పెర్ల్ యొక్క ప్రపంచ వాణిజ్యం సంవత్సరానికి 3 బిలియన్లకు యుస్ డాలర్‌లు పైగా ఉన్నట్లు నివేదించబడింది. ముత్యాల ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్‌తో, కల్చర్డ్ ముత్యాల ప్రపంచ మార్కెట్ 2025 నాటికి 10.7 బిలియన్లకు యుస్ డాలర్‌లు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఆస్ట్రేలియా, హైతీ, ఇండోనేషియా, జపాన్ మరియు చైనా ప్రధానంగా ముత్యాలను ఉత్పత్తి చేసే దేశాలుగా చెప్పుకోవచ్చు. పెరుగుతున్న దేశీయ మార్కెట్ డిమాండ్‌ను తీర్చడానికి ప్రతి సంవత్సరం 4 మిలియన్ డాలర్ల విలువైన ముత్యాలను దిగుమతి చేసుకునే దేశాలలో భారత్ ఒకటి. 'పెర్ల్' అనే పదం లాటిన్ పదం "పిరులా" నుండి వచ్చింది, దీని అర్థం 'పియర్' – అంటే ముత్యాల పియర్ ఆకారానికి అనుగుణంగా ఉండడం వల్ల ఈ పేరు పొందింది. పెర్ల్ పెంపకం పరిశ్రమ యొక్క ప్రారంభ విజయాన్ని 1893లో జపాన్‌కు చెందిన కోకిచి మికిమోటో సాధించాడు, అతను 'పెర్ల్ కింగ్' మరియు పెర్ల్ కల్చర్ పరిశ్రమ పితామహుడిగా పరిగణించబడ్డాడు. భారతదేశంలో 1973లో టుటికోరిన్‌లోని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (CMFRI), ముత్యాల పెంపకంలో సాంకేతిక పురోగతిని సాధించింది అలాగే హేచరీలో ముత్యపు చిప్పల (pearl oysters) యొక్క నియంత్రిత ఉత్పత్తి అభివృద్ధి ద్వారా 1981లో రెండవ, సమానమైన, పురోగతి సాధించబడింది. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో మాదిరిగా భారతదేశంలో సహజ ముత్యాల వనరులు క్షీణించాయి మరియు నాలుగు దశాబ్దాల క్రితం భారతదేశంలో ముత్యాల చేపల వేట ఆగిపోవడం వల్ల ఉత్పత్తి మరియు డిమాండ్ మధ్య భారీ వ్యత్యాసం కలిగింది, దానిని ముత్యాల ఆక్వాకల్చర్ ద్వారానే తీర్చగలము. కల్చర్డ్ ముత్యాలు సముద్ర మరియు మంచినీటి వాతావరణంలో ఉత్పత్తి చేయబడతాయి. ముత్యాలలో మూడు రకాలు ఉన్నాయి:



Pinctada fucata

(ఎ) సహజ ముత్యాలు: ఇసుక లేదా పరాన్నజీవులు వంటి విదేశీ పదార్థానికి వ్యతిరేకంగా రక్షణాత్మక యంత్రాంగంలో భాగంగా సహజ ముత్యాలు ఏర్పడతాయి, ఇవి ముత్యాల చిప్పల యొక్క కణజాలాలలోకి ప్రవేశించడం వల్ల ఆ జంతువు "నాక్రే" అనే పదార్థాన్ని విదేశీ పదార్థ చుట్టూ పొరలు పొరలుగా పూస్తుంది, తద్వారా విలువైన మెరుస్తున్న రత్నం ఏర్పడుతుంది. సహజ ముత్యాలు దొరకడం చాలా అరుదు.

(బి) కల్చర్డ్ ముత్యాలు: కల్చర్డ్ ముత్యాలు, సహజ ముత్యాల మాదిరిగానే ఏర్పడతాయి. ఒకే తేడా ఏమిటంటే కావలసిన ఆకారాల ఉన్న విదేశీ పదార్థం (న్యూక్లియస్)ని శస్త్రచికిత్స ద్వారా ముత్యపు చిప్పలు యొక్క శరీరంలోకి అమర్చబడుతుంది, ఈ విదేశీ పదార్థంని ముత్యపు చిప్పలు బయటకి పంపలేక దాని చుట్టూ "నాక్రే" (Nacre) అనే పదార్థనాన్ని ఉత్పత్తి చేయడం వల్ల ముత్యం అనే విలువైన జీవ రత్నం ఏర్పడతుంది. నాలుగు రకాల కల్చర్డ్ ముత్యాలు–

I. ఆకోయ్ సముద్రపు ముత్యాలు (తెలుపు రంగు)– జపాన్, చైనాలో ఉత్పత్తి

II. సౌత్ సీ కల్చర్ ముత్యాలు (తెలుపు, వెండి, బంగారం రంగు)– ఆస్ట్రేలియా, ఇండోనేసియా,



Dr. V.Anu Prasanna, M.Sc., Ph.D
Assistant Professor, Head of the Department,
Department of Zoology,
Yogi Vemana University,
YSR Kadapa, A.P



Lamellidens corrianus



Parreysia corrugata

Pinctada margaritifera



ఫిలిపిన్స్


III. తహితన్ కల్చర్ ముత్యాలు (నలుపు, గ్రే, బ్రౌన్ రంగు)– ఫ్రెంచ్ పోల్నేసియా (తహితి)

IV. మంచినీటి కల్చర్ ముత్యాలు (చాలా రంగుల్లో)– చైనా

(సి) కృత్రిమ ముత్యాలు: కృత్రిమ ముత్యాలు ను కృత్రిమ మెరుపుతో ప్లాస్టిక్స్, గాజు, చేప పొలస మొదలైన వాటిని వాడి తయారు చేస్తారు.

ముత్యాలలో 82-86% CaCO3 (కాల్షియం కార్బొనేట్) యొక్క అరగోనైట్ స్ఫటికాలు ; 10-14% organic matrix/scleroprotein (Conchiolin) మరియు 2–4% నీరు కలిగి ఉంటుంది. పెర్ల్ (ముత్యం) 2.7 నిర్దిష్ట గురుత్వాకర్షణతో మోహ్ స్కేల్‌లో 3.5–4.5 కాఠిన్యాన్ని కలిగి ఉంటుంది.

భారతదేశం నుండి వచ్చిన ముత్యాలు చాలా ప్రసిద్ధమైనవి మరియు భారీ డిమాండ్ ఉన్న 'ఓరియంటల్ పెర్ల్స్'లో అత్యుత్తమమైనవి. భారతదేశంలో దక్షిణ భారతదేశం మరియు అండమాన్ నికోబార్ దీవులతో పాటు సుదీర్ఘ తీరప్రాంతం ఉన్న కారణంగా ముత్యాల చిప్పల పెంపకంకి గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. రెండు రకాల సముద్రపు ముత్యాలు చిప్పలు (Oysters)- Pinctada fucata గల్ఫ్ ఆఫ్ మన్నార్, టుటికోరిన్, త్రివేంద్రం సముద్రంలో మరియు Pinctada margaritifera ఆండమాన్ నికోబార్ దీవుల్లో సమృద్ధంగా దొరుకుతాయి. సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్



Lamellidens marginalis

ఇన్‌ట్టిట్యూట్ (CMFRI) సముద్ర ముత్యాల చిప్పల (Oysters) పెంపకంలో సాంకేతికతను ప్రామాణీకరించింది అలాగే మంచినీటి ముత్యాల మస్సెల్స్ (Mussels) చెరువు, నది, సరస్సులు, జలాశయాలు మొదలైన సహజమైన నీటి వనరులలో అందుబాటులో ఉంటాయి. భారతదేశం మంచినీటి మస్సెల్ (Mussels) గొప్ప జీవవైవిధ్యాన్ని కలిగి ఉంది, దేశవ్యాప్తంగా యాభై రెండు జాతులు వివరించబడ్డాయి, వీటిలో మూడు జాతుల (Mussels)- Lamellidens marginalis, L. corrianus and Parreysia corrugata ముత్యాల నిర్మాణానికి అధిక సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్లు కనుగొనబడింది. సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్ వాటర్ ఆక్వాకల్చర్ (CIFA) మంచినీటి ముత్యాల చిప్పల సాంకేతికతను ప్రామాణీకరించింది. ఒరిస్సా, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ మరియు మహారాష్ట్రలలోని అనేక మంది పారిశ్రామికవేత్తలు ఇప్పుడు మంచినీటి ముత్యాల చిప్పల యొక్క సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబించారు. ఆంధ్రప్రదేశ్‌లో సంస్థాగత ఫైనాన్స్ సంస్థలు మరియు నాబార్డ్ రిఫైనాన్స్‌తో అనేక ప్రాజెక్టులు సముద్ర ముత్యాల ఉత్పత్తి కోసం చేపట్టారు.



దళితుడిని కాబట్టే నన్ను పిలువలేదు దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని కావటం వల్లే తనను రామాలయ భూమి పూజకు పిలు వలేదని స్వామి కన్హయ్య ప్రభునం దన్ గిరి ఆరోపించారు. ఆయన దేశంలోని అఖాడాల అత్యున్నత సంస్థ "అఖిల భారత అఖాడా పరి షత్'లో ఉన్న ఏకైక దళిత సాధువు, జునా అఖాడా మహామండలేశ్వర్. భూమి పూజ ఆహ్వానితుల్లో వివక్ష ఏమిటని కన్హయ్య ప్రశ్నించారు.

నీవు ఏ దిక్కుకు తిరిగినా సరే, దారికడ్డంగా నిలబడే పెనుభూతం కులవ్యవస్థ. ఈ బూతాన్ని చంపిపారవేస్తే తప్ప నీవు రాజకీయ సంస్కరణగాని, ఆర్థిక సంస్కరణగాని సాధించలేవు.

– అంబేద్కర్


ఏపీలో ఏదో జరుగుతోంది

- కె.బుజ్జి

ఏం జరుగుతోందో.. ఎందుకు జరుగుతోందో.. ఎలా జరుగుతుందో తెలియదు గాని, మొత్తానికి ఏదో జరుగుతుందనే అభిప్రాయం మాత్రం ప్రస్తుత రాజకీయాలను చూస్తే ఇదే అభిప్రాయం కలుగుతుంది. టిడిపి, వైయస్సార్ కాంగ్రెస్, జనసేన, బిజెపి మిగతా చిన్నచితకా పార్టీలు ఎన్నో ఉన్నాయి.ఏ పార్టీలోనూ సానుకూల పరిస్థితులు లేవు. ప్రతి పార్టీ గందరగోళంలోనే ఉన్నట్టుగా కనిపిస్తున్నాయి. టిడిపి నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి పెద్దఎత్తున వలసలు చోటుచేసుకోవడం, ఇంకా అనేకమంది ఆ పార్టీ వైపు చూస్తూ ఉండడం వంటి పరిణామాలతో ఆ పార్టీలో ఉన్న నాయకుల్లోనూ గందరగోళం నెలకొని ఉండగా, 2019 ఎన్నికల్లో ఘోరాతి ఘోరంగా ఓటమి చెంది, ఒక్క సీటు మాత్రమే దక్కించుకున్న జనసేన రాజకీయంగా బలపడేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. అసలు 2024 నాటికి అధికార పార్టీకి పోటీ ఇచ్చే స్థాయికి వస్తుందా అనేది ఆ పార్టీ నాయకులకు కూడా అనుమానాలు కలుగుతున్నాయి.

ఇక బిజెపి విషయానికి వస్తే, చెప్పుకోవడానికి జాతీయ పార్టీ అయినా, అంత గొప్పగా ఏమి ఇక్కడి పరిస్థితి లేదు. కేవలం కొద్ది మంది నాయకులు తప్ప, క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి బలమే లేదు. ఎప్పుడూ ఏదో ఒక పార్టీ తో పొత్తు పెట్టుకుని ముందుకు వెళ్ళడమే తప్ప, సొంతంగా బలం పెంచుకునే ఆలోచనలో ఉన్నట్లుగా కనిపించని పరిస్థితి. వైఎస్ఆర్‌సిపి 151 సీట్లతో అసెంబ్లీ 22 పార్లమెంటు స్థానాలు ఉన్న ఆ పార్టీకి ఇప్పుడు మనశ్శాంతి లేనట్టుగా తయారయింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలను తమ దారిలోకి తెచ్చుకునేందుకు కేంద్ర అధికార పార్టీ బిజెపి చేస్తున్న రాజకీయం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు మింగుడు పడడం లేదు. ఇప్పటికే నరసాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు వంటి వారు పార్టీపై తిరుగుబావుటా ఎగరవేసి పార్టీని, పార్టీ అధ్యక్షుడిని విమర్శిస్తూ లేనిపోని గందరగోళం సృష్టిస్తున్నారు.

పార్టీ ఆయనకు షోకాజ్ నోటీస్ ఇస్తే, పార్టీకి తిరిగి షోకాజ్ నోటీసు ఇచ్చినంత హడావుడి చేస్తున్నాడు. అయితే ఆయన పార్టీపై విమర్శలు చేయడం, కవ్వింపు చర్యలకు పాల్పడుతూ ధిక్కార స్వరం వినిపించడం వెనుక ప్రత్యేక కారణాలు ఏమీ లేవని, రాజు గారి వెనుక బిజెపి కేంద్ర పెద్దలు ఉన్నారని,వారే వెనకుండి విమర్శలు చేస్తున్నారని, తమ పార్టీకి చెందిన అసంతృప్తి నాయకులను బిజెపిలోకి ఆకర్షించేందుకు ఇలా చేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుమానిస్తోంది. అసలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తులు పెరగడానికి ఆ పార్టీ అధినేత జగన్ తప్పిదం కూడా కనిపిస్తుంది. అధికారంలోకి వచ్చి ఇప్పటికే ఏడాది దాటిపోయినా, ఇప్పటికీ జగన్ దర్శనం కూడా లభించలేదు.



నియోజకవర్గాల్లో ఉన్న సమస్యలు కానీ, ఇతర పార్టీ వ్యవహారాల గురించి గాని చెప్పుకునేందుకు అవకాశం దక్కడం లేదు అనే బాధ వారిలో ఎక్కువ కనిపిస్తోంది. అలాగే మొత్తం పరిపాలన వ్యవహారాలన్నీ, అధికారుల చేతుల్లో పెట్టడంతోనే తమ చేతులకు కనిపించిన బేడీలు జగన్ వేశారనే అసంతృప్తి చాలామంది నాయకుల్లో వచ్చేసింది. ఇప్పుడిప్పుడే అటువంటి వారంతా ఒక్కొక్కరిగా బయటపడుతుండడంతో బీజేపీలో ఆశలు చిగురిస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఉన్నఅసంతృప్తులు అందరినీ తమ వైపు లాక్కోగలిగితే, 2024 ఎన్నికల నాటికి తమకు పెద్దగా ఇబ్బంది ఉండదని, ఎలాగూ పవన్ సహకారం ఉంటుంది కాబట్టి, ఏపీ అధికార పీఠం దక్కించుకోవచ్చనే అభిప్రాయంలో ఉంటూ ముందుకు వెళుతుంది.

ఈ పరిణామాలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని కలవరానికి గురిచేస్తున్నాయి. అసలు కేంద్ర బిజెపి పెద్దలు తమ పార్టీపై ఏ అభిప్రాయంతో ఉన్నారు అనేది ఇప్పటికీ అర్థం కావడంలేదు. ఒక్కో సందర్భంలో జగన్ కు మద్దతు ఇస్తూనే, కట్టడి చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు తమ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేపైన గురిపెట్టి బిజెపి వైపు లాక్కునేందుకు ప్రయత్నాలు చేయడం వంటి అన్ని పరిణామాలు మంట పుట్టిస్తున్నాయి. ఇలా ప్రతి పార్టీలోనూ ఏదో ఒక ఇబ్బంది వచ్చి పడుతూనే ఉంది. ఏ పార్టీలోనూ నాయకులు మనశ్శాంతిగా ఉన్నట్లుగా కనిపించడం లేదు. ఈ పరిస్థితులలో మార్పు వస్తుందా లేదా ఎప్పటికీ ఏపీ రాజకీయాలు ఇలాగే ఉంటాయా అనే సందేహాలు జనాల్లో కలుగుతున్నాయి. అసలు ఏపీ రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

కరోనా కష్టాల్లో "కలం"


- డి. ఉదయ్ భాస్కర్

సమాజంలోని ప్రతి అంశానికీ స్పందిస్తూ, వార్తలు, కథనాల రూపంలో అందిస్తూ, పగలు, రేయి, ఎండా, వాన తెలియకుండా కష్టపడే అక్షరసైనికులు, హాలికులు జర్నలిస్టులు. కలం మాటున, లోగో మైకు, కెమెరా కళ్ళు చాటున కష్టాలను, కన్నీళ్లను దాచుకొని సాగే జర్నలిస్టులకు కష్టాలు కొత్తకాదు. కానీ, కరోనా సమయంలో వచ్చిన, వస్తున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివిధ స్థాయిల్లోని జర్నలిస్టులు ఒక్కొక్కరు ఒరిగిపోతున్నారు. ముఖ్యంగా ఈ నెలలో ప్రతిరోజూ ఏదో ఒక జర్నలిస్ట్ చావు వార్త వినాల్సి వస్తోంది. అందులో యువకులున్నారు. నడివయస్సువారు ఉన్నారు. రిపోర్టర్లున్నారు. ఫోటో, వీడియో జర్నలిస్టులున్నారు. సంపాదక వర్గంలో పనిచేసేవారు ఉన్నారు. ఇలా అనేకులున్నారు. కరోనా సోకి కొందరు మరణిస్తున్నారు. కొందరు జీవచ్ఛవాల్లా బతుకుతున్నారు. ఎందరో ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నవారిలోనూ చాలామందికి పూర్తి జీతాలు అందడం లేదు. ఎవరో కొందరికి తప్ప, మిగిలినవారికి చాలీచాలని జీతాలే. అందులో మళ్ళీ కోతలు. ఆకలి కడుపులతో జర్నలిస్టులు ఎలా బతకాలి. జర్నలిజం పట్ల మక్కువతో ఈ రంగాన్ని ఎంచుకున్నవాళ్లే ఎక్కువమంది ఉన్నారు. పరిచయాలు, పలకరింపులు కడుపునింపవని అర్థమైనా, అలవాటైన ఈ రంగాన్ని వదలలేక, ఉండలేక ఎందరో జర్నలిస్టులు విలవిలలాడుతున్నారు. మీడియాలో అన్ని పనులు వర్క్ ఫ్రమ్ హోమ్ నుండి జరుగవు. చెయ్యలేరు. క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిందే. ఏ కల్లోలం జరిగినా, ఏ విధ్వంసం జరిగినా, ఏ ప్రమాదం జరిగినా, ఏ ఆందోళన, ఏ ఉద్యమం, ఏ నిరసన జరిగినా క్షేత్రస్థాయిలో పని చేసి, వార్తలు ఇవ్వాల్సిందే. ఎన్నో ఏళ్ళుగా వృత్తిజీవులు యోధుల్లా తిరిగి, వార్తలు అందిస్తున్నారు. ప్రస్తుత కరోనా పరిస్థితుల్లో ఉన్న తీరు వేరు. ఎవర్ని కలిసినా, ఎక్కడికి వెళ్లినా ఎవరో ఒకరి నుండి కరోనా వైరస్ జర్నలిస్ట్ మిత్రులను సోకుతూనే ఉంది. కొన్ని మీడియా కార్యాలయాల్లో పరీక్షలు చేస్తే, చాలామందికి పాజిటివ్ రిపోర్ట్ వచ్చిందని తెలుస్తోంది. భౌతికదూరం పాటించినప్పటికీ, కరోనా వ్యాప్తి నుండి దూరం కాలేకపోతున్నారు. అత్యవసర సేవలు అందించే వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, పోలీసులు, పారిశుద్ధ్య కార్మిక సిబ్బంది మొదలైనవారికి సోకుతున్నట్లుగానే జర్నలిస్టులకూ కరోనా సోకుతోంది. దీని దెబ్బకు కొందరు జర్నలిస్ట్ మిత్రులు ఇప్పటికే రాలిపోయారు. కొందరు చికిత్స పొందుతున్నారు. మిగిలినవారు ఏ సమయంలో మనల్ని కూడా కరోనా సోకుతుందో అనే భయంతో జీవిస్తున్నారు. సగటు జర్నలిస్ట్ జీవితాలు చాలా చిన్నవి. లక్షల రూపాయల బ్యాంక్ బాలన్స్లు, ఆస్తిపాస్తులు ఉండవు. తను బతకాలి, తన కుటుంబాన్ని బతికించాలి. ఎక్కువమంది కష్టం వస్తే తట్టుకోలేక, ఒకర్ని అడగలేక విలవిలలాడి పోతున్నారు. కరోనా కాలంలో జర్నలిస్టులు అష్టకష్టాలు అనుభవిస్తున్నారు. వైద్యం కొందరికి అందుతోంది. కొందరికి అందడం లేదు. కరోనా సోకి మరణిస్తున్న కుటుంబాలను ఎవరు ఆదుకుంటారు. ముందుండి నిలబడి ప్రపంచాన్ని నడిపించే యోధులంటూ... అందరూ జర్నలిస్టులను కీర్తిస్తుంటారు. వీధిన బడుతున్న జర్నలిస్టులను ఆదుకొనే యోధులు కనిపించడం లేదు. కొన్ని ప్రభుత్వాలు తప్ప, అటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండీ జర్నలిస్టులకు పూర్తిస్థాయిలో సాయం అందడం లేదు. కరోనా పోరాటంలో మగ్గిపోతున్న జర్నలిస్ట్ కుటుంబాల గురించి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. జర్నలిస్టుల వైపు దృష్టి సారించాలి. కరోనా సమయంలో, మనదేశంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు కరోనా ఆరోగ్య భీమా కల్పించాయి. కేరళ, ఒరిస్సా, హర్యానా, పంజాబ్, అస్సాం రాష్ట్రాలు 10 లక్షల నుండి 50 లక్షల వరకూ కరోనా సోకిన జర్నలిస్టులకు భీమా సదుపాయం ఏర్పాటుచేశాయి. కేరళ ప్రభుత్వం ఇంకొక అడుగు ముందు వేసింది. కరోనా కోసం కేటాయించిన ప్రత్యేక బడ్జెట్లో, ప్రకటనల రూపంలో, తోడ్పాటు రూపంలో మీడియా సంస్థలకు కొంత బడ్జెట్ కేటాయించి, మీడియా సంస్థలను ఆదుకుంటోంది. ప్రత్యేక భీమా కేటాయించి జర్నలిస్ట్ కుటుంబాలకు అండగా నిలుస్తోంది. మిగిలిన చాలా రాష్ట్రాల్లో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఉన్నప్పటికీ, అందులో కరోనాను చేర్చకపోవడం వల్ల, భీమా సయం అందడం లేదు. హౌస్ క్వారంటైన్లో ఉంచే జర్నలిస్టులకు అందే ఆర్థిక సహాయం ఏ మూలకూ సరిపోదు. కరోనా వైద్యం చాలా ఖరీదుగా మారిపోయింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో కరోనాను కూడా చేర్చడం కాస్త ఊరట కల్పించే అంశం. ఇటు వైద్య ఖర్చులు భరిస్తూ, అటు కుటుంబాన్ని పోషించుకోవడం సగటు జర్నలిస్టులకు సాధ్యమయ్యే పని కాదు. గ్రామీణ జర్నలిస్టుల జీవితాలు ఇంకా ఘోరం. వారికి అస్సలు ఒక్క రూపాయి జీతం కూడా అందదు. లైన్ అకౌంట్స్ కొన్ని సంస్థల్లో ఉన్నాయి. చాలా సంస్థల్లో లేవు. లైన్ అకౌంట్లో వచ్చే ఆదాయం కూడా నామమాత్రమే. కరోనా సోకిందంటే, వారి కష్టాలు వర్ణనాతీతం. కరోనా వార్తల సేకరణతో పాటు వివిధ సామూహిక క్షేత్రాల్లో పనిచేసే జర్నలిస్టులకు కరోనా కిట్లు కూడా సక్రమంగా అందడం లేదు. కొన్ని జర్నలిస్ట్ సంఘాలు చందాలు పోగుచేసి, జర్నలిస్టులకు ఎంతో కొంత సహాయం చేస్తున్నాయి. తోటి జర్నలిస్టులకు నేనుసైతం అంటూ నిలబడుతున్న సంఘాలకు కృతజ్ఞతలు చెప్పి తీరాలి. ఇవన్నీ కంటితుడుపు చర్యలే కానీ, సమగ్రమైన పరిష్కారాలు కావు. అత్యవసర సేవకుల లాగానే, సమాజం కోసం అహర్నిషలు పాటుపడుతున్న జర్నలిస్టులను, జర్నలిస్ట్ కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దఎత్తున ఆదుకోవాలి. అక్షర యోధులకు కొండంత అండగా నిలబడాలి. ఒకప్పుడు, బతకలేనివాడు బడిపంతులు అనేవారు. ఇప్పుడు బతకలేక పోతున్నవాడు బడుగు జర్నలిస్ట్. జర్నలిస్టులను కాపాడుకోవాలి. జర్నలిజాన్ని రక్షించుకోవాలి. కరోనా పోరాటంలో అశువులు బాసిన అమరవీరులకు అశ్రుతర్పణములు అందిస్తూ...

ఘంటసాలను మరపించిన... రామకృష్ణ

(రామకృష్ణ జయంతి)

- కొడుకుల శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్ట్



శిశువులు, పశువులు, పాములు కూడా సంగీతానికి స్పందిస్తాయనేది ఆర్యోక్తి. ఎల్లలు లేనిది సంగీతం. చిత్తూరు నాగయ్య, ఘంటసాల వెంకటేశ్వరరావు వంటి మహానుభావులెందరో ఆ అమృత ఝరిని సినీ సంగీత రూపంలో అందించారు. రెండు దశాబ్దాల పాటు ఘంటసాల గళానికి, స్వరానికి అలవాటు పడిన మన చెవులకు వారి నిష్క్రమణ పర్వంలో మరొక గళం అందుకుంది. అగ్రనాయకులు అక్కినేని, ఎన్టీఆర్‌లకు పాటల పాడే గొంతు ఇక లేదేమో అనుకుంటున్న తరుణంలో అభిమానులకు ప్రత్నామ్నాయం దొరికింది. మరో రెండు దశాబ్దాల పాటు ఆ సంగీత సామ్రాట్టు గళాన్ని మరిపించిన మరో ఘంటసాల, మనం రామకృష్ణగా పిలుచుకున్న విస్సంరాజు రామకృష్ణ దాసు. తెలుగు సినీ సంగీత ఉద్యానవనంలో మరో కోయిలైన రామకృష్ణ గురించి కొన్ని మాటలు...

సంగీత కుటుంబ నేపథ్యం

రామకృష్ణది సంగీత నేపథ్య కుటుంబం, తాత పులిపాక ముకుందరావు వైణిక విద్వాంసులు. తల్లి రత్నమ్మ సంగీత వాతావరణంలోనే రామకృష్ణను పెంచింది. ఆమె విజయనగరంలో ప్రముఖ వాయులీన విద్వాంసులు పద్మశ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడు వద్ద విద్యను అభ్యసించారు. ప్రఖ్యాత గాయని పులిపాక సుశీల, రామకృష్ణ తల్లికి స్వంత చెల్లెలు. కుటుంబమంతా సంగీత నిలయం కావడంతో రామకృష్ణకు సహజంగానే స్వరజ్ఞానం ఒంటబట్టింది. వృత్తిరీత్యా తండ్రి గనుల శాఖలో ఉన్నతోద్యోగి కావడంతో రామకృష్ణ బాల్యం హైదరాబాద్‌లోనే గడిచింది. ఒకవైపు చదువు కుంటూనే నేదునూరి కృష్ణమూర్తి వద్ద శాస్త్రీయ సంగీతం అభ్యసించారు. ఘంటసాలకు వీరాభిమాని కావడంతో వేసవి సెలవుల్లో మద్రాసు వెళ్ళినప్పుడు పిన్ని సుశీలతో కలిసి రికార్డింగులకు వెళ్ళి శ్రద్ధగా రిహార్సల్స్ చేయడాన్ని, పాడే విధానాన్ని, సంగీత దర్శకులు రికార్డింగు చేసే పద్ధతుల్ని నిశితంగా గమనించే వారు. అలా 'శ్రీకృష్ణ విజయం' చిత్రం కోసం "పిల్లనగ్రోవి పిలుపు మెల్లమెల్లన రేపెను వలపు" అనే పాట రికార్డింగుకు పిన్నితో వెళ్ళినప్పుడే రామకృష్ణ తొలిసారిగా ఘంటసాలను చూసారు. అలా ఘంటసాలతో మాట్లాడే అవకాశం రామకృష్ణకు 1970లో కలిగింది.

సింహాద్వారం గుండా ముందడుగు

రామకృష్ణ చదవుకునే రోజుల్లో చిత్తరంజన్ రేడియోలో నిర్వహించే 'యువవాణి' కార్యక్రమంలో పాల్గొంటూ లలితగీతాలు ఆలపిస్తూ వుండేవారు. కాలేజీలో చేరాక సాంస్కృతిక కార్యక్రమాల్లో తొలిపాట రామకృష్ణతోనే మొదలయ్యేది. అప్పుడే సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నించాలనే ఆలోచన అతనికి కలిగింది. 1972లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బిఎస్సీ చదువుతుండగా రామకృష్ణకు అనుకోకుండా పాడే అవకాశం వచ్చింది. కుంటుంబ నియంత్రణ డాక్యుమెంట్రీ చిత్రం కోసం రెండు పాటలు కె.బి.కె.మోహనరాజు పాడాల్సి ఉండగా, ఆయన బిజీగా ఉండడంతో ఆ అవకాశం రామకృష్ణకు దక్కింది. పాటల రికార్డింగు సారథి స్టూడియోస్‌లో జరుగుతున్నప్పుడు అక్కడే ఉన్న అక్కినేని నాగేశ్వరరావు అతడి గళం విని, మెచ్చుకుని అన్నపూర్ణ బ్యానర్ మీద నిర్మించబోయే 'విచిత్రబంధం' సినిమాలో పాడే అవకాశాన్ని ఇస్తానని మాటయిచ్చారు. అలా తొలిప్రయత్నంలోనే అక్కినేని వంటి గొప్ప నటుడికి పాడే అవకాశం రామకృష్ణకు దక్కడం అదృష్టం. మద్రాసు జెమినీ స్టూడియోలో కె.వి.మహాదేవన్ స్వరపరచగా పిన్ని సుశీలతో కలిసి పాడిన దాశరథీ గీతం "వయసే ఒక పూలతోట... వలపే ఒక పూలబాట" రామకృష్ణ సినిమాలో పాడిన తొలిపాట. అందులో కొసరాజు రాసిన "చిక్కావు చేతిలో చిలకమ్మా... నీవు ఎక్కడికి పోలేవు ఆగవమ్మా" అనే సోలో సాంగ్ కూడా పాడారు. ఈ రెండు పాటలూ సూపర్ హిట్టు కావడంతో చిత్రసీమ దృష్టి రామకృష్ణ వైపు మరలింది. అలా అదృష్ణం తలుపుతట్టి రామకృష్ణను గాయకుడిగా నిలబెట్టింది.

భుజం తట్టిన గాన గంధర్వుడు

అదే సంవత్సరం ప్రతాప్ ఆర్ట్స్ ప్రొడక్షన్స్ నిర్మాత కె.రాఘవ, దాసరి నారాయణరావుకు తొలిసారి దర్శకత్వ బాధ్యతలు అప్పగిస్తూ "తాత మనవడు" సినిమా నిర్మాణానికి పూనుకొని రమేష్‌నాయుడికి సంగీత దర్శకత్వ బాధ్యతలు అప్పగించారు. నారాయణరెడ్డి రాసిన "అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం... ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే నాటకం... వింత నాటకం..." పాటను రామకృష్ణ చేత రమేష్‌నాయుడు రిహార్సల్స్ చేయిస్తుంటే ఘంటసాల

యాదృచ్ఛికంగా అక్కడకు వచ్చారు. రామకృష్ణ పాడుతున్న తీరును మెచ్చుకుని, కొన్ని కిటుకులు చెప్పి, రికార్డింగు రోజు తను కూడా స్టూడియోకి వచ్చి చూస్తానని చెప్పి భుజం తట్టి వెళ్లారు. అలా తొలిసారి ఘంటలసాలను చూసిన జెమినీ రికార్డింగ్ థియేటర్లోనే ఘంటసాల ప్రోత్సాహం లభించడం రామకృష్ణకు మనోబలాన్ని పెంచింది. ఈ పాట రామకృష్ణకు చాలా మంచి పేరు తెచ్చిపెట్టింది. అదే సినిమాలో సినారే రాసిన మరోపాట "ఏమిటో ఈలోకమంత... ఎంతకూ అంతుపట్టని వింత"ను కూడా రమేష్‌నాయుడు రామకృష్ణతో పాడించడం విశేషం. 'తాత మనువడు' సినిమా సూపర్ హిట్ కావడంతో రామకృష్ణ పాటలకు మంచి డిమాండ్ వచ్చింది. "పాడే పాట ముఖ్యం కాదు. సంగీత దర్శకుని బాణీని అర్థం చేసుకుని, పాటలోని సాహిత్యాన్ని గ్రహించి భావాన్ని గొంతులో పలికించాలి. మాటలను, భావాలను, విభజించి పలకాలి" అని ఘంటసాల రామకృష్ణకు మెళకువలు బోధించారు. ఘంటసాల చెప్పిన విధంగానే రామకృష్ణ పాటల మీద మంచి పట్టు సాధించారు. అది ఎలాంటిదంటే 1973లో అంజలి పిక్చర్స్ వారు నిర్మించిన 'భక్త తుకారం' సినిమాలో ఘంటసాలతో బాటు రామకృష్ణ కూడా మంచి పాటలు పాడారు. ఈ సినిమా శతదినోత్సవ సభలో రామకృష్ణ "కరుణామయా దేవా" పాటను ఆలపించినప్పుడు ఘంటసాలకు అనుమానం వచ్చి సభావేదిక మీదే రామకృష్ణను 'సినిమాలో ఆ పాట నేను పాడానా లేక నువ్వే పాడావా" అని అడగడంతో రామకృష్ణకు గండపెండేరం తొడిగించుకున్నంతగా ఆనందం కలిగింది. అదే సభావేదిక మీద ఘంటసాలే స్వయంగా రామకృష్ణకు శాలువ కప్పి సత్కరించారు. అనారోగ్యం కారణంగా తను పాడాల్సిన పాటలను రామకృష్ణతో పాడించమని సంగీత దర్శకులకు ఎన్నో సార్లు సిఫార్సులు కూడా చేసారు. 'భక్త తుకారం'లో రామకృష్ణ పాడిన 'శ్యామసుందరా ప్రేమమందిరా', "మనసున నీవే నిలిచినవేళ జపముల తపముల ఇంకేలా", "పిలుపు వినగాలేవా...నీ గుడికి తిరిగిరావా", "పాండు రంగ నామం పరమపుణ్య ధామం" పాటలు అజరామారాలై నిలిచాయి. ఆదినారాయణరావు సంగీత దర్శకత్వంలో పాడడం తన పూర్వజన్మ సుకృతమని అని రామకృష్ణ చెప్పేవారు.

కలిసిన బంధం

ఒకవైపు సినిమాల్లో పాటలు పాడుతూనే పాట కచేరీలు కూడా రామకృష్ణ నిర్వహించేవారు. రామకృష్ణ ఇచ్చినన్ని స్టేజి ప్రోగ్రాములు మరెవ్వరు ఇవ్వలేదనేది నిర్వివాదాంశం. ఈ కచేరీలో తనతో బి.వసంత ఎక్కువగా గళం కలుపుతూ ఉండేది. తరువాత రోజుల్లో డివియస్.రాజు 'ధనమా - దైవమా' పాటల రిహార్సల్స్ సందర్భంగా పరిచయమైన జ్యోతి ఖన్నా అనే అమ్మాయి రామకృష్ణ బృందంలో చేరి పాటలు పాడసాగింది. ఒకసారి ప్రోగ్రాం జరుగుతుండగా ప్రేక్షకులు "ఇద్దరూ ఈడూ జోడు బాగున్నారు" అంటూ మెచ్చుకున్నారు. మరో చోట వాళ్లిద్దరూ భార్యభర్తలని అనుకొని" మీ దంపతులిద్దరూ మా ఇంటికి విందుకు రావాలి" అని ఒక అభిమాని ఆహ్వానించారు. ఇంకో చోట యాంకర్ "ఇప్పుడు పాడబోయే పాటను రామకృష్ణ, జ్యోతిరామకృష్ణ కలిసి గానం చేస్తారు" అంటూ ప్రకటించేసారు. ఇలాంటి మాటలకు మొదట్లో సిగ్గుపడినా తర్వాత ఇద్దరూ పరస్పరం ఇష్టపడ్డారు. ఆపై 1977లో రిజిస్టర్ వివాహం చేసుకున్నారు. రామకృష్ణ దంపతులకు సాయికిరణ్, శ్రీలేఖ ఇద్దరు సంతానం. సాయికిరణ్ చాలా సినిమాల్లో, టివి సీరియల్లో నటిస్తున్నాడు.

పాటల ఆణిముత్యాలు

రామకృష్ణ రెండు వందల సినిమాలు, ప్రైవేటు గీతాలు కలిపి దాదాపు ఐదువేలకు పైగా పాటలు పాడారు. 1970-80 ప్రాంతాల్లో రామకృష్ణ అద్భుతమైన పాటలు పాడారు. ముఖ్యంగా అక్కినేని, ఎన్టీఆర్, శోభన్‌బాబు, కృష్ణంరాజులకు తొలిరోజుల్లో ఎక్కువ పాటలు పాడారు. అక్కినేని మ్యానరిజాన్ని అనుసరిస్తూ పాడిన పాటలు ఘంటసాలను తలపించాయి. ముఖ్యంగా అందాల రాముడు సినిమాలో "ఎదగడానికెందుకురా తొందరా" పాటలో ఈ లక్షణం విలక్షణంగా కనిపిస్తుంది. అలాగే దానవీరశూరకర్ణ సినిమాలో పాండవోద్యోగ విజయాల పద్యాలు, భగవద్గీత ఖండికలు, ఆలపించిన తీరు ఘంటసాలను తలపించింది. రామకృష్ణ నిరంహాకారి, అందరితో కలుపుగోలుగా వుండే మనస్తత్వం. పిన్ని సుశీల సహకారం లభించినా తన స్వశక్తి మీదే వెలుగులోకి వచ్చిన గాయకుడు. అయితే పరిశ్రమలో కొందరి వల్ల రామకృష్ణ ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. అమరదీపం సినిమాలో 'నా జీవన సంధ్యా సమయంలో" పాట పాడుతున్నప్పుడు సంగీత దర్శకుడు రామకృష్ణను ముప్పు తిప్పలు పెట్టాడు. కానీ ఆ పాట సినిమా మొత్తానికే హిట్టయ్యిందనేది వేరే విషయం. ఇలాంటి ఇబ్బందులు రామకృష్ణకు మరెందరో సంగీత దర్శకుల వద్ద ఎదురయ్యాయి. 'అందరూ దొంగలే' సినిమాలో రామకృష్ణ పాడిన "పిల్లంటే పిల్లకాదు వర్ణించ వల్లకాదు" పాట శోభన్‌బాబుకు అతికినట్టు సరిపోవడంతో, రామకృష్ణ తనకు పాడాలని శోభన్ ఆంక్షలు పెట్టిన రోజులు లేకపోలేదు. రామకృష్ణ ఆలపించిన కొన్ని మధురగీతాలు గుర్తుచేసుకోవాలంటే ముఖ్యంగా: ఒసే వయ్యారి రంగి ఒగలమారి బుంగి (పల్లెటూరి బావ), శారదా నను చేరదాబీ శ్రీమతిగారికి తీరిన వేళా (శారద), కృష్ణవేణి తెలుగింటి విరిబోణీ (కృష్ణవేణి), నీ మనసు నా మనసు ఏకమై (ఇదాలోకం), ఒకనాటి మాటకాదు మధువొలకబోసే అందాలు కనువిందు చేస్తుంటే సారీ సో సారీ (కన్నవారి కలలు), కొత్తగా పెళ్లైన కుర్రవానికి చందమామ రావే జాబిల్లిరావే (బలిపీఠం), ఏదోఏదో అన్నది ఈ మసక వెలుతురు (ముత్యాలముగ్గు), ఆకాశం దించాలా నెలవంక తుంచాలా శివశివ శంకర భక్తవశంకర ఎన్నియల్లో ఎన్నియల్లో చందమామ కంద గెలిచింది (భక్తకన్నప్ప), మనసులేని బ్రతుకొక నరకం నా పక్కన చోటున్నది ఒక్కరికే పెదవి విప్పలేను మొరటోడు నా మొగుడు (సెక్రటరీ), అంతలేసి అందాలు ఇంతే ఈ జీవితమూ (అమరదీపం), పూవులకన్నా పున్నమి వెన్నెలకన్నా (కరుణామయుడు) జీవితం మధుశాల యవ్వనం రసలీల (వయసు పిలిచింది), ఆశయాల పందిరిలో (యవతరం కదిలింది) ఈ నదిలా నా హృదయం, వీణలేని తీగను (చక్రవాకం), ఎక్కడున్నావు ప్రభూ కనుగొంటిని హరినీ హరినామమే మధురం (చక్రధారి) ఇక్కడే కలుసుకున్నాము (జీవితం), గాలిలో పైర గాలిలో (గంగ-మంగ), ఒక్కరిద్దరుగా

మారేది (ఆలుమగలు), జాబిల్లి చూసేను నిన్ను నన్ను (మహాకవి క్షేత్రయ్య), నీ కన్నులలోనే చూసానులే (బంగారు కలలు), అనురాగమే ఒక ఆలయం (దేవదాసు మళ్లీ పుట్టాడు), చిలకమ్మ పలకవే పలుకు (శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర)....లాంటివి ఎన్నో. ఘంటసాల తర్వాత ఆ స్థాయిలో అసంఖ్యాకంగా భక్తిగీతాలను ఆలపించిన ఘనత రామకృష్ణకే దక్కుతుంది. ఆయన ఆలపించిన భక్తిగీతాల ఆల్బమ్‌లు విశేష ఆదరణ పొందాయి.

అపురూపం ఆ బహుమానం

'భక్త తుకారం' శతదినోత్సవ వేడుకల్లో ఒక చిన్నారి ఆటోగ్రాఫ్ కోసం వస్తే ఘంటసాల మొదట తను సంతకం చేసి, ఆ ప్రక్కనే రామకృష్ణ సంతకాన్ని కూడా పెట్టించడం తనకు దక్కిన గొప్ప బహుమతిగా రామకృష్ణ ఎన్నోసార్లు గుర్తుతెచ్చుకునేవారు. ఓసారి అమెరికా వెళ్లినప్పుడు హరిబాబు అనే వైద్యుడు కెనడా దేశపు డాలర్ నోటుమీద ఘంటసాల చేసిన ఆటోగ్రాఫును తనకు బహుమానంగా ఇచ్చినప్పుడు దాన్ని అపురూపంగా దాచుకున్నారు. ఎన్టీఆర్ సొంత సినిమా 'శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర' సినిమాలో పాటలన్నిటినీ సంగీత దర్శకుడు సుసర్ల దక్షిణామూర్తి రామకృష్ణ చేత పాడించారు. ఆ సినిమా ఘన విజయం సాధించినప్పుడు ఎన్టీఆర్ రామకృష్ణను ఆలింగనం చేసుకొని "ఈ సినిమా విజయంలో మీ పాత్ర కీలకమైంది బ్రదర్" అని ప్రశంసించడం అరుదైన ప్రశంసంగా రామకృష్ణ పరిగణించారు.

క్యాన్సర్ వ్యాధి రామకృష్ణను 68 ఏళ్లకే బలి తీసుకుంది. విజయనగరంలో 1947 ఆగస్టు 20న పుట్టిన రామకృష్ణ, 2015 జులై 16న హైదరాబాద్‌లో మరణించారు.

ఉత్తరాంధ్ర ప్రజల గుండె చప్పుడు వంగపండు

- పి.సుకుమార్



వంగపండు గీతాలు ప్రజా
జీవిత దర్పణాలు కారు
చీకట్లో, దిశానిర్దేశం చేసే
దీప శిఖలు అణగారిన
వారిలో విప్లవాన్ని
కలిగించే ఉద్దీపనాలు
ఈ పాటలు వాస్తవ
అనుభవ భావ
రసాలు అంతే లేని
అవధుల్లేని మహా సాగర
ప్రవాహాలు సకల నవరస సమ్మేళన
మధురానుభూతులు సిద్ధాంత
అభిమత సాగర సంగమాలు
వంగపండు పాటలో వేగం
ఉంటుంది రాగం ఉంటుంది
ఓరకమైన ఊపు ఉంటుంది
అందులో పేదల బాధల రూపు
ఉంటుంది చూపు ఉంటుంది సమాజానికి
అంటుకున్న రోగం ఉంటుంది వ్యంగ్యం
ఉంటుంది. హాస్యం ఉంటుంది. విజ్ఞానం
ఉంటుంది. వినోదం ఉంటుంది. ఆనందం
ఉంటుంది. ఆవేశం ఉంటుంది. విప్లవం
ఉంటుంది. సరసం ఉంటుంది. పెంకితనం
ఉంటుంది. తెంపరితనం కూడా ఉంటుంది.
అన్నిటికి మించి ప్రజల హృదయం
ఉంటుంది. వారి కన్నీటి బాధల జీవితం
ఉంటుంది. వాస్తవం ఉంటుంది.
కరుణారసం ఉంటుంది. అన్నార్తుల
ఆర్తనాదం ఉంటుంది. పీడితుల గుండె శబ్దం
ఉంటుంది. జీవిత సారం ఉంటుంది. జీవన
వేదం ఉంటుంది. వేదాంతం ఉంటుంది.
కొంత వైరాగ్యం ఉంటుంది. ఉండనే
ఉండనిది ఏమిటంటే అబద్దం ఉండదు.
అవకాశ వాదం ఉండదు. కల్పిత కథనం
ఉండదు. నిరాశ ఉండదు. భయం ఉండదు.
దైన్యం ఉండదు. పిరికితనం ఉండనే
ఉండదు. ఇదీ వంగపండు గీతం..
వంగపండు జీవితం...

వైఎస్ రాజశేఖర్ రెడ్డి కల

డాక్టర్ విజయ్ ప్రసాద్



విద్యా వ్యవస్థ సమూలంగా ప్రక్షాళన చేయడం, పేదవారికి ఉన్నత విద్య అందుబాటులోకి తేవడం.. ఇదీ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కల. ఫీజురీఎంబర్స్ మెంట్ ద్వారా ఆ కల సాకారమైంది. ఫీజు రీఎంబర్స్ మెంట్‌తో ఎంతోమంది పేద విద్యార్థులు, ఎంసీఏ, ఎంబీఏలు చదివారు, ఇంజినీరింగ్ పూర్తి చేసి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇంజినీరింగ్ వాల్యూ పడిపోయిందని కొన్ని విమర్శలున్నా.. పేదలకు మాత్రం ఉన్నత విద్య పూర్తిగా అందుబాటులోకి వచ్చింది వైఎస్ హయాంలోనే.

ఇక జగన్ జమానాలో వైఎస్ కల పూర్తిగా సాకారం కాబోతోంది. పిల్లలను ఇంగ్లిష్ మీడియం చదివించాలనేది ఇప్పటి తల్లిదండ్రుల కల. ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు కట్టలేక, పల్లెటూళ్లలో సరైన వసతులు లేక సగం మంది సతమతమయ్యేవారు. ఇంకొంతమంది తమ పిల్లల చదువుల కోసం అప్పు చేసి తిప్పలు పడేవారు. ఆ కష్టాలన్నీ తీర్చేందుకే జగన్ అమ్మఒడి ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటు, ప్రైవేట్ స్కూళ్లలో చదువుకునేవారికి కూడా అమ్మఒడి అందించారు.

వాస్తవానికి ప్రతి బిడ్డకూ అమ్మఒడి సొమ్ము అందాల్సి ఉన్నా.. ప్రైవేట్ స్కూల్స్‌కి కూడా పథకం వర్తింపజేయడంతో ఇద్దరు ముగ్గురు పిల్లలున్నా కూడా ఒక తల్లికి ఒకటే ఆర్థిక సాయం అందింది. అయితే వచ్చే ఏడాది ఈ పథకంలో భారీ మార్పులు ఉండబోతున్నాయని సమాచారం.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ స్కూల్స్‌లో కూడా ఇంగ్లిష్ మీడియం అందుబాటులో ఉంటుంది. నాడు-నేడు పథకం ద్వారా అన్ని మౌలిక వసతులు అప్పటికి పూర్తవుతాయి. స్కూల్ తెరవగానే యూనిఫామ్, షూస్, బుక్స్.. అన్నీ ఒకేసారి ఉచితంగా ఇచ్చేస్తారు. అంటే వచ్చే ఏడాదికల్లా ప్రైవేట్ స్కూల్స్‌కి ధీటుగా ప్రభుత్వ స్కూల్స్ ఉంటాయన్నమాట.

సో.. అమ్మఒడిని కేవలం ప్రభుత్వ స్కూళ్లకు పరిమితం చేసినా వచ్చే ఇబ్బందేమీ ఉండదు. పేదలంతా ప్రభుత్వ స్కూళ్లలోనే ఉంటారు కాబట్టి, అసలైన లబ్ధిదారులు వారే అవుతారు. అప్పుడు ప్రతి తల్లికి కాకుండా, ప్రతి బిడ్డకు అమ్మఒడిని అందించే ఆర్థిక వెసులుబాటు ప్రభుత్వానికి ఉంటుంది. అంటే ప్రైవేటుపై వేటుకి రంగం సిద్ధమవుతోందన్నమాట.

ఇన్నాళ్లూ పిల్లల భవిష్యత్‌ని బూచిగా చూపి తల్లిదండ్రుల వద్ద ఫీజుల పేరుతో వేలకు వేలు గుంజేసిన కార్పొరేట్ విద్యా వ్యవస్థ మొత్తం ఈ దెబ్బతో విలవిల్లాడాల్సిందే. ప్రభుత్వ స్కూళ్లు కళకళలాడాల్సిందే. ఆ విధంగా.. తండ్రి ఉన్నత విద్యను పేదలకు అందుబాటులోకి తెస్తే.. తనయుడు ప్రాథమిక విద్యలో పెను మార్పులకి శ్రీకారం చుట్టారు. దటీజ్ వైఎస్సార్.. దిసీజ్ జగన్ సార్..


పాపం..రంగనాధ్

- డా॥గంగాధర్

1969లో బుద్ధివంతుడు అనే సినిమా షూటింగ్ జరుగుతుంది... అందులో "టాటా..వీడ్కోలూ...గుడ్ బై ఇంక సెలవూ." అనే పాట చిత్రీకరణ జరుగుతుంది. అందులో ఆర్కెస్ట్రా బృంధంగా నటిస్తున్న వారిలో ఒక 20 సంవత్సరాల ఆజానుభాహుడైన యువకుడు ఫ్లూట్ ఊదుతున్నట్లు నటిస్తున్నాడు..ఎందుకో తెలియదు కెమెరామెన్ చేతిలోని కెమెరా పదేపదే అతని వైపే ఫోకస్ అవుతుంది.. ఏదో తెలియని ఆకర్షణ ఆ యువకునిలో కనిపిస్తుంది...అది గమనించాడు ఆ చిత్రదర్శకుడు బాపూగారు. ఆ యువకుడి గురించి వివరాలు అడిగాడు.. ఆ యువకుడి పేరే యస్ యస్ రంగనాధ్ ..ఆరడుగుల అందగాడు. అందాలరాముడు సినిమా తీస్తున్నప్పుడు బాపుగారు రంగనాధ్ గారిని రమ్మని కబురుపంపాడు. ఆయన వచ్చిన తరువాత అందాలరాముడు సినిమాలో "రాముడి పాత్ర వుంది వేస్తారా అన్నారు"అందుకు రంగనాధ్ గారు, సర్, గిరిబాబుగారు నన్ను హీరోగా "చందన"అనే సినిమా తీయబోతున్నారని బాపూగారితో చెప్పగా ,మంచిది..ఇది చిన్నరోల్ మాత్రమే..హీరోగానే నటించమని సలహా ఇచ్చారు బాపూగారు.ఆ విధంగా 1974లో చందన అనే సినిమాలో మొదటహీరోగా నటించారు రంగనాధ్ గారు.

1949 జూలై 17న చెన్నైలో పుట్టిన రంగనాధ్ గారు చిన్నతనంలోనే తాతగారి ఇంటికి దత్తతుకు వెళ్ళారు.తాతగారు మైసూరు ఫ్యాలస్‌లో రాజాగారికి వ్యక్తిగత వైద్యులు. అదీగాక తాతగారి కుటుంబమంతా సంగీతవిద్వాంసులే. ఆయన అమ్మమ్మగారు వీణవాయించడంలో గోల్డ్ మెడల్ సాధించివున్నది. అమ్మ జానికమ్మగారు మంచి సంగీతవిద్వాంసులు..తబలిష్టు. అందుకే ఆయనకు సంగీతంపై మక్కువ ఏర్పడింది..క్రమంగా నాటకరంగంలోనికి అడుగుపెట్టాడు.

తిరుపతిలో కళాశాలవిద్య పూర్తికాగానే వాళ్ళమ్మ అతనిని సినిమాలలో నటించమని ప్రోత్సహించింది.అయితే వారి బంధువులెవరూ సినీరంగంలో లేరు..సినీఫీల్డ్‌లో నిలదొక్కుకోవడం అంత ఈజీకాదని గ్రహించిన రంగనాధ్ గారు రైల్వేలో టి.సిగా చేరిపోయాడు..కుటుంబపరిస్థితుల దృష్ట్యా అది ఆయన అత్యంత అవసరమైనది కూడా, అయినా సినిమారంగంలోనికి అడుగుబెట్టాలనే కోరిక వదలలేదు.



మొదటి సినిమా "చందన" విజయవంతంకాకపోయినా మంచి ప్రవర్తన,స్పష్టమైన తెలుగు ఉచ్చారణ! అభినయం ఉన్న రంగనాధ్‌ను తెలుగుసినిమా గుర్తించింది. జమీందార్ అమ్మాయి, పంతులమ్మ, ఇంటింటి రామాయణం,దేవతలారా దీవించండి, లాంటిసినిమాలు ఆయనను హీరోగా అగ్రస్థానానికి చేర్చాయి. అయితే తెలుగుసినీపరిశ్రమలో వచ్చిన మార్పులకు అనుగుణంగా రంగనాధ్ గారు నటించిన సినిమాలలాంటికథలకు ఆధరణ తగ్గిపోయింది.దాని ప్రభావంతో ఆయన హీరో ప్రస్థానంకూడా కనుమరుగైపోయింది.దాదాపు ఐదారు సంవత్సరాలు చాలా కష్టాలు పడ్డాడు..పెద్దకుటుంబం..దాని పోషణభారం ఆయనదే..నెలకు రెండుబస్తాల బియ్యమే కావాలి..

విధిలేని పరిస్థితులలో"గువ్వలజంట"సినిమా ద్వారా విలన్ గా రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించారు.గువ్వలజంట సినిమా విజయవంతంగాకపోయినా విలన్ గా దాదాపు 50 సినిమాలపైగా నటించాడు.ఖైదీ సినిమాతో క్యారెక్టర్ నటుడిగా మంచిపేరు రావడంతో క్యారెక్టర్ నటుడిగా స్థిరపడిపోయారు.

ఆరడుగుల నిండైన విగ్రహం.గంభీరమైన కంఠం..అంతకు మించి కుటుంబవిలువలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చే మనసున్న మంచిమనిషి.,,తమ బంధువుల పిల్లల చదువులకోసం తన ఇంటినే హాస్టల్‌గా మార్చిన మహనీయుడు..దురదృష్టపుశాత్తూ ఒకరోజు వర్షం

పడుతున్న సమయంలో పాలకోసం పై అంతస్థు నుండి క్రిందకు వచ్చి పైకి వెళుతున్న సమయంలో కాలుజారిపడిపోయిన శ్రీమతి వెనుపూస దెబ్బతినడంతో మంచానికే పరిమితమైంది..అయినా ఒక చిన్నబిడ్డను సాకినట్లు తన భార్యను సాకాడు!! మగవాడైనప్పటికీ అన్నిరకాల సపర్యలు చేశాడు..ఒక మహోన్నతమైన,ఆదర్శవంతమైన భర్తగా నిలిచాడు..

తెలుగుసినిమా పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకున్నాడు.. మంచికవిగా కూడా పేరు తెచ్చుకున్నాడు..నిజాలను నిర్భంగా చెప్పే అతను ఆత్మహత్యలను మహా పిరికిచర్యగా అభివర్ణించేవాడు.. యాధృచ్ఛకంగా తనూ ఆత్మహత్యే చేసుకున్నాడు. రంగనాథ్‌గారు.

బలవంతంగా ప్రాణం తీసుకున్నారంటే బహుశా తను బతకూడదనే అంతటి విరక్తి పుట్టివుండవచ్చు..అసలు అతని ఆత్మహత్యకు కారణమేమి?? నేటి ఉరుకులపరుగుల జీవనశైలికి ఉదాహరణ.. చివరిరోజులలో "ఒంటరి"తనం.. అతనికి కష్టం అనిపించింది... అప్యాయంగా మాట్లాడేవారే కరువైనారు,, మనదేశంలో సీనియర్ సిటిజన్స్ ఎంత నిరాధరణకు గురౌతున్నారో..రంగనాథ్‌గారి జీవితమే ఉదాహరణ..

ప్రశాంతంగా తనువుచాలించాల్సిన సమయంలో బలర్మరణం మా మనసును కదిలించింది!! రంగనాథ్‌గారు మీ కోసం మేం చేయగలిగింది ఒక్కటే..కన్నీళ్ళు నిండిన కళ్ళతో నివాళులర్పిండమే..,, ఇంక మరే తండ్రి మీలాగ ఇటువంటి మరణం పొందకూడదని కోరుకుంటున్నాను. ఎందుకో రంగనాథ్‌గారిని చూస్తే మన కుటుంబంలో ఒక సభ్యునిగా అనుభూతి కలుగుతుంది. జూలై 17 ఆయన జన్మదినం సందర్భంగా...కన్నీరు నిండిన కళ్ళతో నివాళులు అర్పిస్తున్నాము!!!

ఆరోగ్యాంధ్ర

- పి.భూషణం

కుయికుయి మని అంబులెన్స్ హారన్ వింటే వెంటనే దివంగత నేత వైఎస్ గుర్తుకువస్తారు. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం జగన్ ఆధ్వర్యంలో ఆరోగ్యశ్రీ పథకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్వ వైభవం కల్పిస్తోంది. ఆ పథకానికి భారీగా నిధులు సమకూరుస్తూనే పెద్ద సంఖ్యలో సేవలు అందించేలా చర్యలు తీసుకుంటోంది. తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మానసపుత్రికగా ఉన్న ఈ పథకానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఇప్పటికే ఈ పథకానికి పెద్దపీట వేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల మహమ్మారి వైరస్‌కు చికిత్సను కూడా ఆరోగ్య శ్రీ పరిధిలోకి తేవడం తెలిసిందే. ఇప్పుడు తాజాగా వైద్య ఖర్చులు రూ.వెయ్యి దాటితే ఇప్పటికే వెయ్యి చికిత్సా విధానాలకు ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిధిలోకి మరో 87 చికిత్సా విధానాలు తీసుకువస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి విడుదల చేశారు. రూ. వెయ్యి నుంచి రూ.47 వేల వరకు ఖర్చయ్యే 87 చికిత్సా విధానాలను కొత్తగా ఆరోగ్య శ్రీ పథకంలోకి చేర్చినట్లు ప్రకటించారు. ఇన్ పేషెంటుకు అవసరమయ్యే 53 విధానాలతో పాటు 29 స్వల్పకాలిక చికిత్సా విధానాలు మరో 5 డేకేర్ విధానాలు ఈ విధానంలో ఉన్నాయి.

వైద్య ఖర్చులు రూ. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పరిధిలోకి తెస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ మేరకు హామీ నిలబెట్టుకుంటున్నారు. ఆరోగ్యశ్రీలో పలు మార్పులు చేసి పైలట్ ప్రాజెక్టుగా పశ్చిమ గోదావరి జిల్లాలో ఈ ఏడాది జనవరి 3వ తేదీ నుంచి అమలు చేస్తున్నారు. తాజాగా ఇది ఇప్పుడు విజయనగరం విశాఖపట్టణం గుంటూరు ప్రకాశం వైఎస్సార్ కడప కర్నూలు జిల్లాల్లో అమల్లోకి రావడం శుభ పరిమాణం.ఆరోగ్యశ్రీ విస్తరణ పథకాన్ని ప్రారంభించే సందర్భంలో కలెక్టర్లతో మాట్లాడిన సీఎం జగన్.. హోమ్ ఐసోలేషన్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని సూచించారు. "కరోనా వస్తుంది, పోతుంది.. భవిష్యత్‌లో కరోనా సోకని వారంటూ ఎవరూ ఉండరేమో" అంటూ మరోసారి స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న అసింప్టమాటిక్ కేసుల్ని చూస్తుంటే జగన్ మాటలు అక్షర సత్యాలని రుజువవుతున్నాయి.

కరోనా వచ్చినట్టు తెలియకుండానే చాలామందిలో తగ్గిపోయింది. అలాంటివారి వల్ల అది ఇతరులకు సోకిన దాఖలాలు ఏపీలో కనిపించలేదు. ప్రస్తుతం పాజిటివ్‌గా తేలుతున్న వారిలో సగం మందికి లక్షణాలు ఉండటంలేదు. ఇలాంటి సందర్భంలో అందరినీ తీసుకెళ్లి ఆస్పత్రుల్లో చేర్చాలంటే వసతులు సరిపోవు. అసలైన బాధితులకు వైద్యం అందకుండా పోయే ప్రమాదం కూడా ఉంది. ఆస్పత్రుల్లో చేరి మానసిక వ్యథతో లేనిపోని రోగాలు తెచ్చుకునే వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

దీంతో జగన్ ఫార్ములాయే ఇప్పుడున్న ఏకైక ప్రత్యామ్నాయం. హోమ్ ఐసోలేషన్‌ని అమలు చేసి, నిత్యం వారి ఆరోగ్య పరిస్థితుల్ని వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తూ వైద్యం అందిస్తే కరోనా భయం పూర్తిగా తొలగిపోతుంది.

పలకరింపు

- ఎస్. హిమబిందు

మనుషులకు మాత్రమే వున్న వరమిది. మానవీయ సంబంధాల వారధి. మనసు వ్యాకులతల పారద్రోలు మంత్రమిది

పలకరింపులు లేని సమాజం సమూహం ఒట్టి నిర్జీవంగా గోచరిస్తాయి. ఒక్క పలకరింపుతో నూతనోత్తేజమేదో తొంగి చూస్తూంటుంది. పలకరింపు అనేది మంచితనానికి, కలిసి బతికే మనిషితనానికి నిదర్శనంగా నిలుస్తుంది.

నేటి అత్యంతాధునిక అనేక సౌకర్యాల, విలాసాలననుభవిస్తున్న కాలంలో మనం పోగొట్టుకుంటున్న గొప్ప మానవాంశం పలకరింపు.

ఇది చాలా చిన్న విషయంగానే అనిపించవచ్చు. ఒక్క చిన్న మాటే పలకరింపై వెలగవచ్చు. కానీ ఎన్ని డబ్బులు పోసినా దొరకని అమూల్య సంపద పలకరింపు.

ఒక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు. ఒక బాధని తొలగించవచ్చు. ఒక ఆలోచనను రేకెత్తించవచ్చు. ఒక ఆశను చిగురింపచేయొచ్చు. మనసు గాయాలను, గాట్లను మాన్పించవచ్చు.

పలకరింపుకు అంత శక్తీ వుంది. పలకరించడమనే సమస్య నేడు ఇండ్లల్లో వృద్ధులు విపరీతంగా ఎదుర్కొంటున్నారు. తమ జీవితమంతా కుటుంబం కోసం, పిల్లల కోసం వెచ్చించి, వృద్ధాప్యంలో ఏమీ చేయలేని స్థితిలో ఇంట్లో వున్న పెద్దల్ని పనికిరాని వస్తువుల్ని చూసినట్లు చూస్తున్నారు. వారి శ్రమఫలమే వర్తమానపు మన కళ అని మరిచి పోతున్నారు.

అట్లాంటి పెద్దలను ఆప్యాయంగా పలకరించాలి ఒక మాట మాట్లాడాలి. ఒక్కసారి పలకరింపుతో వాళ్ళను కదిపి చూడండి. బండెడు అనుభవాలను మీ ముందుంచుతారు. ఆ అనుభవాలు ఇప్పటికీ మనకు దివిటీలా పని చేస్తాయి.

పలకరింపులు పెద్దలకు ఆరోగ్యాన్నిచ్చే మందులా పని చేస్తుంది. పెద్దలనే కాదు ఎవరినైనా పలకరిస్తూ వుండాలి. దాంతో స్నేహం, బంధం, ప్రేమ, అనుబంధం పెరుగుతూ వుంటుంది. ఇవి కేవలం మనుషులు సాధించేవి.

ప్రముఖ కథా రచయిత్రి ఇల్లిందల సరస్వతీ దేవిగారు తీయని పలకరింపు అని ఒక కథను రాశారు.

అందులో ఒక రిటైర్డు పెద్దాయన, పలకరింపులు లేక పడుతున్న బాధను చక్కగా చిత్రించారు. "నేను డబ్బులు బాగా సంపాదిస్తూ ఉద్యోం చేస్తున్నపుడు నన్ను చాలా మందే పలకరించేవాళ్ళు. ఉద్యోగ విరమణ చేసి, ఆదాయం తగ్గిపోయిన క్షణం నుంచి పనికిరాని వాడిలా పలకరింపుకు నోచుకోలేక వృద్ధాశ్రమం చేరాను" అని పాత్రలో వివరిస్తుంది.

డబ్బులు మాత్రమే ముఖ్యంగా మారిన నేటి తరాలకు మనుషుల మధ్య సంబంధాలు అప్రధానమై పోయి ఈ పరిస్థితులు దాపురించాయి. ఇది లాభాల ఆర్జన కోసం సరుకుల మీద వ్యామోహాన్ని పెంచిన సాంస్కృతిక దాడి ఫలితం. దీన్ని మార్చకపోతే మనమూ ఒకప్పటికి బాధితులుగా మిగులుతాం.

లాక్‌డౌన్ మూలానా ఇంట్లోనే అందురున్నప్పటికీ వారి మధ్య దూరాలేవీ తగ్గలేదు. మరింత పెరుగుతూనే వున్నాయి. ఎవరి చేతుల్లో వాళ్ళు సెల్‌ఫోన్‌లతో ఇయర్ ఫోన్లతో తమలో తామే, తమకు తామే గడిపేస్తున్నారు. కుటుంబ సంబంధాల్లో విపరీత దూరాలు పెరుగుతున్నాయి.


మనసుల్లో దాగిన భావాలు,అభిప్రాయాలు పలకరించి అడిగితేనే తెలుస్తాయి. తెలిసినపుడే వాటిని సరిచేయడమో, చర్చించి మనం సరికావడమో చేయవచ్చు, కొన్ని అపోహలూ తొలిగిపోవచ్చు. కుటుంబం లోనే కాదు ఇంటి పక్కన వాళ్ళను, దూరాన వున్న మిత్రులను ఖాళీ సమయం దొరకగానే ఒకసారి పలకరించండి.

కరోనా బాధితులను, దాని వల్ల భయపడుతున్న వాళ్ళను పలకరించాలి. పది మందితో గల సంబంధమే జీవితం.

నాకు తెలిసిన ఒక పెద్దాయన అన్ని హంగులు ఉండి కూడా, తాను, తన భార్యాబిడ్డలు, సన్నిహితులతో ఏసి లాంటి సకల సౌకర్యాలు అనుభవిస్తూ, వృద్ధురాలు తన తల్లిని మాత్రం ఔట్ హౌస్ కొట్టుగదిలో ఉంచాడు. తనని పలకరించితేనే భార్య అనుగ్రహానికి దూరమైపోతానేమో అని భావించి, దూరంగానే ఉంచిన ప్రబుద్ధుడు.

"నాకేమీ పెట్టాల్సిన అవసరం లేదు, నేనేమీ అడగటమూ లేదు. రోజు ఏం చేస్తున్నావమ్మా, ఏం తిన్నావు, బాగున్నావా" అని నన్ను అడిగితే చాలని ఎనభై యేండ్ల తల్లి నాతో చెబుతూ దు:ఖించింది అంటే పలకరింపుల విలువేమిటో అర్థం చేసుకోవచ్చు. చివరికి ఆమె పోయిన తరువాత అతను కార్చిన మొసలికన్నీరుకి ఏ అవార్డు ఇవ్వొచ్చో అర్థం కాలేదు. అందుకే ...పలకరించండి. పలుకులేమీ బంగారం కాదు. మనిషి తనానికి ఆనవాళ్ళు.

బంధం తెగిపోయినా సరే..
నిజమే చెప్పండి.
అబద్ధాలు చెప్పి నమ్మకం మాత్రం పోగొట్టుకోకండి.
ఎందుకంటే.. తెగిన బంధం ఎప్పుడైనా తిరిగి కలవచ్చు.
పోయిన నమ్మకం మాత్రం తిరిగిరాదు.



వెలమ రాజుల శత్రుదుర్భేద్య దుర్గం "దేవరకొండ"


- వి.రాజశేఖర్

వచ్చిపోయే అతిథులతో కళకళలాడుతుండే అతిథి గృహాలు, వేదోచ్ఛారణలమధ్య వెలిగిపోతుండే గుళ్లు, గోపురాలు.. సిరిమువ్వల సవ్వడితో చేసే నాట్య విన్యాసాలు, సంగీత సాహిత్య సమ్మేళనాలు, రారాజుల తీర్పుకోసం వేచి ఉండే ప్రజలతో నిండిన రాజ ప్రసాదాలతో కళకళలాడుతూ దర్శనమిచ్చే చారిత్రక ప్రదేశం దేవరకొండ దుర్గం.

వెలమ రాజులు శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ఈ కట్టడం హైదరాబాద్ నుంచి నాగార్జున సాగర్ వెళ్లే దారిలో మల్లేపల్లి నుంచి ఏడుకిలోమీటర్ల దూరం లోపలికి వెళితే స్వాగతం పలుకుతుంది.ఎనిమిది వందల సంవత్సరాల క్రితం వెలమ రాజుల రాచరిక పరిపాలనా విధానానికి అనుగుణంగా, భద్రతా సంబంధమైన విషయాలతో శత్రువుల ఊహకు సైతం అందని విధంగా.. రాతి, మట్టి ప్రాకారాలతో నిర్మించిన దేవరకొండ దుర్గం వారి విజ్ఞతను చాటుతూ మనకు ఈనాటికీ దర్శనమిస్తోంది.

సంవత్సరాల తరబడి దుర్గంలోనే ఉంటూ యుద్ధం చేయాల్సి వచ్చిన సందర్భాలలో అందుకు అవసరమైన వనరుల్ని ఏర్పరచుకున్న తీరు.. శత్రు సైన్యంపై దాడి చేసేందుకు అనువుగా నిర్మించిన రహస్య స్థావరాలు... తదితరాలను పరిశీలిస్తే, ఆనాటి పద్మనాయక వెలమ రాజుల పరిజ్ఞానం నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ముందు దిగదుడుపే అనిపించకమానదు. కాకతీయ రాజులవద్ద సేనానులుగా పనిచేసిన పద్మనాయక వంశానికి చెందిన భేతాళ నాయకుడి సంతతివారు ఆ తరువాతి కాలంలో దేవరకొండ రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నట్లుగా చారిత్రక కథనాల ద్వారా తెలుస్తోంది. వీరి వంశంలో 8వ తరానికి చెందిన రెండవ మాదానాయుడు కాలంలోనే దేవరకొండ దుర్గం నిర్మాణం జరిపినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.మాదానాయుడి తండ్రి సింగమనాయుడు దుర్గం కొంత భాగం నిర్మాణం పూర్తి చేసినా, పూర్తి స్థాయిలో మాదానాయుడి కాలంలోనే రూపొందినట్లు తెలుస్తోంది. ఇతని కాలంలోనే దేవరకొండ రాజ్యం శ్రీశైలందాకా విస్తరించినట్లు చరిత్ర చెబుతోంది. 525 ఎకరాల విస్తీర్ణం, 500 అడుగుల ఎత్తుగల ఏడు కొండలను కలుపుతూ పద్మనాయకులు ఈ దుర్గాన్ని అత్యద్భుతంగా నిర్మించారు.సువిశాలమైన ఎత్తైన కొండలు హెచ్చుతగ్గులుండటంచేత అందుకు అనుగుణంగా చుట్టూ ఒకే ప్రాకారాన్ని కాకుండా, ఒకదాని వెనుక మరొకటిగా అనేక ప్రాకారాలను సంపూర్ణ పరిజ్ఞానంతో నిర్మించారు.

ఏడు కొండలను కలుపుతూ పెద్ద పెద్ద బండరాళ్లను చక్కగా చీల్చి చూసేవారిని ఆశ్చర్యంలో ముంచెత్తేలా 6, 8, 10 మీటర్ల ఎత్తుగల ప్రాకారాల గోడలను నిర్మించారు. దుర్గంలోపల కొండపైన సమృద్ధిగా జలవనరులున్నట్లు తెలుస్తోంది.అవన్నీ అలా ఉంచితే.. దుర్గంలోపల వంద ఎకరాల సువిశాల వ్యవసాయ క్షేత్రం ఉండటం విశేషంగా చెప్పవచ్చు. ఈ దుర్గంలో 360 బురుజులు, 9 ప్రధాన ద్వారాలు,



32 చిన్న ద్వారాలు, 23 పెద్ద బావులు, 53 దిగుడు బావులు, 6 కోనేరులు, 5 చిన్న కొలనులు, 13 ధాన్యాగారాలు, గుర్రపుశాలలు, ఆయుధాగారాలు ఉండేవని చరిత్ర ద్వారా తెలుస్తోంది. అయితే సరైన రక్షణ లేని కారణంగా వీటిలో నేడు చాలా వరకు శిథిలమైపోయాయి.

ప్రధాన ద్వారాల నిర్మాణంలో కూడా వెలమ రాజులు సంపూర్ణ పరిజ్ఞానాన్ని ఉపయోగించి కట్టినట్లు అర్థమవుతోంది. ఒకవేళ శత్రువులు చొరబడినా వారిని అంతమొందించేందుకు మొదటి ద్వారం నుంచి రెండో ద్వారం చేరేందుకు అతి సమీపంలోనే మూడు మలుపులు తిప్పి వాటిని నిర్మించడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఈ మెలికలు తిరిగిన 3 మలుపులలో దాదాపు 100 మంది సైనికులు శత్రువులకు కనిపించకుండా రహస్యంగా నక్కి ఉండేలా స్థావరాలను సైతం నిర్మించారు.

అంతేగాకుండా.. కొండమీద నెలవైన దుర్గం కాబట్టి, కొండపైకి ఎక్కి గోడను కూలద్రోయటంగానీ, గోడను ఎగబాకి లోపలికి ప్రవేశించటం సాధ్యపడదు. సింహద్వారాలకు అతి సమీపంలో "యు" ఆకారంలో బలమైన బురుజులను నిర్మించి శత్రువులు లోనికి చొరబడేందుకు ఏ మాత్రం అవకాశం ఇవ్వని విధంగా దుర్గాన్ని నిర్మించారు.

మొదటి రెండు ద్వారాలను అతి సమీపంలో నిర్మించి వాటి మధ్య రెండు అంతస్థులుగా సైనిక స్థావరాలను నిర్మించారు. మొదటి ద్వారం దాటగానే కొత్తవారు సైతం నోరెళ్లబెట్టే విధంగా రెండు ద్వారాలను నిర్మించారు. ఇందులో ఒకటి డమ్మీ ద్వారం కాగా, మరోటి కోటలోపలికి ప్రవేశించేది. ప్రతి ద్వారానికి అడుగు భాగాన రెండువైపులా పూర్ణకుంభాలను చెక్కించారు. ఈ కోట ద్వారాలపై చెక్కిన పూర్ణకుంభ కలశాలనే ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వం తమ అధికార చిహ్నంగా తీసుకుని ఉండవచ్చునని చారిత్రక పరిశీలకులు భావిస్తున్నారు. సింహద్వారం దాటి లోపలికి వెళ్లగానే ఎడమవైపు నల్లరాతి ఏకశిలా నంది విగ్రహం దర్శనమిస్తుంది. మరికాస్త దూరం ముందుకెళితే మరో ప్రధాన ద్వారం, ఆ తర్వాత కుడివైపుకు వెళితే శిథిలావస్థకు చేరుకున్న ధాన్యాగారాలు, సైనికావాసాలు, అధికారుల భవనాలు కనిపిస్తాయి. ఈ ప్రదేశం దాటి విశాలమైన మెట్లు ఎక్కి కాస్త దూరం వెళితే రెండో రాతి ప్రాకారం కనిపిస్తుంది. ఇందులో ఉండే విశేషం ఏంటంటే.. ఆ ప్రాకారం దగ్గరికి వెళ్లేదాకా దానికి అమర్చిన ద్వారం ఎవ్వరికీ కనిపించదు. అలాగే మెట్లు ఎక్కుతూ పడమరవైపు వెళితే మరో రాతి ప్రాకారం వస్తుంది. అందులో ఎన్నో రహస్య సైనిక స్థావరాలు నిర్మించబడి ఉన్నాయి.

దాన్ని దాటి ముందుకెళితే నాలుగో రాతి ప్రాకారం, దానినుంచి పడమర దిశగా పైకి ఎక్కుతూ వెళితే ఐదో ప్రాకారం వస్తాయి. ఐదో ప్రాకారంవద్ద ఇప్పటికీ ఏ మాత్రం చెక్కుచెదరని సింహ ద్వారం మనకు దర్శనమిస్తుంది. ఈ ద్వారం దాటి లోనికి వెళ్లగానే ఓ ఆలయం ఉంటుంది. దానికి ఉత్తర దిశగా వెళితే రెండు దారులు.. అందులో దక్షిణంవైపు మెట్లు ఎక్కి వెళితే దుర్గంలోని ఎత్తైన కొండపై ఉండే రామాలయానికి చేరుకుంటాం. కొండపైగల 50 ఎకరాల సమతల ప్రదేశంలో రాజమందిరం, అంతఃపురం, సభావేదికలు, రాణివాసాలు, రాజదర్బాలు మనకు ఆహ్వానం పలుకుతాయి. అక్కడికి నైరుతీ దిశలో గొలుసుబావి ఉంది. రాజవంశీకులు ఈ బావిలోని నీరే తాగేవారట. కోటను వదిలి వెళ్లేటప్పుడు విలువైన వస్తువులు, ధనం, నగలు, మోట బొక్కెనలలో నింపి వాటికి బలమైన ఇనుప గొలుసులు కట్టి ఈ బావిలో పడవేసి, గొలుసులను బలమైన రాతి స్థంభాలకు బిగించి వెళ్లేవారని తెలుస్తోంది. ఇందుకు నిదర్శనంగా ఆ గొలుసులు 1980 సంవత్సరందాకా కనిపించేవనీ, ఆ తర్వాత అవి అదృశ్యమయ్యాయని స్థానికులు చెబుతుంటారు.

గొలుసుబావికి ఎదురుగా ఉండే కోనేరు.. ఎన్ని కరువులు వచ్చినా ఎండిపోలేదని, దశాబ్దాల నుంచి నీరు ఒకేలాగా ఉందని కూడా స్థానికులు చెబుతుంటారు. గొలుసుబావికి ఉత్తరదిశగా కొంతదూరం నడచివెళితే విశాలమైన మట్టి ప్రాకారం మధ్య ఓ శివలింగం, నందీశ్వరుడు, పెకిలించబడిన ధ్వజస్థంభం, ఓంకారేశ్వరస్వామి ఆలయాలు కనిపిస్తాయి. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం మహాశివరాత్రి, వైకుంఠ ఏకాదశి రోజున స్థానిక గ్రామాల ప్రజలు పూజాదికాలు నిర్వహిస్తుంటారు. ఇక ఆనాటి ధాన్యాగారాలలో ఇప్పటికీ ధాన్యం పొట్టు చెక్కుచెదరకుండా కనిపించటం విశేషంగా చెప్పవచ్చు. దేవరకొండ దుర్గాన్ని శత్రు రాజులు ఎవరూ యుద్ధం ద్వారా స్వాధీనం చేసుకోలేక పోయినప్పటికీ, ఆనాటి రాజకీయ పరిణామాలు, పెరుగుతున్న శత్రువులు.. తదితర కారణాల చేత రెండవ మాదానాయుడి కాలంలో అక్కడి పాలకులు స్వచ్ఛందంగా కోటను వదలి, విజయనగర రాజులవద్ద ఆశ్రయం పొందినట్లుగా చారిత్రక కథనాల ద్వారా తెలుస్తోంది.

ఇదిలా ఉంటే..

భారత పురావస్తు శాఖవారు ఈ దేవరకొండ దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నప్పటికీ, వారి నిర్లక్ష్యం కారణంగా విలువైన చారిత్రక సంపద అంతా శిథిలావస్థకు చేరుకుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దుర్గంలో గుప్త నిధులకోసం అనేకమంది ఎంతో విలువైన కళాఖండాలను సైతం ధ్వంసం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పురావస్తు శాఖ ఇప్పటికైనా మేల్కొని మన పూర్వీకుల జాతి సంపదను కాపాడి, తరువాతి తరాల వారికి అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తుందని ఆశిద్దాం.



ఎవ్వరికీ "వంగ"ని లొంగని "పండు..

– గౌతమ్ శ్రీనివాస్



"ఆయన పాట ప్రజాజీవిత దర్పణం..చీకట్లో దిశను చూపే వెలుగు రేఖ..అణగారిన వర్గాల అభ్యున్నతికి ఊతకర్ర...ఆయన పాట జీవిత అనుభవ నవరసాల సారం.,అవధుల్లేని సాగరం..ఆయన పాటలో వేగం ఉంటుంది..ఊపుంటుంది..పేదల బాధ ఉంటుంది.. సమాజానికి పట్టిన రోగం ఉంటుంది..వైద్యమూ ఉంటుంది. ఖరీదైన కార్పొ"రేటు" లేని పాటల కర్మాగారం అతడు. అతడే **ఉత్తరాంధ్ర మణిపూస** వంగపండు ప్రసాదరావు. ఆటపాట ఆపేసి కాలిగజ్జెల సవ్వడీ నిలిపేసి అందరాని అనంతలోకాలకి వెళ్ళిపోయాడు. వంగపండు,, ఆయన దేహానికి మరణం కానీ ఆయన పాటకు కాదు ఇది ఆఖరి చరణం.. తరమెల్లిపోతున్నది ఆనాటి స్వరమాగిపోతున్నది" ...

ఇది వంగపండు ప్రసాదరావు రాసి, పాడిన ఒక పాటకు పల్లవిలోని వాక్యం...ఇప్పుడు అతను లేని కళింగాంధ్ర జానపదం విషాదగీతమాలపిస్తోంది. ప్రజా వాగ్గేయకారుడు' అనగానే తెలుగునాట గద్దర్ పేరు విన్పిస్తుంది. కానీ, ఆస్థాయి 'గొంతుక' ఇంకొకటి వుంది. ఆయనే వంగపండు ప్రసాదరావు. వెనుకబాటుతనానికి కేరాఫ్ అడ్రస్ కదా.. అందుకే, ఉత్తరాంధ్రకి చెందిన ప్రజా గాయకుడు వంగపండు ప్రసాదరావు. పాట కూడా తొక్కివేయబడింది. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవ..' అంటే వెంటనే 'మగధీర' సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్ గుర్తుకొస్తుంది. కానీ, ఒకప్పుడు అది వేలాదిమంది.. లక్షలాదిమందిని కదిలించిన పాట.

బహుశా ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఓ ముప్పయ్యేళ్ళ క్రితం 'ఏం పిల్లడో ఎల్దమొస్తవ' పాట పాడని వారంటూ ఎవరూ వుండరేమో. అంతలా జనాన్ని కదిలించింది ఆ పాట. ఇలాంటి ఎన్నో పాటల్ని రచించి, పాడిన ప్రజా గాయకుడు వంగపండు ప్రసాదరావు అనారోగ్యంతో మృతి చెందారు. విజయనగరం జిల్లా పార్వతీపురంలోని తన సొంత ఇంట్లో తుదిశ్వాస విడిచారు. ఏనాడూ వంగపండు ప్రసాదరావు తన పాటని అమ్ముకోలేదు. అదీ ఆయన ప్రత్యేకత. ఆయన పాటల్లోని పదాలు ప్రజల్ని కదిలించేవి.

ఉత్తరాంధ్ర యాసని ఆయన తన పాటల్లో పలికించిన తీరు అద్భుతం. ఉమ్మడి

తెలుగు రాష్ట్రం విడిపోతున్న సమయంలో సమైక్య ఉద్యమం కోసం కూడా గళం విప్పారు వంగపండు ప్రసాదరావు. కొందరు రాజకీయ నాయకులు ఆయన్ని 'వాడుకునేందుకు' ప్రయత్నించినా, చాలా సందర్భాల్లో ఆయన సున్నితంగా తిరస్కరించారు.

తమ రాజకీయ ప్రత్యర్థులపైకి వంగపండు పాటని అస్త్రంలా సంధించేందుకు జరిగిన ప్రయత్నాల్నీ ఆయన తప్పుపట్టారు. 'పాటంటే నాకు ప్రాణం.. ఎందుకంటే, పాట అనేది పీడిత ప్రజల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందనేది నా నమ్మకం..' అంటారు వంగపండు ప్రసాదరావు.

వంగపండు, ప్రజా గాయకుడు గద్దర్‌కి అత్యంత సన్నిహితుడు. పీడిత ప్రజల కోసం నినదించిన వంగపండు పాట, ఉత్తరాంధ్రలోనే కాదు, తెలంగాణలోనూ సత్తా చాటింది. ఏది ఏమైనా, ఉత్తరాంధ్ర గొంతుక వంగపండు ప్రసాదరావుతో మూగబోయింది. మళ్ళీ 'ఉత్తరాంధ్రకే ప్రత్యేకమైన యాసతో పాట' ఇంకో నోట ఆ స్థాయిలో వినగలమా.? ఏం పిల్లడో... మళ్లెప్పుడొస్తవో...!

ఏం పిల్లడో ఎల్దమొస్తవా...!

ఏం పిల్లో ఎల్దామొస్తవా...!

సికాకులంలో సీమల కొండకి...చిలకలు కత్తులు దులపరిస్తయట

సాలూరవతల సవర్ల కొండకి...సెవల పిల్లులే శంఖమూదెనట...

నల్గొండా నట్టడవిలోనికి... పాముని పొడిచిన చీమాలున్నాయట...

తెలంగాణ కొమరయ్య కొండకి... బడితెలు పట్టిన

ఉడతాలున్నయట...

కలకొత్తాలోని కొసకారు కొండకి... పులుల్ని మింగిన గొర్రెలున్నయట...

వావ్...!

ఆ మాటల్లో...

శ్రీకాకుళం యాస ఉంది...

ఉత్తరాంధ్ర ఊపిరి ఉంది...

జనం గోస ఉంది...

ఆ పదాల్లో...

జ్వలనం ఉంది...

చలనం ఉంది...

సమరం ఉంది...

ఆ ఆవేశం వెనుక...

మట్టి మనుషుల చెమట చుక్కలున్నాయి...

పేద బతకుల బాధలున్నాయి...

ఆగ్గిపిడుగులైన జనం గుండెమంటున్నాయి..

ఆ ఉద్రేకంలో...

బడుగులు ఎక్కుపెట్టిన బాణాలున్నాయి...

పీడితులు పేల్చిన తూటాలున్నాయి...

తాడితులు ఎగరేసిన తిరుగుబాటు జెండాలున్నాయి...

ఆ ఉద్వేగం...

శ్రీకాకుళం రైతాంగ పోరాటానికి బాసటగా నిలిచింది...

తెలంగాణా అడవుల్లో అన్నలపోరుకు సలాం కొట్టింది...

బెంగాల్‌లోని నక్సల్బరీ తిరుగుబాటకు జేజేలు పలికింది...

అన్యాయంపై తిరగబడే జనజాతరకు స్ఫూర్తినిచ్చే పాటగా నిలిచింది...

ఇలా ప్రాంతాలకు అతీతంగా ప్రజాపోరాటాలకు ఎలుగెత్తిన గొంతుక శాశ్వతంగా మూగబోయింది.

'జజ్జనకరీ జనారే' అంటూ జానపదాలతో జనం గుండెలు కదిలించిన 'గజ్జెల సవ్వడి' ఆగిపోయింది.

'భూమి భాగోతం' వీధి నాటకంతో బూర్జువాల బండారాన్ని నడిరోడ్డుపై కడిగిపారేసిన కలం కాలగమనంలో కలిసిపోయింది.

కార్మికులు, కర్షకుల బతుకుపోరును ఆసువుగా ఆలపించిన

ప్రజాకవి తనువు చాలించారు. .

నడిరోడ్డే వేదికగా...కాళ్ల గజ్జెలే వాద్యాలుగా చేసుకుని

అర్ధ శతాబ్దకాలానికిపైగా జన హృదయాలను కదిలించిన

ప్రజావాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు

శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నారు.

కానీ...

ఆ స్వరం తెలుగు జానపదంలో అజరామరం...

ఆ ధిక్కారం జనపదాల్లో నిత్య చైతన్యశీలం...

జోహార్ ...'వంగపండు'

గజ్జకట్టి జనగోసని ఆలపించిన అలాంటి ఉత్తరాంధ్ర పిల్లగాడు

మళ్లెప్పుడొస్తడో...!

నడిచే అగ్నిపర్వతం

చైతన్య పాంచజన్యం

మేల్కొలుపే అరుణోదయం


నిత్యావిప్లవ శంఖారావం

వంగపండు మరణం

సమాజానికి తీరని లోటు!

స్టార్ లెందరు ఉన్నా సోనూసూదే.. రియల్ స్టార్

- కూర్నన చంద్రమోహన్, సీనియర్ జర్నలిస్ట్ -



చిత్ర పరిశ్రమలో ఎందరో స్టార్లు ఉన్నారు.

ఒకరు మెగాస్టార్.. మరొకరు సూపర్‌స్టార్.. ఇంకొకరు పవర్‌స్టార్.. మరొకరు రెబెల్ స్టార్. ఇలా అన్ని స్టార్ల భుజకీర్తులున్న తెలుగు సినిమా హీరోలు.. ఒక దృశ్యం చూసి స్ఫూర్తి పొందాలి. రాజకీయ నాయకులు సిగ్గుతో చితికిపోవాలి. నవరంధ్రాలూ మూసుకుని, మొక్కల పోటీలో చాలెంజ్ చేస్తూ గడపాలి.. ఎందుకంటే సోనూ సూద్ చేసిన పని అలాంటిది మరి!

సోనూసూద్. తెలుగుసినిమాల్లో విలన్ పాత్రధారి. కానీ ఆయన తెరపై మాత్రమే విలన్. నిజజీవితంలో అతనే అసలైన రియల్ హీరో. తెరపై కనిపించే పెద్ద పెద్ద హీరోల హీరోయిజమంతా ఆ తెరపైనే. నిజజీవితంలో మాత్రం వారంతా జీరోలే. వారిలో సామాజిక స్పృహ, బాధ్యత ఉన్న వారి సంఖ్య అత్యల్పం. మరి మన హీరోలు ఏం సేవచేస్తారని ప్రశ్నించవచ్చు. ఎందుకు చేయరు? బ్రహ్మాండంగా చేస్తారు! ఎలా అంటే.. కలర్ కాంబినేషన్ జీన్స్, టీ షర్టు, రేబాన్ కళ్లజోడుతో తన ఇంటిలోనే మొక్కలకు నీళ్లు పోసి, వంటలు చేసి ఫొటోలు దిగి.. మిగిలిన వారికి చాలెంజ్ విసురుతారు. దాన్ని ట్విటర్‌లో పెట్టేస్తారు. అంతే మిగతా హీరోలు, హీరోయిన్లు వెంటనే వారి ఇళ్ల పెరట్లో చిన్న గుంత తీసి, మొక్క నాటి 'ఫలానా స్టార్ విసిరిన చాలెంజ్‌కు ఇదే నా సమాధానం. మరి మీరు?' అని తన ఫొటోతో ఒక ట్వీట్ చేస్తారు. దానిని మీడియా కూడా అదేదో సంఘసేవ చేసినట్లు, ఎవరి ఇళ్లలో వాళ్లు మొక్కలు పెంచుకుంటే అదేదో ఘనకార్యమైనట్లు ఫొటోలు వేసి, ఉచిత ప్రచారం అందిస్తాయి. హీరోలంతా సామూహికంగా ఆంధ్ర-తెలంగాణ సీఎంలను కలసి, తమ స్టుడియోలకు స్థలాలు, సినిమా హాళ్లకు విద్యుత్ రాయితీలు, షూటింగులకు పర్మిషన్లు, సినిమా థియేటర్లకు అనుమతి కోసం వినతిపత్రాలిస్తారు. ఇది చాలదూ.. కళామతల్లికి వారు చేస్తున్న అనిర్వచనీయ సేవలు! కానీ, సోనూసూద్ అనే విలన్ క్యారెక్టర్ ఆర్టిస్టు పుట్టింది ఆంధ్రాలో కాదు. తెలంగాణలో కాదు. ఆయన పంజాబీ. అరుంధతి సినిమాలో పశుపతి పాత్రతో తెలుగు వారికి దగ్గరయి, ఉత్తమవిలన్‌గా నంది

పురస్కారం అందుకున్న నటుడు. బాలీవుడ్ హీరో షారూక్‌ఖాన్ సైతం, ఆయన నటన చూసి అసూయపడ్డారు. నటనలోనే కాదు, నిజ జీవితంలో కూడా సూద్ సేవలు చూస్తే.. కోట్ల రూపాయలు తీసుకునే హీరోలు, వారి కుటుంబాలు కూడా సిగ్గుతో తల దించుకోవలసిందే. పూర్వాశ్రమంలో రైల్వేలో కూలీగా పనిచేసిన సూద్.. ఇప్పుడు సమాజానికే సేవా చిహ్నంగా మారారు.

ముంబయిలో తుపాను రాబోతుందని తెలియడంతో, 28 వేల మందిని స్కూళ్లకు తరలించి వారికి కడుపునిండా భోజనం పెట్టిన మానవతావాది సోనూసూద్. అసోం నుంచి ముంబయికి బతకడానికి వచ్చిన 200 మందిని, కరోనా వల్ల ముంబయిలో చిక్కుకున్న ఒడిషా, అసోం కూలీలను సొంత ఖర్చుతో బస్సులు ఏర్పాటుచేసి, స్వగ్రామాలకు పంపించిన కరుణామయుడు. కేరళలో చిక్కుకున్న ఆడపిల్లల కోసం ఏకంగా విమానం ఏర్పాటుచేసి, వారిని ఒడిషాకు పంపించిన ఆపద్బాంధవుడు. ఆయన సాయానికి ఒడిషా సీఎం నవీన్ పట్నాయక్ చలించి, కృతజ్ఞతలు చెప్పారు. వలస కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు, సొంత ఖర్చుతో కాల్‌సెంటర్ ఏర్పాటుచేశారు. మహారాష్ట్రలో చిక్కుకున్న తెలంగాణ వాసులకు.. నటి, ఎంపి నవనీత్‌కౌర్‌తో కలసి రెండు బస్సులు ఏర్పాటుచేసిన గొప్ప వ్యక్తి. తాజాగా వరంగల్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని, కూరగాయలు అమ్ముతోందన్న వార్త తెలిసి చలించిన సోనూ, ఆమె నెంబరు తీసుకుని, సాయం చేసే పనిలో ఉన్నారు. కరోనా బాధితులకు చికిత్సలందించే డాక్టర్లను, వారి అపార్టుమెంట్లకు రానీయకుండా అడ్డుకుంటున్న ఈ అమానవీయ కాలంలో.. వారి కోసం తన సొంత హోటల్‌నే, ఇచ్చేసిన దయార్ధ్ర హృదయుడి గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన దానంలో ప్రచారం లేదు.

తాజాగా.. మదనపల్లెలో ఓ చిన్న టీ కొట్టు యజమాని. తనకున్న కొద్దిపాటి పొలం దున్నేందుకు, ఎద్దులు లేక.. తన ఇద్దరి కూతర్లనే కాడెద్దులుగా మార్చి, వ్యవసాయం చేస్తున్న దయనీయ దృశ్యాన్ని, టీవీ9 కథనంగా మలిచి ప్రసారం చేసింది. అంతకుముందు, తమ దుస్థితి వివరిస్తూ, ఆ అమ్మాయిలు ఓ వీడియోను యూట్యూబ్‌లో పెట్టారు. ఆ దృశ్యాలు మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరినీ కదిలించింది. ఒక్క మన తెలుగు హీరోలను తప్ప! ఆ విషయం తెలిసిన విలన్ క్యారెక్టర్ ఆర్టిస్టు సోనూసూద్.. 'మీరు చదువుకోండి. రేపటికల్లా మీకు కాడెద్దులు మీ గుమ్మం ముందుంటాయి' అని ట్వీట్ చేశారు. తర్వాత మళ్లీ ఆయనే.. 'ఎద్దులు కాదు. మీ కుటుం బానికి ట్రాక్టరే కావాలి. సాయంత్రానికల్లా మీ పొలంలో ట్రాక్టరు ఉంటుంది' అని ట్వీట్ చేశారు. అన్నట్లుగానే సాయంత్రానికల్లా, 8 లక్షల ఖరీదయిన ట్రాక్టర్ పంపించి, ఔదార్యం చాటుకున్న మహామనీషి సోనూసూద్.

ఒక పంజాబీ వ్యక్తి, తెలుగువారితో ఏమాత్రం సంబంధం లేని ఓ నటుడు, ఇన్ని మానవీయ కార్యక్రమాలు చేపడుతుంటే.. తెలుగు ప్రజలు కొనే టిక్కెట్లతో వందల కోట్లకు పడగలెత్తిన, మన హీరోలు మాత్రం సెల్ఫీలు దిగి, కాలక్షేపం చేయడాన్ని ఏమనాలి? ఏం.. వారికి మాత్రం సామాజిక బాధ్యత లేదా? వారూ ఒకప్పుడు వేషాలు లేక పస్తులున్న వారే కదా? పోనీ..ఈ హీరోలేమైనా, కృష్ణానగర్‌లో తోపుడు బండ్లమీద దొరికే తిండి తిని బతుకుతున్నారా? ఏ రోజు బియ్యం ఆరోజు తెచ్చుకుని పొట్టపోసుకుంటున్నారా? స్టుడియోలకు స్థలాలు, అక్రమ కన్వెన్షన్ హాళ్లను కూల్చివేయకుండా పాలకులతో పైరవీలు, భూములు, సినిమా హాళ్లు, మాల్స్ కొనుగోలుపై ఉన్న శ్రద్ధ.. తెలుగు రాష్ట్రాల్లోని ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న, ఇలాంటి సమస్యలపై పది శాతం కూడా చూపరేం? చాలామందికి ఇలాంటి ప్రశ్నలు మింగుడుపడకపోవచ్చు. ఏం? సంపాదిస్తే పెట్టాలని రూలుందా అని కొందరు అడగవచ్చు. ఎస్. అది మిగిలిన వారికి వర్తించకపోవచ్చు. సాధారణ ఉద్యోగులు, వ్యాపారులకు అది వర్తించక పోవచ్చు. కానీ, జనం సొమ్ముతో కొనే టికెట్ల వల్లే..సమాజంలో ఒక స్థానం సంపాదించుకున్న హీరోలకు మాత్రం, ఆ ప్రశ్నలు కచ్చితంగా వర్తిస్తాయి. అంతే! అన్నట్లు.. సోనూ సూద్, అనంతపురం ఆడబిడ్డల కష్టాన్ని చూసి చలించి, ట్రాక్టర్ పంపిస్తే, దానిని ఏ ఒక్క తెలుగు పత్రిక మొదటి పేజీలో వేయలేదు. పెద్ద పత్రికలు సహా, అన్నీ మళ్లీ సినిమా థియేటర్ల ప్రారంభం కథనాలకే ప్రాధాన్యం ఇవ్వడం బట్టి, జర్నలిస్టుల మెదళ్లు కూడా ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతోంది. అదే ఏ మెగాస్టారో, ఏ పవర్‌స్టారో, ఏ సూపర్‌స్టారో 'టక్ చేసుకుని, నెత్తిన టోపీ, చేతికి గ్లవుజులు పెట్టుకుని, వ్యవసాయం చేస్తే' ఆ ఫొటోను మొదటి పేజీలో వేసి మురిసిపోయేవి.గుడి కట్టడం మంచిదే.



గుడి కట్టడం మంచిదే కాని, ఒక గుడికడితే ఆ గుడి వేయిమంది బిచ్చగాళ్లను తయారుచేసి 'దానిచుట్టే తిరిగేలా చేస్తుంది.. అదే డబ్బుతో ఓ గ్రంథాలయాన్ని నిర్మిస్తే లక్షలమంది మేధావులను తయారు చేయడానికి దోహద పడుతుంది

డా॥ బి.ఆర్. అంబేడ్కర్

భరణీయం వైవిధ్యమైన పాత్రల నటుడు

తనికెళ్ళ భరణి

- పి.సుమతి, లెక్చరర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశాఖపట్నం

రంగస్థల మరియు సినిమా నటుడు, సినిమా రచయిత. తెలుగు భాషాభిమాని. భరణి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా, పోడూరు మండలంలోని జగన్నాధపురం. తెలుగు సినిమాలలో హాస్య ప్రధాన పాత్రలు అనేకం పోషించాడు. ఈయన సకల కళాకోవిదుడు. ఇతనికి దర్శకుడు వంశీ మిత్రుడు. వంశీ దర్శకత్వంలో వచ్చిన శ్రీ కనక మహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్ సినిమాకు మంచి సంభాషణలు అందివ్వడమే కాక ఒక మంచి పాత్రను కూడా పోషించాడు. ఇప్పటిదాకా దాదాపు 320 సినిమాలలో నటించాడు.

తనికెళ్ళ భరణి ఇంటర్మీడియట్ వరకు ఏమీ వ్రాయలేదు. హైదరాబాద్‌లోని రైల్వే కాలేజీలో ఓ నాటకం వేయాల్సివచ్చినపుడు 'అద్దె కొంప' అనే నాటకం రాసి ప్రదర్శించగా ఆ నాటకానికి మొదటి బహుమతి వచ్చింది. ఇంటర్ చదివే సమయంలో ఆయన మిత్రుడు శ్రేయోభిలాషి అయిన దేవరకొండ నరసింహప్రసాద్ ప్రేరణతో వ్రాసిన "అగ్గిపుల్ల ఆత్మహత్య", "కొత్త కలాలు" కవితలు ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైంది. తరువాత బి.కాం చదివే సమయంలో రాళ్ళపల్లితో పరిచయం అయింది. రాళ్ళపల్లి వ్రాసిన "ముగింపు లేని కథ" నాటకంలో తనికెళ్ళ భరణి 70 సంవత్సరాల వయోధిక పాత్ర ధరించాడు. ఆ నాటకం విజయం సాధించిన తరువాత భరణికి నాటకరంగంలో స్థిరమైన స్థానం లభించింది. రాళ్ళపల్లి నాటక సంస్థ పేరు "శ్రీ మురళీ కళానిలయం". రాళ్ళపల్లి మద్రాసు వెళ్ళిన తరువాత "శ్రీ మురళీ కళానిలయం" సంస్థకు రచయిత కొరత ఎదురైంది. అది భరణికి నాటక రచయితగా నిలదొక్కుకోవడానికి సహకరించింది. ఆయన ఆ సంస్థ కొరకు 10 నాటకాలు రచించాడు. ఆ నాటకాలకు తల్లావఝుల సుందరం దర్శకత్వం వహించాడు. అందులో స్త్రీవాదాన్ని బలపరుస్తూ వ్రాసిన " గోగ్రహణం " నాటకం సాహిత్య అకాడమీ పురస్కారం అందుకోవడం విశేషం. ప్రయోగాత్మకంగా ప్రదర్శించబడిన ఆ నాటకాలకు ప్రజల ఆదరణ లభించింది.

వీధినాటకాలు

ఔత్సాహిక నాటకాలు వేయడానికి వేదికగా ఉన్న రవీంద్రభారతి, నారద గానసభ వంటి నాటకరంగాలలో నాటకం వేయడానికి అధికంగా వ్యయం కావడం అది భరించే అవకాశాలు లేని కారణంగా భరణి పనిచేస్తున్న సంస్థ వారు బెంగాలీ నాటకకర్త "బాదల్ సర్కార్"ను ప్రేరణగా తీసుకుని వీధినాటకాలు వేయడం ప్రారంభించారు. ఇలా ప్రదర్శించిన నాటకాలలో మొదటిది "పెద్దబాలశిక్ష" నాటకం. తలావఝుల సుందరం ప్రారంభించిన ఈ



నాటకాలకు మంచి ఆదరణ లభించింది. భరణి వీటిలో నటించడమే కాక నాటకాల నటనా బాధ్యత కూడా వహించాడు. భరణి రచించిన "గోగ్రహణం, కొక్కరకో, గొయ్యి" నాటకాలు తల్లవఝుల సుందరం దర్శకత్వంలో ప్రదర్శించబడ్డాయి. నాటకాలలో భరణి అత్యధికంగా విలన్ పాత్రలు ధరించాడు.

చలనచిత్రరంగ ప్రవేశం

తనికెళ్ళ భరణి వ్రాసిన "చల్ చల్ గుర్రం" నాటకం చూసిన రామరాజు హనుమంతరావుకు, రాళ్ళపల్లి ద్వారా వంశీకి పరిచయమై కంచు కవచం చిత్రానికి ఆ సినిమాకు రచయితగా, నటుడిగా చేశాడు. తరువాత " లేడీస్ టైలర్" చిత్రానికి గుర్తింపు వచ్చింది. ఆ తరువాత " శివ " చిత్రంలో నటుడిగా అవకాశం అలాగే పేరూ వచ్చింది. దాదాపు 60 చిత్రాలకు పనిచేసే అవకాశం లభించింది. ఆయన తెలంగాణా యాసలో మాటలు వ్రాయడంలో సిద్ధహస్తుడు. " మొండి మొగుడు - పెంకి పెళ్ళాం" చిత్రంలో కథానాయికకు పూర్తిగా తెలంగాణ యాసలో రాశాడు.

తనికెళ్ళభరణి చలనచిత్ర నటుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు. సొగసు చూడతరమా, ఎగిరేపావురమా, మావిచిగురు, పరదేశి చిత్రాలలో భరణి ఉదాత్తమైన నటన ప్రదర్శించాడు. కామెడీ, విలన్, ఉదాత్తమైన వైవిధ్యమైన పాత్రధారణతో భరణి ప్రజాదరణ పొందిన నటులలో ఒకడయ్యాడు. ఆయన దాదాపు 320 పైచిలుకు చిత్రాలలో నటించాడు. భరణీ రచనలలో –ఆటకదా శివ" మంచి ఆదరణ పొందింది.

జగతికి వెలుగు పంచిన సూరీడు

- డా॥ యల్లయ్య



ప్రపంచం అంతా ఒక మనిషి జయంతి ని గుర్తు పెట్టుకోవాలంటే అది ఖచ్చితంగా "నికోలస్ టెస్లా" దే అవుతుంది అని నా నమ్మకం. నికోలస్ టెస్లా 164 వ జయంతి. ఐన్‌స్టీన్ ని ఒకసారి మీరు ఈ ప్రపంచంలో అత్యంత మేధావి కదా, ఎలా ఫీల్ అవుతున్నారు అని అడిగితే ఈ ప్రశ్న మీరు నికోలస్ టెస్లా ని అడగండి, నన్ను కాదు అంటాడు.

నికోలస్ టెస్లా యూరప్‌లోని క్రొయేషియా దేశంలో చిన్న పల్లెటూరులో పుట్టాడు. తండ్రి సెర్బియన్ చర్చ్ ఫాదర్, తల్లి గృహిణి, ముగ్గురు అక్కా చెల్లెళ్ళు, ఒక అన్నయ్య. బయటి వాళ్ళతో కలిసేవాడు కాదు, ఎప్పుడూ తమ సిబ్లింగ్స్‌తోనే గడిపేవాడు. తల్లి పెద్దగా చదువుకోపోయినా తమ అవసరాలకి కావాల్సిన చిన్న చిన్న పనిముట్లని తనే తయారు చేస్తుండేది. టెస్లా మీద తల్లి ప్రభావం చాలా ఎక్కువ. ఇంకా టెస్లా చదువులో బాగా చురుకు. సామాన్య ప్రభుత్వ పాఠశాలలోనే చదివాడు, ఆ తర్వాత పాలిటెక్నిక్ చేశాడు. టెస్లాని కూడా చర్చ్ ఫాథర్ చేయలనేది తండ్రి కోరిక. కానీ చిన్న ఎలక్ట్రిక్ కంపనీలో ఉద్యోగానికి జాయిన్ అవుతాడు.

డైరక్ట్ కరెంట్ (డి.సి) వలన చాలా ఎలక్ట్రాన్స్ వేస్ట్ అవుతున్నై మరియూ ప్రమాదం దీనికి ఆల్టర్నేటివ్ కరెంట్ (ఎ.సి) కనిపెట్టాలని అంటుండేవాడు. ఆ తర్వాత ఒక మ్యానేజర్ అమెరికాలో థామస్ ఆల్వా ఎడిషన్ నాకు తెలుసు అని ఒక ఉత్తరం రాచి ఇచ్చి వెళ్ళి అతన్ని కలువు అంటాడు. టెస్లా అమెరికా వెళ్ళి ఎడిషన్ కంపనీలో జాయిన్ అయ్యి ఎడిషన్‌తో కూడా ఆల్టర్ నేటివ్ కరెంట్ గురించి, వైర్ లెస్ కమ్యూనికేషన్స్ గురించి చర్చించేవాడు. ఇతన్ని ప్రోత్సహిస్తే అతని ఉనికి, వ్యాపారానికే ప్రమాదం అని గ్రహించిన ఎడిషన్ ముందు డైరక్ట్ కరెంట్ జనరేటర్స్, డి.సిలోని లోపాలు నీవు సరిచేయగలిగితే 50,000 డాలర్లు ఇస్తా అంటాడు. ఎడిషన్‌కి, ఇంకెవరికీ చేతకాని డైరక్ట్ కరెంట్‌లోని లోపాలు అన్నీ సరిచేస్తాడు టెస్లా. కానీ థామస్ ఆల్వా ఎడిషన్ నేను జోక్ చేశా డబ్బులు ఇస్తాను అనేసరికి టెస్లా ఆ కంపనీని విడిచి పెట్టి సొంతంగా చిన్న ల్యాబ్ పెట్టుకొని ప్రయోగాలు చేస్తుండేవాడు. ఒకరోజు అది అగ్ని ప్రమాదానికి గురి అయ్యిందో థామస్ ఆల్వా ఎడిషన్ తగలపెట్టించాడో తెలియదు, పూర్తిగా బూడిద అయ్యింది (డి.సి) కరెంట్ మీద వ్యాపారం అంతా ఎడిషన్ దేబీ టెస్లా ఎ.సి కరెంట్ దానికి పోటీ అవుతుంది .

టెస్లా చేసేది ఏమీ లేక ఎలక్ట్రిక్ కేబుల్స్‌కి కాలువలు త్రవ్వే పనిలో జాయిన్ అయ్యి రోజులు గడిపేవాడు. ఇతని ఎ.సి జనరేటర్స్ ప్రయోగాల గురించి తెలిసిన ఒక పెద్ద మనిషి టెస్లాని ప్రొత్సహిస్తాడు. ఎ.సి జనరేటర్స్ పవర్ సిస్టంస్‌ని అభివృద్ధి చేశాడు. ఆ తర్వాత 5 సంవత్సరాలలో ఎ.సి మోటర్స్, ట్రాన్స్ ఫార్మర్స్, జనరేటర్స్ మొదలగునవి 30 వాటి మీద పెటెంట్స్ తీసుకున్నారు. ఏ విధంగా చూసినా డి.సి కంటే ఎ.సి కరెంట్ అన్ని విధాలుగా ప్రయోజన కరంగా ఉండడంతో అందరూ ఎ.సి కరెంట్‌ని వాడటం స్టార్ట్ చేశారు.

థామస్ ఆల్వా ఎడిషన్ జనరేటర్స్ వ్యాపారం దెబ్బ తిని ఎ.సి కరెంట్ ప్రమాదం అని, ఎ.సి కరెంట్‌తో చేసిన తీగలతో కుక్కలని చంపి అది ఎంత ప్రమాదమో జనాలకి చూపించేవాడు. ఇంకా జైలు ఖైదీలకి ఎ.సి కరెంట్‌తో చేసిన తీగలు పెట్టి క్రూరంగా చంపి ఎ.సి కరెంట్ ప్రమాదమని ప్రపంచానికి నమ్మ చూపాడు ఎడిషన్.

టెస్లా దీనికి విరుగుడుగా టెస్లా కాయిల్స్ తయారు చేసి లక్షల వోల్ట్ ఏ.సి కరెంట్ ప్రయోగం తన మీదే ప్రవహింప చేసుకొని ప్రపంచానికి చూపించి అత్యంత సురక్షితం అని నిరూపించాడు. ఆ తర్వాత నయాగరా వాటర్ ఫాల్స్‌కి టర్బైన్‌ని అమర్చి జనరేటర్స్

ద్వారా కరెంట్ ఉత్పత్తి చేసి దాన్ని న్యూయార్క్ నగరానికి పంపి ప్రపంచం అంతా అబ్బుర పడేలా చేశాడు.

తనకి వచ్చిన డబ్బు అంతా ప్రయోగాలకే ఉపయోగించేవాడు. రోజుకి 20 గంటలు ప్రయోగాలే ఆయన జీవితం. ఒక్ బోటుని వైర్ లెస్ కమ్యూనికేషన్స్‌తో నడిపించిన వ్యక్తి టెస్లా నే. ఇండక్షన్ మోటార్, టెస్లా కాయిల్స్, వాటర్ టర్బైన్స్, ఎక్స్ రేస్, వైర్ లెస్ టెక్నాలజీ, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్, రిమోట్ సెన్సారింగ్..ఎలా దాదాపు 250కి పైగా పేటెంట్స్ టెస్లా పేరు మీదనే ఉన్నాయి. రేడియోని కనిపెట్టి మార్కోని నోబెల్ బహుమతి సాధించాడూ కానీ అంతకముందే టెస్లా వైర్‌లెస్ కనిపెట్టి వైర్‌లెస్స్ కమ్యూనికేషన్స్ మీద పేటెంట్ ఉంది. నిజానికి ఆ క్రెడిట్ టెస్లాది. ఇంకా ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఎనర్జీకి టెస్లాకి థామస్ ఆల్వా ఎడిషన్‌తో కలిపి నోబెల్ బహుమతి ఇద్ధాం అనుకున్నారు, దానికి టెస్లా నిరాకరించారు.

ఈనాటి కంప్యూటర్స్, ఆర్టిఫీషియల్ ఇంటెల్లిజెన్స్, రాకెట్ సైన్స్‌లోని చాలా వరకు వైర్ ఎఫెక్టివ్ వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌కి, ఎలక్ట్రిక్ కార్ల తయారీకి టెస్లా ఆవిష్కరణలే కారణం. ప్రస్తుత ప్రపంచ స్థితి గతులని మార్చే మార్చుతున్న ప్రతి టెక్నాలజీకి ఏదో ఒక రకంగా టెస్లా ఆవిష్కరణలు పేటెంట్‌లే కారణం. మానవ సమాజానికి ఎక్కువ ప్రయోజనకరమైనవి కనుగున్నది టెస్లానే.

జీవితం అంతా, సంపాదించిన దనం అంతా ప్రయోగాకే కేటాయించాడు టెస్లా. పెండ్లి చేసుకోలేదు. ఇంకా చివరిదశలో స్వామి వివేకానంద బోధనలకి ప్రభావితం అయ్యాడు. టెస్లాకి ఈ ప్రపంచంలో ఎవ్వరికీ లేని అధిక ఫోటో గ్రాఫిక్ మెమోరీ/ శక్తి ఉండేది. ఏదైనా కనిపెట్టకముందే అది తన కలలోకి రూపం వచ్చేది లేదా తనే రూపం ఇచ్చేవాడు.

ప్రస్తుత టెస్లా మోటార్స్ కూడా ఎలాన్ మస్క్ ది కాదు. టెస్లా మీద గౌరవం తో ఇద్ధరు ఔత్సాహికులు టెస్లా మోటార్స్ స్థాపిస్తే ఆ తర్వాత కొన్ని యేండ్లకి ఎక్కువ షేర్స్ తీసుకొని వాళ్ళని బయటికి పంపించి ఎలాన్ మస్క్ తన అధీనంలోకి తీసుకున్నాడు.

ఏది ఏమైనా జీవితం అంతా ప్రయోగాలకే కేటాయించి 250 పేటెంట్స్ పొంది, ఎన్నో ఆవిష్కరణలు చేసి, మరెన్నో ఆవిష్కరణలకి కారణభూతుడు, ప్రస్తుత ప్రపంచ దిశ, దశలని మార్చే ప్రతి టెక్నాలజీ వెనక ఉంది టెస్లా ఆవిష్కరణేలే. ప్రపంచ చరిత్రలో 21వ శతాబ్ధం వరకు నాకు తెలిసి అత్యున్నతమైన వ్యక్తి, శాస్త్రజ్ఞుడు, మేధావి నికోలస్ టెస్లానే.

“దేనిలోనైనా విజయం సాధించాలంటే మనిషి లోతుగా ఆలోచించే బదులు క్లియర్‌గా ఆలోచించాలి” అనేవాడు నికోలస్ టెస్లా.

బీజేపిలో వీరప్పన్ !!!

- ప్రజామీడియా నెట్‌వర్క్



తమిళనాడు భారతీయ జనతా పార్టీ యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమించబడంది విద్యా వీరప్పన్. 29 యేళ్ల వయసున్న ఈమె గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌కు సొంత కూతురు. 150 మంది హత్యలకు కారణం అయ్యాడనే కేసులున్నాయి వీరప్పన్ మీద. వీరప్పన్ చేత హతమైన వారిలో పోలీసు ఉన్నతాధికారులతో సహా సామాన్య పోలీసులు, సామాన్యులు కూడా ఉన్నారు. అలాగే వంద ఏనుగులను చంపి వాటి దంతాలను అపహరించిన నేరాలు కూడా వీరప్పన్ ఖాతాలో ఉన్నాయి. ఇక వెస్టన్ ఘాట్స్‌లో గంధపు చెక్కల స్మగ్లింగ్ సరేసరి!

దశాబ్దాల పాటు కర్ణాటక- తమిళనాడు రాష్ట్రాలను గడగడలాడించిన నేరగాడు వీరప్పన్. అలనాటి కన్నడ స్టార్ హీరో రాజ్ కుమార్ ను అపహరించి తన డిమాండ్లను నెరవేర్చుకోగలిగాడు. కర్ణాటక, తమిళనాడు పోలీసులు ఎంతగానో వేటాడగా 2004లో వీరప్పన్ ను కాల్చి చంపగలిగారు. అంతటితో వీరప్పన్ ముఠా శకానికి కూడా తెరపడింది.

ఇప్పుడు వీరప్పన్ కూతురు తమిళనాడు రాజకీయాల్లో రాణించే ప్రయత్నం చేస్తోంది. ఆమె బీజేపీ స్టేట్ యూత్ వింగ్ వైస్ ప్రెసిడెంట్‌గా నియమితం అయ్యింది. కృష్ణగిరిలో స్థానిక విద్యార్థుల కోసం ఒక స్కూల్ నడుపుతోందట విద్య. తన జీవితంలో ఒక్కసారే తన తండ్రిని చూసినట్టుగా ఆమె చెబుతోంది. తనకు ఆరేడేళ్ల వయసు ఉండగా.. ఒకసారి ఆయనను చూసినట్టుగా విద్య చెబుతోంది. బాగా చదువుకొమ్మని, డాక్టర్ అయ్యి పేదలకు సేవ చేయాలని ఆయన తనకు సూచించాడని విద్య చెబుతోంది.

నేటి చిట్టి కథ

- కె.గౌతమ్


ఒకానొక చక్రవర్తి యుద్ధంలో గెలిచి వచ్చాడు. భట్రాజుల పొగడ్తలతో గర్వం మరింత అతిశయిల్లింది. తన జీవితాన్ని తీర్చిదిద్దిన మార్గదర్శి, జ్ఞాని, గురువు అయిన మహా మంత్రే ఆయనకా సమయంలో చులకనగా కనిపించాడు. దీన్నే అంటారు కళ్లునెత్తికెక్కాయని.

అతనిలో గర్వంతో బాటు అహంభావం కూడా పెరిగింది. మంత్రితో ఎలా వ్యవహరించాలో కూడా మరచిపోయాడు.

'మంత్రివర్యా! మీరెంతో తెలివైనవారు, జ్ఞాన నిధి, గొప్ప వ్యూహ కర్తలు. ఈ తెలివి తేటలతో బాటు అందం కూడా ఉంటే ఎంత బాగుండును' అన్నాడు.

అసలతను చక్రవర్తి కావడానికి కారణభూతుడు ఆ మంత్రే. కొలువులో అందరూ చక్రవర్తి మాటలకు ఆశ్చర్యపోయారు.

తనను నిండు సభలో అవమానించిన చక్రవర్తిపై ఆ మంత్రికి కోపం రావాలి. ఆ మంత్రి ఏ భావమూ ప్రకటించలేదు. తనను తక్కువ చేసి మాట్లాడిన రాజును తూలనాడలేదు.



దగ్గరలో ఉన్న ఒక పరిచారకుడిని పిలిచి 'ఎండ మండిపోతోంది. ప్రభువులకు దాహంగా ఉంది తక్షణమే స్వర్ణ పాత్రలో ఉన్న శుద్ధమైన జలాన్ని తెచ్చి ప్రభువులకు తాగడానికి ఇవ్వు' అన్నాడు.

పరిచారకుడు స్వర్ణ పాత్రలోని జలాన్ని ఒక బంగారు గ్లాసులో తెచ్చి ఇచ్చాడు.

'ఆనీళ్లు వెచ్చగా ఉండి ఉంటాయి. దాహం తీరి ఉండదు. మట్టి కుండలో నీరు తెచ్చి ఇవ్వు' అన్నాడు మంత్రి మళ్ళీ. ..పరిచారకుడు మట్టి కుండలోనుంచి తెచ్చి ఇచ్చిన నీటిని చక్రవర్తి తృప్తిగా తాగాడు.

వెంటనే ఆలోచించాడు... మంత్రి ఒక్క సారిగా నీటిని గురించి ప్రస్తావించడడం, పరిచారకుడి చేత స్వర్ణ పాత్ర, మట్టి పాత్ర ల్లోని నీటిని తెప్పించడం ఇదంతా ఎందుకు చేశాడని ఆలోచించాడు. వివేకవంతుడు కనుక వెంటనే అర్థమయింది. జ్ఞానోదయమయింది.

వెంటనే సింహాసనం దిగి మంత్రి వద్దకు వచ్చి, 'గురు దేవా! మన్నించండి. గర్వాతిశయంతో కాని మాట అన్నాను. బంగారు పాత్ర విలువైనదే కావచ్చు. అందంగా ఉండవచ్చు. కాని దానికి నీటిని చల్లపరిచే గుణం లేదు. మట్టి పాత్ర బంగారు పాత్రతో సరితూగలేదు. అయినా నీటిని చల్లగా ఉంచు తుంది. అందం కాదు గుణం, జ్ఞానం, క్షమ అనే ఆభరణాలే అతి విలువైనవని మీరు బహు చక్కగా బోధించారు. నా అపరాధాన్ని మన్నించండి' అన్నాడు.

ఆ చక్రవర్తి మరెవరో కాదు మౌర్య వంశ స్థాపకుడు చంద్ర గుప్త మౌర్యుడు. ఆ మహా మంత్రి మరెవరో కాదు. మహారాజనీతి వేత్త, చతురుడు, అర్థశాస్త్ర రచయిత, కౌటిల్యునిగా పేరు గాంచిన చాణక్యుడు.

నరస్యాభరణం రూపం
రూపస్యాభరణం గుణమ్
గుణస్యాభరణం జ్ఞానమ్
జ్ఞానస్యాభరణం క్షమా

మానవులకు ఆభరణం రూపమని, రూపానికి ఆభరణం సుగుణమని, సుగుణానికి ఆభరణం జ్ఞానమని, జ్ఞానానికి ఆభరణం క్షమ అని దీని అర్థం.

పై శ్లోకంలో మనిషికి రూపం మంచి ఆభరణమని చెప్పినా గుణం, జ్ఞానం, క్షమ అనేవి రూపం కన్నా అతి ప్రధానమైనవని స్పష్టం చేయబడింది.

అంటే మంచి అందగాడైనా ఏ వ్యక్తి అయినా ఆ ఒక్క లక్షణం ద్వారా పూజ్యుడు కాడు.

వినయం అనేది మనిషిలో ఎల్లవేళలా అన్ని పరిస్థితుల్లోనూ ఉండాలి.

కొందరు ఓటమి చవి చూసి నప్పుడో, బాధలలో మునిగిపోయినప్పుడో తమ బాధలు వెళ్ళబుచ్చుకునేందుకు ఇతరుల ముందు వినయం ప్రదర్శిస్తారు.

అయితే ఇలాంటి వ్యక్తులు గెలుపు సాధించి నపుడు, సంపదలు వచ్చినపుడు, మంచి పదవి ఉన్నపుడు గర్వాతిశయంతో ఇతరులను చిన్న చూపు చూస్తారు, కించ పరుస్తారు, మాటలతో ఎదుటివారిని చులకన చేస్తారు.

అందంగా ఉండడం మంచిదే కాని తను అందంగా ఉన్నానని అందవిహీన మయిన పనులు చేయడం తగనిది.

అన్నీ ఉన్నప్పుడు, ఆనందంగా ఉన్నప్పుడు కూడా హద్దులెరిగి ప్రవర్తించాలన్నది పెద్దల మాట.



రోషిణి ద గ్రేట్

- బి.రాజేష్

హెచ్‌సిఎల్ పగ్గాలు చేపట్టిన రోషిణి నాడార్ 2017 నుంచి ప్రపంచంలో 100 మంది శక్తివంతమైన మహిళల్లో ఒకరు. ప్రస్తుతం భారతదేశంలో అత్యంత మహిళా ధనవంతురాలు ఆమే. భారతదేశ చరిత్రలో ఒక మహిళ, ఒక ఐటీ కంపనీ పగ్గాలు చేపట్టి చైర్మన్ అవ్వటం ఇదే తొలిసారి హెచ్‌సిఎల్‌ని స్థాపించిన శివ నాడార్ ఏకైక కుమార్తె రోషిణి, తండ్రి చాటు బిడ్డ. ఎక్కడికి వెళ్ళినా తండ్రితోనే వెళ్తుంది. తండ్రి మాట జవ దాటదు కానీ తానే స్వతహాగా విద్యాగ్యాన్ అనే సంస్థని స్థాపించింది. చాలా మంది వేరే వాళ్ళకి సహాయం చేసి ఫోటోలు దిగుతారు. ఈమె మాత్రం తాను సహాయం చేసిన వాళ్ళు నాయకులుగా ఎదగాలి, పెద్ద పెద్ద సంస్థల్లో లీడర్లుగా ఎదగాలి, భారతదేశాన్ని నడిపించాలి, అప్పుడు తాను వెళ్ళి వాళ్ళతో ఫోటోస్ దిగాలి అంటుంది.

రోషిణి నాడార్ గంట సేపు మాట్లాడితే 40 నిమిషాలు వేరే వాళ్ళు బాగుపడాలి, పల్లెటూర్లు బాగుపడాలి అంటుంది. ప్రధానంగా పాఠశాల విద్య అత్యంత ముఖ్యం అంటుంది రోషిణి. పల్లెటూర్ల నుంచి కొన్ని వందల మంది విద్యార్థులని సెలక్ట్ చేసి వాళ్ళని గొప్ప వాళ్ళగా తీర్చిదిద్దటమే ఆమె పనుల్లో ఒకటి. అందరిలాగా ఆడ మగ సమానత్వంపై మాత్రమే మాట్లాడదు, అన్ని విషయాల్లో డైవర్శిటీ ఉండాలి, పల్లెటూరి వాళ్ళు కూడా నాయకులుగా ఎదిగి అన్ని చోట్లా వాళ్ళు అన్ని స్థానాల్లో ఉండాలి అంటుంది రోషిణి.

1976లో హెచ్‌సిఎల్‌ని స్థాపించిన శివనాడార్‌ది కూడా విలక్షణ వ్యక్తిత్వం. తమిళనాడులోని తుత్తుకూడి జిల్లాలోని తిరుచందూర్ దగ్గర్లోని మూలైపోజి అనే పల్లెటూర్లో పుట్టిన శివనాడార్ చదువు అంతా సామాన్యమైన పాఠశాల, కాలేజ్‌లే. చదువు అయ్యాక ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తూ స్నేహితులతో కలిసి హెచ్‌సిఎల్ ని స్థాపించాడు. కంప్యూటర్స్ అంటే మన దేశంలో చాలా మందికి తెలియని కాలంలో వాటి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తుల కోసం "హిందూస్థాన్ కంప్యూటర్స్ లిమిటెడ్ హెచ్‌సిఎల్"ని 1976లోనే స్థాపించాడు. ఇప్పుడు హెచ్‌సిఎల్ భారతదేశంలో మూడో అతి పెద్ద ఐటీ కంపనీ. లక్షా 50 వేల మంది ఉద్యోగులు ఉన్నారు.

2019లో ముఖేష్‌అంబానీ 200 కోట్ల విరాళం ఇస్తే భారత దేశం అంతా ఆయన పేరు మారు మోగింది, ఆ తర్వాత రతన్‌టాటా 400 కోట్లు విరాళం ఇస్తే దానకర్ణుడు రతన్‌టాటా అని ప్రపంచ మీడియా కూడా కీర్తించింది. నిజానికి 2019 సంవత్సరంలో 600 కోట్లకి పైగా దానం చేశాడు శివనాడార్. ఆయనా చెప్పడు, అవతలి వారిని చెప్పొద్దు అంటాడు కారణం అది ఆయన బాధ్యత. దైవభక్తుడైన శివ నాడార్ తన సంపాదనలో 10శాతం విరాళాలు ఇస్తుంటాడు. దీనితో పాటు తన తండ్రి పేరిట ఇంజనీరింగ్ కాలేజి స్థాపించి చాలా మందికి చాలా విషయాల్లో సహాయం చేస్తుంటాడు. ఇంకా శివానాడార్ ఫౌండేషన్‌తో కొన్ని వేల, లక్షల మందికి సహాయం చేస్తుంటాడు శివనాడార్.

శివనాడార్ తన తండ్రి శ్రీ శివసుబ్రమణ్యా నాడార్ పేరుతో 100 మంది వరకు *Ph.D* కూడా చేస్తున్న అత్యంత పెద్ద ఇంజనీరింగ్ కాలేజ్ స్థాపిస్తే శివ నాడార్ కూతురు రోషిణి నాడార్ తన తండ్రి శివ నాడార్ పేరిట "శివ నాడార్ విశ్వ విద్యాలయం" నే నిర్మించింది.

ప్రపంచంలో అత్యున్నతమైన చికాగోలోని నార్త్ వెస్టర్న్ విశ్వ విద్యాలయ కెల్లాగ్స్ బిజినెస్ స్కూల్ నుంచి ఎం.బి.ఎ చేసింది రోషిణి. గతంలో కూడా హెచ్‌సిఎల్ కంపనీ సి.ఈ.ఒగా పనిచేసింది, వైస్ ప్రెసిడెంట్‌గా చేసింది, వైస్ చైర్మన్‌గా కూడా పని చేస్తుంది. ఇప్పుడు భారత దేశంలో మేటి కంపనీ హెచ్‌సిఎల్ పూర్తి పగ్గాలు చేపట్టింది రోషిణి నాడార్. ఆమె భర్త శిఖర్ మల్హోత్రా.. తను కూడా అదే కంపెనీలో వైస్ చైర్మన్.

నీలాంటి యువతే కదా మన భారత దేశ భవిష్యత్తు. ప్రపంచంలో మన దేశం గొప్పగా ఉండాలంటే నీవు మరిన్ని విజయ శిఖరాలు అధిరోహించాలి రోషిణి. హెచ్‌సిఎల్ కంపనీని, ఈ దేశాన్ని గెలిపించాలి. ఆల్ ద వెరీ బెస్ట్ రోషిణి నాడార్.

కారంచేడు "కత్తి"

- కె.జయకుమార్

ఎన్నో దుర్మార్గాలు జరిగిపోతున్నా.. కొన్ని మాత్రమే జాతి మొత్తాన్ని కదిలిస్తాయి. కారంచేడుకి మరియు చుండూరుకు ఆ అరుదైన గౌరవం దక్కింది. సుప్రీంకోర్టు మెట్లు ఎక్కింది. జాతీయ సమస్యగా నిలిచి వెలిగింది. నిందితుణ్ణి నిలదీసింది. కులాధిపత్యాన్ని ఎదిరించింది. నిర్మించడం, ప్రవహించడం, ప్రజ్వలించడం కారంచేడు ఉద్యమ ధర్మంగా సాగింది. దాని అగ్రభాగాన నిలిచి నడిపించిన వాడు రాజకీయనాయకుడు కాదు. సంపూర్ణంగా చదువుకున్నవాడు. సంస్కృతాంధ్రభాషా పండితుడు. పొన్నూరు మాలకులానికి చెంది (దళితుడు) కత్తి పద్మారావు నామధేయుడు.

ఆయన భార్య కాపు. ఒక కోడలు కమ్మ. మరో కోడలు మాదిగ.. దళితుల కోసం ఆయన ఇరవై వేల పుస్తకాలతో లైబ్రరీ ఏర్పాటు చేశాడు. అక్కడ చదువుకోవడానికి వచ్చేవాళ్ళకి ఉచిత భోజనం పెడుతున్నాడు. దళిత సమస్యల పైన అంబేద్కర్ మీద అరవై పుస్తకాలు రాశాడు. గుక్క తిప్పుకోకుండా వందల పద్యాలు చెప్పగలడు.

కారంచేడు ఘోరం తర్వాత, విజయవాడలో అక్టోబర్ 6న జరిగిన మహాసభలో పోలీసులు లాఠీలతో వందలమందిని చావగొట్టారు. ఆడవాళ్ళనీ పిల్లల్నీ భయభ్రాంతుల్ని చేశారు. లక్ష్యం ఒక్కటే. దళిత ఉద్యమాన్ని దెబ్బతీయాలి. పద్మారావు గొంతు నొక్కేయాలి. వేదిక మీద ప్రసంగిస్తున్న కత్తిని అరెస్టు చేసి తీసుకెళ్లారు. నాకెందుకొచ్చిన గొడవ ! అని ఆనాడే పద్మారావు పాలకుల ముందు మోకరిల్లి వుంటే, ఏ యూనివర్సిటీకో వైస్ ఛాన్సలర్ అయ్యుండేవాడు. ఏ సాహిత్య అకాడమికో అధ్యక్షుడై కులికేవాడు. గవర్నర్ పక్కనో, ముఖ్యమంత్రి చెంతనో కూర్చునేవాడు. కత్తి పద్మారావు నిప్పుకణిక అనీ, నిలువెత్తు నిజాయితీ పరుడు. మన రాజకీయనాయకుల్లా వందల కోట్లు వెనకేసినవాడు మాత్రం కాదు. నిక్కచ్చిగా, నిష్కర్షగా నలభై సంవత్సరాలు దళితుల కోసమే మాట్లాడినవాడు, కొట్లాడినవాడు, దళిత మహా సభ ఏర్పాటు చేసి తర్ఫీదు యిచ్చి సైన్యాన్ని తయారుచేసినవాడు. మరీ ముఖ్యంగా" దళిత యువకుల్ని చదువుకోండిరా " అని చెప్పిన గురుతుల్యుడు పద్మారావు ఒక్కడే.

కోర్ట్ కేసులో గమ్మత్తు

కారంచేడు బాధితుల కోసం తేళ్ళ జడ్సన్ న్యాయపోరాటం చేశాడు. బొజ్జా తారకంలాంటి పెద్దలు అండగా నిలిచారు. అటు పోలీసులు పెట్టిన ప్రభుత్వ కేసు, ఇటు దళితుల కోసం జడ్సన్ దాఖలు చేసిన ప్రైవేటు కేసు. ఈ రెండిట్లో నిందితులు మొత్తం 164 మంది. వీళ్ళలో 140 మందిపై ప్రాథమిక సాక్ష్యాధారాలు వున్నాయని చీరాల థర్డ్ అడిషనల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఎం. రాందాస్ భావించారు. తారకం, మట్లె వెంకటసుబ్బయ్య, సిరిల్‌రెడ్డి అడ్వకేట్లు. బాధితుల ఆందోళనతో కేసు గుంటూరుకి బదిలీ అయింది. 1992 ఫిబ్రవరి17న విచారణ మొదలైంది. 1994 అక్టోబర్ 31న తీర్పు యిచ్చారు. అయిదుగురికి యావజ్జీవం, 46 మందికి మూడేళ్ళ జైలు, నలుగురికి పదివేల జరిమానా!

నిందితులు హైకోర్టుకి వెళ్ళారు. 1998లో హైకోర్టు కేసు కొట్టివేసింది. బాధితులు స్పెషల్ లీవ్ పిటిషన్ని 1998 నవంబర్‌లో సుప్రీంకోర్టు తీసుకుంది. హైకోర్టు తీర్పుని తిరస్కరించింది. గుంటూరు కోర్టు వేసిన శిక్షల్ని ఖరారు చేసింది. 13 ఏళ్ళ న్యాయపోరాటంలో నిందితులు కొందరు చనిపోయారు. ఒకడికి జీవితఖైదు, 30 మందికి మూడేళ్ళ జైలుశిక్ష విధించింది. బాధితుల తరపున ఎం.ఎన్.రావు వాదించారు. హత్యానేరం (302) కింద శిక్ష పడిన వాళ్ళలో 1.రాయనీడి ప్రసాద్ 2. చాగంటి సత్యనారాయణ 3. చాగంటి సుబ్బారావు 4. రాయని అలియాస్ గమ్మత్తు రాఘవయ్యలు చనిపోవడంతో ఒక్క రాయని అలియాస్ గమ్మత్తు అంజయ్యకి యావజ్జీవ శిక్ష పడింది.



ఐదు వందల సంవత్సరాల నా
మందిర కల నువ్వు రాసిన రాజ్యాంగం
వల్ల నెరవేరుతుంది ఓ మహానుభావా..
ఓ అంబేద్కరా నీ రుణం ఎలా
తీర్చుకోవాలయ్యా

ఇరాన్ చూసి నేర్చుకోవాలి

- ఎం.మహేష్



అదొక మతరాజ్యం. మధ్యయుగం నాటి ఆచారాల దేశం. అలాంటి దేశంలో కరోనా విపరీత స్థాయికి చేరింది ఒక దశలో. అది కూడా ప్రపంచంలో అప్పుడప్పుడే కరోనా కేసులు పెరుగుతున్న వేళ ఆ వైరస్‌తో తీవ్ర ఇక్కట్ల పాలైన దేశాల్లో అది ఒకటి. అదే ఇరాన్. మార్చి నెలలోనే అక్కడ కరోనా కేసుల సంఖ్య భారీగా నమోదైంది. అంతలోనే రంజాన్ వచ్చింది. ఆ పరిస్థితుల్లో అసలు ఇరాన్ ఏమైపోతుందో అని చాలా మంది భావించారు. అయితే అనూహ్యంగా కరోనా కేసులను ఇరాన్ నియంత్రించగలిగింది!

ఎనిమిది కోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో మార్చి-ఏప్రిల్ నెలలకే రెండు లక్షల స్థాయిలో కేసులు నమోదయ్యాయి. అంతంత మాత్రం సౌకర్యాలు, ప్రజల్లో అవగాహన తక్కువ ఉండే దేశమైన ఆ పర్షియన్ రాజ్యంలో కరోనాను చాలా వరకూ నియంత్రించుకున్నారు. ఒక దశలో రోజు వారీ కేసుల సంఖ్య బాగా తగ్గుముఖం పట్టింది. ఆ తర్వాత రెండో దశ వ్యాప్తి చెందినా, పరిస్థితి నియంత్రణలోనే ఉందక్కడ!

ఇప్పుడు ఇరాన్ ప్రస్తావన ఎందుకంటే.. అలాంటి మధ్యయుగం కాలం నాటి దేశం నావెల్ కరోనా వైరస్‌ను నియంత్రిచగలిగితే, మనది అభ్యున్నతి సాధించిన దేశమని ఫీలయ్యే ఇండియన్లు ఎందుకు నియంత్రించలేకపోతున్నారు? కరోనా కేసుల సంఖ్య దేశంలో ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణాల్లో ఒకటి ప్రజల తీరే! పరిస్థితి ఏమిటో కూడా అర్థం చేసుకోకుండా ఇంకా తిరిగే వాళ్లు తిరుగుతూనే ఉన్నారు. తమకేం కాదు, వైరస్ సోకినా ఏం కాదు అనే భావన చాలా మందిలో బలీయంగా నెలకొంది. కేసుల సంఖ్య పెరుగుతుంటే ప్రభుత్వాలను తిట్టడం పెద్ద పనేం కాదు. ప్రజలు నిర్లక్ష్యపూరితంగా వ్యవహరిస్తే ఏ ప్రభుత్వం ఏం చేస్తుంది?

కర్ణాటకలో లాక్‌డౌన్ పెట్టారు. అయినా బెంగళూరులో వాహనాలు పగలంతా ఇష్టానుసారం తిరుగుతున్నాయని మీడియాలో కథనాలు వస్తున్నాయి. పోలీసులు అక్కడక్కడ ఉన్నా వాహనాలను ఆపడం లేదట. ఎందుకంటే.. ఎవరికి కరోనా ఉంటుందో ఎవరికి తెలుసు? ప్రతి వాహనాన్నీ ఆపి, కీస్ లాక్కొని, డాక్యుమెంట్స్ చూపమని, వారితో చర్చించి.. సర్దిచెప్పి, ఫైన్ వేసి వాళ్లను పంపించే ధైర్యం పోలీసులకు కూడా ఇప్పుడు లేనట్టుంది. వాళ్లను ఆపి తాము కరోనా తెచ్చుకోవడం కన్నా.. కామ్‌గా నిలబడిపోయేదే మేలని పోలీసులు కూడా ఒక అభిప్రాయానికి వచ్చి ఉండవచ్చు. వాళ్లవి కూడా ప్రాణాలే కదా! తిరిగే వాడికి లేని తీట తమకెందుకు అని పోలీసులు కూడా కామ్‌గా ఉంటున్నారు. అందుకు వారిని కూడా తప్పు పట్టలేం.

భారతీయులు తమ సొంతమైన నిర్లక్ష్యభావన నుంచి వందశాతం, పూర్తిగా బయటకు వచ్చే వరకూ కరోనా నియంత్రణ సాధ్యం కాదని స్పష్టం అవుతోంది.

వారసులకు కరోనా కాటు!!

- ప్రజామీడియా నెట్‌వర్క్

సినిమా రంగంలో హీరోలుగా నిలదొక్క కోవడం సంగతి అలా వుంచితే, ఎంట్రీ ఇవ్వాలంటే చాలా వరకు బ్యాకింగ్ వుండాల్సిన అవసరం అయితే వుంది. ఇది ఈజీవే. కానీ విధి మాత్రం ఇంకోలా వుంటుంది. సక్సెస్ రావచ్చు. రాకపోవచ్చు. వారసులు అంతా నిలదొక్కుకోవాలని లేదు. కానీ కరోనా టైమ్ మరీ చిత్రంగా వుంది. వారుసులు నిలదొక్కుకోవడం, లేకపోవడం సంగతి సరే, అసలు ఎంట్రీనే డిలే అయిపోతోంది.

మెగా టీమ్‌లో మరో ప్లేయర్ అన్నట్లుగా రంగ ప్రవేశం చేసారు వైష్ణవ్ తేజ్. ఉప్పెన సినిమాతో ఫీల్డ్‌లోకి అడుకు పెట్టారు. ఫస్ట్ లుక్, సాంగ్, ఇలా పబ్లిసిటీ మెటీరియల్ బాగుంది, కాస్త హోప్ వుంది అనుకునే సరికి సినిమా విడుదల ఆగిపోయింది. మళ్లీ ఎప్పుడు వస్తుందో వెయిట్ చేయాల్సిందే.

బెల్లంకొండ ఫ్యామిలీ నుంచి వచ్చిన హీరో సాయి శ్రీనివాస్. అప్ అండ్ డౌన్స్‌తో ఏదో కిందా మీదా ఈదుతూ వస్తున్నాడు. ఇలాంటి టైమ్‌లో తమ్ముడు సాయి గణేష్ కూడా రంగంలోకి దిగాడు. పవన్ సాదినేని డైరక్షన్, వివేక్ ఆత్రేయ డైలాగులు. సినిమా ప్రారంభమై చాలా కాలం అయింది. కరోనాకు ముందు కూడా అప్ డేట్ లేదు. కరోనా టైమ్‌లో సరేసరి.

నిర్మాత డివివి దానయ్య కుమారుడు తెరంగేట్రం చేయాలని ఎప్పటి నుంచో మంచి సబ్జెక్ట్ కోసం చూస్తున్నారు. డైరక్టర్ మారుతి చేతుల మీదుగా అనుకున్నారు. కానీ మళ్లీ ప్లాన్ మారింది. దర్శకుడు



శ్రీవాస్ మంచి హిలేరియస్ సబ్జెక్ట్ తేవడంతో ప్రీ పొడక్షన్ మొదలు పెట్టారు. షూట్ అనౌన్స్ చేస్తారు అనుకునేలోగా కరోనా వచ్చి కూర్చుంది.

నిర్మాత రాజ్ కందుకూరి కుమారుడు శివ కందుకూరి తొలి సినిమా చేసారు. ఫరవాలేదు అనే టాక్ వచ్చింది. లైన్‌లో మరో మంచి సినిమాలు రెండు వున్నాయి. ఒకటి దాదాపు పూర్తయింది. వెంట వెంటనే వస్తే, కుర్రాడు నిలదొక్కుకుంటాడు అనుకున్నారు. మళ్లీ మామూలే. కరోనా హ్యాండ్ బ్రేక్ వేసేసింది.

ఇలా తొలి సినిమాల కోసం వెయిట్ చేస్తున్న చిన్న, చితక హీరోలు ఇంకా వున్నారు. పాపం, వీరంతా కరోనా కాటు నుంచి ఎప్పుడు తప్పించుకుని, తెరపైకి వస్తారో?

29 గ్రామాలు ముఖ్యమా.. రాష్ట్రంలో మిగిలిన గ్రామాలు ముఖ్యమా

మొత్తం రాజధాని కోసం ఇచ్చిన భూమి 36,000 వేల ఎకరాలు.

అందులో చంద్ర బాబు కులస్తులు ఇచ్చినది 25,000 ఎకరాలు.

మిగిలిన11,000 ఎకరాలు ఇతర అన్ని కులస్తులవి.

అప్పటి ధర ఎకరం 15,00,000/-

ఎకరానికి ప్రభుత్వం ఇస్తానని హామీ ఇచ్చినది 1200 గజాలు.

అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందితే రానున్న రోజుల్లో, అతి కొద్ది కాలంలో ఒక గజం ఖరీదు లక్ష. అంటే 1200×1,00,000=12,00,00,000 (12 కోట్లు)

అంటే ఒక్కో రైతు త్యాగం విలువ ఎకరానికి 12 కోట్లు.

కేవలం 12 to 15 లక్షల విలువైన ఎకరాన్ని ఇచ్చి 11,85,00,000/- లాభం పొందాలనేది (చం. బా) వారి అనుయాయుల దురాశ.

ఒక్కో రైతు 5 ఎకరాల చొప్పున అంచనా వేస్తే 25,000 ÷ 5 = 5,000 మంది రైతులు చంద్ర బాబు అనుయాయులు (ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు)

5 ఎకరాలు × 12 కోట్లు = 60 కోట్లు (ఒక్కో రైతుకు)

అంటే కేవలం అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందితే ఒకే సామాజిక వర్గానికి చెందిన 5 వేల మంది (రాజధానికి భూమి త్యాగం చేసిన త్యాగధనులు) ప్రపంచంలోనే అత్యంత సంపన్నులు అవుతారు.

ఇక మిగిలిన భూమి పప్పు బెల్లాలుగా అయిన వారికి ఒక ధర, బయటి వారికి మరో ధర, కేంద్ర ప్రభుత్వ సంస్థలకు ఇంకో ధర, రాష్ట్ర ప్రభుత్వానికి ఇంకేదో ధర చొప్పున కమిషన్లు తెలిసిన విషయమే.

మరి ఇంత లాభం కళ్ళెదుటే పోతుంటే ఆ 29 గ్రామాలు ముఖ్యమా లేక రాష్ట్రంలో మిగిలిన గ్రామాలు ముఖ్యమా.

ఇతర గ్రామాల నుండి అంత రాబడి ఉంటే చెప్పండి ఉద్యమం చేద్దాం.

ఆధునిక మానవుడు

\- బుకర్

అడవుల్లో, కొండల్లో, కోనల్లో తిరుగుతూ, ఆకులు అలములు తింటూ, చెట్లు బెరళ్లు కట్టుకొని, రాళ్లు రప్పలు నుండి నిప్పు సృష్టించుకొని, వంట వార్పులు చేసుకొని బతికాడు నాటి మానవుడు.ఇద్దరితో మొదలైన ఈ ప్రయాణం, పదులై, వందలై, వేలు, లక్షలై, నేడు కోట్లకు చేరింది. జనాభా సంఖ్య పెరిగింది. జ్ఞానం పెరిగింది. కోరికలు పెరిగాయి. మనిషి భూమిపై అద్భుతమైన ఆవాసాలు ఏర్పరచుకున్నాడు. స్వర్గ సుఖాలు పొందుతున్నాడు. సృష్టికి ప్రతి సృష్టి చేస్తున్నాడు. ఈ పయనం ఆగడం లేదు. ఈ తృప్తి తీరడం లేదు. భూమి, నీరుపై నివసిస్తున్నాడు. గాలిలో ప్రయాణం చేస్తున్నాడు. ఆకాశం అంతూ, విశ్వవిశ్వాంతరాల రహస్యాలు తెలుసుకొని అక్కడా జీవిద్దాం అనుకుంటున్నాడు. ఆ సంపదనూ సొంతం చేసుకోవాలనుకుంటున్నాడు. ఈ ఆలోచనల నుండి పుట్టిందే... గ్రహాలవైపు మనిషి గమనం. సరిగ్గా జులై 20వ తేదీనాడు, 1969లో మొట్టమొదటగా మనిషి చంద్రుడిపై కాలు పెట్టాడు.ఇప్పటికి 51ఏళ్ళు పూర్తయ్యాయి. ఆ మనిషి పేరు నీల్ ఆర్మ్ స్ట్రాంగ్. పేరుకు తగ్గట్టుగానే ఇతను చాలా బలవంతుడు. ఇతని సంకల్పం ఇతనికంటే బలమైంది. చంద్రుడిపై కాలు మోపిన మొదటి మానవుడిగా కీర్తి సాధించాడు. మానవాళికి ఆకాశమంత ఆశను కల్పించాడు. అపోలో-2గా ఈ యాత్ర జగత్ ప్రసిద్ధం. అంతరిక్షంలో 8 రోజులు, 14 గంటలు, 12నిముషాలు గడిపాడు. అంతరిక్ష యానంలో వచ్చిన విపరీతమైన పరిణామాలను, భయాలను, గమన స్థితులను అనుభవించాడు.అతని సంకల్పం లాగానే, జాబిల్లిపై నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ అడుగుల గురుతులు ఇంకా చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఆ తర్వాత కూడా అనేక అంతరిక్ష ప్రయోగాలు జరిగాయి. చివరగా, 1972 డిసెంబర్‌లో అపోలో ప్రయోగించారు. ఈ ప్రయోగం ఎక్కువ ప్రయోజనాలు ఇచ్చింది. ఈ వ్యోమగాములు 1969 కంటే ఎక్కువసేపు చంద్రమండలంలో గడిపారు.ఎక్కువ మొత్తంలో నమూనాలు కూడా సేకరించారు. చందమామపై మళ్ళీ మనిషి కాలు పెట్టలేదు. 1969లోనే అపోలో-2 కోసం కేటాయించిన బడ్జెట్ 2,000వేల కోట్ల డాలర్లు. అపోలో-12 ప్రయోగాల ద్వారా తీసిన వేలాది ఫోటోలను నాసా అందరికీ అందుబాటులో ఉంచింది.భూమి నుండి చంద్రుడి వరకూ ఉన్న కచ్చితమైన దూరాన్ని కూడా ఈ ప్రయోగాల వల్ల తెలుసుకోగలిగాం. చంద్రుడిపై మనిషి కాళ్ళుపెట్టి, ఇప్పటికి 48ఏళ్ళు పూర్తయింది. చంద్రుడితో పాటు అన్ని గ్రహాలను తాకాలని మనిషి కోరుకుంటున్నాడు. అంతరిక్ష పర్యాటకాన్నీ పరిచయం చేయాలనుకుంటున్నాడు. అక్కడుండే విలువైన వనరులను తెలుసుకొని, వీలైతే స్వాధీనం చేసుకోవాలని అనుకుంటున్నాడు. గ్రహాలు, తోకచుక్కల్లో ఉండే విలువైన వనరులను తవ్వి, భూమిపైకి తేవాలని కొన్ని కంపెనీలు ప్రయత్నం చేస్తున్నాయి. అంగారక గ్రహంలో విల్లాలు కట్టి, మానవ నివాసాలు తరలించాలని ఎలన్ మస్క్ అనుకుంటున్నాడు. 2024కల్లా మనిషిని చంద్రమండలంపైకి మరోసారి పంపించాలని నాసా ప్రయత్నం చేస్తోంది. 2028కి అక్కడ శాశ్వత స్థానం ఏర్పరచాలనే ఆలోచనలోనూ నాసా ఉంది. చందమామ దక్షిణ ధృవం పైకి వ్యోమగాములను 2030నాటికల్లా పంపాలని చైనా ప్రయత్నాలు చేపడుతోంది. భూమిపైన కాకుండా, మిగిలిన గ్రహాల్లో మనిషి జీవించే వాతావరణ పరిస్థితులు ఎంతవరకు ఉన్నాయి అన్నది పరిశోధనాత్మకంగా ఇంకా తేలాల్సిన అంశం. ఇది లాభదాయకమా, భూమితో పాటు గ్రహాల్లోనూ మనిషి పట్టణాలు, నగరాలు ఏర్పరచుకోవడం సాధ్యమా అనే యక్ష ప్రశ్నలకు సమాధానాలు రావాలి.ఇప్పటికే భూమిపై మనిషి మితిమీరిన స్వార్థంతో తోటి జీవరాశులను, పర్యావరణాన్ని, వాతావరణాన్ని, ప్రకృతిని ధ్వంసం చేశాడు.సహజ వనరులను పాడు చేశాడు. ఇంకా చేస్తూనే ఉన్నాడు.దీనికి తగ్గట్టుగా, కరోనా వైరస్, ప్రకృతి వైపరీత్యాలు, అనారోగ్యాలు మొదలైన రూపాల్లో భారీగా మూల్యం చెల్లించుకుంటున్నాడు. ఇది చాలక అన్నట్లుగా, గ్రహాల్లోకి వెళ్లి, అక్కడి వనరులనూ కొల్లగొడతానంటున్నాడు. వాటి అంతూ చూస్తానంటున్నాడు. ముందు, మనం నివసించే భూమినే ఎంతవరకు అర్థం చేసుకుంటున్నాడన్నది ప్రశ్న. ఇప్పుడు గ్రహాలు అంటున్నాడు. సౌర కుటుంబమేకాక, అవతల ఉన్న అంతరిక్షాన్ని అర్థం చేసుకోవాలని అంటున్నాడు. జ్ఞానం అనంతం. మనిషి ప్రయాణం అనంతం. జ్ఞానం ఆనందాన్ని ఇవ్వాలికానీ, విషాదాన్ని మిగల్చకూడదు. చూసి రమ్మంటే.. కాల్చొచ్చినట్లు.. ఈ గ్రహాలను ఏదో చేయాలనుకుంటున్నాడు. కంటికి కనిపించని కరోనాయే మనిషితో ఎన్నో ఆటలు ఆడుకుంటోంది. కాలుష్యం వల్ల ఓజోన్ పొర దెబ్బతిని, అల్ట్రా వైలెట్ కిరణాలు భూమిని తాకుతున్నాయి.ఇటువంటి ఎన్నో ప్రమాదాలను మనిషి స్వాగతిస్తున్నాడు.మిగిలిన గ్రహాల్లో ఎలా ఉన్నా, మనిషి ఈ భూమిపై ఆరోగ్యంగా, ఆనందంగా చిరకాలం బతకడం ముఖ్యం. అదే సమయంలో, సర్వ చరాచర వ్యవస్థలకు నష్టం జరుగకుండా చూడడం అంతే ముఖ్యం. గ్రహాలకు ఆగ్రహం రాకుండా, అనుగ్రహం పొందే విధంగా మనిషి ప్రయాణం సాగితే, మనిషితో పాటు అనంతమైన సృష్టికి మంచిది. మనిషి గమనం దిశ మంచి వైపు సాగాలి.

ప్రైవేట్ రైళ్ళు...

- ఎన్.కళ్యాణి

ఇటీవల భారత ప్రభుత్వం 109 రూట్లలో 150 రైళ్ళను నడిపేందుకు ప్రయివేటు కంపెనీలకు "రిక్వెస్ట్ ఫర్ క్వాలిఫికేషన్" జారీ చేసింది. ఇది దేశంలో పెద్ద చర్చనీయాంశమైంది. సామాన్యులకు అందుబాటులో ఉండే చౌకైన రవాణా వ్యవస్థగా పేరుపొందింది మన రైల్వే వ్యవస్థ. ఈ పరిస్థితి మారనుందా? ఎటువైపు మన ప్రయాణం? వివేక్‌దేబ్ కమిటి సిఫార్సులు 2015లోనే మోడీ సర్కార్‌కు అందాయి. ఆ కమిటి భారతీయ రైల్వేను నిలువునా అడ్డంగా విడదీయాలని చెప్పింది.

2019 ఎన్నికలానంతరం మోడీ సర్కార్ వందరోజుల యాక్షన్ ప్లాన్‌ను రైల్వే మంత్రిత్వశాఖకు నిర్దేశించింది. ప్రయివేటు రైళ్ళను అనుమతించడంతో పాటు, 7 తయారీ యూనిట్లను కార్పొరేటీకరించడం, రైల్వే స్టేషన్లను ప్రయివేటు పరం చేయడం గురించి ప్రణాళికలు రూపొందించింది. ప్రయాణీకుల ఛార్జీల్లో ఉన్న 47శాతం సబ్సిడీని ఎత్తివేయడానికి ప్రతిపాదించింది. మోడీ సర్కార్ రెండవసారి గెలవడంతో మొత్తం రైల్వే సర్వ మంగళానికి ప్లాను సిద్ధమైందన్న మాట!

రైల్వే ప్రొడక్షన్ యూనిట్లలో రైలు ఇంజన్లు, బోగీలు, చక్రాలు ఉత్పత్తి అవుతాయి. ఇది రైల్వే వ్యవస్థ స్వావలంబనతో నిలవడానికి, తాజాగా మోడీ చెపుతున్న ఆత్మ నిర్భర్‌కు ఉదాహరణ. 2018-19లో 4200 కోచ్‌లు లక్ష్యంగా నిర్ణయించగా 6076 కోచ్‌లు తయారయ్యాయి. అదే సంవత్సరం 500 లోకోలు (ఇంజన్లు) లక్ష్యం కాగా 734 తయారయ్యాయి. ఐ.ఎస్.ఓ. 9000 సర్టిఫికెట్‌తో అద్భుత నైపుణ్యంతో ఈ నిర్మాణాలు జరుగుతున్నాయి. దీన్ని ఇప్పుడు కార్పొరేటైజేషన్ చేస్తామంటున్నారు. దేశమంతా ఉన్న వర్క్‌షాపులు కూడ దీన్లో కలుపబోతున్నారు. భవిష్యత్‌లో రైల్వేలకు అవసరమైన లోకోలు, కోచ్‌లు, చక్రాలు డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం గ్లోబల్ టెండర్లు పిలిచి సమకూర్చుకుంటారు. అంటే ఇప్పటి కంటే 2,3 రెట్లు అధిక ధరలకు కొనవల్సి వస్తుందన్నమాట! సంవత్సరానికి తక్కువలో తక్కువ పదివేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుంది.

ఇప్పుడు ఏకంగా రైల్వే ట్రాక్‌పై ప్రయివేటు రైళ్ళ నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొదటిదశలో లాభాలు వచ్చే రూట్లను వారికి అప్పచెపుతున్నది. లోకోలు, కోచ్‌ల కొనుగోళ్ళకు వారికి పూర్తి స్వేచ్ఛ. ఛార్జీలు కూడా వాళ్ళేగ నిర్ణయించుకుంటారు. పైగా పీక్ టైమింగ్ వారికే. విమానాల్లో నేడు మనం చూస్తున్నట్టు ఫ్లెక్సీఫేర్ ఉంటుంది. అంటే ఏవిధంగా కావాలంటే ఆ విధంగా రవాణా ఛార్జీలు వసూలు చేస్తారన్నమాట! నిర్ణీత సంఖ్యలో ప్రయాణీకులు లేకుంటే రైలు రద్దు కూడా అవుతుంది. లండన్‌లో ఇలాంటి బాధలు పడీపడీ రైల్వేను మళ్ళీ జాతీయం చేయాలనే డిమాండ్ ముందుకొచ్చింది.

రద్దీ సమయాల్లో ప్రయివేటు రైళ్ళు నడవడం వల్ల సాధారణ ప్రయాణీకులు ఛార్జీలు భరించలేరు. ముఖ్యంగా ఉద్యోగులు, చిన్న వ్యాపారులు రోజూ అప్ అండ్ డౌన్ ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడతారు. వీరి ప్రయాణానికి ఉపకరించే ప్యాసెంజర్ రైళ్ళు రద్దయ్యే అవకాశముంది. సీనియర్ సిటిజన్లకు, విద్యార్థులు, వికలాంగులకు ఇచ్చే రాయితీలు రద్దవుతాయి. ఆర్టీసీని, ప్రయివేటు బస్సులను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది. లాభాలు వచ్చే ఎక్స్‌ప్రెస్ రూట్లు కాకుండా, రైల్వేకు ప్రధాన ఆదాయం ఇచ్చే గూడ్స్ రైళ్ళను, ముఖ్యంగా రెండు రూట్లలో డిడికేటెడ్ ఫ్రైట్ కారిడార్‌ను పబ్లిక్ ప్రయివేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఉత్తర, తూర్పు కారిడార్లు 2021లో ప్రారంభమవుతాయి. ఇవి కనుక ప్రయివేటు చేతిలోకి వెళ్తే భారతీయ రైల్వే వ్యాధిగ్రస్త పరిశ్రమగా పరిగణించబడే ప్రమాదముంది. రైల్వే స్టేషన్లను ప్రయివేటుకిస్తే పార్కింగ్ ఫీజు నుంచి క్యాటరింగ్ ఛార్జీల వరకు వారే నిర్ణయించుకుంటారు. ప్రతి సౌకర్యానికి ఎయిర్‌పోర్ట్‌ల్లాగా ఛార్జీలు వసూలు చేస్తారు. ఇది సామాన్యులకు నరకం చూపిస్తుంది.

టెలికం రంగంలో ట్రాయ్ (TRAI), రెగ్యులేటరీ కమిషన్‌లాగా నియమిస్తారు. ఈ రెగ్యులేషన్ ఛార్జీలు, రూట్లు, టైమ్‌టేబుల్, రైళ్ళు నిర్వహణ (నడవడం, రద్దు) వగైరా అన్నింటినీ రెగ్యులేటర్ నిర్ణయిస్తారు.

ఇంతపెద్ద ప్రజోపయోగ రవాణా వ్యవస్థను బీజేపీ విచ్ఛిన్నం చేసి ప్రయివేటు పరం చేస్తుంటే ఇదే పద్ధతిలో చేసిన ప్రపంచ దేశాల అనుభవం అర్థం చేసుకోవడం అవసరం. ఇంగ్లండులో రైల్వేను ముక్కలు చేసి ప్రయివేటువారికి అప్పగించారు. వారు నడపలేక నష్టాల పాలైతే ఆ నష్టాలను ప్రభుత్వమే భరిస్తోంది. అర్జెంటీనాలో ప్రయివేటీకరించిన తర్వాత 35వేల కి.మీ. తిరిగే రైళ్ళ ఇప్పుడు 8వేల కి.మీ. నడుస్తున్నాయి. బ్రెజిల్‌లో ప్రయివేటీకరించిన తర్వాత ప్యాసింజర్ రైళ్ళు, లోకల్ రైళ్ళు రద్దు చేశారు.

ఆస్ట్రేలియా, ఇంగ్లండుల్లో రైళ్ళ ప్రమాదాల యెడల అక్కడ వేసిన ఎంక్వైరీ కమిటీలు ప్రయివేటు కంపెనీలను తప్పుపట్టాయి. లోకోలకు, కోచ్‌లకు, ట్రాక్‌లకు పొంతన సమన్వయం లేకపోవడమే కారణమని తేల్చి చెప్పాయి. ఈ పరిణామాలను గమనించిన ఇతర ఐరోపా దేశాలు ప్రయివేటీకరణకై ముందడుగు వేయట్లేదు. ఆ దేశాల ప్రజలు వ్యతిరేకత తెల్పుతున్నారు. ఇన్ని అనుభవాలున్నాయి. అయినా విఫలమైన ఈ ప్రయోగాన్నే మోడీ సర్కార్ నెత్తికెత్తుకోవడం ఆశ్చర్యకరం. ఈ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు అన్నిరంగాలను, రక్షణ, బీమా, బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రయివేటీ కరిస్తున్నాయి. ప్రజా సంక్షేమం గాలికి వదిలి వేయబడింది. కార్పొరేట్ లాభాలే ఈ ప్రభుత్వ లక్ష్యంలాగా ఉంది. రవాణా రంగాన్ని లాభ నష్టాలతో పరిశీలించకూడదని ప్రముఖ **'మెట్రోమ్యాన్'** ఇ.శ్రీధరన్ చెప్పింది బంగారు మాట! రైల్వేలను రక్షించుకోవాల్సిన బాధ్యత భారత ప్రజలదే.

మానవత్వం

- సి. కాశిం

చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు కొంచెమైన నదియు గొదవుగాదు.. విత్తనంబు మఱ్ఱివృక్షంబునకు నెంత విశ్వదాభిరామ వినురవేమ అంటాడు వేమన. పుణ్యం కొంచెమైనా సరే, దాన్ని చిత్తశుద్ధితో చేయాలి. అప్పుడు.. దానికి తప్పక తగిన ప్రతిఫలం లభిస్తుంది. మర్రివిత్తనం చిన్నదైనంత మాత్రాన అది పెద్ద వృక్షంగా ఎదగడంలేదా..? సద్బుద్ధితో ఏది చేసినా, ఎంత చేసినా విజయం సిద్ధిస్తుందన్నదే ఈ వేమన పద్య సారాంశం..

అలాంటి దయాహృదయాన్ని కనబర్చిన కేరళకు చెందిన ఓ మహిళకు అలాంటి ప్రతిఫలమే దక్కింది. ఆమె పేరు సుప్రియ. కేరళలోని తిరుపత్తూర్ జిల్లా పరిధిలోని తిరువల్లు ఆమె స్వస్థలం. గత మూడేళ్లుగా ఆమె జోయ్‌ఆలుక్కాస్ అనే సంస్థలో సేల్స్ ఉమన్‌గా పని చేస్తోంది. గత 10 రోజుల క్రితం సుప్రియ ఓ అంధుణ్ని బస్సు ఎక్కించి, తన సేవా గుణాన్ని చాటుకుంది. అయితే మూవ్ అవుతున్న బస్సు వెనకాల పరిగెడుతూ.. కండక్టర్‌ను బస్సాపమని అరిచి.. విషయాన్ని వివరించి.. ఓ అంధుణ్ని తీసుకొచ్చి మెల్లిగా అతణ్ని బస్సెక్కిస్తున్న వీడియోను పక్కనే ఉన్న ఓ వ్యక్తి ఆమెకు తెలియకుండానే షూట్ చేశాడు. ఆ వీడియోను తన సోషల్ మీడియా గ్రూప్స్‌లో ఆమెను అభినందిస్తూ పోస్ట్ చేశాడు. సుమారు పదిరోజుల క్రితం పోస్ట్ చేసిన ఆ వీడియో వేల లైకులు, సామాన్యుల నుంచి ఐపీఎస్ అధికారులు, సినీస్టార్లు, సెలబ్రిటీల వరకూ కామెంట్స్, రీట్వీట్స్‌తో తెగ వైరలైపోయింది. ఈ వీడియోను తిరుపత్తూరు జిల్లాకు చెందిన ఐపీఎస్ అధికారి విజయ్ కుమార్ “She made this world a better place to live.. Kindness is beautiful” అంటూ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. బాలీవుడ్ యాక్టర్, హీరో రితేష్ దేశ్ ముఖ్ కూడా సుప్రియ దయార్ద్ర గుణానికి అభినందలను తెలియజేశాడు. అక్కడికి కట్ చేస్తే.. అంతేనా? ఇదంతా జస్ట్ కొసరే.. అసలు ఇంకా ఉంది?

నెట్టింట్లో ప్రశంసల వర్షంతో పాటే.. ముందుగా మనం వేమన పద్యం రూపంలో చెప్పుకున్న.. చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు కొంచెమైన నదియు గొదవుగాదన్నట్టుగా.. సుప్రియ ఊహించని ఓ గిఫ్ట్ ఆమెకు లభించింది. ఆమె వీడియో వైరలవ్వడంతో.. ఆమె పనిచేసే సంస్థ జాయ్‌అలుక్కాస్ గ్రూప్ చైర్మనైన జాయ్‌అలుక్కాస్, తన భార్యతో కలిసి సుప్రియ కిరాయికుంటున్న ఇంటికెళ్లి అభినందించారు. అంతేకాదు.. వచ్చే వారం త్రిస్సూర్‌లో ఉన్న జాయ్‌అలుక్కాస్ హెడ్ ఆఫీస్‌కు రావాలని కోరాడు.

కట్ చేస్తే.. త్రిస్సూర్‌కు వెళ్లిన సుప్రియకు తమ హెడ్ ఆఫీస్‌లో వందల మంది ఉద్యోగుల సమక్షంలో అభినందల వర్షం కురిసిందట. దాంతో ఒక్కసారిగా భావోద్వేగానికి గురై ఆనందభాష్పాలతో ఒకరకమైన అనుభూతికి లోనైన సుప్రియకు.. అందులోంచి తేరుకునేలోపే.. మరో పెద్ద బహుమానం దక్కింది. అదే సామాన్యులెందరో కనే సొంతింటి కల తీరడం. అవునూ.. ఒక అంధుడిపై చూపించిన కరుణకు సుప్రియకు అద్భుతమైన గిఫ్ట్‌ను అందించారు జాయ్‌అలుక్కాస్. సుప్రియకు ఇద్దరు పిల్లలు, ప్రైవేట్ కంపెనీలో పనిచేసే భర్త ఉండగా.. అసలూహించని బహుమానం అందుకున్న సుప్రియ అనుభూతి ఇక మాటల్లో వర్ణించలేనిదనుకోండి

హృదయం ఎప్పుడూ దయతో నీలా ద్రవిస్తూ ఓ ప్రవాహోఝరిలా ఉండాలే తప్ప.. అదెప్పుడూ ఎండిపోయిన దాఖలాలు ఈ ప్రపంచంలో కనిపించకూడదని.. అందుకే నీ దయార్ద్ర హృదయానికి ఈ బహుమతి అంటూ జాయ్ అలుక్కాస్ భార్య జాలీ అలుక్కాస్ చెప్పిన మాటలు తానెప్పటికీ మర్చిపోనని చెప్పింది సుప్రియ.

సుప్రియ వీడియో వైరలయ్యాక.. ఆమెలాగా సాయం చేసేందుకు మానవతా దృక్పథంతో ముందుకెళ్లాలే గానీ.. ప్రేక్షకపాత్రకు పరిమితం కాకూడదనే కామెంట్స్ కూడా సోషల్ మీడియాలో హోరెత్తాయి. ఎక్కడైతే మానవత్వం పరిమళించే మనుషులుంటారో.. అక్కడ దయాగుణానికి అవకాశముంటుందన్న రోమన్ తత్వవేత్త లూసియస్ అన్నేయస్ సెనెకా చెప్పిన మాటలను అక్షరసత్యం చేసి సుప్రియ ప్రశంసలతో పాటు.. ఊహించనిదానికన్నా పెద్ద ప్రతిఫలమైన సొంత ఇంటిని కూడా సొంతం చేసుకుంది.

సో, సుప్రియ చూపించిన మానవతా విలువలకు ఒక సెల్యూటైతే..? అలాంటి దయాగుణాన్ని చూపించినవారి పట్ల మరింత కరుణను కురిపించిన జాయ్ అలుక్కాస్‌కు డబుల్ సెల్యూట్.


ఇరిగేషన్ శాఖ పేరు మార్పు

ఇరిగేషన్ శాఖ ఇకపై వాటర్ రీసోర్సెస్ డిపార్ట్‌మెంట్‌గా కొనసాగుతుందని, ఈ మేరకు పేరు మారుస్తున్నామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. సోమవారం ప్రగతి భవన్‌లో ఇరిగేషన్ రీ ఆర్గనైజేషన్ పై మంత్రులు, అధికారులు, ఇంజనీర్లతో సీఎం సమీక్షించారు. రాష్ట్రంలో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీటిని ఇవ్వడానికి రోజుకు గోదావరి నుంచి 4 టీఎంసీలు, కృష్ణా నుంచి 3 టీఎంసీల నీటిని ఎత్తిపోయాలని సీఎం స్పష్టం చేశారు. రీఆర్గనైజేషన్ తర్వాత మేజర్, మీడియం, మైనర్, ఐడీసీ లాంటి వ్యవస్థలన్నీఒకే గొడుగు కిందికి వస్తాయని, ఒక జోన్‌కు ఒక సీఈ (చీఫ్ ఇంజనీర్) ఇన్‌చార్జీగా వ్యవహరిస్తారని చెప్పారు. మేజర్ ప్రాజెక్టులు మొదలు.. చెరువులు, చెక్ డ్యాంలు, లిఫ్టులన్నీ ఉంటాయన్నారు.

ప్రజాస్వామ్య మూలాలనే తొలగిస్తారా!

- ఇ.మధు





ఈ విద్యా సంవత్సరానికిగాను 9-12 తరగతుల సీబీఎస్ఈ సిలబస్‌ను 30శాతం తగ్గిస్తూ కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ఇటీవల ప్రకటించారు. కోవిడ్ విపత్తు కారణంగా విద్యా సంస్థలు కోల్పోయిన పని దినాలను దష్టిలో పెట్టుకొని విద్యార్థులపై భారం లేకుండా 30శాతం సిలబస్‌ను తగ్గించాలని ఎన్సీఈఆర్టీ కూడా సూచించింది. దేశవ్యాప్తంగా సుమారు 1500మంది సిలబస్‌ను తగ్గించాలన్న అభిప్రాయాన్ని ఎంహెచ్ఆర్డీకి తెలియజేశారు. సిలబస్ తగ్గింపు సరేకాని వేటిని తొలగించాలి, ఎవరి అభిప్రాయాలు తీసుకున్నారు అనే ప్రక్రియలో పారదర్శకత లేదు. భావజాల దురుద్దేశాలు ఉన్నాయి. ప్రస్తుతం నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్లో విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేలా సిలబస్ తగ్గింపు ఉండాలి. కాని తగ్గించిన సిలబస్‌ను గమనిస్తే ఆ లక్ష్యంతో చేసినట్టుగా లేదు. అవి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ భావజాలానికి ఏమాత్రం గిట్టనివి, ఎంపిక చేయబడ్డవిగా ఉన్నాయి. ఎప్పటి నుండో సిలబస్‌లో తాను చేయదలచుకున్న మార్పులకు భిన్నంగా, ఆటంకంగా ఉన్న పాఠ్యాంశాలనే ఇప్పుడు తీసేశారు. స్వాతంత్ర్యానంతరం అన్ని ముఖ్యమైన విద్యా కమిషన్లు చెప్పిన, రాజ్యాంగ విలువలకు ప్రాతినిధ్యం వహించే పాఠ్యాంశాలన్నీ ఈ రద్దు జాబితాలో ఉన్నాయి. కోవిడ్ విపత్తును ఎదుర్కొనడం కాక దానిని అవకాశంగా మలుచుకొని సిలబస్‌లో తన ఎజెండా అమలుకు కేంద్ర ప్రభుత్వం పూనుకుంటున్నదని అర్థమౌతున్నది.

తొలగించిన భాగాల్లో ముఖ్యమైనవి

సమాఖ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, హక్కులు, ఉద్యమాలు, పౌరసత్వం, ఆహార భద్రత, జాతీయవాదం, స్థానిక ప్రభుత్వాలు, ప్రాంతీయ ఆకాంక్షలు, భద్రత, పర్యావరణం, సహజ వనరులు, ప్రణాళికాబద్ధమైన అభివద్ధి, పంచవర్ష ప్రణాళికలు, భారతదేశ విదేశాంగ విధానం, ఇరుగు పొరుగు దేశాలతో సంబంధాలు, భిన్నత్వంలో ఏకత్వం.. వంటి అంశాలకు సంబంధించిన పాఠ్యాంశాలను తొలగించారు. తీసివేసిన భాగాలన్నీ

రాజ్యాంగ లక్ష్యాల సాధన, మన దేశ చరిత్రకు సంబంధించిన పాఠ్యాంశాలే. ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత ప్రాథమికమైనవి. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులు. ఇవిగాక కులం, మతం, లింగ వివక్ష, ప్రపంచీకరణ విధానాలు, పెద్ద నోట్ల రద్దు, జీఎస్‌టీకి సంబంధించిన అంశాలనూ తొలగించారు. ఇవి పాలకుల వైఫల్యాలను తెలియచెప్పేవి కనక వాటిని తీసేశారు.

రాజకీయ ఎజెండా

విద్యా సంవత్సరం ప్రారంభించడానికి మానవ వనరుల మంత్రిత్వశాఖ తగిన కసరత్తు, ఏర్పాట్లు, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు చేయాలి. అయితే ఆ పని కన్నా సిలబస్ తగ్గింపు మీద, ఆన్‌లైన్ విద్య పైన ఎక్కువ దష్టి సారించింది. విద్యా సంవత్సరం ప్రారంభ మయ్యాక ఉన్న పని దినాల ఆధారంగా సిలబస్‌ను కుదించవచ్చు. ఆ కుదింపు కూడా ఎంపిక చేయబడిన అంశాలనుకాక ర్యాండమ్‌గా చేయవచ్చు. అసలు తొలగించిన భాగాలు విద్యార్థులకు ఒత్తిడిని తగ్గిస్తాయా! రాజ్యాంగ లక్ష్యాలకు సంబంధించిన పాఠ్యాంశాలను బోధించకుండా ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దగలమా? తొలగించిన పాఠ్యాంశాలు విద్యార్థుల జీవితానికి, భవిష్యత్తుకు ఉపయోగ పడనివా పోనీ మిగిలిన పాఠ్యాంశాలు తొలిగించిన వాటికన్నా ముఖ్యమైనవా ఈ పాఠ్యాంశాలు బోధిస్తే ప్రస్తుతం మన దేశంలో అవి అమలవుతున్నాయో లేదో విద్యార్థులు తెలుసుకొని ప్రశ్నించే ప్రమాదముందనా వీటిని బోధించకపోతే పాలకుల విధానాలకు ఎదురుండదనా సిలబస్‌ను హేతుబద్ధీక రించామని మంత్రి గారు చెప్పడమంటే తొలగించిన పాఠ్యాంశాలు సహేతుకమైనవి కావని ఉద్దేశ్యమా తదితర ప్రశ్నలకు ఎన్‌హెచ్‌ఆర్‌డీ దగ్గర సమాధానం లేదు. ఈ తొలగింపు ఈ విద్యా సంవత్సరానికే పరిమితమని, ఎన్‌సిఇఆర్‌టి రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రణాళిక ద్వారా... తొలగించిన పాఠ్యాంశాలనుకూడా అవసరం మేరకు బోధించవచ్చని ఎన్‌హెచ్‌ఆర్‌డీ చెప్పడం మరీ దారుణం. అంటే దేశ భవిష్యత్తుకు అవసరమైన ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం, లౌకికవాదం వంటి రాజ్యాంగబద్ధ విలువల అవసరాన్ని ప్రశ్నార్థకం చేయడమే ఇది. కుదింపు సామాజిక శాస్త్రాలలో మాత్రమే కాదని 190 సబ్జెక్టులలోనూ తగ్గించామని సీబీఎస్‌ఈ చెప్పడం సాంకేతికంగా తప్పుకోవడానికే తప్ప సమంజసమైనది కాదు. సీబీఎస్‌ఈ కిందటి విద్యా సంవత్సరంలో కూడా కులం, ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యానికి సవాళ్లు, భిన్నత్వం మొదలైన పాఠ్యాంశాలనూ రద్దు చేసింది. విద్యార్థులకు సిలబస్ భారాన్ని తగ్గించాలనే పేరుతో విద్యా లక్ష్యాలకు తిలోదకాలు ఇవ్వడం సమంజసం కాదు. కరోనా వంటి విపత్కర పరిస్థితులకు 'జీవావరణ శాస్త్రం, పరిణామం'ను దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేయడమే కారణమని.. వీటికి సంబంధించిన పాఠ్యాంశా లను కూడా నేర్చుకోవలసిన ఈ సమయంలో తొలగించడమేమిటని 'ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎవల్యూషనరీ బయాలజిస్ట్స్' సంస్థ ప్రశ్నిస్తోంది.

మరిన్ని మార్పులు

ఈ ప్రయత్నం కేవలం సీబీఎస్‌ఈకి మాత్రమే పరిమితం కాదు. కోవిడ్ విపత్తును అధిగమించేందుకు 'ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్'లో భాగంగా ప్రకటించిన న్యూ నేషనల్ కరిక్యులమ్ అండ్ పెడగాజి ఫ్రేమ్‌వర్క్ ద్వారా సిలబస్‌లో, బోధనలో పెద్ద ఎత్తున మార్పులు చేయాలని చూస్తున్నది. నిజానికి బీజేపీ అధికారం చేపట్టిన చాలా రాష్ట్రాల్లో సిలబస్‌లను మార్పు చేసింది. త్వరలో కేంద్ర ప్రభుత్వం అమలు చేయదలచుకున్న 'జాతీయ విద్యా విధానం-2019' ద్వారా మొత్తం విద్యా వ్యవస్థను, దాని నిర్మాణాలను, సిలబస్, పాఠ్య ప్రణాళిక, బోధనలను రాజ్యాంగ విరుద్ధంగా మితవాద భావజాలం వైపు మళ్లించడానికి అనేక ప్రతిపాదనలు చేసింది. రాజ్యాంగ విలువలను, ఆధునిక విలువలను నీరుగార్చి ప్రాచీన భావనలను, విలువలను బోధించాలని ప్రతిపాదించింది. ప్రజాస్వామిక విలువలైన సమానత్వం, సమ న్యాయం, స్వాతంత్ర్యం, లౌకికవాదం, సంక్షేమం, ఆత్మగౌరవం, హక్కులు మొదలైనవి మన విద్యా వ్యవస్థలో కీలకమైన విలువలుగా ఉండాలని 'నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్-2005' చెప్పింది. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం నీతి, నైతిక విద్య పేరుతో మత విలువలను బోధించాలని ప్రతిపాదిస్తున్నది. పాఠశాల విద్యలో 6-8గ్రేడుల మధ్య విద్యార్థులకు ఒక సంవత్సరం కోర్సుగా దీనిని నిర్వహించాలని, స్వచ్ఛత, సేవ, మోసం, అహింస, సహాయం, సహనం, సత్యం, నిష్కామ కర్మ వంటి పాఠ్యాంశాలను బోధించాలని చెబుతున్నది. పంచతంత్ర, జాతక, హితోపదేశ కథలను బోధించి స్ఫూర్తినివ్వాలని చెబుతున్నది. న్యాయ విద్య కరిక్యులమ్‌ను రాజ్యాంగ విలువలను బట్టికాక ఇతిహాస కాల్పనిక విజయగాథల నుండి తయారు చేయాలని ప్రతిపాదించింది. అలాగే ఉన్నత విద్యలో ఉదారకళల విద్య పేరుతో 64కళల జ్ఞానాన్ని అందించాలని ప్రతిపాదించింది. ఎంపిక చేయబడిన కాలాల చరిత్రను, నాటి విలువలు, సంస్కృతిని నేర్పాలంటుంది. అంటే భారతదేశ చరిత్ర, సంస్కృతి, విలువలు, వారసత్వం మొదలైన వాటిని విమర్శనాత్మకమైన దక్పథం నుండి కాక ఒక గుడ్డి విశ్వాసంతో బోధించాలంటుంది. ఏకత, ఏకైక సంస్కృతిని విద్యా వ్యవస్థ ద్వారా సాధించాలని చెబుతున్నది. అంటే ఇది మన దేశంలో ఉన్న బహుళ సంస్కృతులను నిరాకరించడమే కదా? మితవాద భావాలను బోధించడం, వివక్షాపూరితమైన ప్రాచీన ఆచరణలను రుద్దడం లక్ష్యంగా కనిపిస్తుంది. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి పరిశోధన ప్రక్రియను కూడా మితవాద భావజాలం వైపు మళ్లించడానికి ప్రయత్నిస్తున్నది. దేశవ్యాప్తంగా సిలబస్‌ను ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించాలని, రాష్ట్రాలు వాటికి కొంత జోడించుకోవచ్చని ప్రతిపాదించింది. అంటే సిలబస్‌ను పూర్తిగా మితవాద భావజాల కేంద్రంగా రూపొందించమంటోంది. అంటే.. బీజేపీ ప్రభుత్వం మొత్తం విద్యా వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన ఆధునిక విలువలనుగాక ప్రాచీన విలువల బోధన వైపు సిలబస్‌ను మార్చేందుకు ప్రయత్నిస్తున్నది. కోవిడ్ విపత్తును ఆసరాగా చేసుకొని రాజ్యాంగ విరుద్ధంగా సీబీఎస్‌ఈ సిలబస్‌ను కుందించినట్లుగానే భవిష్యత్తులో అన్ని రకాల సిలబస్‌ల విషయంలో మార్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తుంది. ప్రజాతంత్రవాదులు దీనిని తిప్పికొట్టాలి.

పుష్పక విమానం

- టి.వరప్రసాద్



నేపాల్ అయోధ్య రాముడి గురించి ఏం చెబుతున్నదనే కథ కాసేపు వదిలేద్దాం.. దానిపై చైనా ప్రభావాన్ని కూడా కాసేపు మరిచిపోదాం.. అదే చైనా ప్రభావం బలంగా ఉన్న శ్రీలంక కూడా అలాంటి ప్రయత్నాల్లో ఉందా..? ఈ డౌట్ కొడుతోంది కొందరికి తాజాగా.. కానీ అది రాముడిని నిందించే ప్రయత్నమో, రాముడి వ్యక్తిత్వాన్ని, దైవత్వాన్ని కించపరిచే ఆలోచనల్లో ఏమీ లేదు.. ఈ జన్మస్థలాల గొడవ అసలే లేదు.. కాకపోతే రావణుడిపై ఉన్న విలనీ ముద్రను డైల్యూట్ చేసే ఆలోచనలో ఉంది.. ఎందుకు.. అకస్మాత్తుగా ఈ ప్రయత్నం దేనికి..? అనూహ్యం.. అంతుపట్టదు.



రాముడి కాలంలో రావణుడు శ్రీలంక పాలకుడు.. శివుడిని నిత్యమూ పూజించే బ్రాహ్మణుడు.. ప్రపంచ వాణిజ్యాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని, సముద్రాలపైనా ఆధిపత్యం సాధించి, ఎవరూ ఊహించనంత సంపదను సృష్టించాడు.. తెలివైనవాడు.. తన సైనిక సంపత్తితో నాటి ఆర్యావర్తం దాకా అన్ని రాజ్యాలనూ గెలిచాడు.. సుపరిపాలకుడు.. అన్నింటికీ మించి అప్పట్లోనే.. అంటే 5 వేల సంవత్సరాల క్రితమే అత్యున్నత సాంకేతిక సామర్థ్యాన్ని కలిగినవాడు.. ఈ ప్రపంచంలో మొట్టమొదటి విమాన ప్రయాణికుడు, విమానం యజమాని.. అదే పుష్పకవిమానం.

ఆ విమానంపై బోలెడన్ని రామాయణాల్లో బోలెడన్ని వర్ణనలున్నయ్.. రావణుడిని ఇప్పటికీ తమిళనాడు, శ్రీలంక, కేరళ ప్రాంతాల్లో దేవుడిగా కూడా పూజిస్తారు.. ఆర్యుడు, క్షత్రియుడైన రాముడు.. దక్షిణాదికి వచ్చి, అన్యాయంగా రావణుడిని చంపినట్టుగా ఆయా జానపద సాహిత్యం చెబుతూ ఉంటుంది.. రావణుడి పేరిట జాతరలు కూడా జరుగుతయ్.. ఈ నేపథ్యంలో రావణుడి గత వైభవాన్ని, గత సాంకేతిక నైపుణ్యాన్ని, గత వైశిష్ట్యాన్ని ప్రజలకు కొత్తగా పరిచయం చేయాలని శ్రీలంక భావిస్తోంది.

ముందుగా నాటి పుష్పక విమానంపై అధ్యయనానికి సంకల్పించింది ఆ దేశ టూరిజం ప్లస్ ఏవియేషన్ శాఖ.. అసలు 5 వేల ఏళ్ల క్రితం ఓ విమానం ఎలా రూపొందించారు, ఎలా నడిచేది, ఎలా ఎగిరేది, అప్పుడున్న సాంకేతిక జ్ఞానం ఏమిటి..? ఈ విషయాల్లో ప్రజలు ఎవరైనా సరే, తమకు అందుబాటులో ఉన్న పుస్తకాలు, డాక్యుమెంట్లు, చారిత్రక ఆధారాలు ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం ఓ నోటిఫికేషన్ జారీ చేసింది

"రావణుడు తెలివైనవాడు.. ఈ ప్రపంచపు మొట్టమొదటి విమానచోదకుడు, యజమాని, ప్రయాణికుడు.. ఇది పురాణం కాదు.. వాస్తవం.. అయితే ఆ చరిత్రను మేం నిరూపిస్తాం.. జస్ట్, ఓ అయిదేళ్లు ఆగండి, మేం రీసెర్చ్ పూర్తిచేసి, నమ్మలేని నిజాలతో మీ ముందుంటాం.." అంటున్నాడు శ్రీలంక ఏవియేషన్ అథారిటీ మాజీ వైస్ చైర్మన్ శశి దనతుంగె.. ఇంతకీ, శ్రీలంకకు అకస్మాత్తుగా ఈ కోరిక ఎందుకు పుట్టింది..? ఏమో.. కాలం చెప్పాలి, అసలు ఈ తాజా ప్రక్రియ వెనుక ఉద్దేశాలు ఏమిటో.!!

ఖర్చులను అంచనా వేయండి..

తెలంగాణ ప్రభుత్వం

ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులకు కచ్చితమైన ఆపరేషన్ మ్యానువల్స్ ఉండాలని సీఎం చెప్పారు. ప్రాజెక్టుల ఆపరేషన్స్, మెయింటెనెన్స్‌కు ఎంత ఖర్చవుతుందో అంచనా వేయాలన్నారు. అన్ని పంపుహౌస్‌ల మెయింటెనెన్స్ బాధ్యతను విద్యుత్ శాఖకు అప్పగించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కింద చేసేందుకు వీలున్న పనులను గుర్తించి, ప్లాన్లు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో మంత్రులు ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్, ఇరిగేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్ కుమార్, సీఎంవో సెక్రటరీ స్మితా సబర్వాల్, ఈఎన్సీలు మురళీధర్, నాగేందర్‌రావు, అనిల్‌కుమార్, హరిరాం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అన్ని శాఖలూ ఒకే చోటుకు..

వాటర్ రీసోర్సెస్ డిపార్ట్మెంట్‌కు ఎన్ని ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్సీ) పోస్టులు అవసరమో ముందుగా నిర్ణయించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈఎన్సీ జనరల్‌అడ్మినిస్ట్రేషన్, ఆపరేషన్స్ పోస్టులు కొనసాగుతాయని చెప్పారు. వాటికి అదనంగా ఇంకా ఈఎన్సీ పోస్టులు అవసరమైతే చెప్పాలన్నారు. ఇరిగేషన్‌లో వేర్వేరువిభాగాలుగా ఉన్న అన్ని శాఖలను ఒకే చోటుకు చేర్చాలని ఆదేశించారు. ఈఈలు, డీఈల పరిధిని నిర్ణయించి, ప్రపోజల్స్ ఇవ్వాలన్నారు. ఈఎన్సీ నుంచి లష్కర్ వరకు డిపార్ట్ మెంట్‌లో ఎంత మంది ఉన్నారు? ఇంకా ఎన్ని పోస్టులు అవసరం అనేది నిర్ణయించాలని, అవసరమైతే డిపార్ట్‌మెంట్‌కు ఇంకో 1000 పోస్టులు కొత్తగా మంజూరుచేస్తామని సీఎం చెప్పారు.



కశింకోట చరిత్ర

- ఆర్.బి.ప్రసాద్

కశింకోట సంస్థానపు గ్రామము. నిజాం పాలనలో చికాకోల్ సర్కారులో ఒక ఫౌజ్‌దారీగా ఉండేది. ఆ తరువాత 1794 నుండి 1802 వరకు విశాఖపట్నం జిల్లాగా ఏర్పడిన మూడు కలెక్టరేట్లలో ఒక కలెక్టరేటుకు ముఖ్యపట్టణంగా ఉంది. 1802లో విశాఖపట్నం జిల్లా ఏర్పడిన తర్వాత అనకాపల్లి జమిందారీ తాలూకాలో భాగమైనది. మహమ్మదీయుల పాలనలో గోదావరి నదికి ఉత్తారన ఉన్న ప్రాంతంలోని కోటలలోకెల్లా పరిష్టమైన ప్రముఖ కోటగా పేరుపొందింది. అయితే ప్రస్తుతం కశింకోటలో కోట యొక్క శిథిలాలు మాత్రమే మిగిలాయి. 1882లో రాబర్ట్ సీవెల్ కశింకోట దుర్గం 800 యేళ్ళనాటిదని ప్రస్తావించాడు. అంటే ఈ కోట కనీసం 11వ శతాబ్దం నుండి ఉండి ఉండాలి. ఇక్కడ సదాశివరాయల కాలం నాటి రెండు శాసనాలు (1558, 1559) లభించాయి. 1572లో ఇబ్రహీం కులీ కుతుబ్ షా ఉత్తరాంధ్రలో తన ప్రాబ్యలం పెంచుకోవటానికి రాజమండ్రి నుండి దండెత్తి కశింకోటను వశపరచుకున్నాడు. ఆ తరువాత ఒరిస్సాపై దండెత్తాడు. నామమాత్రంగా గంజాం మెత్తం గోల్కొండ సుల్తానుల ఆధీనంలో ఉన్నా బాహుబలేంద్ర కుటుంబం వారు పాలిస్తుండేవారు. ఆ తరువాత వాళ్లు రాజధానిని రాజమండ్రి నుండి కశింకోటకు మార్చారు. బాహుబలేంద్ర కుమారుడు ముకుందరాజు కశింకోట రాజుగా ఉన్న కాలంలో పన్నులు కట్టడానికి నిరాకరించాడు. కుతుబ్‌షా దండెత్తి రాగా, వేంకటాపతి రాయలును సహాయం కోరాడు.

కశింకోట సంస్థానం :

కశింకోట సంస్థానాన్ని చెలికాని కుటుంబం పాలించింది. వీరు రావు వారికి బంధువులు. హవేలీ భూములతో ఏర్పడిన కశింకోట, మేలుపాక సంస్థానాలను వేలంలో విజయనగరం రాజు కొన్నాడు. రెండు సంవత్సరాల తర్వాత వాటిని కారుమంచి వెంకటాచలానికి అమ్మాడు. 1837లో ఆయన మరణించిన తర్వాత కూతురు కొడుకు మంత్రిప్రగడ వెంకటరావుకు సిద్ధించాయి. 1845లో ఆయన కూడా మరణించగా, వెంకటరావు తమ్ముడు చిరంజీవిరావు, కొడుకు వెంకటాచలానికి ఉమ్మడిగా కట్టబెట్టారు. ఇద్దరూ పిల్లలైనందువళ్ళ సంస్థానం సంరక్షక పాలనలో ఉంది. తమ్ముడు చిరంజీవిరావు 1851లో మరణించాడు, కొడుకు వెంకటాచలం 1863లో యుక్తవయస్కుడై 1865 మే నెలలో మరణించాడు. ఆయన మైనరు విధవ రామాయమ్మ, పసిపాప మహాలక్ష్మమ్మ.

శారదా నది తీరంలో ఉన్న కశింకోట దాదాపు 650 సం. పూర్వమే ఉంది. దీనిని 14వ శతాబ్దం నాటి సింహాచలం శాసనాలలో **"కసిమికోట"**గా పేర్కొంటున్నారు. కసిమి అంటే బురద అని అర్థం. కోట చుట్టూ బురదను రక్షణ కవచంగా వాడడం వలన కసిమికోట అయింది. తూర్పు గాంగులు, బాహుబలేంద్రుడు, కుతుబ్ షాహీల, విజయనగరం పూసపాటి రాజుల పాలనలో ఉంది. మొఘులులు, గోల్కొండ నవాబుకు జరిగిన మెదటి యుద్ధం ఇక్కడే 1635లో జరిగింది.

ఫ్రెంచ్ వారిని పూసపాటి ఆనంద రాజు చందుర్తి(తూ.గో) యుద్ధంలో (1758 డిసెంబర్) ఓడించడానికి ముందు కసింకోటలో 1758 నవంబర్‌లో విజయనగరం రాజుకు ఆంగ్లేయులకు సంధి జరిగింది.

కశిమికోట సంస్థానంలో గుండు సోమనాథశాస్త్రి, తోటపల్లి వెంకటరామ సిద్ధాంతి, ప్రముఖ వైణికులు తుమరాడ సంగమేశ్వర శాస్త్రి వంటి వారు ఉండేవారు.

రాణి మహాగ్ని చిన నృసింహ కవి గారి"తిథికల్పవల్లి"కి మంజరిని రచించి ప్రచురించారు.

కశింకోటలో పేరుపొందిన హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా అజీజ్ షా, ఖాదర్ హన్నీ వోనూఫీ జమీ దర్గాలు ఉన్నాయి.

సాహితీ పయోనిధి..దాశరథి

- కెబి. రమేష్

కవితను ఆయుధంగా మలచి ఉద్యమించిన 'సుకవి' అతడు. నిజాం పరిపాలన తెలంగాణ ప్రజల అగచాట్లను, కన్నీళ్లను 'అగ్నిధార'గా మలచి పీడిత ప్రజల గొంతును వెలుగెత్తి నినదించిన ఉద్యమకారుడతడు. అందుకు ఆ నిరసనకారుడు ధారపోసిన కవితాధార 'అగ్నిధార'. "ముసలి నక్కకు రాచరికంబు దక్కునే...ఓ... నిజాము పిశాచమా, కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని" అని గర్జిస్తూ 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని సగర్వంగా ప్రకటించి విముక్తి ఉద్యమానికి ప్రేరణనిచ్చిన ప్రాతస్మరణీయుడతడు. ఇందూరు కోట జైలులో పండ్లు తోముకోవడానికి నిజాం సిబ్బంది ఇచ్చే బొగ్గులను ఆయుధాలుగా మలిచి, 'దగాకోరు, బడాచోరు, రజాకారు పోషకుడవు. దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది. దిగిపోవోయ్, తెగిపోవోయ్' అంటూ కవిత్వాన్ని వజ్రాయుధంగా వాడి, ఆ జైలు గోడలమీద నిజాం ప్రభువుకు వ్యతిరేకంగా పద్యాలు రాసి కొరడా దెబ్బలు తిన్న విప్లవకారుడతడు. భావప్రేరిత ప్రసంగాలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన ధీశాలి. తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు నేటికీ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. ఆ ధీమంతుడే 'దాశరథి' అని ప్రేమగా పిలిపించుకున్న దాశరథి కృష్ణమాచార్యులు. చలన చిత్రసీమలో కూడా దాశరథి తన మార్కు పాటల్ని రాసి 'శభాష్' అనిపించుకున్నారు. జూలై 22, 1925న వరంగల్ జిల్లా చిన్న గూడూరులో జన్మించిన దాశరథి జయంతి సందర్భంగా ...దాశరథి కృష్ణమాచార్యుల బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. మెట్రిక్యులేషన్ పరీక్షను ఉర్దూ మీడియంలో చదివారు. తెలంగాణా ఉద్యమం కారణంగా చదువు కుంటుపడడంతో 1952లో ఉస్మానియా విశ్వవిద్యాలయ సాయంకళాశాలలో చేరి ఆంగ్ల సాహిత్యంలో పట్టా పుచ్చుకున్నారు. చిన్నతనం నుంచే పద్యాలు అల్లడంలో ప్రావీణ్యత సాధించారు. సంస్కృత, ఉర్దూ, పారశీక భాషల్లో దాశరథి దిట్ట. తొలి నుంచి వామపక్ష భావాలు కలిగిన దాశరథి, కమ్యూనిస్టు సిద్ధాంతాలు, వైఖరి నచ్చక రెండవ ప్రపంచ యుద్ధసమయంలో బయటకు వచ్చారు. సాయుధ రైతాంగ పోరాటానికి నడుం బిగించారు. మెట్రిక్యులేషన్ పూర్తవగానే కొంతకాలం ఉపాధ్యాయునిగా, పట్టా పుచ్చుకున్న తర్వాత పంచాయతీ తనిఖీ అధికారిగా పనిచేశారు. 1956 నుంచి 1963 వరకు ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలోను, 1963 నుంచి 1971 వరకు ఆకాశవాణి మద్రాసు కేంద్రంలోను, ప్రయోక్తగా ఉద్యోగం చేశారు. ఆంధ్రమహాసభలో విప్లవాత్మక సందేశాలు ఇచ్చినందుకు నిజాం ప్రభుత్వం 1948లో దాశరథిని జైలులో పెట్టింది. నిజామాబాదు ఇందూరుకోట జైలులో వున్నప్పుడు పండ్లు తోముకోవడానికి జైలు సిబ్బంది ఇచ్చే బొగ్గు ముక్కలతో ఆ జైలు గోడల నిండా నిజాంకు వ్యతిరేకంగా పద్యాలు రాసి కొరడాదెబ్బలు



తిన్నారు. తర్వాత తెలంగాణా రచయితల సంఘాన్ని నెలకొల్పి యువతలో సాహితీ చైతన్యాన్ని రగిలించి కవితా సేవలు విస్తరింపజేశారు. ఆయన మంచి వక్త కావడంతో ఊరూరా పర్యటిస్తూ ప్రజలను ప్రభావితం చేశారు. దాశరథి రచించిన తొలి పుస్తకం 'అగ్నిధార'ను 1949లో దేవులపల్లి రామానుజరావు ఆంధ్ర సారస్వత పరిషత్తు వార్షికోత్సవంలో విడుదల చేశారు. నిజాం నిరంకుశత్వం, భారత స్వాతంత్ర్య సమరం, ప్రజల అగచాట్లు, నిజాం ప్రభుత్వ పతనం వంటి అంశాలు 'అగ్నిధార' ఖండికల రచనకు పునాదులని దాశరథి స్వయంగా చెప్పుకున్నారు. తర్వాత 'రుద్రవీణ', 'మహ ఆంధ్రోద్యమం', పునర్నవం', 'కవితా పుష్పకం', 'తిమిరంలో సమరం' వంటి కవితాగ్రంథాలు వెలువరించారు. కథలు, నాటికలు కూడా రాశారు. 1965లో 'గాలిబ్ గీతాలు' రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు ఉత్తమ అనువాద గ్రంథ బహుమతి, 1967లో 'కవితా పుష్పకం' సంపుటికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 1974లో 'తిమిరంలో సమరం' రచనకు కేంద్రసాహిత్య అకాడమీ బహుమతి లభించింది. 1975లో ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదుతో, ఆగ్రా విశ్వవిద్యాలయం 'డాక్టర్ ఆఫ్ లెటర్స్

పట్టాతో దాశరథిని సత్కరించారు. 1977లో దాశరథి ఆంధ్రరాష్ట్ర ఆస్థాన కవిగా నియమితులయ్యారు.

దాశరథి రచించిన వైవిధ్య గీతాలు

దాశరథి ఎన్నో భక్తిగీతాలను సినిమాల కోసం రాశారు. ఆ పాటలన్నీ శ్రోతలు మెచ్చినవే. 'తిరుమల మందిర సుందరా' (మేనకోడలు), 'నను పాలింపగ నడచీ వచ్చితివా' (బుద్ధిమంతుడు), 'శరణం నీ దివ్య చరణం' (మట్టిలో మాణిక్యం), 'నడిరేయి ఏ జాములో స్వామి నినుచేర దిగివచ్చునో' (రంగులరాట్నం), 'రారా కృష్ణయ్యా రారా కృష్ణయ్యా' (రాము) పాటలు దాశరథి రాసిన భక్తి పాటల్లో కొన్ని. రక్తి పాటలను కూడా దాశరథి అద్భుతంగా ఆవిష్కరించారు. వాటిలో కొన్ని 'తనివి తీరలేదే నా మనసు నిండలేదే' (గూడుపుఠాణి), 'వెన్నెలరేయి ఎంతో చలీ చలీ' (ప్రేమించిచూడు), 'ఓ చెలీ కోపమా అంతలో తాపమా' (శ్రీకృష్ణ తులాభారము), 'విన్నవించుకోనా చిన్న కోరికా' (బంగారు గాజులు), 'ఎన్నెన్నో జన్మల బంధం నీదీ నాదీ' (నోము), 'ఈవేళ నాలో ఎందుకో ఆశలు' (మూగనోము), 'ఒక పూలబాణం తగిలింది మదిలో' (ఆత్మగౌరవం), 'ఓ బంగరు రంగుల చిలకా పలకవే' (తోటరాముడు). వీణ పాటలంటే వెంటనే గుర్తుకొచ్చేది దాశరథి గీతాలే. వాటిలో కొన్ని 'పాడెద నీ నామమే గోపాలా' (అమాయకురాలు), 'వేణుగానలోలునిగన వేయి కనులు చాలవులే' (రెండు కుటుంబాల కథ), 'నేనె రాధనోయి గోపాలా' (అంతా మనమంచికే), 'మ్రోగింది వీణా పదేపదే హృదయాల లోనా' (జమీందారుగారి అమ్మాయి), 'మదిలో వీణలు మ్రోగే ఆశలెన్నో చెలరేగే' (ఆత్మీయులు). అలాగే దాశరథి రాసిన ఖవ్వాలీ పాటలు కూడా జనరంజకాలే. 'నవ్వాలీ నవ్వాలీ నీ నవ్వులు నాకే ఇవ్వాలి' (ఇద్దరుమిత్రులు), 'అందాల ఈ రేయి రాదోయి రాదోయి' (లేతమనసులు), 'దీపాలు వెలిగే పరదాలు తొలగే' (పునర్జన్మ) పాటలు ఆ కోవలోనివే. కొన్ని మంచి ఆవేదనా పూరిత గీతాలను కూడా దాశరథి రాసి హిట్ చేశారు. వాటిలో 'మంటలు రేపే నెలరాజా ఈ తుంటరితనమూ నీకేలా' (రాము), 'కన్నయ్యా నల్లని కన్నయ్యా' (నాదీ ఆడజన్మే), 'నీవురావు నిదుర రాదు నిలిచిపోయె ఈ రేయి' (పూలరంగడు), 'బాబూ వినరా అన్నాతమ్ములా కథ ఒకటి' (పండంటి కాపురం) మచ్చుకు కొన్ని మాత్రమే. మరికొన్ని మంచి పాటలను ఉదహరించాలంటే... 'అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం' (ఆడపడుచు), 'నన్ను వదలి నీవు పోలేవులే' (మంచిమనసులు), 'వినిపించని రాగాలే' (చదువుకొన్న అమ్మాయిలు), 'అందాల ఓ చిలుకా అందుకో నా లేఖా' (లేతమనసులు), 'రాశాను ప్రేమలేఖలెన్నో' (శ్రీదేవి), 'దివినుండి భువికి దిగివచ్చే దిగివచ్చే' (తేనెమనసులు), 'అందాల బొమ్మతో ఆటాడవా' (అమరశిల్పి జక్కన్న), 'గోదారి గట్టుంది, గట్టుమీద చెట్టుంది' (మూగమనసులు), 'కిలకిల నగవుల నవమోహినీ ప్రియ కామినీ' (వసంతసేన), 'కనరాని దేవుడే కనిపించినాడే' (రంగులరాట్నం). ఇలా చెప్పుకుంటూ పోతే దాశరథి రాసిని కొన్ని వందల పాటల్లో యేపాటను తీసివేయగలం! నంది పురస్కారాలు ప్రారంభించేనాటికే దాశరథి దాదాపు సినిమా పాటలు రాయడం మానివేయడంతో ఆ బహుమతులు దాశరథి అందుకోలేకపోయారు. నవంబరు 5, 1987 లో దాశరథి కన్నుమూశారు.

మనిషికి ప్రాణం తర్వాతే ఏదైనా

- ప్రజామీడియా నెట్‌వర్క్

అందుకే ప్రాణాలతో ఉంటే బలిసాకు తినైనా బతకొచ్చని పెద్దలు చెబుతారు. డబ్బు, ఆస్తులు, ఇతరత్రా ఏవి పోగొట్టుకున్నా మళ్లీ సంపాదించుకోవచ్చు. కానీ ప్రాణం పోగొట్టుకుంటే మళ్లీ తిరిగి సంపాదించుకునేది కాదు కదా. అలాంటి ప్రాణం కంటే కరోనా కబళిస్తున్న ముఖ్యమైన అంశం మరొకటి ఉంది. అదే మానవత్వం.

మనిషి అంటేనే మంచి మనసు. దయతో స్పందించే హృదయమున్న ప్రాణి మనిషి. గత కొన్ని నెలలుగా కరోనా మహమ్మారి అమానవీయత గురించి మీడియాలో కథలుకథలుగా చదువుకుంటున్నాం, చూస్తున్నాం. కానీ ఆ మహమ్మారి ధాటికి ఏమీ చేయలేని నిస్సహాయతతో కళ్లప్పగించి చూడ్డం తప్ప మరేం చేయలేకున్నాం.

గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో నడిరోడ్డుపై కరోనా రోగి కుప్పకూలి ప్రాణాలు పోగొట్టుకోవడం మనసున్న ప్రతి ఒక్కర్నీ కదిలించింది. కరోనా బారిన పడిన 52 ఏళ్ల ఆ వ్యక్తి ట్రీట్‌మెంట్ కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చాడు. అప్పటికే అతని సత్తువను కరోనా మహమ్మారి పీల్చి పిప్పి చేసింది. ఇక అడుగు ముందుకు వేయలేకపోయాడు. నడిరోడ్డుపైన్నే అందరూ చూస్తుండగా కుప్పకూలిపోయాడు.

అతని మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు భయపడ్డారు. దీంతో శవాన్ని నడిరోడ్డుపైనే వదిలేసి ఇంటికెళ్లిపోయారు. బంధాలు, అనుబంధాలన్నీ కరోనా ముందు ఉత్తుత్తివే అని తేలిపోయింది. అన్నీ బాగుంటేనే అందరూ. లేకపోతే ఈ లోకంలో ఎవరికి ఎవరు? అనేందుకు ఇదే నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది. చచ్చిన వాడి కోసం తాము చావులేమని కుటుంబ సభ్యుల నిర్ణయమే నిర్దయగా శవాన్ని నడిరోడ్డుపై వదిలి వెళ్లేలా చేసిందనడంలో సందేహం లేదు.

ఏ దిక్కూలేని అనాథ శవమైతే ప్రభుత్వాన్ని నిందించవచ్చు. కానీ ఇక్కడ అలాంటి పరిస్థితి కాదు. కళ్ల ముందు కరోనా హత్యను చూస్తూ...తామూ దానికి బలి కావడానికి ఎవరు మాత్రం ముందుకొస్తారు? సత్తెనపల్లెలో మూడు గంటలపాటు పడి ఉన్న శవాన్ని చివరికి మున్సిపల్ సిబ్బంది శ్మశాన వాటికకు తరలించి దేవుళ్లను తలపించారు.

ఉద్యమాల ఉపాధ్యాయుడు ఉసా

- ఎన్.సురేష్



కొవిడ్‌తో కన్నుమూసిన ఉప్పుమావులూరి సాంబశివరావు విప్లవోద్యమ క్షేత్రంలో అస్తిత్వ పోరాటాల గొంతుక, రచయిత, వక్త, ఉద్యమాల ఉపాధ్యాయుడిగా పేరొందిన ఉప్పుమావులూరి సాంబశివరావు (ఉ.సా) ఇకలేరు. ఆయన వయస్సు 69 ఏళ్లు. కరోనా వైరస్ సోకడంతో హైదరాబాద్ బర్కత్‌పురలోని బ్రిసెల్ కోన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం ఉదయం ఐదు గంటలకు కన్నుమూశారు. ఆయన భార్య, రిటైర్డ్ కమర్షియల్ ట్యాక్స్ అధికారి పద్మావతి 2015లో గుండెపోటుతో చనిపోయారు. ఈ దంపతులకు కూతురు హిమబిందు ఉన్నారు. ఢిల్లీలో సివిల్ సర్వీసెస్ ఇనిస్టిట్యూట్‌లో ఫ్యాకల్టీగా ఉన్న ఆమెకు కూడా కరోనా సోకడంతో ప్రస్తుతం క్వారంటైన్‌లో ఉన్నారు. దాదాపు 40 సంవత్సరాలుగా ఎస్సీ, ఎస్టీ వెనుకబడిన తరగతుల ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఉ.సా శ్రమించారు. కాంప్రెహెన్సివ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ (సీబీసీ) చైర్మన్‌గా వ్యవహరించారు. 'కారంచేడు', 'చుండూరు', 'జస్టిస్ ఫర్ రోహిత్', 'సేవ్ నల్లమల' తదితర పోరాటాలతో పాటు తెలుగు నేలపై అన్ని సమకాలీన సామాజిక ఉద్యమాలలో ఉ.సా క్రియాశీలకంగా పనిచేశారు. కులోన్మాదహత్యలకు వ్యతిరేకంగా గొంతెత్తారు.

ఉ.సా స్వస్థలం ఏపీ గుంటూరు జిల్లాలోని పొన్నూరు దగ్గర బ్రాహ్మణ కోడూరులో 1951 ఫిబ్రవరి 19న జన్మించారు. తండ్రి ఆయుర్వేద వైద్యుడు. ఉ.సా డిగ్రీదాకా చదివారు. గుంటూరు, తెనాలిలో ఆయన విద్యాభ్యాసం సాగింది. విద్యార్థి దశలోనే వామపక్ష రాజకీయాల పట్ల ఆకర్షితులై భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా వేదిక(యూసీసీఆర్ఐ ఎం.ఎల్) కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ప్రఖ్యాత కమ్యూనిస్టు నేత తరిమెల నాగిరెడ్డికి కొరియర్‌గా వ్యవహరించారు. ఎమర్జెన్సీ సమయంలో కొంతకాలం జైలుశిక్ష అనుభవించారు. జైల్లో ఉన్నప్పుడే 'జోలాలీ' వంటి ప్రసిద్ధ గీతాలను రచించారు. నల్లగొండ జిల్లా మోత్కూరు రైతుల పోరాటానికి నాయకత్వం వహించారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టం రావడంలోనూ ఆయన పాత్ర ప్రత్యేకమైంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మద్దతునిచ్చి ఉద్యమంలోనూ పాల్గొన్నారు. అంబర్‌పేట శ్మశానవాటికలో శనివారం సాయంత్రం ఉ.సా అంత్యక్రియలు ముగిశాయి. ఉ.సా 1990లలో **'ఎదురీత'** రాజకీయ మాసపత్రిక నిర్వహించారు. ప్రస్తుతం 'దేశీ-దిశ-బహుజన వాయిస్' పేరుతో వెబ్ చానల్ నిర్వహిస్తున్నారు. సామాజిక అంశాలపై ఆయన పలు పుస్తకాలను రాశారు. ఉ.సా. ప్రజాతంత్ర విద్యార్థి సంఘం యూసీసీఆర్ఐ (ఎంఎల్) పార్టీలో పనిచేశారు. ఆ పార్టీ నాయకులు దేవులపల్లి, తరిమెల నాగిరెడ్డితో సాన్నిహిత్యం పెంచుకున్నారు.

తూ.గో. జిల్లా దేవీపట్నం ప్రాంతంలో గిరిజన హక్కుల కోసం పోరాడారు. ఈ క్రమంలో పార్టీలో మహిళా విభాగంలో పనిచేస్తున్న పద్మావతిని కులాంతర వివాహం చేసుకున్నారు.

గోదావరి జలాలను నల్లగొండ జిల్లాకు తీసుకు రావాలని కోరుతూ జరిగిన పోరాటంలో, అమరావతి ప్రాంతంలోని పొన్నెకల్లులో రైతాంగ సమస్యలపైన జరిగిన పోరాటాల్లో పాల్గొన్నారు.

మోత్కూర్‌లో విద్యుత్ అంతరాయంతో కాలిపోయిన మోటార్లను వేలాది ఎడ్లబండ్లపై పెట్టుకొని ఉ.సా. ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీ చిరస్థాయిగా నిలిచిపోతుంది.

కారంచేడు, చుండూరు దళిత ఉద్యమాల్లో చురుకైనపాత్ర పోషించారు. ఎమర్జెన్సీ కాలంలో జైలు జీవితం గడిపారు.

మహబూబ్‌నగర్‌లో ఆకలిచావులకు చలించి తన తోటి మేధావులతో కలిసి భోజన కేంద్రాలను నాలుగేళ్ల పాటు నాలుగు గ్రామాల్లో నిర్వహించారు.

జోలాలి పాడాలి అనే పాటను, కరువుపై అనేక పాటలను, పుస్తకాలను, బుర్రకథను, పోచంపాడు కుంభకోణంపై ఓ పుస్తకాన్ని, నల్లగొండ వరదకాలువ అనే మరో పుస్తకాన్ని రచించారు.

అనంతరం పార్టీ నుంచి దూరమై అంబేద్కర్, పూలే ఆలోచనా విధానాలతో బహుజనుల కోసం పనిచేశారు. కంచె ఐలయ్యతో కలిసి నలుపు పత్రికను, ఆ తరువాత ఎదురీత పత్రికను నడిపారు.

ఉస్మానియా ఆసుపత్రికి ఇక సెలవు..

- డా॥యాదగిరి

హైదరాబాద్‌లోని చారిత్రక, పెద్ద హాస్పిటల్ ఉస్మానియా వార్డుల్లోకి వచ్చిన మురుగునీరు ప్లస్ వరదనీరు.. అసలే శిథిల భవనాలు, ఆపై డ్రైనేజీ దెబ్బతిన్నది.. ఈ స్థితిలో మురుగునీరు కూడా పేషెంట్ల బెడ్లను ముంచెత్తే తీరు ప్రభుత్వం ప్రతిష్టను మంటగలిపింది.. జాతీయ మీడియా కూడా కథనాలు రాసింది.. సోషల్ మీడియా అయితే దుమ్మెత్తిపోసింది.. నిజానికి ఇది ఇప్పటి సమస్య కాదు.

ఏనాటిదో భవనం.. శిథిలమైపోయింది.. ఒకవైపు ఎప్పుడు పడిపోతుందో తెలియనంత దురవస్థ.. అప్పట్లో కేసీయార్ దాన్ని సందర్శించి, పాత భవనాన్ని కూలగొట్టి కొత్తది కట్టాలని సంకల్పించాడు.. కొందరు పేషెంట్లను కూడా అక్కడి నుంచి ఖాళీ చేశారు.. కానీ ప్రతిపక్షాలు రంగంలోకి దిగి గగ్గోలు పెట్టాయి.. ఎవరో మేధావులు హెరిటేజ్ బిల్డింగ్ అది, ఎలా కూల్చేస్తారని కోర్టుకెక్కారు.. చివరకు దాన్నలా అనాథగా వదిలేశాడు కేసీయార్.

మొన్నటి ఇన్సిడెంట్ తరువాత మళ్లీ విమర్శలు.. అరె భాయ్, మేం కూల్చేసి కొత్తది కడతామంటే మీరే వద్దన్నారు, గాయిగత్తర లేపారు, మళ్లీ మీరే ఇప్పుడు తిట్టిపోస్తున్నారు, అసలు మీరే కదా సైంధవులు అని టీఆర్ఎస్, సర్కార్ ఎదురుదాడికి దిగింది కానీ.. "విపక్షాలు సచివాలయం కూల్చొద్దూ అన్నాయి, ఆగావా..? కాళేశ్వరం డిజైన్లు సరిగ్గా లేవు అన్నాయి, ఊరుకున్నావా..? ధర్నా చౌక్ ఎత్తివేత వద్దూ అన్నాయి, పాటించావా..? పాత భవనం కూల్చే స్థితి లేకపోతే, వేరేచోట కొత్తది కడితే వద్దన్నాయా..?" అంటూ వరుస ఉదాహరణలతో విపక్షాలు మళ్లీ దాడికి దిగాయి.

ఈ తల్నొప్పి వదిలించుకుందామని కేసీయార్ ప్రభుత్వం నిర్ణయించుకుంది.. అంతేకాదు, మళ్లీ భారీ వర్షాలు పడితే, ఇంకేదైనా సీరియస్ ప్రమాదం గనుక జరిగితే, రోగుల ప్రాణాలకే ప్రమాదం.. పైగా ఆ భవనాల పరిస్థితి ఏమీ బాగాలేదు.. రిపేర్లకూ చాన్స్ లేదు.. అందుకని ప్రమాదకరంగా ఉన్న వార్డులను వెంటనే ఖాళీ చేసేయాలని ఉత్తర్వులు జారీ చేసింది తాజాగా.. పైన కనిపించే ఉత్తర్వు ఇదే.. పాత భవనం మొత్తం ఖాళీ చేసి, సీల్ వేయాల్సిందిగా మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆర్డరేశాడు.. అదీ తక్షణం ఖాళీ చేయాలి, గడువులు, వాయిదాల్లేవ్.

ప్రస్తుతానికి పేషెంట్లను ఎక్కడో ఓచోట అడ్జస్ట్ చేసి, ఆ పాత భవనాల్ని కూల్చేసి, అక్కడే కొత్తది కట్టాలా..? లేక సమీపంలో ఇంకేదైనా ప్రభుత్వ స్థలం ఉంటే పెద్దదీ, సకల సౌకర్యాలతో విశాలమైన కొత్త భవనాన్ని కట్టాలా అనే విషయంలో ఇంకా తర్జనభర్జన ఉన్నట్టుంది.. కానీ ఇప్పటికైతే ఉస్మానియా పాత భవనం ఇక శాశ్వతంగా మూసుకుపోయినట్టే.. ఎలాగూ పాత సచివాలయం కూల్చివేత, కొత్త భవన నిర్మాణాల పట్ల హైకోర్టు కూడా పాజిటివ్‌గానే స్పందించింది.. ఈ ఉస్మానియా పాత భవనాల్ని, శిథిల భవనాల్ని కూల్చేసినా పెద్దగా అడ్డంకులేమీ ఎదురుకావనీ ప్రభుత్వం భావిస్తోంది.. రేప్పొద్దున అనుకోనిది జరిగి సిబ్బంది, రోగులకు ఏమైనా ప్రమాదం వాటిల్లే బదులు, దాన్ని తక్షణం ఖాళీ చేయడమే బెటరని నిర్ణయం తీసుకుంది ప్రస్తుతానికి.



రంగంలోకి రఫేల్

- ఎన్.హేమంత్





సైనిక బలంలో భారత్ కన్నా చైనా మిన్న కాబట్టి పూర్తిస్థాయి యుద్ధంలో ఇండియా నిలబడలేదని బీజింగ్ బెదిరిస్తూ ఉంటుంది. కానీ, కొవిడ్ సంక్షోభానికి చైనాయే కారణమనే ఆరోపణతో ప్రపంచంలో ఏకాకి అయిన బీజింగ్ , సంపూర్ణ సమరానికి దిగుతుందా అంటే సందేహమే. చైనా అజేయ శక్తిగా ఎదిగితే అమెరికా అగ్రరాజ్య హోదాకు కలిగే ముప్పు ఏమిటో వాషింగ్టన్‌కే కాకుండా పాశ్చాత్య దేశాలన్నింటికీ తెలుసు. అందుకే, గల్వాన్ ఘర్షణల నేపథ్యంలో భారత్ అడిగినదే తడవుగా ఫ్రాన్స్, అమెరికా, రష్యా, ఇజ్రాయెల్‌లు యుద్ధవిమానాలు, డ్రోన్లు, క్షిపణులను హుటాహుటిన పంపాయి. 2016లో భారత్‌ను ప్రధాన వ్యూహపరమైన భాగస్వామిగా గుర్తించిన అమెరికా, ప్రపంచంలో అతిపెద్ద యుద్ధనౌక యూఎస్ఎస్ నిమిట్జ్‌ను హిందూ మహాసముద్రానికి పంపింది. నిమిట్జ్ అండమాన్ నికోబార్‌దీవుల సమీపంలో భారత నౌకాదళంతో జత కలిసి సంయుక్త విన్యాసాలు జరిపింది. మరోవైపు ఫ్రాన్స్ అత్యాధునిక రఫేల్ యుద్ధవిమానాల బట్వాడాను వేగవంతం చేసింది.అయిదు రఫేల్ విమానాలు జులై 29న భారత్‌లోని అంబాలా స్థావరానికి చేరుకున్నాయి. ఫ్రాన్స్ తన వైమానిక దళం కోసం సిద్ధంచేసుకున్న మీటియోర్, స్కాల్ప్ క్షిపణులను భారతీయ రఫేల్‌లకు అమర్చి పంపుతున్నందువల్ల అవి తక్షణం చైనాతో సమరానికి సై అనగలవు. మీటియోర్ క్షిపణి గగనంలో 120 కిలోమీటర్ల దూరంలోని శత్రు విమానాన్ని కూల్చగలిగితే, స్కాల్ప్ 600 కిలోమీటర్ల దూరంలోని భూతల శత్రుస్థావరాన్ని ధ్వంసం చేయగలదు. రఫేల్ సరిహద్దు దాటకుండానే శత్రువు పనిపట్టగలదన్న మాట. భారత వైమానికదళ అమ్ములపొదిలోని అత్యాధునిక యుద్ధ విమానాలు- సుఖోయ్ 30, మిరేజ్ 2000. మిగ్ 29 ఫైటర్లను ఇప్పటికే సరిహద్దుల్లో మోహరించింది. మొత్తం మీద భారత్ , చైనాల మధ్య యుద్ధం మన ఈశాన్య సరిహద్దులకే పరిమితమవుతుందని రక్షణ నిపుణుల అంచనా. గల్వాన్ లోయకు చుట్టుపక్కల 500 కిలోమీటర్ల దూరంలో చైనాకు రెండు వైమానిక స్థావరాలు, 1000 కిలోమీటర్ల పరిధిలో మరో రెండు ఉన్నాయి. 1,300 నుంచి 1,500 కిలోమీటర్ల దూరంలో మరి రెండు స్థావరాలు ఉన్నాయి. ఇవన్నీ ఎత్తైన ప్రాంతాల్లో ఉన్నాయి. అక్కడి నుంచి చైనా విమానాలు భారత సరిహద్దుకు వచ్చి బాంబులు కురిపించాలటే మార్గమధ్యంలో తిరిగి ఇంధనం నింపుకోవలసి ఉంటుంది. ఇంధన పరిమితి వలల అవి ఎక్కువసార్లు బాంబుదాడులు నిర్వహించలేవు. పైగా, ఎత్తైన ప్రాంతాల్లో ఉష్ణోగ్రత పెరిగిన కొద్దీ విమానం మోయగల బరువు తగ్గిపోతుంది. ఉదాహరణకు ఒక ఎయిర్ బస్ విమానం తక్కువ ఎత్తు నుంచి పూర్తి లోడు నింపుకొని ఎత్తైన ప్రాంతంలో దిగగలదు కానీ, అక్కడి నుంచి తిరిగి పైకి ఎగిరేటప్పుడు కనీసం అందులో పావు వంతు లోడు కూడా మోయలేదు. అంటే, ఎత్తులో ఉన్న స్థావరాల నుంచి చైనా యుద్ధ విమానాలు ఎక్కువ బాంబులతో పోరుకు దిగలేవు. ఏతావతా 500 కిలోమీటర్ల పరిధిలోని చైనా స్థావరాలు మాత్రమే వైమానిక యుద్ధానికి వత్తాసు ఇవ్వగలుగుతాయి. అదే భారత్ విషయానికి వస్తే ఉత్తర, ఈశాన్య భారతాల్లోని వైమానిక స్థావరాలన్నీ సరిహద్దుకు సమీపంలో ఉండి చైనాపై దాడికి తోడ్పడతాయి. శ్రీనగర్, లదాఖ్ తప్ప మిగతా 21 స్థావరాలు ఎత్తు తక్కువ ప్రాంతాల్లోనే ఉన్నాయి. లదాఖ్ వంటి ఎత్తైన ప్రాంతాల నుంచీ ఎగరడానికి వీలుగా రఫేల్ ఇంజిన్‌లో భారత్ కోరిన మార్పుచేర్పులను చేసి ఫ్రాన్స్ పంపుతోంది. తక్కువ ఎత్తులోని స్థావరాల నుంచి మన విమానాలు పూర్తి బాంబు లోడుతో పైకెగిరి చైనా స్థావరాలపై దాడి చేసి తిరిగి రాగలవు. మళ్ళీ ఇంధనం, బాంబులు నింపుకొని దాడికి బయలుదేరగలవు. చైనా విమానాలకు ఆ వెసులుబాటు లేదు. ఫలితంగా భారత విమానాలకు చైనా ఫైటర్లకన్నా రెండు నుంచి ఆరు రెట్లు ఎక్కువసార్లు దాడులు జరిపే

సత్తా ఉంది. చైనాను సమర్థంగా ఎదుర్కోవడంపై ఈ నెల 22-24 తేదీల్లో భారత వాయుసేన ప్రధానాధికారి ఆర్ .కె.ఎస్ . భధౌరియా తన ఏడుగురు కమాండర్లతో చర్చిస్తారు.గల్వాన్ , అక్సాయ్ చిన్ వంటి హిమాలయ ప్రాంతాలు సముద్ర మట్టానికి 10,000 నుంచి 15,000 అడుగుల ఎత్తులో ఉన్నాయి. 10,000 కిలోమీటర్లకన్నా ఎక్కువ ఎత్తుకు వెళ్లినకొద్దీ మానవుడికి అదనపు ఆక్సిజన్ అవసర మవుతుంది. ఈ ఎత్తైన ప్రాంతాల్లో ఎక్కువ కాల నివసించినవారికి మాత్రం అవసరం ఉండదు. ఇంత ఎత్తులోని వాతావరణానికి అలవాటు పడాలంటే సైనికులకు ఏడు నుంచి 20 రోజుల వ్యవధి పడుతుంది. భారతదేశ పర్వత పోరాట దళాలు ఎత్తైన ప్రాంతాల్లో పోరుకు ఇలానే అలవాటు పడి నిత్యం సమర సన్నద్ధంగా ఉంటాయి. పైగా సియాచిన్ , కార్గిల్ వంటి పర్వత యుద్ధాల్లో ఆరితేరిన దళాలు మనవి. చైనా దళాలకు ఆ అనుభవం లేదు. చైనాకు మైదానాల్లో ఎన్ని లక్షల సైనికులు ఉన్నా, వారందరినీ ఉన్నపళాన హిమాలయాలకు తరలించడం కుదరదు.భారతదేశం చైనాపై పోరుకు మొత్తం 2.25 లక్షల సైనికులను మోహరించగలదని అమెరికాకు చెందిన బెలఫర్ సెంటర్ అంచనా. చైనా ఇంతకన్నా ఎక్కువమందినే మోహరించగలిగినా, పైన చెప్పుకొన్న వాతావరణ పరిమితులు దానికి అడ్డుపడతాయి. భారతదేశం 1965 నుంచి పాకిస్థాన్ తో పదేపదే ప్రత్యక్ష, పరోక్ష యుద్ధాలు చేస్తూ అపార పోరాట అనుభవం గడించగా, చైనా పోరాట అనుభవం 1979లో వియత్నాం యుద్ధంతో సరి. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి చైనాపై భారత్ అనేక సైనిక, పారామిలిటరీ దళాలను మోహరించింది. వైమానిక స్థావరాలు, రహదారులు, వంతెనలు నిర్మించింది. రష్యా నుంచి ఏఎన్ 32 రవాణా విమానాలకు తోడు అమెరికా నుంచి భారీ సి 130 హెర్క్యులిస్ , సి 17 గ్లోబ్ మాస్టర్ రవాణా విమానాలనూ సేకరించింది. వీటి ద్వారా భారీ సంఖ్యలో సైనికులను, మందుగుండును, ట్యాంకులు, కవచ శకటాలను కూడా మెరుపు వేగంతో చైనా సరిహద్దుకు తరలించవచ్చు. ఎల్ ఏసీ సమీపంలో చైనా 101 యుద్ధవిమానాలను మోహరిస్తే, భారత్ 122 విమానాలను సిద్ధంగా ఉంచింది. భారత్ తాజాగా అమెరికన్ అపాచీ అటాక్ హెలికాప్టర్లను, చినూక్ రవాణా హెలికాప్టర్లను కూడా సరిహద్దులో దించింది.చైనాకు మొత్తం 320 అణ్వస్త్రాలు ఉంటే, భారత్ వద్ద 150 ఉన్నాయని స్టాక్ హోమ్ అంతర్జాతీయ శాంతిశోధన సంస్థ (సిప్రి) 2020 సంవత్సర సంపుటి వెల్లడించింది. చైనా అణ్వస్త్రాలలో 104 భారత్ లో ఏ ప్రాంతంపైనైనా దాడి చేయగలవని బెలఫర్ సెంటర్ అంచనా. భారత్ అమ్ములపొదిలోని 10 అగ్ని-3 అణ్వస్త్రాలు చైనాలో ఏ లక్ష్యంపైనైనా, ఎనిమిది అగ్ని-2 అణుక్షిపణులు చైనా మధ్య ప్రాంతాల మీద విరుచుకుపడగలవు. ఇవి కాకుండా 51 జాగ్వార్ , మిరేజ్ యుద్ధ విమానాల నుంచీ అణుబాంబులు కురిపించవచ్చునని బెలఫర్ సెంటర్ అంచనా. పరిస్థితి అక్కడి వరకు రాకూడదని ప్రపంచమంతా కోరుకొంటోంది. చైనా మొండిగా యుద్ధానికి దిగితే- ప్రపంచం భారత్ కు మద్దతు పలకడం, చైనా ఒంటరి కావడం ఖాయం!

సీమ సస్యశ్యామలమే!

ఇప్పటికే రాయలసీమ ప్రాంతానికి జలకళ విస్తరిస్తోంది. హంద్రీనీవా ప్రాజెక్టు పుణ్యమా అని రాయలసీమలోని ఆ చివరి వరకూ కృష్ణా జలాలు అందుతున్నాయి. గత ఏడాది భారీగా నీటి లభ్యతతో చిత్తూరు జిల్లా వరకూ హంద్రీనీవా కాలువలు సాగాయి. ఐదు నెలల పాటు కాలువల్లో నీళ్లు ప్రవహించి, రాయలసీమ ప్రాంతంలో భూగర్భ జలాలను పైకి తీసుకురావడంతో పాటు, పదుల సంఖ్యలో చెరువులను నింపింది. ఉమ్మడి ఏపీలోనే అతి పెద్ద చెరువులు హంద్రీనీవా ప్రాజెక్టుతో అనుసంధానం అయ్యాయి. అలాంటి చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి ఇప్పటికే.

గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఇప్పటికే అత్యంత కరువు జిల్లా అయిన అనంతపురంలో చాలా మండలాలను, అలాగే చిత్తూరు జిల్లా వరకూ సాగే హంద్రీనీవా ప్రాజెక్టు కవర్ చేసింది. అయినా.. సీమకు అందిన నీటి పరిమాణం మాత్రం చాలా తక్కువ. గత ఏడాది కొన్ని వందల టీఎంసీల నీళ్లు సముద్రం లోకి వెళ్లిపోగా.. రాయలసీమకు తిప్పి తిప్పి కొడితే 40 టీఎంసీలు తరలించి ఉంటారు. హంద్రీనీవాతో పాటు ముచ్చుమర్రి తదితర ఎత్తిపోతల ప్రాజెక్టుల ద్వారా తరలించిన పరిమాణం కూడా తక్కువే. హంద్రీనీవా ఏడాది సామర్థ్యం కేవలం 40 టీఎంసీలు మాత్రమే!

ఆ మాత్రం నీటికే రాయలసీమలోని కొంత ప్రాంతం జలకళను సంతరించుకుంది. ఇలాంటి నేపథ్యంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న మరో బృహత్ ప్రాజెక్టు మొత్తం రాయలసీమ రూపురేఖలనే మార్చేలా ఉంది. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుకు జగన్ శ్రీకారం చుట్టారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తుంగభద్ర వచ్చి కృష్ణాలో కలిసే సంగమేశ్వరం ప్రాంతం వద్ద నిర్మించనున్నారు. దీని ద్వారా రాయలసీమ ప్రాంతానికి ఏకంగా రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోయనున్నారు!

ఈ డెలివరీ సిస్టమ్ నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీటి సరఫరా ఉంటుంది.

కృష్ణా నదికి వరదల సమయంలో ఈ ప్రాజెక్టు నుంచి రోజుకు మూడు టీఎంసీల సామర్థ్యంతో నీటి లిఫ్ట్ జరిగితే.. రాయలసీమలోని ప్రాజెక్టులన్నీ రోజుల వ్యవధిలోనే నిండిపోతాయి. ఈ లిఫ్ట్‌కు అనుగుణంగా కాలువల సామర్థ్యం కూడా పెంచాల్సి ఉంటుంది. అందుకు సంబంధించి పనులు సాగుతున్నాయిప్పుడు. అవాంతరాలను లెక్క చేయకుండా జగన్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయంలో ముందుకు సాగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. అన్ని అడ్డంకులను దాటుకుని వీలైనంత త్వరగా ఈ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ విజయవంతం అయితే.. కృష్ణా జలాలతో రాయలసీమ మరింత సస్యశ్యామలం కానుంది.

జగన్ ఓడలేదు... రాజ్యాంగం(వ్యవస్థలు) గెలిచాయి

- కె.రాజా

మన వ్యవస్థల గొప్పదనం ఏమిటంటే... పెద్ద పెద్ద నేతలనే లొంగదీశాయ్ గతంలో... ఇందిరాగాంధీ వంటి నియంతలకు కూడా చుక్కలు చూపించాయి... జగన్ అనగా ఎంత.. అంతే... ఇక్కడ జగన్ ఓడిపోయాడా.. నిమ్మగడ్డ గెలిచాడా.. నిమ్మగడ్డకు నైతికంగా అండగా నిలిచిన చంద్రబాబు గెలిచాడా... తన సామాజికవర్గం గెలిచిందా.. ఆల్రెడీ హైకోర్టు తలంటింది... సుప్రీంకోర్టులో కూడా ఎదురుదెబ్బ తగలనుంది... మొన్ననే ఆ సంకేతాలు కూడా ఇచ్చింది... గవర్నర్ కూడా తను పాస్ చేసిన ఆర్డినెన్సులు, జీవోలను తానే పక్కన పడేసి, భిన్న నిర్ణయం తీసుకున్నాడు... నిమ్మగడ్డకు అనుకూలంగా మారాడు... ఇక తప్పనిసరై, వేరే దిక్కులేక జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్గా నిమ్మగడ్డను తిరిగి నియమిస్తూ జీవోను అర్ధరాత్రి జారీ చేయించాడా..

నిజానికి ఇదొక్కటే కాదు... జగన్ మబ్బుల్లో నుంచి నేలకు దిగివచ్చిన విషయాలు ఇంకొన్నీ ఉన్నయ్... పంచాయతీ భవనాలకు పార్టీ రంగులు వేసిన విషయంలోనూ అంతే కదా... దాని మీద పంతానికి పోయాడు... దానివల్ల వచ్చే రాజకీయ లబ్ధి ఏమీ లేకపోయినా పట్టుదల చూపించాడు... చివరకు వెనక్కి తగ్గాల్సి వచ్చింది... వేసిన తన పార్టీ రంగుల్ని తానే తీసేయించాల్సి వచ్చింది... శాసనమండలి కూడా అంతేగా... తనకు రాజధాని బిల్లుల విషయంలో మండలి వైఖరి నచ్చలేదు... అక్కడంతా తెలుగుదేశం మెజారిటీ... దాన్ని గెలవాలంటే వ్యూహాలు కావాలి, ఓపిక కావాలి, ఎత్తుగడలు కావాలి, రాజకీయం కావాలి... అవి ఆలోచించకుండా రద్దుల ఖాతాలో చేర్చేశాడు.

తీరా ఏమైంది.. ఇక్కడ జగన్కు అది ప్రెస్టేజీ ఇష్యూ కావచ్చు, కానీ కేంద్రంలో బీజేపీ ఇలాంటివి ఎన్ని చూసి ఉంటుంది.. జస్ట్, ఏపీ అసెంబ్లీ తీర్మానాన్ని అలా టేబుల్ సొరుగులో పడేసింది... అంతేకాదు, దానిపై వీసమెత్తు ఇంట్రస్టు కూడా చూపలేదు... విధిలేక జగన్ మొన్న ఓ ఇద్దరిని గవర్నర్ కోటాలో నామినేట్ చేయించాడు, మరో రెండు ఖాళీల్లో ఒకదానికి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ కూడా జారీ చేసింది... ఆ మధ్య మండలిని జగన్ రద్దు చేశాడు అనే విషయమే ఇప్పుడెవరికీ గుర్తులేదు... అంతే.

ఇప్పుడు ఎన్నికల కమిషనర్ విషయమే తీసుకుందాం... నిజానికి ప్రభుత్వం చేసిన ప్రాథమిక తప్పు ఏమిటీ అంటే... ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఉన్నప్పుడు, ఓ రాజ్యాంగ వ్యవస్థకు సంబంధించి కీలకనిర్ణయం తీసుకుని, కమిషనర్ పదవీకాలాన్ని కుదించేసి, ఇంటికి పంపించేయడం... కొత్తగా ఎవరో ఓ తమిళ వృద్ధ మాజీ న్యాయమూర్తిని తీసుకొచ్చి, హడావుడిగా, రహస్యంగా నియమించేయడం... **అసలు ఒక ఎన్నికల కమిషనర్ను నియమించే అధికారం రాష్ట్రానికి లేదు అని హైకోర్టు అన్నది...** మరి అప్పట్లో **ఇదే నిమ్మగడ్డను చంద్రబాబు నియమించడమూ తప్పే అవుతుంది కదా...** ఆ పాయింట్ మీద సుప్రీంలో కొట్లాడే ప్రయత్నం చేసింది రాష్ట్ర ప్రభుత్వం... కానీ దాన్ని బలంగా ప్రజెంట్ చేయలేకపోయినట్టుంది... సుప్రీం రాష్ట్ర ప్రభుత్వ వాదనల్ని లైట్ తీసుకుంది.

సరే, ఏదయితేనేం... నాకు జనం అమితమైన మెజారిటీ ఇచ్చారు, కుర్చీ ఎక్కించారు, ఇక నేనేది చెబితే అదే అల్టిమేట్ అనే గగనమేఘాల్లో నడక ఆపేసి, మెల్లమెల్లగా జగన్ కిందకు దిగుతున్నాడు... దిగాలి... దిగకతప్పదు... నేల మీద నడక అలవాటు చేసుకోవాలి... మన దేశంలో వ్యవస్థల నడుమ చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ ఉంటాయనే బేసిక్ పాయింట్, ఏదీ సర్వాధికారి కాదు అనే నిజం ఇన్నేళ్లూ జగన్కు అర్థం కాలేదు... ఇప్పుడు తత్వం బోధపడుతుంది.

జగన్ సర్కార్కు గుణపాఠం

ఎట్టకేలకు ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేశ్కుమార్ను పునర్నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం అర్ధరాత్రి జీవో జారీ చేసింది. దీంతో రెండుమూడు నెలలుగా సాగుతున్న నిమ్మగడ్డ వ్యవహారానికి ఫుల్స్టాప్ పడినట్టైంది. **ఈ నియామకంతో మన రాజ్యాంగం ఎంత గొప్పదో చెప్పకనే చెబుతోంది.** వ్యక్తుల కంటే రాజ్యాంగ వ్యవస్థ సమున్నతమైందని నిమ్మగడ్డ పునర్నియామక ఎపిసోడ్ మరోమారు రుజువు చేసింది. అయితే ఈ మొత్తం ప్రక్రియలో జగన్ సర్కార్ గుణపాఠం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేశ్కుమార్ను పునర్నియమించాలని హైకోర్టు ఆదేశించినా, గవర్నర్ సూచించినా, జగన్ సర్కార్ ఖాతరు చేయలేదు. దీనికి కారణం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండడమే. చివరికి సుప్రీంకోర్టు కూడా ఎస్ఈసీని నియమించాలని ఆదేశించింది. అయినప్పటికీ జగన్ సర్కార్లో చలనం లేకపోవడంతో...ఒక దశలో కోర్టు ధిక్కరణకు పాల్పడేందుకు కూడా వెనుకాడరేమోనని, ఏపీ ఛీఫ్ సెక్రటరీని బలి పశువు చేస్తారేమోననే ఆందోళన కూడా లేకపోలేదు.

ఈ ఆలోచనలు, ఆందోళనల మధ్య నిమ్మగడ్డను ఎస్ఈసీగా పునర్నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇప్పటికైనా **జగన్ సర్కార్ రాజ్యాంగానికి, న్యాయస్థానాలకు విలువ ఇచ్చినందుకు సంతోషించాల్సిందే.** ఈ పరిణామాల్ని ఆహ్వానించాల్సిందే. కానీ ముమ్ముందు ఇలాంటి పరిణామాలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిమ్మగడ్డ వ్యవహారం నుంచి జగన్ సర్కార్ ఎన్నో గుణపాఠాల్ని నేర్చుకోవాల్సి ఉంది.

మొట్ట మొదటగా నిమ్మగడ్డ రమేశ్కుమార్ను వ్యక్తిగా చూడడం వల్లే ఇలాంటి దుస్థితి. **ఆయనకు రాజ్యాంగం అనే గొప్ప ఆయుధం అండగా ఉందని జగన్ సర్కార్ అర్థం చేసుకుని ఉంటే...** సంస్కరణల పేరుతో ఆయన తొలగింపునకు తెగబడి ఉండేవారు కాదు. **నిప్పుతో అయినా చెలగాటం ఆడొచ్చేమో కానీ, రాజ్యాంగంతో చెలగాటం మంచిది కాదు.** రాజ్యాంగంతో చెలగాటం ఆడితే

ఏమవుతుందో జగన్ సర్కార్‌కు ఇప్పటికైనా బోధపడి ఉంటుంది.

నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వ్యవహార శైలి కచ్చితంగా అభ్యంతరకరంగా ఉంది. ఇందులో రెండో మాటకు తావులేదు. జగన్ సర్కార్‌పై కేంద్రహోంశాఖకు ఐదు పేజీల లేఖ, బీజేపీ నేతలతో హైదరాబాద్‌లో ఒక హోటల్‌లో సమావేశం కావడం తదితర అంశాలు...తన విశ్వసనీయతను తానే చంపుకున్నాడు. అయితే ఇవన్నీ నైతికపరమైన అంశాలు. కానీ చట్టపరంగా ఇవి న్యాయస్థానాల్లో నిలబడవు.

నిమ్మగడ్డ అప్రజాస్వామిక, నియంతృత్వ ధోరణులను న్యాయవ్యవస్థల ద్వారానే కట్టడి చేయాలి. అంతే తప్ప, న్యాయాన్ని, చట్టాన్ని ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకుంటే అసలుకే ఎసరు వస్తుంది. ఇప్పుడు జరిగింది అదే. నిమ్మగడ్డ కంటే జగన్ సర్కార్ ఎక్కువ తప్పులు చేయడం వల్ల...నిమ్మగడ్డ తప్పులు పక్కకు పోయాయి. ఇదే జగన్ సర్కార్ చేసిన పెద్ద తప్పు.

నచ్చని వ్యక్తి తప్పులు చేస్తున్నాడని గ్రహిస్తే...అతను మరిన్ని తప్పులు చేసేలా మౌనం పాటించాలి. అదే రాజకీయ వ్యూహం. కానీ జగన్ సర్కార్‌కు లేడికి లేచిందే పరుగు అన్నట్టు...మనసులో ఆలోచనమే కలగడమే ఆలస్యం...తక్షణం అమలు కావాల్సిందే. రాజ్యాంగం, న్యాయం లాంటి వాటితో పనిలేదని జగన్ సర్కార్ తరచూ భావిస్తూ బొక్క బోర్లా పడుతూ ఉంటుంది.

నిమ్మగడ్డ తొలగింపు, తిరిగి పునర్నియామకం మధ్య జరిగిన వ్యవహారాలతో... **అనవసరంగా అతనికి అధిక ప్రాధాన్యత ఇచ్చి పొలిటికల్ సెలబ్రిటీని చేశారు.** నిమ్మగడ్డకు మరో 8 నెలల పదవీ కాలం ఉంది. కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి కనుచూపు మేరలో కనిపించడం లేదు. ఈ మాత్రం సంబరానికి జగన్ సర్కార్ న్యాయ వ్యవస్థలను గౌరవించరనే అప్రతిష్టను మూట కట్టుకోవాల్సి వచ్చింది. పోనీ చివరికి ఏమైనా సాధించారా? అని ప్రశ్నించుకుంటే ఏమీ లేదనే జవాబు వస్తుంది.

థియేటర్లు తెరవడం సాధ్యమేనా?....

- ప్రజామీడియా నెట్‌వర్క్



లాక్‌డౌన్ సడలింపులో భాగంగా థియేటర్లు తెరుచుకోవడానికి కేంద్రం అనుమతి ఇస్తుందని వార్తలు వస్తున్నాయి. సడలింపులో భాగంగా కేంద్రం కాస్త ఉదారంగానే ప్రవర్తిస్తోంది. కానీ అమలు చేసుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల ఇష్టా ఇష్టాలకు వదిలేస్తోంది. మందు దుకాణాలు మీకు కావాలంటే తీసుకోండి. మాల్స్ మీకు కావాలంటే తెరుచుకోవచ్చు, ఈ విధంగా కేంద్రం చెబుతోంది. ఇప్పుడు బహుశా థియేటర్ల విషయంలో కూడా ఇదే విధంగా చెప్పే అవకాశం వుంది.

కానీ తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు తెరిచే పరిస్థితి వుందా? థియేటర్లు తెరిచినా జనం వస్తారా? జనం వచ్చినా వేయడానికి సరైన సినిమాలు వున్నాయా? పైగా కేంద్రం ప్రకటించే విధాన సూత్రాల ప్రకారం థియేటర్లు నడపడం సాధ్యమేనా? 25శాతం ఆక్యుపెన్సీతో థియేటర్లు నడిస్తే ఏమేరకు లాభం? ఇవన్నీ ప్రశ్నలే.

థియేటర్లు మూసివేత వల్ల ఇప్పటికి ఎగ్జిబిటర్లకు ఆదాయం నష్టం సంగతి అలా వుంచితే, ఖర్చు పరంగా పెద్దగా లేదు. కొద్దిగా ఇస్తున్న జీతాలు, కరెంటు బిల్లు మాత్రమే. ఇదే కనుక థియేటర్లు ఓపెన్ చేస్తే, ఫుల్‌గా జీతాలు ఇవ్వాలి. కరెంట్ బిల్లులు ఫుల్‌గా ఇవ్వాలి. లీజుమొత్తాలు కట్టాలి. ఇదంతా 25 పర్సంట్ ఆక్యుపెన్సీతో చేయాలి. అందువల్ల సింగిల్ థియేటర్ ఓనర్ల సంగతి అలా వుంచితే, పెద్ద సంఖ్యలో థియేటర్లు చేతిలో వున్నారు, వాటిని తెరవడానికి రెడీ అవుతారా?

ఇదిలా వుంటే తెలుగు రాష్ట్రాల్లో జిల్లాల్లో కేసులు భయంకరంగా వున్నాయి. ఇప్పుడు థియేటర్ల వల్ల ఏమాత్రం ఈ కేసులు పెరిగిపోయినా, కరోనా అదుపు తప్పి పోతుంది. ఇలాంటి నేపథ్యంలో కేంద్రం అనుమతి ఇచ్చినా, రాష్ట్రాలు ఓకె అంటాయా అన్నదీ అనుమానమే. జనాలకు కరోనా అంటే భయం పోయినా, సింగిల్ థియేటర్లకు వెళ్లడానికి ధైర్యం చేస్తారా? అన్నది చూడాలి. ఎందుకంటే ఆలయాలు ఓపెన్ చేసినా, మాల్స్ ఓపెన్ చేసినా, జనాలు పాతిక శాతానికి మించి వెళ్లడం లేదు ఆర్టీసీ బస్ లు ఖాళీగా తిరుగుతున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో థియేటర్లకు జనం వస్తారా?అన్నది అనుమానం. పైగా సినిమా థియేటర్లు తెరిచినా కంటెంట్ లేదు. సరైన కంటెంట్ లేకుండా థియేటర్ కు జనం రారు. పాతిక శాతం ఆక్యుపెన్సీ తో పెద్ద సినిమాలు కాదు, కనీసం మీడియం సినిమాలు కూడా విడుదల చేయడానికి డిస్ట్రిబ్యూటర్లు,ఐ నిర్మాతలు ముందుకు రారు. ఇలాంటి నేపథ్యంలో ఇప్పట్లో థియేటర్లు తెరుచుకుంటాయి అనడం కలే.